ఈనాడు
చిత్తూరు

మంగళవారం 2 జనవరి 2018 | 16 పేజీలు

అడ్డుకునేవారు లేక.. ఆక్రమణలు ఆగక..

శోత్రీయ భూముల వ్యవహారం ఇది



ఆక్రమిత భూముల్లో సాగుచేసిన పుచ్చపంట

చిన్నపాండూరు (వరదయ్యపాళెం) న్యూస్‌టుడే: అధికారుల సాక్షిగా మళ్లీ శోత్రీయభూముల్లో ఆక్రమణల సాగు జోరందుకుంది. కొన్నిరోజులుగా అనర్హులైన స్థానికేతరులు సాగుపనులు చేపడుతున్నా, అడ్డుకునే నాథుడు కరవయ్యాడు. ఇకపై ఆక్రమిస్తే కఠిన చర్యలు తప్పవని ఏటా అధికారులు ఆక్రమణదారులను హెచ్చరించడం.. ఆక్రమణదారులు సాగు చేయడం రివాజుగా మారింది.

వరదయ్యపాళెం మండలం చిన్నపాండూరు పంచాయతీ పాదిరికుప్పం రెవెన్యూ పరిధిలో 1065 ఎకరాల శోత్రీయ భూములున్నాయి. వీటిలో 400 ఎకరాలకు పైగా భూములను ఆక్రమించిన స్థానికులు గత 40 ఏళ్లుగా సాగుచేసుకుంటున్నారు. స్థానికేతరులు సైతం ఇక్కడి భూములను ఆక్రమించడం విస్మయానికి గురిచేస్తోంది. మిగిలిన 600 ఎకరాలను భూమిలేని పేదలకు పంచాలని ప్రజాసంఘాలు

... మిగతా 7లో

జనవిరిసిన ఉత్సాహం..!





డిసెంబరు..31..అర్ధరాత్రి వేళ..ఊరూవాడా ఏకమైంది..ఆనంద సందడి చేసింది..365 రోజుల అనుభూతి విరిసింది.. ఎటుచూసినా.. పాటలు వినిపించాయి..నృత్యాలు కనిపించాయి..12 గంటల సమయం దాటగానే..యువకులు కేరింతలు కొట్టారు..నూతన సంవత్సరానికి స్వాగతం పలికారు..పెద్దలు కేక్‌లు కట్ చేశారు..ఆత్మీయులు కలుసుకున్నారు.. శుభాకాంక్షల ఆలింగనాలు చేసుకున్నారు.. దేవాలయాలకు చేరుకున్నారు.. దీవెనలు అందుకున్నారు..జీవిత గమనంలో మరో వసంతంలోకి ఆనందంగా అడుగిడారు.



రంగంపేటపై నుంచే..
నాలుగు వరుసల దారి!

- మదనపల్లె-తిరుపతి రహదారి నిర్మాణంలో పురోగతి
- త్వరలో భూసేకరణ నోటిఫికేషన్ జారీ

ఈనాడు-తిరుపతి : భూసేకరణలో సమస్యలను అధిగమించడంతోపాటు మలుపులను తగ్గించి.. రవాణా సౌకర్యం మెరుగుపడేలా మదనపల్లి-తిరుపతి రహదారి నిర్మాణానికి జాతీయ రహదారుల సంస్థ (ఎన్‌హెచ్‌ఏ) ప్రణాళికలు రూపొందించింది. ఈ ప్రాజెక్టును త్వరితగతంగా పూర్తి చేసేందుకు ఇప్పటికే సర్వే పూర్తి చేసింది. త్వరలోనే భూసేకరణకు మార్కింగ్ ఇవ్వనున్నారు. భూసేకరణ నోటిఫికేషన్ జారీ చేసేందుకు కేంద్రం నుంచి ఆమోదం లభించింది. ఎన్‌హెచ్‌ఏ అధికారులు ఈ మేరకు జిల్లా రెవెన్యూ అధికారులకు సమాచారం పంపించారు.

మదనపల్లె నుంచి తిరుపతి రహదారి నిత్యం రద్దీగా ఉంటుంది. పశ్చిమ మండలాల్లో మదనపల్లె పెద్ద మార్కెట్ కావడంతో చిన్నగొట్టిగల్లు, రొంపిచర్ల, పీలేరు, వాల్మీకిపురం, కలకడ, మండలాల మీదుగా మదనపల్లెకు పంట ఉత్పత్తుల రవాణా అధికంగా ఉంటుంది. అనంతపురం జిల్లాతో అనుసంధానించే ఈ మార్గం ప్రస్తుత రద్దీకి ఏ మాత్రం సరిపోవడం లేదు. రెండు వరుసల నుంచి నాలుగు వరసలకు విస్తరించాలన్న డిమాండ్ దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉంది. తాజాగా అన్ని అనుమతులు రావడంతో.. కేంద్ర జాతీయ రహదారుల సంస్థ నిధులతో ఈ రోడ్డు విస్తరణ జరగనుంది. ఇప్పటికే భూసేకరణ నిమిత్తం రెవెన్యూ సిబ్బంది సర్వే పూర్తి చేశారు. ఈ క్రమంలో ఎదురైన అడ్డంకులను కూడా క్రమంగా

... మిగతా 7లో

ఈ నెత్తుటి మరకల వెనుక



- తిరుపతిలో తిష్ఠ వేసిన బ్లేడ్‌బ్యాచ్‌లు
- పోలీసులకు సవాల్‌గా మారుతున్న హత్యలు..
- రైల్వేస్టేషన్, బస్టాండ్ పరిసరాలే ఆవాసాలు
- వీరి విలాసం.. ఎందరికో విషాదం

తిరుపతి(రైల్వే), న్యూస్‌టుడే: వారికి చదువు సంధ్యల్లేవు. బంధం, బంధుత్వం పట్టదు. మానవత్వం, మర్యాద ఎరుగరు. వారికి తెలిసిందల్లా ఒక్కటే..! ఏ రోజుకారోజు ఎలా పూట గడవాలి? ఎంజాయ్ చేయడానికి ఏం చేయాలి? ఎవరిని దోచుకోవాలి? జేబులో సింపుల్‌గా పెట్టుకుని తిరిగే బ్లేడే వీరి పదునైన ఆయుధం. ఒంటరిగా దొరికినా, వారు చెప్పింది వినకున్నా, అడిగింది ఇవ్వకున్నా.. తెల్లారి రైల్వే పట్టాలపై శవాలుగా తేలాల్సిందే! తిరుపతిలో ఇటీవల జరిగిన పలు హత్యకేసులను ఛేదిస్తే బ్లేడ్ బ్యాచ్ ఆగడాలు ఒక్కొక్కటిగా బయటకు వస్తున్నాయి. తిరుపతి పుణ్యక్షేత్రానికి వచ్చే భక్తులు, ఒంటరిగా వెళ్లే యువకులు, అమాయకులు, విటులు.. వీరికి టార్గెట్. అమ్మాయిలను ఎరవేసి నిర్మానుష్య ప్రదేశానికి తీసుకెళ్లి నిలువుదోపిడీ చేస్తున్నారు. తేడా వచ్చి తిరగబడితే పీక కోసేస్తున్నారు.

పోలీసులకూ భయమే! : పోలీసులంటే అందరికి భయం.. దొంగలకు మరీ భయం. అయితే ఈ బ్లెడ్‌బ్యాచ్ అంటే పోలీసులకే భయం. పోలీసులతో ఎలా ఆడుకోవాలి? ఎలా బెదరగొట్టాలి? ఎలా తప్పించుకోవాలి. ఏ

... మిగతా 7లో




- ఇటీవల తిరుపతిలోని పద్మావతిపురంలో థామస్ అనే యువకుడు దారుణంగా హత్యకు గురయ్యాడు. హతుడి మిత్రుడైన వెంకటేశ్ ఈ కేసులో హంతకుడు. ఒకప్పుడు వీరిద్దరూ తిరుపతి రైల్వే స్టేషన్ పరిసరాల్లో సంచరించే బ్లేడ్ బ్యాచ్ సభ్యులు. ప్రస్తుతం ఒకరు మరణించగా.. మరొకరు జైలుకెళ్లారు. రెండేళ్ల క్రితం రైల్వే లోకో పైలెట్‌కు చెందిన ఉద్యోగి రాత్రి పూట ఒంటరిగా వెళ్తుండగా.. పాత తిరుచానూరు రైల్వే గేటు సమీపంలో అతనిపై దాడి చేసి బ్లేడ్‌తో గాయపరిచారు. ఉద్యోగి వద్ద ఉన్న డబ్బులు లాక్కున్నారు. ఆ కేసులో జైలు శిక్ష అనుభవించి, విడుదలైన ఆరు నెలల్లోనే వెంకటేష్ తన స్నేహితుడినే హతమార్చి మళ్లీ జైలుకెళ్లాడు.
- ఇటీవల తిరుపతి ఆర్టీసీ బస్టాండ్ సమీపంలో ఒక దర్జీని బ్లేడ్‌తో గొంతుకోసి చంపారు. ఇప్పటి వరకూ ఈ కేసు విచారణ అతీగతి లేదు. హంతకులెవరో పోలీసుల తేల్చలేదు.
- ఆర్నెల్ల క్రితం ఎస్‌డీహెచ్‌ఆర్‌లో డిగ్రీ చదువుతున్న విద్యార్థిని పడమర రైల్వేస్టేషన్ వద్ద సాయంత్రం 5 గంటల సమయంలో అందరూ చూస్తుండగానే బ్లేడ్ బ్యాచ్ గాయపరిచి పారిపోయింది.
- పాత తిరుచానూరు రైల్వే గేటు నంబర్ 106 సమీపంలో ఏటా 15 నుంచి 20 గుర్తుతెలియని శవాలు బయట పడుతుంటాయి. ఇందులో మెజార్టీ కేసులు బ్లేడ్ బ్యాచ్ ఆగడాలకు తెగిన గొంతులే!



చిత్తూరు అదనపు ఎస్పీ రాధిక మరో మైలురాయిని అధిగమించారు. డిసెంబరు 30న అర్జెంటీనాలోని 6,962 మీటర్ల ఎత్తున్న అకంకగువా పర్వతాన్ని అధిరోహించి పోలీస్ శాఖ కీర్తిని చాటారు.

కళాంజలిలో 'మ్యారీగోల్డ్' వస్త్రశ్రేణి





ఈనాడు, హైదరాబాద్: చేనేతలకు, అల్లికలకు సరికొత్త డిజైన్లకు చిరునామాగా నిలుస్తున్న కళాంజలిలో ఇప్పుడు సంప్రదాయ మ్యారీగోల్డ్ డిజైన్లు అందుబాటులోకి వచ్చాయి. కార్యాలయాలకు వెళ్లేటప్పుడు, ఇంట్లో వేసుకునేందుకు అనువుగా.. కాటన్, సిల్క్ దుస్తులు ఆకట్టుకుంటున్నాయి. మంగళగిరి కుర్తీపైన నలుపు రంగు ముద్రలతో... కాలర్ దగ్గర పూల అల్లికలు మరింత ఆకర్షణగా కనిపిస్తున్నాయి. మంగళగిరి బాటమ్, కాటన్ దుప్పట్టాలు ఆకర్షణీయమైన రంగుల్లో ఉన్నాయి.

వివరాలకు www.kalanjali.com, www.facebook.com/kalanjali.com సందర్శించండి.

తెప్పోత్సవాలు సమాప్తం

తిరుపతి(కపిలతీర్థం), న్యూస్‌టుడే: శ్రీ కపిలేశ్వరాలయంలో అయిదు రోజులుగా సాగుతున్న తెప్పోత్సవాలు సోమవారంతో ముగిశాయి. ఆలయ పుష్కరిణిలో శ్రీ చండికేశ్వర మనోన్మణి చంద్రశేఖరస్వామి తెప్పలపై విహరిస్తూ భక్తులను కటాక్షించారు. ఆలయ పండితులు ఉత్సవమూర్తిని ఆస్థాన మండపంలో ప్రతిష్ఠించి అలంకరించారు. అనంతరం ఊంజల్ మండపానికి తీసుకొచ్చి ఊంజల్ సేవ నిర్వహించారు. మంగళవాయిద్యాల మధ్య ఆలయ పుష్కరిణి వద్దకు తీసుకొచ్చి తెప్పలపై కొలువుదీర్చారు. భక్తుల సమక్షంలో ప్రత్యేక పూజలు నిర్వహించగా.. ఆలయ పుష్కరిణిలో ఏడు చుట్లు తిరుగుతూ భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. గత నెల 28వ తేదీ ప్రారంభమైన తెప్పోత్సవాలు వైభవంగా ముగిశాయి. కార్యక్రమంలో ఆలయ డిప్యూటీ ఈవో సుబ్రహ్మణ్యం, ఏఈవో శంకర్‌రాజు, సూపరింటెండెంట్ రాజ్‌కుమార్, ఇన్‌స్పెక్టరు మురళీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.



అలంకారంలో చండికేశ్వర మనోన్మణి చంద్రశేఖరస్వామి

టాస్క్‌ఫోర్స్ డైరీ ఆవిష్కరణ

జీవకోన(తిరుపతి), న్యూస్‌టుడే: ఏపీ ఎర్రచందనం అక్రమ రవాణా నిరోధక ప్రత్యేక కార్యదళం(టాస్క్‌పోర్స్) డైరీని సోమవారం ఐజీ కాంతారావు ఆవిష్కరించారు. తిరుపతి నగర పరిధి కపిలతీర్థంలోని టాస్క్‌ఫోర్స్ కార్యాలయంలో నూతన సంవత్సర వేడుకలు నిర్వహించారు. టాస్క్‌ఫోర్స్ ఎస్సై అశోక్ కుమార్ ప్రత్యేకంగా రూపొందించిన డైరీని ఐజీ ఆవిష్కరించారు. కార్యక్రమంలో డీఎస్పీలు హరినాథబాబు, లక్ష్మీనారాయణ, ఏసీఎఫ్ నాగార్జునరెడ్డి, సీఐ రామిశెట్టి మధుబాబు, ఆర్ఐలు, ఎస్సైలు పాల్గొన్నారు.



టాస్క్‌ఫోర్స్ కార్యాలయంలో డైరీ ఆవిష్కరిస్తున్న ఐజీ కాంతారావు

సేవలకు చిరునామా స్విమ్స్

ఆస్పత్రి ఓపీ సేవల వివరాలు ఇలా

న్యూస్‌టుడే, తిరుపతి(స్విమ్స్): తితిదే ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న శ్రీ వేంకటేశ్వర వైద్యవిజ్ఞాన సంస్థ(స్విమ్స్) ఆసుపత్రి, శ్రీ పద్మావతి మహిళా వైద్యకళాశాల అనుబంధంగా 300 పడకల ఆసుపత్రిలో ఆదివారం మినహా మిగతా అన్నిరోజుల్లో ఓపీ సేవలు అందుబాటులో ఉంటాయి. ఉదయం 7గంటల నుంచి 11 గంటల వరకు వైద్యులు అందుబాటులో ఉంటారు. కొన్ని స్పెషాల్టీ విభాగాలు మినహా అన్ని విభాగాలు వైద్యులు రోజూ రోగులను పరీక్షిస్తారు. అత్యవసర విభాగం(క్యాజువాల్టీ) 24గంటలు పనిచేస్తూ ఉంటుంది. ఆయా విభాగాల వారి ఓపీలకు కేటాయించిన గదుల వివరాలు ఇలా..



గది నెంబరు	విభాగం పేరు	ఓపీరోజు
11	రక్తనమూనాల సేకరణ కేంద్రం	సోమ-శనివారం
16,17	సీటీ సర్జరీ	సోమ-శనివారం
18,19	కార్డియాలజీ (గుండెవ్యాధులు)	సోమ-శనివారం
21,22,23	న్యూరాలజీ	సోమ-శనివారం
25,26	మెడిసిన్	సోమ-శనివారం
29	హెమటాలజీ	సోమ-శనివారం
35,36,37	నెఫ్రాలజీ	సోమ-బుధ-శుక్రవారం
39,40	ఎండోక్రినాలజీ	సోమ-శనివారం
41	సర్జికల్ గ్యాస్ట్రోఎంట్రాలజీ	మంగళ-గురు-శనివారం
27,28	న్యూరోసర్జరీ	సోమ,బుధ,శుక్రవారం
31	జనరల్ సర్జరీ, రుమటాలజీ	సోమ,బుధ,శుక్రవారం
39	ప్లాస్టిక్ సర్జరీ	సోమ,బుధ,శుక్రవారం
31	సర్జికల్ అంకాలజీ	మంగళ,గురు,శనివారం
32	మెడికల్ అంకాలజీ	మంగళ,గురు,శనివారం
28	రేడియేషన్ అంకాలజీ	మంగళ,గురు,శనివారం
ప్రత్యేక ఓపీ సేవలు		
32	బ్రెస్ట్ క్లినిక్	సోమవారం
25,26	చెస్ట్ క్లినిక్	సోమ-శనివారం
39,40	జువైనెల్ డయాబెటిక్ క్లినిక్	ప్రతినెలా రెండో శనివారం
39,40	ఎండోక్రినాలజీ	మంగళవారం
25,26	రుమటాలజీ క్లినిక్	మంగళ,గురు,శనివారం
39,40	మాస్టర్ హెల్త్ చెకప్	సోమ-శనివారం
సాయంత్రం ప్రత్యేక ఓపీ సేవలు		
సమయం: సాయంత్రం 3గంటల నుంచి 6గంటల వరకు		
18,19	కార్డియాలజీ	సోమ-శనివారం
ఆదివారం ఉచిత ఓపీ సేవలు		
39,40	డయాబెటిక్	ప్రతినెలా రెండో ఆదివారం
21,22	ఎపిలెప్సీ	ప్రతినెల మూడో ఆదివారం
18,19	హైపర్‌టెన్షన్ క్లినిక్	ప్రతినెలా నాల్గో ఆదివారం

శ్రీ పద్మావతి మహిళా వైద్యకళాశాల అనుబంధంగా.. వైద్యసేవలు

స్విమ్స్ ఓపీడీ విభాగంలో..

దంత వైద్యం, ఊపిరితిత్తుల వ్యాధులు-టీబీ, శ్వాసకోశవ్యాధులు, స్పీచ్ థెరపీ సోమ-శనివారం



300 పడకల శ్రీ పద్మావతి మహిళా వైద్యకళాశాలలో..

మెడిసిన్ నాల్గవ యూనిట్	సోమ,బుధ,శుక్రవారం
స్త్రీ వ్యాధులు, ప్రసూతి వైద్యవిభాగం	సోమ-శనివారం
ఈఎన్‌టీ(చెవి, ముక్కు, గొంతు)	సోమ-శనివారం
డెర్మటాలజీ (చర్మవ్యాధుల విభాగం)	సోమ-శనివారం
పిడియాట్రీ (చిన్నపిల్లల వైద్యవిభాగం)	సోమ-శనివారం
సైకియాట్రీ (మానసిక వైద్యవిభాగం)	సోమ-శనివారం

హార్సిలీహిల్స్‌కు ద్విచక్ర వాహనంపై మంత్రి తనయుడు

బి.కొత్తకోట, న్యూస్‌టుడే: రాష్ట్ర గృహ నిర్మాణశాఖ మంత్రి కాలువ శ్రీనివాసులు కుమారుడు భరత్ ఆదివారం రాత్రి హార్సిలీహిల్స్‌కు వచ్చాడు. బెంగళూరులో చదువుకుంటున్న ఈయన కొత్త సంవత్సరాన్ని పురస్కరించుకుని స్నేహితులతో కలసి ద్విచక్ర వాహనంపై వచ్చాడు. అయితే హార్సిలీ హిల్స్ ఘాట్‌రోడ్డులో పోలీసులు ద్విచక్ర వాహనాన్ని పైకి వెళ్లడానికి అనుమతించలేదు. నూతన సంవత్సరపు రద్దీని దృష్టి లో ఉంచుకుని ద్విచక్రవాహనాలను కొండపైకి అనుమతించడంలేదని కాండ్లమడుగు తనిఖీ కేంద్రంలో పోలీసులు మంత్రి తనయుడికి చెప్పారు. ఈలోగా గృహనిర్మాణ శాఖ అధికారులు జోక్యం చేసుకుని ద్విచక్ర వాహనాన్ని తనిఖీకేంద్రం వద్దనే పెట్టి కారులో మంత్రి కుమారుడిని తీసుకెళ్లారు.

ద్విచక్రవాహనాన్ని ఢీకొన్న బస్సు

ఒకరికి తీవ్ర గాయాలు

వాల్మీకిపురం, న్యూస్‌టుడే : ద్విచక్రవాహనాన్ని ఆర్టీసీ బస్సు ఢీకొని ఒక వ్యక్తి తీవ్రంగా గాయపడిన సంఘటన సోమవారం మండలంలోని చింతలవారిపల్లెలో చోటు చేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి. కలికిరి మండలం సీకే బర్నేపల్లెకు చెందిన నాగేశ్వరరావు సోమవారం ఉదయం తన కుమారుడు చరణ్ (7)తో కలిసి ద్విచక్రవాహనంపై గుర్రంకొండలోని బంధువుల ఇంటికి బయలుదేరాడు. మార్గంమధ్యలోని చింతపర్తి వద్ద మరో వ్యక్తి హరీష్‌నాయక్‌ను తన వాహనంలో ఎక్కించుకుని వెళుతుండగా చింతలవారిపల్లె వద్ద ఎదురుగా వస్తున్న ఆర్టీసీ బస్సు వీరిని ఢీకొంది. ఈ ప్రమాదంలో నాగేశ్వరరావు కాలు తెగి దూరంగా పడిపోగా హరీష్‌నాయక్‌కు కూడా తీవ్రగాయాలయ్యాయి. వీరిమధ్యలో కూర్చుని ఉన్న బాలుడు చరణ్ మాత్రం సురక్షితంగా ప్రమాదం నుంచి బయటపడ్డాడు. గాయపడిన వారిని 108 వాహనంలో స్థానిక ప్రభుత్వాసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండటంతో మెరుగైన వైద్యం కోసం తిరుపతికి తీసుకెళ్లారు. ఎస్సై వెంకటేష్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



తీవ్రంగా గాయపడిన నాగేశ్వరరావు

జన్మభూమి గ్రామసభల బహిష్కరణ

పుంగనూరు, న్యూస్‌టుడే : జిల్లాలోని వైకాపా ప్రజాప్రతినిధులు, నేతలు, కార్యకర్తలు మంగళవారం నుంచి ప్రారంభమయ్యే అయిదోవిడత జన్మభూమి గ్రామసభలను బహిష్కరించాలని జడ్పీ ఫ్లోర్‌లీడర్, స్థానిక జడ్పీటీసీ సభ్యుడు వెంకటరెడ్డియాదవ్ తెలిపారు. సోమవారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ వైకాపా అధిష్ఠానం నిర్ణయం మేరకు తీసుకుంటున్న ఈ బహిష్కరణను జిల్లావ్యాప్తంగా పార్టీనేతలు అనుసరించాలని కోరారు. ఇటీవల జిల్లాలో వ్యక్తిగత మరుగుదొడ్ల నిర్మాణంలో జరిగిన అక్రమాలపై వైకాపా జిల్లాకేంద్రంలో ధర్నాచేసినా, జిల్లా పాలనాధికారికి ఫిర్యాదు చేసినా ఎలాంటి చర్యలు తీసుకోకపోవడంతో ఈ నిర్ణయం తీసుకున్నామని పేర్కొన్నారు.

బ్రాహ్మణుల సంక్షేమానికి ముఖ్యమంత్రి కృషి: ఆనందసూర్య

తిరుపతి(బాలాజీకాలని), న్యూస్‌టుడే: బ్రాహ్మణుల సంక్షేమానికి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కృషిచేస్తున్నారని, బ్రాహ్మణ వర్గం ఆధ్వర్యంలో సేవా కార్యక్రమాలను విస్తృతం చేయాలని ఏపీ బ్రాహ్మణ కార్పొరేషన్ ఛైర్మన్ వేమూరి ఆనంద సూర్య పిలుపునిచ్చారు. స్థానిక పద్మావతిపురంలో నూతనంగా ఏర్పాటు చేసిన రాష్ట్రీయ బ్రాహ్మణ సంఘటన కార్యాలయాన్ని ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ బ్రాహ్మణులకు సంబంధించిన సంక్షేమ పథకాలను పూర్తిస్థాయిలో సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఆంధ్రా బ్యాంకు విశ్రాంత మేనేజన్ జీఎస్ ప్రసాద్ మాట్లాడుతూ రాష్ట్రీయ బ్రాహ్మణ సంఘటన ఆధ్వర్యంలో చేపట్టబోయే సేవా కార్యక్రమాల కోసం ప్రత్యేక కార్యాలయాన్ని ఏర్పాటు చేయడం శుభపరిణామమన్నారు. రాష్ట్రీయ బ్రాహ్మణ సంఘటన రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ కేబీసీపీ సాయి మాట్లాడుతూ బ్రాహ్మణులకు సంబంధించిన సంక్షేమ పథకాల సద్వినియోగానికి ఈ కార్యాలయం ఉపకరిస్తుందన్నారు. కార్యక్రమంలో శంకరశర్మ, స్వప్న తదితరులు పాల్గొన్నారు.



వేమూరి ఆనంద సూర్యను సత్కరిస్తున్న నిర్వాహకులు





కాణిపాకం వినాయకున్ని దర్శించుకు వస్తున్న తెలుగు రాష్ట్రాల ఉమ్మడి హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ సునీల్‌చౌదరి, కుటుంబ సభ్యులు.. జిల్లా ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ దుర్గారావు దంపతులను ఆశీర్వదిస్తున్న ఆలయ వేదపండితులు

గణనాథుడి సేవలో ప్రముఖులు

కాణిపాకం, న్యూస్‌టుడే: స్వయంభు శ్రీవరసిద్ధి వినాయకస్వామి వారిని ఆంగ్ల నూతన సంవత్సరం సందర్భంగా సోమవారం పలువురు న్యాయమూర్తులు, కుటుంబ సభ్యులతో కలసి దర్శించుకున్నారు. ఈక్రమంలో ఉమ్మడి రాష్ట్రాల హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ సునీల్‌చౌదరి, జిల్లా ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ దుర్గారావు వేర్వేరుగా దర్శించుకున్నారు. ఆలయ మర్యాదల ప్రకారం ఈవో పెనుమాక పూర్ణచంద్రరావు, అర్చకులు రాజగోపురం వద్ద వారికి స్వాగతం పలికారు. అనంతరం వారు స్వామివారి సేవలో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. సంప్రదాయం ప్రకారం న్యాయమూర్తులు, కుటుంబ సభ్యులకు స్వామివారి శేషవస్త్రాలు, తీర్థప్రసాదాలను ఈవో అందించారు. మూషికమండపంలో వేదపండితులు వారిని ఆశీర్వదించారు. ప్రాంగణంలోని వీరాంజనేయస్వామి, నవగ్రహాలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు. న్యాయమూర్తుల వెంట ఆలయ ఏఈవో రవీంద్రబాబు, సూపరింటెండెంట్ స్వాములు, ఇన్‌స్పెక్టర్లు బాలాజీనాయుడు, రమేష్, చిత్తూరు న్యాయస్థాన సిబ్బంది ఉన్నారు.

భక్తజన సంద్రం.. శ్రీకాళహస్తీశ్వరాలయం

శ్రీకాళహస్తి, న్యూస్‌టుడే: వాయులింగ క్షేత్రంగా ప్రసిద్ధి చెందిన శ్రీకాళహస్తీశ్వరాలయం సోమవారం ఉదయం నుంచి రాత్రి వరకు భక్తులతో కిక్కిరిసిపోయింది. ముక్కంటీశుని దర్శనార్థం అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. ప్రత్యేకించి ఆంగ్ల సంవత్సరాది కావడం, ఓంశక్తి మాలలు ధరించిన భక్తులు దాదాపు యాభై బస్సులకు పైగా ముక్కంటీశుని దర్శనార్థం రావడంతో ఆలయంలో రద్దీ నెలకొంది. ఎరువు వర్ణపు దుస్తులు ధరించిన భవానీలు.. ఓంశక్తి నినాదాలతో శ్రీజ్ఞానప్రసూనాంబిక సమేత వాయులింగేశ్వరుని దర్శించుకున్నారు. సాధారణ దర్శనానికి భక్తులు దాదాపు రెండు గంటల పాటు వేచి ఉండాల్సి వచ్చింది. ఉదయం నుంచి రాత్రి వరకు ముప్పై ఐదు వేల మందికి పైగా భక్తులు స్వామి, అమ్మవార్లను దర్శించుకుని ఉండవచ్చునని ఆలయ అధికారగణం భావిస్తోంది.



శ్రీకాళహస్తీశ్వరాలయంలో దర్శనం కోసం నిరీక్షిస్తున్న ఓంశక్తి మాలలు ధరించిన భవానీలు

పాలనాధికారికి శుభాకాంక్షల వెల్లువ..!

తరలివచ్చిన అధికార యంత్రాంగం ● ప్రభుత్వ శాఖల్లో ఆంగ్ల సంవత్సరాది సంబరాలు

చిత్తూరు (జిల్లా సచివాలయం), న్యూస్‌టుడే : ప్రభుత్వ శాఖల్లో 2018 ఆంగ్ల నూతన సంవత్సరం సంబరాలు ఘనంగా జరిగాయి. జిల్లా నలుమూలల నుంచి అధికార యంత్రాంగం చిత్తూరుకు తరలివచ్చింది. సోమవారం ఉదయం జిల్లా పాలనాధికారి క్యాంపు కార్యాలయంలో పాలనాధికారి పీఎస్ ప్రద్యుమ్నను జిల్లా, మండల స్థాయి అధికారులు కలసి పుష్పగుచ్ఛాలు అందించి శుభాకాంక్షలు తెలిపారు. జిల్లా ప్రధాన న్యాయమూర్తి దుర్గారావు, జిల్లా సంయుక్త పాలనాధికారి పీఎస్ గిరీష, జేసీ-2 చంద్రమౌళి ఆయన్ను కలిసి నూతన ఆంగ్ల సంవత్సరాది శుభాకాంక్షలు చెప్పారు. జిల్లా సచివాలయంలో పాలనాధికారిని ఎస్పీ రాజశేఖర్ బాబు, తిరుపతి సబ్ కలెక్టరు నిశాంత్ కుమార్, మదనపల్లె సబ్ కలెక్టరు వెట్రిసెల్వి, శిక్షణ కలెక్టరు కీర్తి కలిసి పుష్పగుచ్ఛాలు అందజేశారు. కోళ్ల సమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడు వి. సుందరనాయుడు, నెక్ జోనల్ ఛైర్మన్ వి.రమేష్ బాబు, పౌల్ట్రీ సమాఖ్య రైతులు జిల్లా పాలనాధికారి, జేసీలను కలిసి శుభాకాంక్షలు తెలిపారు. విశ్రాంత డీఆర్వో రజియా బేగం, డీఆర్‌డీఏ పీడీ రవిప్రకాష్ రెడ్డి, డ్వామా పీడీ కూర్మనాథ్, డీఈవో పాండురంగ స్వామి, చిత్తూరు ఆర్డీవో కోదండరామిరెడ్డి, డీపీవో ప్రభాకరరావు, సాంఘిక సంక్షేమ శాఖల అధికారులు, వివిధ శాఖల ఉన్నతాధికారులు జిల్లా పాలనాధికారిని కలిసి శుభాకాంక్షలు చెప్పారు. జిల్లా అగ్నిమాపక శాఖ అధికారి శ్రీనివాసులరెడ్డి, ఆ శాఖ అధికారులు, అటవీశాఖ పశ్చిమ, తూర్పు, సామాజిక వన విభాగం అధికారులు, జిల్లా రెవెన్యూ సంఘం అధ్యక్షుడు విజయసింహారెడ్డి, రాష్ట్ర కార్యదర్శి నరసింహులునాయుడు, వీఆర్వో సంఘం అధ్యక్షుడు బాలాజీ రెడ్డి, జాతీయరహదారుల విభాగం అధికారులు, హౌసింగ్, వ్యవసాయ అనుబంధ శాఖల అధికారులు, జలవనరుల శాఖ, జడ్పీ సీఈవో, ఆర్‌డబ్ల్యూఎస్, జిల్లా ఖజానాశాఖ డీడీ,డీఎస్‌వో, పౌరసరఫరాల శాఖ డీఎం, జిల్లా ముఖ్య ప్రణాళిక అధికారులు, ఐసీడీఎస్, జిల్లా సచివాలయ ఉద్యోగులు జిల్లా పాలనాధికారి, జేసీలను కలసి శుభాకాంక్షలు తెలిపారు. జిల్లా వ్యాప్తంగా ఉపాధ్యాయసంఘాలు,పురపాలక సంఘాల కమీషనర్లు, తహసీల్దార్లు, పలువురు ఎంపీడీవోలు తరలివచ్చారు. జిల్లా పాలనాధికారులకు మిఠాయిలు అందించారు. కేక్ కోసి పంచి పెట్టారు. చిత్తూరు ఎమ్మెల్యే సత్యప్రభ, ఎమ్మెల్సీ రాజనరసింహులు కలెక్టర్‌ను కలిసి శుభాకాంక్షలు తెలిపారు.





జేసీకి కేక్ తినిపిస్తున్న జిల్లా పాలనాధికారి పీఎస్ ప్రద్యుమ్న.. జిల్లా పాలనాధికారికి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలుపుతున్న సుందరనాయుడు, వి.రమేష్ బాబు



జిల్లా పాలనాధికారికి పుష్పగుచ్ఛం అందిస్తున్న ఎస్పీ రాజశేఖర్ బాబు

● జిల్లా తెదేపా అధ్యక్షుడు పులివర్తి నాని, తెదేపా జడ్పీటీసీ సభ్యులు చిట్టిబాబు, ముల్లగూరి లత, వెంకటేశ్వరచౌదరి, వైకాపా నాయకులు జంగాలపల్లె శ్రీనివాసులు, రజక సమాఖ్య అధ్యక్షుడు షణ్ముగం, మాజీ ఎమ్మెల్యే ఎఎస్ మనోహర్, ఇతర పలు సంఘాల నాయకులు, సభ్యులు జిల్లా పాలనాధికారి, జిల్లా సంయుక్త పాలనాధికారిని కలిసి నూతన ఆంగ్ల సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు.

4న ఉద్యోగ మేళా

చిత్తూరు (సంతపేట), న్యూస్‌టుడే : ప్రైవేటు సంస్థ డీమార్ట్‌లో ఉద్యోగ ఖాళీల భర్తీ నిమిత్తం ఈనెల నాలుగో తేదీన ఉద్యోగ మేళాను నిర్వహిస్తున్నట్లు జిల్లా ఉపాధి అధికారి ఎస్వీరమణ తెలిపారు. క్యాషియర్, ప్యాకర్స్, సేల్స్ అసోసియేట్స్ విభాగాల్లో ఖాళీల భర్తీ చేయనున్నట్లు వెల్లడించారు. అభ్యర్థులు పదో తరగతి/ఇంటర్/డిగ్రీ ఉత్తీర్ణులై, వయస్సు 19-25 సంవత్సరాల్లోపు ఉండాలన్నారు. ఇతర వివరాలకు కార్యాలయంలో సంప్రదించాలన్నారు. ఆసక్తి కల్గినవారు 4వ తేదీన ఉదయం 9 గంటలకు చిత్తూరులోని జిల్లా ఉపాధి కార్యాలయం వద్ద హాజరు కావాలని ఆయన వెల్లడించారు.

డీఈడీ పరీక్షలకు 87మంది గైర్హాజరు

చిత్తూరు (విద్య), న్యూస్‌టుడే : డీఈడీ ద్వితీయ సంవత్సర పరీక్షల్లో భాగంగా ఐదోరోజు సోమవారం 2,822 మంది విద్యార్థులకు గాను 2,735 మంది హాజరయ్యారు. 87మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు. పరీక్షలు నేటితో ముగియనున్నాయని డీఈవో పాండురంగస్వామి తెలిపారు. ఈ పరీక్షలు సజావుగా నిర్వహించినట్లు ఆయన పేర్కొన్నారు.

ఘనంగా.. నూతన సంవత్సర వేడుకలు

క్యాంపు కార్యాలయంలో కేక్ కోసిన ఎస్పీ ● మహిళా నేరాల నియంత్రణే ధ్యేయంగా పనిచేయండి

చిత్తూరు (నేరవార్తలు), న్యూస్‌టుడే : జిల్లా పోలీసు క్యాంపు కార్యాలయంలో సోమవారం నూతన సంవత్సరం వేడుకలు ఘనంగా జరిగాయి. జిల్లా ఎస్పీ రాజశేఖర్‌బాబు పోలీసు అధికారులతో కలసి కేక్ కోసి పంచిపెట్టారు. చిత్తూరు, పుత్తూరు, మదనపల్లె, పలమనేరు సబ్‌డివిజన్ డీఎస్పీలు, సీఐలు, ఎస్సైలందరూ ఎస్పీకి పుష్పగుచ్ఛం అందించి నూతన సంవత్సరం శుభాకాంక్షలు తెలిపారు. పోలీసు అధికారులు, సంఘం నాయకులు గజమాలతో ఎస్పీని సత్కరించారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ రాజశేఖర్‌బాబు మాట్లాడుతూ పోలీసులు ఈ ఏడాది కొత్త లక్ష్యంతో ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. మహిళా నేరాల నియంత్రణే ధ్యేయమని చెప్పారు. అన్ని పోలీసు స్టేషన్ల అధికారులు మహిళలపై జరిగే నేరాలపై దృష్టి పెట్టాలన్నారు. ఇదే లక్ష్యంతో ముందుకు సాగాలని సూచించారు. అనంతరం పోలీసు అధికారులందరికి నూతన సంవత్సరం శుభాకాంక్షలు తెలిపి, ఫోటోలు తీయించుకున్నారు.

ఎస్పీని కలసిన సుందరనాయుడు

జిల్లా ఎస్పీ రాజశేఖర్‌బాబును సోమవారం రాష్ట్ర పౌల్ట్రీ సమాఖ్య అధ్యక్షుడు సుందరనాయుడు మర్యాద పూర్వకంగా కలిశారు. పుష్పగుచ్ఛం అందించి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. ఆయన వెంట నెక్ జోనల్ ఛైర్మన్ రమేష్, నెక్ ఈసీ సభ్యుడు ఈశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.



ఎస్పీని కలసి పుష్పగుచ్ఛం అందిస్తున్న సుందరనాయుడు

జిల్లా ప్రధాన న్యాయమూర్తికి శుభాకాంక్షలు

చిత్తూరు (న్యాయవిభాగం), న్యూస్‌టుడే : నూతన సంవత్సరాన్ని పురస్కరించుకుని జిల్లా ప్రధాన న్యాయమూర్తి దుర్గారావుకు ఆ శాఖ ఉద్యోగులు, సిబ్బంది శుభాకాంక్షలు తెలిపారు. సోమవారం ఆయన స్వగృహంలో నూతన సంవత్సర వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా ప్రధాన న్యాయమూర్తి నూతన సంవత్సర కేక్‌ను కోసి అందరికి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం దుర్గారావును న్యాయశాఖ ఉద్యోగుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గోపినాధరెడ్డి ఆధ్వర్యంలో ఉద్యోగులు ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో న్యాయమూర్తులు, న్యాయశాఖ ఉద్యోగుల సంఘం నాయకులు లక్ష్మీపతి, రవీంద్రారెడ్డి, సౌందర్‌రాజన్, మస్తాన్‌వల్లి, సుందర్, రెడ్డెప్ప, రేవతి, మునీర్, రాజేంద్ర, ప్రభు, బాలసుబ్రహ్మణ్యం, ఉద్యోగులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



జిల్లా ప్రధాన న్యాయమూర్తి దుర్గారావుకు శుభాకాంక్షలు తెలిపిన న్యాయశాఖ ఉద్యోగులు

తిరుపతి



కాలమాన పట్టికను ఆవిష్కరిస్తున్న వీసీ హరిబాబు, అధికారులు

మంచి మాట ☛ బాధలన్నింటినీ సహిస్తూ, అనుక్షణం క్షమిస్తూ, నిస్వార్థానికి మారుపేరైన మాతృత్వమే భారతీయ నారీమణులకు ఆదర్శం. - స్వామి వివేకానంద



సేవా స్మరణ... సంఘం ఆచరణ

- సంక్షేమమే ధ్యేయంగా సంఘం ఏర్పాటు
- అనాథ పిల్లలు, సంఘ బాధితులకు చేయూత
- ఆదర్శం.. తిరుపతి మోటర్ సైకిల్ మెకానిక్స్ అసోసియేషన్

తిరుపతిలో ద్విచక్ర వాహనాల మరమ్మతులకు ఆ ఒక్కరోజు ఆగాల్సిందే. ఎందుకంటే నగరంలో ఉండే ద్విచక్ర వాహన మెకానిక్‌లు మీకు అందుబాటులో ఉండరు. దుకాణాలు తెరిచి ఉండవు. మీరు ఎంత వెతికినా మీ ప్రయత్నం వృథా తప్ప ఒక్కరూ దొరకరు. ఆ రోజు అంటే ప్రతినెలా 20వ తేదీ. ప్రత్యేకత ఏమిటి అనుకుంటున్నారా? అయితే కథనం చదవాల్సిందే.

- న్యూస్‌టుడే, తిరుపతి(గాంధీరోడ్డు)



అనాథ శరణాలయానికి బియ్యం వితరణ చేసిన మెకానిక్‌లు(దాచిన చిత్రం)

నగరంలో 'తిరుపతి మోటర్ సైకిల్ మెకానిక్స్ అసోసియేషన్' పేరుతో సంక్షేమ సంఘం ఏర్పాటైంది. సమాజంలో మెకానిక్‌లకు గుర్తింపు ఉండాలనే ఉద్దేశంతో 1993లో మెకానిక్ బోగిరాజు సంక్షేమ సంఘాన్ని ఏర్పాటు చేశారు. 43 మందితో ఏర్పడిన సంఘం నేడు 322 మంది సభ్యులకు విస్తరించింది. వీరు ప్రతినెలా 20వ తేదీన దుకాణాలకు సెలవు ప్రకటించి ఒకచోట సమావేశం ఏర్పాటు చేసుకుంటారు. సమావేశంలో మెకానిక్‌లు ఎదుర్కొంటున్న సమస్యలపై చర్చిస్తారు. సంఘానికి అధ్యక్షుడిగా ఉన్న మునిరెడ్డి(మెకానిక్) నాయకత్వంలో.. సభ్యుల్లో ఎవరికి ఏ కష్టం వచ్చిన మేముఉన్నాం అంటూ ముందుంటారు. సభ్యుల్లో ఎవరైన అనారోగ్యం పాలైనా..ప్రమాదానికి గురైనా, మృతిచెందినా సంఘం ద్వారా ఆదుకుంటారు. సభ్యుల సంక్షేమమే కాదు.. సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ఎవరైన సాయం కావాలని ఆశ్రయిస్తే తమ వంతుగా చేయూతనిస్తారు.

విస్తరిస్తున్న సేవలు

సభ్యుల సంక్షేమానికి ఏటా పాటుపడుతున్నారు. ఆపదలో ఉన్న 15 మంది మెకానిక్‌లకు గత ఏడాది పదివేల రూపాయల చొప్పున ఆర్థికసాయం అందించారు. అలాగే 1993 నుంచి ఏటా పదిమందికి తగ్గకుండా

సాయం చేస్తూ వస్తున్నారు. తిరుపతి గ్రామీణం అవిలాలలోని మాతృశ్య అనాథ శరణాలయంలో ఉన్న సుమారు 56 మంది సంక్షేమాన్ని కాంక్షిస్తూ ఈ గత ఏడాది మే, జూన్ 20వ తేదీల్లో వారికి అవసరమైన బియ్యం, నిత్యావసర సరకులు వితరణ చేశారు. పిల్లల చిరిగిన దస్తులు కుట్టుకోవడానికి కుట్టు మిషన్ అసవరం ఉందని నిర్వాహకురాలు శ్రీదేవి కోరగా.. రూ.5 వేలు విలువ చేసే కుట్టు యంత్రం ఉచితంగా అందజేశారు. ఇలా సంఘానికే కాకుండా సమాజంలో సేవల్లో ముందండి ఆదర్శంగా నిలుస్తున్నారు.



సమావేశమైన తిరుపతి మోటార్‌సైకిల్ మెకానిక్‌లు

మెకానిక్‌లకు గుర్తింపు అవసరం



స్కూటర్ మోకానిక్ అంటే చులకన భావన ఉండేది. సమాజంలో మోటర్ సైకిల్ మెకానిక్‌లకు గుర్తింపు కావాలనే ధ్యేయంతో సంఘాన్ని ఏర్పాటు చేసుకున్నాం. మెకానిక్‌ల సంక్షేమమే ధ్యేయంగా మా సంఘం పనిచేస్తుంది. సభ్యుల్లో ఎవరికి ఏ కష్టం వచ్చినా మేము ముందుంటాం. సభ్యుల సంక్షేమం కోసమే కాకుండా అనాథ పిల్లల సంక్షేమానికి మా వంతుగా సొంత ఖర్చులతో సాయం అందిస్తున్నాం. అనాథ పిల్లల చదువు కోసం భవిష్యత్తులో ఆర్థిక సాయం అందించేందుకు కృషి చేస్తాం.


- మునిరెడ్డి, సంఘం అధ్యక్షుడు

సంఘం ఆదుకుంది



ద్విచక్ర వాహనంపై వెళ్తుతుండంగా ప్రమాదవశాత్తు నాకు ప్రమాదం జరిగింది. మూడు నెలల పాటు ఇంట్లోనే విశ్రాంతి తీసుకున్నా. నా పరిస్థితిని గుర్తించి సంఘం తరపున రూ.10 వేలు ఆర్థిక సాయం అందజేశారు. సంఘం ద్వారా గుర్తింపు వచ్చింది. **- శేఖర్, మెకానిక్**

ప్రభుత్వం ఆదుకోవాలి



సమాజంలో బాధ్యతగా వ్యవహరిస్తున్న మేము సేవా కార్యక్రమాల్లోనూ ముందుంటాం. మా సంక్షేమమే కాకుండా అనాథ పిల్లల సంక్షేమానికి కృషి చేస్తాం. ప్రభుత్వం స్పందించి కార్మిక వ్యవస్థలో ఒకరైన మెకానిక్‌లను ఆదుకోవాలి.

- నాగేంద్ర, మెకానిక్

పశువైద్య విశ్వవిద్యాలయ కాలమానపట్టిక ఆవిష్కరణ

తిరుపతి(పశువైద్య విశ్వవిద్యాలయం), న్యూస్‌టుడే: తిరుపతిలోని శ్రీ వేంకటేశ్వర పశువైద్య విశ్వవిద్యాలయ కాలమానపట్టిక, డైరీని విశ్వవిద్యాలయ వీసీ వై.హరిబాబు సోమవారం ఆవిష్కరించారు. విశ్వవిద్యాలయ పరిపాలన భవనంలో నిర్వహించిన కార్యక్రమంలో వీసీ మాట్లాడుతూ ఆచార్య ఎన్జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం నుంచి పశువైద్య విశ్వవిద్యాలయం విడిపోయిన తరువాత ముద్రణకు సంబంధించి కొద్ది సమస్యలు ఉన్నాయని, వాటిని అధిగమించి నూతన సంవత్సరం ప్రారంభం రోజునే టేబుల్ కాలమానట్టిలు, సాధారణ కాలమానపట్టి, డైరీలను విడుదల చేయడం సంతోషంగా ఉందన్నారు. కార్యక్రమంలో విశ్వవిద్యాలయ అధికారులు, రిజిస్ట్రార్ డాక్టర్ శ్రీనివాసరావులు, ప్రజా సంబంధాల అధికారిణి త్రివేణి అధికారులు పాల్గొన్నారు.



ఉరితాళ్లు చేతబట్టి నిరసన వ్యక్తం చేస్తున్న ఫార్మా-డి నిరుద్యోగులు

అందరికి జనవరి.. మాకేమో ఉరి

ఫార్మా-డి నిరుద్యోగుల వినూత్న నిరసన

తిరుపతి(వైద్యవిభాగం), న్యూస్‌టుడే: నూతన సంవత్సరం అందరి జీవితాల్లో వెలుగును తీసుకువస్తే నిరుద్యోగంతమను ఆత్మహత్య చేసుకోవాల్సిన పరిస్థితిని తీసుకువచ్చిందని ఫార్మా-డి నిరుద్యోగులు వాపోయారు. సోమవారం నగరపాలక సంస్థ కార్యాలయం వద్ద ఫార్మా-డి నిరుద్యోగులు ఉరితాళ్లు చేతబట్టి తమకు ప్రభుత్వం ఉద్యోగ అవకాశాలు కల్పించాలని లేనిపక్షంలో ఆత్మహత్యలు తప్పవని హెచ్చరించారు. ఈ సందర్భంగా డాక్టర్ ఆఫ్ ఫార్మశి రాష్ట్ర అధ్యక్షుడు పి.రాజశేఖర్ మాట్లాడుతూ. . గత కొన్ని రోజులుగా ఫార్మా-డి నిరుద్యోగులు రిలేనిరాహారదీక్షలతో తమ ఆవేదనను తెలిపినా ప్రభుత్వం పట్టించుకోక పోవడం దారుణమన్నారు. ప్రభుత్వం ఇప్పటికైనా స్పందించి ఉద్యోగ అవకాశాలు కల్పించాలని లేనిపక్షంలో ఆత్మహత్యలే శరణ్యమని అన్నారు. దీక్షలో ఫార్మా-డి నిరుద్యోగులు, వారి కుటుంబసభ్యులు పాల్గొన్నారు.

జన్మభూమి- మా ఊరు గ్రామసభలకు సన్నద్ధం

తిరుపతి(రెవెన్యూ), న్యూస్‌టుడే: ఐదో విడత జన్మభూమి- మా ఊరు గ్రామసభలకు సన్నద్ధంగా ఉండాలని తిరుపతి సబ్‌కలెక్టర్ నిశాంత్‌కుమార్ అధికారులకు సూచించారు. తిరుపతి రెవెన్యూ డివిజన్ పరిధిలోని 15 మండలాల్లో లోటుపాట్లు లేకుండా ఏర్పాట్లు చేయాలన్నారు. సోమవారం తహసీల్దార్‌లతో సబ్‌కలెక్టర్ సమీక్షించారు. మంగళవారం నుంచి ప్రారంభం కానున్న గ్రామసభల్లో తొలిరోజు 55 పంచాయతీలలో నిర్వహణ ఉంటుందన్నారు. కేటాయించిన విధులను పక్కాగా నిర్వహించి ప్రజల మన్ననలు పొందాలని సూచించారు. గ్రామసభల్లో ముఖ్యంగా గడిచిన మూడు సంవత్సరాల అభివృద్ధి వివరాలు, ప్రభుత్వ పథకాలు, లబ్ధిదారుల వివరాలు, బుక్‌లెట్‌ల పంపిణీ చేయాలన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ప్రసంగ పాఠంతో పాటు జిల్లా ఇన్‌ఛార్జ్ మంత్రి అచ్చెన్నాయుడు, జిల్లా మంత్రి అమరనాథరెడ్డి, జిల్లా కలెక్టర్ ప్రద్యుమ్న ప్రసంగాలను ప్రజలకు వినిపించాలని కోరారు. విద్య, వైద్యం, ఆరోగ్యం, వ్యవసాయం, పరిశ్రమ అభివృద్ధి, విద్యుత్ వసతి, రహదారుల అభివృద్ధి, సాంకేతిక సమాచార రంగం అభివృద్ధిపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. గ్రామసభల్లో ప్రజల నుంచి వినతులు స్వీకరించాలని సూచించారు.

ఉద్యోగుల సమస్యలను పరిష్కరిస్తాం

తిరుపతి(తితిదే), న్యూస్‌టుడే: వైకుంఠ ఏకాదశి, ద్వాదశి దర్శన విషయంలో జరిగిన అవమానంపై తితిదే ఉద్యోగ సంఘాలు సోమవారం తితిదే ఈవో అనిల్‌కుమార్ సింఘాల్‌ను కలిశారు. ముందుగా పరిపాలనా భవనంలో సమావేశమైన నాయకులు మంగళవారం ఉదయం తితిదే పరిపాలనా భవనం ఎదుట ధర్నా చేయాలని నిర్ణయించుకున్నారు. భవిష్యత్తులో ఇలాంటివి పునరావృత్తం కాకుండా ఉండేలా తితిదే ఒక నిర్ణయానికి రావాలని తీర్మానించుకున్నారు. అనంతరం ఇదే విషయాన్ని ఈవో దృష్టికి తీసుకెళ్లగా ఉద్యోగుల మాట్లాడిన అనంతరం ఈవో తన అభిప్రాయాన్ని వివరించారు. జేఈవో సెలవుపై వెళ్తున్నారని, ఆయన వచ్చిన తరువాత పది రోజుల్లో చర్చించి ఉద్యోగుల సమస్యలను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. ఆయన హామీతో ధర్నాను పది రోజుల పాటు తాత్కాలిక వాయిదా వేస్తున్నట్లు ఉద్యోగ సంఘాల తెలిపారు. కార్యక్రమంలో నాయకులు నాగార్జున, వెంకటేశం, భాస్కర్, వెంకటరమణరెడ్డి, కల్పన, ఇందిర, శివ భాస్కర్‌రావు, శేషగిరి తదితరులు పాల్గొన్నారు.



ఈవోతో మాట్లాడుతున్న తితిదే ఉద్యోగులు

సీఎం చేతుల మీదుగా గృహాలు పంపిణీ



దామినేడు గృహాలను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే సుగుణమ్మ తదితరులు

తిరుపతి(నగరం), న్యూస్‌టుడే: దామినేడు వద్ద ప్రభుత్వం నిర్మిస్తున్న గృహాలను ఈనెల 16న ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు చేతుల మీదుగా పంపిణీ చేసేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు ఎమ్మెల్యే సుగుణమ్మ తెలిపారు. సోమవారం దామినేడు గృహాలను నగరపాలక సంస్థ అధికారులతో కలిసి ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వ సహకారంలో గృహనిర్మాణ పనులు శరవేగంగా సాగుతున్నాయన్నారు. లబ్ధిదారులకు సంక్రాంతి కానుకగా ఇళ్లు పంపిణీ చేసేందుకు అధికారులు చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. ఆమె వెంట పార్టీ నాయకులు దంపూరి భాస్కర్‌యాదవ్, ఆర్సీ మునికృష్ణ, మస్తాన్‌నాయుడు, బుల్లెట్ రమణ, సూరా సుధాకర్‌రెడ్డి, మన్నెం శ్రీనివాసులు తదితరులు ఉన్నారు.



వీసీ దామోదరం, రెక్టార్ భాస్కర్, రిజిస్ట్రార్ అనురాధకు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపిన ఉద్యోగులు

ఉద్యోగుల సమష్టి కృషితోనే ఎస్వీయూకు ఖ్యాతి

తిరుపతి(ఎస్వీ విశ్వవిద్యాలయం), న్యూస్‌టుడే: ఉద్యోగుల సమష్టి కృషితోనే శ్రీవేంకటేశ్వర విశ్వవిద్యాలయానికి అంతర్జాతీయ స్థాయి ఖ్యాతి లభిస్తోందని ఆ వర్సిటీ ఉపకులపతి ఆచార్య దామోదరం పేర్కొన్నారు. నూతన సంవత్సరం వేడుకల్లో భాగంగా పలువురు ఉద్యోగులు సోమవారం ఉన్నతాధికారులను కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా వీసీ మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సహకారం, ఉద్యోగుల అంకితభావంతో తాను వర్సిటీని సర్వతోముఖాభివృద్ధి దిశగా తీసుకెళ్లగలుగుతున్నానని పేర్కొన్నారు. ఇదే ఉత్సాహంతో వర్సిటీ అభివృద్ధికి పాటుపడి విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్తును అందజేద్దామని పిలుపునిచ్చారు. రెక్టార్ ఆచార్య భాస్కర్, రిజిస్ట్రార్ ఆచార్య దేవరాజులు మాట్లాడుతూ విద్యార్థులకు మౌలిక వసతులను కల్పించడంతో పాటుగా, ఉద్యోగుల సంక్షేమానికి నూతన సంవత్సరంలో పెద్దపీట వేస్తామని పేర్కొన్నారు. ఉన్నతాధికారులను కలిసిన వారిలో బోధన, బోధనేతర సిబ్బంది, పరిశోధక విద్యార్థులు, విద్యార్థులు తదితరులున్నారు.

తిరుపతి



ఎంపీ శివప్రసాద్‌కు వినతిపత్రం అందిస్తున్న ఐఎంఏ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ శ్రీహరిరావు తదితరులు

కౌన్సిల్ బిల్లులో సవరణకు సహకరించండి

ఎంపీ శివప్రసాద్‌కు ఐఎంఏ నాయకుల వినతి

తిరుపతి(వైద్యవిభాగం), న్యూస్‌టుడే: కేంద్ర ప్రభుత్వం ఇటీవల పార్లమెంట్‌లో ప్రవేశపెట్టిన నేషనల్ మెడికల్ కౌన్సిల్(ఎన్ఎమ్‌సీ) బిల్లు లోపభూయిష్టంగా ఉందని వెంటనే అందులో ఉన్న లోపాలను సవరించేలా సహకరించాలని చిత్తూరు ఎంపీ శివప్రసాద్‌కు ఇండియన్ మెడికల్ అసోసియేషన్(ఐఎంఏ) నాయకులు విన్నవించారు. సోమవారం ఎంపీని కలిసిన నాయకులు ఈమేరకు వినతి పత్రం అందించారు. అందులో ప్రధానంగా ఎన్ఎమ్‌సీలో అల్లోపతి వైద్యులకు తగిన ప్రాధాన్యం కల్పించడం, ఆల్లోపతి, ఆయుర్వేదం వైద్యులు కూడా అల్లోపతి వైద్య చేయవచ్చనే అనుమతిని రద్దుచేయడం, ప్రైవేటు వైద్య కళాశాలల్లో ఫీజులు ఇష్టారీతిన పెంచుకునేందుకు అవకాశం ఉన్న ఈ బిల్లు లోపభూయిష్టమని తెలిపారు. వెంటనే దీనిపై కేంద్ర ప్రభుత్వం సవరణ చేసేలా ఎంపీ చొరవ చూపాలని కోరారు. వినతిపత్రం అందించిన వారిలో ఐఎంఏ రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ శ్రీహరిరావు, తిరుపతి గౌరవాధ్యక్షులు డాక్టర్ ఐ.వి.రామచంద్రరావు, కార్యదర్శి ఏ.ఆర్.రెడ్డి, కోశాధికారి డాక్టర్ యుగంధర్, ఐఎంఏ రాష్ట్ర మాజీ నాయకుడు డాక్టర్ సి.సుబ్రహ్మణ్యం తదితరులు ఉన్నారు. ఇండియన్ మెడికల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నూతన సంవత్సర వేడుకలను వినూత్నంగా నిర్వహించారు. స్థానిక మదర్ థెరిసా ఆర్ఫనేజ్‌కు సోమవారం ఐదు బస్తాల బియ్యాన్ని విరాళంగా అందించారు.

పారదర్శకంగా 'చంద్రన్న సంక్రాంతి కానుక' పంపిణీ

తిరుపతి(రెవెన్యూ), న్యూస్‌టుడే: రాష్ట్రంలో తెల్ల రేషన్ కార్డు కలిగిన ప్రతి నిరుపేదకు 'చంద్రన్న సంక్రాంతి కానుక' పంపిణీకి ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు శ్రీకారం చుట్టారని రాష్ట్ర ఆహార కమిషన్ సభ్యులు విజయ్‌కుమార్ పేర్కొన్నారు. సోమవారం నగరంలోని ముత్యాలరెడ్డిపల్లి, కపిలతీర్థం సమీపంలోని రేషన్ దుకాణాలలో 'చంద్రన్న సంక్రాతి కానుక'ల పంపిణీ కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రాష్ట్రంలోని హిందూ, ముస్లిం, క్రిస్టియన్లు పండుగలను గొప్పగా జరుపుకోవాలనే సంకల్పంతో చంద్రన్న కానుకను అమల్లోకి తీసుకొచ్చినట్లు వివరించారు. కానుకను అందుకుని నిరుపేద ప్రజలు పండుగను ఘనంగా జరుపుకోవాలని కోరారు. చంద్రన్న క్రిస్మస్ కానుకను పూర్తిస్థాయిలో సరఫరా చేసినట్లు వివరించారు. ఇప్పుడు నగరంలోని 101 రేషన్ దుకాణాల ద్వారా సుమారు 61,400 మందికి చంద్రన్న సంక్రాంతి కానుకలు పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. ఈ నెల 12వ తేదీకి పంపిణీ పూర్తి చేయాలని పౌరసరఫరాల శాఖ అధికారులకు సూచించారు. కార్యక్రమంలో ఏఎస్‌వో శేషాచలంరాజు, ఉప తహసీల్దారులు జయరాజ్, సురేంద్ర తదితరులు పాల్గొన్నారు.



చంద్రన్న సంక్రాంతి కానుకను పంపిణీ చేస్తున్న రాష్ట్ర ఆహార కమిషన్ సభ్యులు విజయ్‌కుమార్

రైతుబజారులో కూరగాయల ధరలు

తిరుపతి(తాతయ్యగుంట), న్యూస్‌టుడే: తిరుపతిలోని రైతుబజారులో కూరగాయల ధర(కిలో)ల వివరాలను ఎస్టేట్ అధికారి అక్తర్ షరీఫ్ తెలిపారు.

సోమవారం నాటి ధరలు ఇలా..

టమోటా- రూ.07, వంకాయలు- రూ.20,36, బెండకాయలు- రూ.24, మిరపకాయలు- రూ.24, కాకరకాయలు- రూ.22,32, బీరకాయలు- రూ.34, కాలిఫ్లవర్(1)- రూ.25, అల్లం- రూ.36, క్యారెట్- రూ.50, క్యాబేజీ- రూ.18, దొండకాయలు- రూ.24, సొరకాయలు- రూ.12, ఉర్లగడ్డలు- రూ.16, తెల్లగడ్డలు- రూ.40, ఎర్రగడ్డలు- రూ.42, చామగడ్డలు- రూ.30, కందగడ్డలు- రూ.30, పందిరి చిక్కుడు- రూ.20,34, గోరుచిక్కుడు- రూ.22, దోస కాయలు- రూ.16, అరటికాయ(1)- రూ.08, మునక్కాయలు- రూ.110, బీట్‌రూట్- రూ.24, ముల్లంగి- రూ.10, బీన్స్- రూ.18, ఆకుకూరలు(1)- రూ.05. ఈ ధరలు మంగళవారం ఉదయం 8గంటల వరకు అమలులో ఉంటాయి.

మంచి సర్వీసుతో సోనోవిజన్‌కు గుర్తింపు

తిరుపతి(భవానీనగర్), న్యూస్‌టుడే: మంచి సర్వీసు అందించే సంస్థ ఏదైనా జనాదరణ పొందుతుందని, ఆ విధంగానే సోనోవిజన్‌కు గుర్తింపు లభించిందని తిరుపతి శాసనసభ్యురాలు సుగుణమ్మ తెలిపారు. స్థానిక లీలామహల్ తిరుమల బైపాస్‌రోడ్డులోని సోనోవిజన్ షోరూమ్‌లో సోమవారం లక్కీడ్రా నిర్వహించారు. ఈ సందర్భంగా మొదటి బహుమతి కింద తిరుపతి కేకేలే అవుట్‌కు చెందిన వెంకటసుబ్బయ్య(కూపన్ నెంబర్ బిల్ నెంబర్ ఎస్ఈ 952) కారును గెలుచుకున్నారు. డ్రా తీసిన ఎమ్మెల్యే అతనికి చరవాణిలో సమాచారం అందించారు. అలాగే ద్వితీయ బహుమతి కింద(కూపన్ నెంబర్ ఎస్ఈ 2827)ఎల్ఈడీ టీవీ, తృతీయ బహుమతి కింద(బీఓ 1038) నెంబర్‌కు ఫ్రిజ్ బహుమతిగా దక్కించుకున్నారు. కార్యక్రమంలో షోరూమ్ అధినేత భాస్కర్‌మూర్తి, బ్రాంచ్ మేనేజర్ హరిప్రసాద్ మాట్లాడుతూ రాయలసీమలోనే అతిపెద్ద షోరూమ్‌లు సోనో విజన్‌వేనని తెలిపారు. సమావేశంలో మరో బ్రాంచ్ మేనేజర్ రాఘవ, తెదేపా నగర అధ్యక్షుడు దంపూరి భాస్కర్‌యాదవ్, మహిళా విభాగం అధ్యక్షురాలు బ్యాంకు శాంతమ్మ, ఎల్‌జీ కంపెనీ ప్రతినిధి సన్యాసిరావు, శ్రీనివాస్, అలీ, ప్రవీణ్, మదన్ తదితరులు పాల్గొన్నారు.



సోనోవిజన్ షోరూమ్‌లో లక్కీ డ్రా తీస్తున్న తిరుపతి శాసన సభ్యురాలు సుగుణమ్మ



- ప్రతాప్ - ఒక్కక్షణం
- జయశ్యామ్- 2 కంట్రీస్
- విఖ్యాత్ - ఆక్సిజన్
- బిగ్‌సినిమా- ప్రాజెక్టు జెడ్
- వేల్‌రామ్స్- హలో
- జగత్- ఎమ్‌సీఏ
- శ్రీనివాస - ఒక్కక్షణం
- కృష్ణతేజ- ప్రాజెక్టు జెడ్
- సంధ్య - ఎమ్‌సీఏ
- సీవీఎస్-సప్తగిరి ఎల్ఎల్‌బీ
- మినీప్రతాప్- టైగర్ జిందాహై
- శ్రీనివాసతేజ- జ్యూమాంజి
- పీజీఆర్- హలో
- తేజ - సీత రాముని కోసం
- ఐ.ఎస్.మహల్- నెక్స్ట్
- నువ్వే పళణి- వేళక్కారన్,
- సక్కా పోడు పోడు రాజా
- సీఎస్ సినిమాస్(దేవేంద్ర)- జ్యూమాంజి

IN THE COURT OF THE PRINCIPAL JUNIOR CIVIL JUDGE OF TIRUPATI
E.P.No. 179/2015 - Disp.No. 32/2012

Margadarsi Chit Fund Pvt. Ltd., Nellore branch rep. by its Manager/Foreman ..**Decree Holder**

Vs

K.SESHU & Other ..**Judgement Debtors**

వేలము ప్రకటన

పై దావా అమలు మనువు షెడ్యూలును వాది పరం డిక్రీ బాకీని రాబట్టుకొనుటకు గాను క్రింద కనబరచిన షెడ్యూలు దాఖలా స్థిరాస్తిని 18-1-2018వ తేదీన పై కనిన కోర్టుయందు ఉ. 10.30 గంటల నుండి సా. 5.00 గంటల మధ్య బహిరంగ వేలము వేయుదురు. సదరు వేలంలో పాల్గొనదలచినవారు వేలం షెడ్యూలును, షరతులను పై కోర్టుయందు తెలుసుకొనవచ్చును.

SCHEDULE: Chittoor Revenue Divison - Sri Balaji Registration Division, Tirupati - Chandragiri Sub Division - Tirupati Rural Mandal- No. 56 belongs to C.Mallavaram Grama Panchayat- Kaluru Village- Govt. Survey No. 50/3-1, 3-H, Tuda Tirupati Layout Plan Approval No. L.P.No. 5/G1/2004, Dt. 23-4-2004, R.O.C.No. 1545/G1/2003, Shanthi Nagar Venture- Plot No.73 - Village: C.Mallavaram, Survey No: 50/3, Document No. 1666/2008 an extent: 201.67 Sq. Yards

BOUNDARIES: East: Plot No. 68. West: 40 feet Road. North: Plot No. 72. South: Plot No. 74.

D.Hr. Value Rs. 10 lakh

SRO Value Rs.5,45,000/-

Field Asst. Value Rs. 20 lakh

Hg: 18-1-18

K.RAMESH BABU, ADVOCATE

D.No.18-8-17A, No.73, Sri Sai Nilayam, Madhura Nagar, Tirupati -517501. Cell: 94400 95932

తిరుపతి కో-ఆపరేటివ్ బ్యాంకు లిమిటెడ్

ప్రధాన కార్యాలయం, తిరుపతి

బంగారు నగల వేలము ప్రకటన స్థలం : తిరుపతి కో-ఆపరేటివ్ బ్యాంకు ప్రధాన కార్యాలయం తేది : 10-1-2018

ఈ క్రింద తెలిపిన వ్యక్తులు పై బ్యాంకు నందు బంగారు నగలు తనఖా పెట్టి అప్పులు తీసుకొని ఉన్నారు. బ్యాంకు అనేక పర్యాయములు నోటీసులు పంపినను వారు సదరు అప్పు బాకీలు చెల్లించలేదు. కనుక వారి బాకీలు రాబట్టుకొనుటకు 10-01-2018 బుధవారం ఉదయం 10 గంటలకు బ్యాంకు ప్రధాన కార్యాలయములో సదరు అప్పు తాలూకు నగలు బహిరంగ వేలము వేయబడును.

వ.నెం.	మెంబరు నెంబరు	అప్పు నెంబరు	రుణగ్రహీత పేరు చిరునామా	బరువు గ్రా.	రుణం తీసుకున్న తేది	మొత్తం రూ.
1	127567/ఎ	31180	శ్రీ యం.యం.ఆనంద్, తండ్రి ఎం.మునిరత్నం 246, చింతలాలయ వీధి, తిరుపతి	38.40	03.06.2016	69000 + వడ్డీ
2	166804/ఎ	31205	శ్రీ యం.మోహన్ తండ్రి యం.గంగయ్య 7-147-17, శాంతి నగర్, తిరుపతి	40.00	08.06.2016	72000 + వడ్డీ
3	127567/ఎ	31209	శ్రీ యం.యం.ఆనంద్ తండ్రి యం.మునిరత్నం 264, చింతలాలయ వీధి, తిరుపతి	43.00	07.06.2016	43000 + వడ్డీ
4	84058/ఎ	31220	[illegible] 20-1-287/సి, [illegible] నగర్, తిరుపతి	78.40	8.6.2016	62000 + వడ్డీ
5	22935/ఎ	31331	శ్రీమతి టి.[illegible] భర్త టి.యం.[illegible] 13-5-531/11, [illegible] నగర్, తిరుపతి	22.00	15.6.2016	40000 + వడ్డీ
6	151672/ఎ	31498	శ్రీమతి [illegible] భర్త యం.[illegible] 18-1-613/బి, [illegible] నగర్, తిరుపతి	57.30	29.6.2016	100000 + వడ్డీ
7	151672/ఎ	31499	శ్రీమతి [illegible] భర్త యం.[illegible] 18-1-613/బి, [illegible] నగర్, తిరుపతి	59.50	29.6.2016	100000 + వడ్డీ
8	29301/ఎ	31749	శ్రీ [illegible] 13-3-344/52, [illegible] తిరుపతి	15.50	20.07.2016	27000 + వడ్డీ
9	157548/ఎ	31790	వై.[illegible] తండ్రి వై.గంగయ్య 19-4-48/1, [illegible] గ్రామం [illegible], తిరుపతి రూరల్	12.80	25.07.2016	18000 + వడ్డీ
10	69484/ఎ	31846	[illegible] తండ్రి [illegible] ప్లాట్ నెం.18, 3-537, [illegible] నగర్ తిరుపతి	36.50	30.07.2016	66000 + వడ్డీ
11	147944/ఎ	6044	శ్రీ [illegible] 1-815, [illegible], తిరుపతి రూరల్	50.00	07.04.2012	90000 + వడ్డీ
12	88005/ఎ	15206	[illegible] 446/ఎ, [illegible], తిరుపతి	38.40	11.01.2014	68000 + వడ్డీ
13	161927/ఎ	18783	[illegible] 3-183, [illegible] గ్రా & పో తిరుపతి రూరల్	22.50	31.05.2014	30000 + వడ్డీ

షరతులు : 1.నోటీసులు చేరని వారు ఇదే ఆఖరినోటీసుగా భావించవలెను. 2.ఈ ప్రకటనను అయిన ఖర్చు బంగారంలో కనబడిన వ్యక్తుల నుండి వసూలు చేయబడును. 3.వేలములో పాల్గొనువారు తప్పనిసరిగా రూ.5000/- డిపాజిట్ చెల్లించవలెను. [illegible] 7.[illegible]

స్థలం : తిరుపతి

తేది : 30.12.2017

సం/-మేనేజింగ్ డైరెక్టర్

జిల్లాలో నిఘా పెంచండి

రాష్ట్ర డీజీపీ మాలకొండయ్య

చిత్తూరు (నేరవార్తలు), న్యూస్‌టుడే : జిల్లాలో పోలీసు నిఘాను పెంచి.. ప్రజలకు భద్రతను కల్పించాలని రాష్ట్ర నూతన డీజీపీ మాలకొండయ్య అన్నారు. సోమవారం ఆయన దూరవీక్షణ ద్వారా పోలీసు అధికారులతో మాట్లాడారు. జిల్లాలోని ప్రధాన కూడళ్లు, ప్రధాన ప్రాంతాలు, చర్చీలు, మసీదులు, ఆలయాల వద్ద సీసీ కెమెరాలను ఏర్పాటు చేయాలని సూచించారు. షాపింగ్ మాల్స్ వద్ద కూడా నిఘాను పటిష్ఠం చేయాలన్నారు. రోడ్డు ప్రమాదాల నివారణకు కృషి చేయాలని తెలిపారు. రానున్న సంక్రాంతి పండుగలో కోడిపందేలు జరగకుండా చర్యలు తీసుకోవాలని చెప్పారు. జన్మభూమి కార్యక్రమంలో బందోబస్తును ఏర్పాటు చేయడమే కాకుండా, రెవెన్యూ అధికారులతో కలసి పనిచేయాలని సూచించారు. అనంతరం పలు అంశాలపై చర్చించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఎస్పీ రాజశేఖర్‌బాబుతో పాటు డీఎస్పీలు పాల్గొన్నారు.

సమావేశ మందిరం ప్రారంభం

చిత్తూరు (జిల్లా సచివాలయం), న్యూస్‌టుడే : జిల్లా సచివాలయంలో ఆధునీకరించిన సమావేశ మందిరాన్ని సోమవారం రాత్రి జిల్లా పాలనాధికారి పీఎస్ ప్రద్యుమ్న ప్రారంభించారు. జిల్లా సచివాలయంలో రెండవ అంతస్తులోని సమావేశ మందిరాన్ని అన్ని హంగులతో ఇటీవలే ఆధునీకీకరించారు. సోమవారం ఈ సమావేశ మందిరంలో పూజలు నిర్వహించి ప్రారంభించారు. కార్యక్రమంలో జేసీ పీఎస్ గిరీష, జేసీ-2 చంద్రమౌళి, జిల్లా సచివాలయ అధికారులు పాల్గొన్నారు.



సమావేశ మందిరాన్ని ప్రారంభిస్తున్న జిల్లా పాలనాధికారి పీఎస్ ప్రద్యుమ్న, జేసీ గిరీష

సావిత్రిబాయి పూలే రాష్ట్ర అవార్డులు

చిత్తూరు (విద్య), న్యూస్‌టుడే : సావిత్రిబాయి పూలే రాష్ట్ర స్థాయి అవార్డులను ప్రభుత్వం సోమవారం సాయంత్రం అమరావతిలో ప్రకటించింది. తొమ్మిది విభాగాలల్లో మహిళా ఉపాధ్యాయులకు అవార్డులను ప్రకటించారు. జిల్లాకు సంబంధించి ఐదు విభాగాల్లో ఉపాధ్యాయినులు పురస్కారాలను అందుకోనున్నారు. ఈ మేరకు అవార్డులకు ఎంపికైన వారు సీఆర్‌టీ విభాగంలో నాగరత్నమ్మ (ఆంగ్లం) కేజీబీవీ కురబలకోట, ప్రత్యేకాధికారి విభాగంలో రఫీయా ప్రవీణ్ కేజీబీవీ పెద్దమండ్యం, ప్రధానోపాధ్యాయులల్లో శ్రీదేవి జడ్పీఉన్నత పాఠశాల గట్టు, బి.కొత్తకోట. ఎస్జీటీలో ఆదిలక్ష్మి, తుమ్మలగుంట తిరుపతి గ్రామీణ మండలం. ఎల్ఎఫ్ఎల్ హెచ్ఎం విభాగంలో శ్రీదేవి, ప్రాథమిక పాఠశాల కుప్పం. ఐఈఆర్‌టీ విభాగంలో శైలజ, పీలేరు ఉన్నారు. వీరందరూ సావిత్రిబాయి పూలే జయంతి రోజున పురస్కారాలను అందుకోనున్నారు.

EENADU CLASSIFIEDS

AGRIBUSINESS

MUSHROOMS

ఫ్రెష్ పుట్టగొడుగుల డీలర్‌షిప్. మష్రూమ్స్ పెంపకం ద్వారా రోజూ ఇంట్లో పనిచేస్తూ 10 వేలు ఆపై ఆదాయం. శిక్షణ ఇచ్చి మష్రూమ్స్ కొంటాం. విత్తనాలు లభించును. ✆ 9966158007.

BUSINESS SERVICES

BUSINESS OFFER

థర్మాకోల్ & పేపర్‌ప్లేట్స్, టీ కప్స్, అగరబత్తి తయారీ మెషిన్లు & రా మెటీరియల్ కలవు. నె॥ 20 వేలు ఆ॥, బై బ్యాక్ అగ్రిమెంట్, (నో ఛార్జెస్). స్కై ఇంజినీరింగ్, ఉప్పల్, Hyd - 84980 27965.

EDUCATION

మార్గ్ ఆధ్వర్యంలో మెప్మా ద్వారా 3 నెలలు 10th పాస్, తెల్ల రేషన్ కార్డు కలిగిన 18- 35 సం॥ యువతీ యువకులకు ఉచిత శిక్షణ, MS Office, Tallyలో ఇవ్వబడును. ✆ 99897 25927, 77992 23265.

COACHING CENTRES

TET + DSC only for Maths (Short Time) Hindi DSC, AP Assistant Professor Exams Paper-I Coaching at Tirupati. ✆ 83740 68717.

SI, గ్రూప్–II, IV, VRO, SSC, BANK, కానిస్టేబుల్ పరీక్షలకు తిరుపతిలో ఉచిత శిక్షణ. బిగ్ లెర్నింగ్స్, M.R.Palli, Tirupati. ✆ 76809 66718.

HEALTH CARE

DIABETIES

డా॥నాగమ్మ హాస్పిటల్, మల్టీ స్పెషాలిటీ సెంటర్, షుగర్, డయాబెటీస్ సంబంధిత సమస్యలు, డయాబెటిక్ ఫుట్‌కేర్, Diabetic Unhealed Wounds, జ్వరం, బి.పి. సం॥ భవానీనగర్, తిరుపతి. ✆ 0877 2226533.

WEIGHT LOSS CENTERS

5 వారాలలో డైట్ లేకుండా 8-10 KG ల బరువు, చేతులు, తోడలు, పొట్టసైజు, మలబద్ధకం, గ్యాస్ట్రిక్ ప్రాబ్లం, మోకాళ్ళనొప్పులు తగ్గుతాయి. Ph: 9652980056

MARRIAGE SERVICES

తేది 11-02-18న ఆదివారం, తిరుపతిలో శ్రీవెంకట గాయిత్రి బ్రాహ్మణ వివాహ పరిచయ వేదిక జరుగును. crkseshagirirao@gmail.com ✆ 94402 71154, 81212 23163.

PEOPLE CARE

OLD AGE HOME

విజయ్ ఓల్డేజ్ హోం & హోంకేర్ సర్వీస్. వృద్ధులు, మంచాన ఉన్నవారికి 24 గం॥ సేవలు చేయుటకు ఆయా/ అటెండర్లను మీ ఇంటికి పంపగలము. ✆ 99121 73322, 99124 53322.

REAL ESTATE

తిరుపతిలో ప్లాట్లు, అపార్ట్‌మెంట్స్, ల్యాండ్స్, కమర్షియల్ బిట్స్ అమ్మదలచిన/ డెవలప్‌మెంట్ కొరకు ఇవ్వదలచిన డైరెక్ట్ ఓనర్స్. సంప్ర॥ 90006 37999.

FLAT FOR SALE

తిరుపతి, కె.టి.రోడ్డు, లక్ష్మీ అపార్ట్‌మెంట్స్‌నందు అన్ని వసతులు గల 2 BHK ప్లాటు కార్ పార్కింగ్‌తో అమ్మబడును. సంప్రదించండి ✆ 95151 25854, 98856 34077.

PLOT FOR SALE

తిరుచానూరు శ్రీ పద్మావతి అమ్మవారి గుడికి 3KM సమీపంలో కొత్తూరు-గంగనగుంట వద్ద లక్ష్మీనారాయణ టెంపుల్ సిటి నందు Tuda ప్లాట్లు కలవు. ✆ 98490 99268.

MK GARDENS: ఏర్పేడు IIT, IISER, IT HUB లకు అతి చేరువలో హైవే మెయిన్ రోడ్డు వెంచర్‌లో స్పాట్ రిజిస్ట్రేషన్‌కు ప్లాట్లు కలవు. RKN Homes & Developers. ✆ 88015 01376, 90006 37999.

TO-LET

3 BEDROOM Flat 1350 Sq.ft. for rent at Pasuparthy Enclave, Opp. RTO Office, Mangalam, Tirupati. Con: 91779 56449.

JOBS

Newly started MNC Company need 20 Marketing Executives. Earn(8000 - 22000) with free Room. Age below 28(Male) Contact: 95159 40947

Wanted Doctors MBBS, DCH & Skin specialist. Ramachandra Hospital, Rajampet. ✆ 9666100254, 9866862008.

తిరుపతిలో TATA SKY లో పనిచేయుటకు Female Co-Ordinator కావలెను. Q: ఇంటర్ +. జీతం: Upto 10,000/- + ఇన్సెంటివ్స్. సం॥ SLV డిస్ట్రిబ్యూటర్స్, యశోదనగర్, కె.టి.రోడ్. ✆ 89775 59999.

ప్రముఖ హోర్డింగ్ సంస్థకు ఆయా జిల్లాలలో వర్క్ సూపర్‌వైజర్లు కావలెను. (ఇంటర్/ITI Civil). అనుభవముబట్టి జీతము. ✆ 99634 71011. మెయిల్: kalyaniadsresumes.1986@gmail.com

తిరుపతి, రేణిగుంట, పుత్తూరు నందు పార్ట్‌టైం- 5,000. ఫుల్‌టైం- 10,000-20,000 + ఫించన్ + లోన్ లభించును. ఆఫీస్, రూం కలవారు (డీలర్) అధిక ఆదాయంకై సంప్ర॥ ✆ 93926 05869.

ఖాదీ గ్రామోద్యోగ్ (KVIC, Govt. of India) ఆధ్వర్యంలో పని చేయుటకు సేల్స్ ఆఫీసర్స్ మరియు ఏజెన్సీ నిర్వహించు నైపుణ్యం కలిగిన వ్యక్తులు కావలెను. ✆ 95335 55588

హైదరాబాద్‌లోని ఇళ్ళల్లో 24 గం.లు వృద్ధులకు సేవచేయడాన్కి, పిల్లలను చూస్కోవడాన్కి 100 మంది ఆడ/మగవారు కావలెను. జీతం:10 వేలు. భోజనం+వసతి ఫ్రీ. ✆ 7032025222

ప్రముఖ కంపెనీయొక్క మస్కిటో మెస్‌లు & జనరేటర్స్ సేల్స్ చేయుటకు ఎగ్జిక్యూటివ్స్ కావలెను. టూ వీలర్ మస్ట్ ✆ 89199 77511, 81256 96884.

Tirupathiలో Master Minds విద్యాసంస్థ నందు పనిచేయుటకు Male Marketing Executives కావలెను. Working Period Jan-18 to June-2018, Qualification Inter/Degree, Two Wheeler Must. Salary 10000/- to 12000/-+Petrol Allowance. Cell. 89781 80843.

SSC, ఇంటర్, డిగ్రీ, P.G., B.Tech వారికి ప్రైవేటు సంస్థలలో, MNC కంపెనీలలో అవుట్ సోర్సింగ్ ద్వారా కంప్యూటర్ OP, అటెండర్స్, సూపర్‌వైజర్స్, నర్సింగ్, హౌస్‌కీపింగ్ వారు కావలెను. తిరుపతి ✆ 70939 76549.

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో ఈ వార్తా పత్రికకు ఏవిధమైన సంబంధం లేదు. ప్రకటనదారులు సరుకుల అమ్మకం లేదా అందించిన సేవల విషయంలో తప్ప, ప్రకటనల ద్వారా ప్రజల నుండి ఎట్టి డబ్బును వసూలు చేయరాదు. డబ్బును వసూలు చేసే ప్రకటనకర్తను బ్లాక్- లిస్టులో ఉంచే మరియు/ లేదా అతనిపై చట్టపరమైన చర్య తీసుకునే హక్కు యాజమాన్యానికి కలదు.

సమష్టి కృషితో 'జన్మభూమి' విజయవంతం

గ్రామసభల నిర్వహణలో నిర్లక్ష్యం వద్దు..

చిత్తూరు (జిల్లా సచివాలయం), న్యూస్‌టుడే : జిల్లాలో నేటి నుంచి ప్రారంభం కానున్న జన్మభూమి-మాఊరు కార్యక్రమాన్ని అధికారులంతా సమష్టిగా పనిచేసి విజయవంతం చేయాలని జిల్లా పాలనాధికారి పీఎస్ ప్రద్యుమ్న పిలుపునిచ్చారు. సోమవారం రాత్రి జిల్లా సచివాలయం నుంచి అన్ని మండలాల ఎంపీడీవోలు, తహసీల్దార్లతో వీడియో సమావేశం ద్వారా సమీక్ష నిర్వహించారు. గ్రామసభల నిర్వహణలో మండల/గ్రామస్థాయి కమిటీలు పకడ్బందీగా వ్యవహరించాలన్నారు. అన్ని స్థాయిల్లోని అధికారులు ఒకరికొకరు సమన్వయంగా పనిచేసి ప్రభుత్వం లక్ష్యం నేరవేరేలా సభలను నిర్వహించాలన్నారు. గ్రామసభల నిర్వహణలో ఎక్కడా నిర్లక్ష్యానికి తావులేకుండా చూడాలన్నారు. 10 రోజుల పాటు నిర్దేశించిన ఫార్మెట్లలో రోజువారిగా నివేదికలు పంపాలన్నారు. యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకొని ఏరోజుకారోజు నివేదికలు అప్‌లోడ్ చేయాలన్నారు. గ్రామసభల్లో నిర్దేశించిన ఫార్మెట్, సమయాల్లో జరగాలని, జన్మభూమి పోస్టర్ గ్రామసభ వెనుక ప్రదర్శించాలని, సీఎం సందేశం చదివి వినిపించాలన్నారు. కొత్త రేషన్‌కార్డులు, పింఛన్లు, చంద్రన్న బీమాను మండల కమిటీలు గ్రామసభల్లో పంపిణీ చేయాలని ఆదేశించారు. మండలాల్లో ఇంకా 1.63 లక్షల దరఖాస్తులు పరిష్కరించాల్సి ఉందని, వీటిపై ఎంపీడీవోలు ప్రత్యేక శ్రద్ధ పెట్టాలన్నారు. నిజమైన లబ్ధిదారులకు కొత్త రేషన్‌కార్డులు పంపిణీ చేయాలని, ఇంటి పట్టాలను గ్రామసభల్లో పంపిణీ చేయాలని, రెవెన్యూ సమస్యలపై వేగంగా చర్యలు తీసుకోవాలని జేసీ పీఎస్ గిరీష తహసల్దార్లను ఆదేశించారు. జన్మభూమి కార్యక్రమం నిర్వహణపై సాయంత్రం అమరావతి నుంచి రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు జిల్లా అధికారులతో వీడియో సమావేశం ద్వారా సమీక్ష నిర్వహించారు. గ్రామసభలను ప్రభుత్వం అనుకున్న విధంగా విజయవంతంగా నిర్వహించేందుకు అధికారులు చిత్తశుద్ధిగా కృషి చేయాలన్నారు.



వీడియో సమావేశం ద్వారా మాట్లాడుతున్న జిల్లా పాలనాధికారి. జేసీలు

గ్రామసభల్లో పెద్ద తెరపై సీఎం సందేశం

జన్మభూమి-మాఊరు గ్రామసభల సందర్భంగా ప్రతి రోజు మధ్యాహ్నం నిర్దేశించిన అంశాలపై సీఎం చంద్రబాబునాయుడు సందేశం ఇవ్వనున్నారు. సీఎం సందేశాన్ని ప్రజలకు ప్రత్యక్షంగా వీక్షించేందుకు వీలుగా పెద్ద ఎల్ఈడీ తెరను జిల్లాకు తెప్పించారు.. జిల్లా పాలనాధికారి పీఎస్ ప్రద్యుమ్న. 10 రోజుల పాటు రాష్ట్ర మంత్రి ఎన్.అమరనాథరెడ్డి పాల్గొనే జన్మభూమి మాఊరు గ్రామసభల్లో ఈ పెద్ద తెర ద్వారా సీఎం సందేశాన్ని ప్రత్యక్ష ప్రసారం చేయనున్నారు. ఈ ఎల్ఈడీ తెర వాహనాన్ని హైదరాబాదు నుంచి ప్రత్యేకంగా తెప్పించారు. సోమవారం సాయంత్రం జిల్లా సచివాలయం వద్ద పాలనాధికారి పీఎస్ ప్రద్యుమ్న ఈ వాహనాన్ని పరిశీలించారు.



ముఖ్యమంత్రి సందేశం ప్రత్యక్ష ప్రసారం కోసం ఏర్పాటు చేసిన వాహనం

- చిత్తూరు (జిల్లా సచివాలయం), న్యూస్‌టుడే

ద్విచక్ర వాహనం అదుపుతప్పి వ్యక్తి మృతి

ఇద్దరు పిల్లలకు తీవ్ర గాయాలు

గంగాధరనెల్లూరు, న్యూస్‌టుడే: మండలంలోని చిన్నదామరగుంట సమీపంలో ద్విచక్ర వాహనం అదుపుతప్పి రాళ్లను ఢీ కొనడంతో వెంకటమునిశెట్టి(56) అక్కడి కక్కడే మృతి చెందాడు. వెనుకకూర్చున్న ఇద్దరు పిల్లలు పునీత్, యామిని తీవ్రంగా గాయపడ్డారు. ఈ సంఘటన సోమవారం రాత్రి చోటు చేసుకుంది. నెల్లేపల్లె పంచాయతీ పెద్దమిట్టపల్లెకు చెందిన వెంకటమునిశెట్టి ద్విచక్ర వాహనంపై వెజ్జుపల్లెకు చెందిన రమణారెడ్డి పిల్లలైన పునీత్(11), యామిని(10)లను ఎక్కించుకొని సోమవారం రాత్రి చిన్నదామరగుంటకు బయలుదేరాడు. చిన్నదామరగుంట సమీపంలో ద్విచక్రవాహనం అదుపుతప్పి రాళ్లను ఢీ కొనడంతో వెంకటమునిశెట్టి అక్కడి కక్కడే మృతి చెందగా, పునీత్, యామినిలకు తీవ్ర గాయాలయ్యాయి. గుర్తించిన గ్రామస్థులు క్షతగాత్రులైన పునీత్, యామినిని చికిత్స నిమిత్తం చిత్తూరు ప్రభుత్వాసుపత్రికి తరలించగా, పరిస్థితి విషమంగా ఉండటంతో తమిళనాడు రాష్ట్రం వేలూరు సీఎంసీకి తరలించారు.

ఎక్సైజ్ డీసీగా నాగలక్ష్మి బాధ్యతల స్వీకరణ

చిత్తూరు (నేరవార్తలు), న్యూస్‌టుడే : ఎక్సైజ్ డీసీగా నాగలక్ష్మి సోమవారం బాధ్యతలు స్వీకరించారు. విజయనగరంలో సెలవుపై ఉంటూ.. బదిలీపై చిత్తూరుకు వచ్చారు. నూతన సంవత్సరం రోజు బాధ్యతలు స్వీకరించి.. జిల్లా పాలనాధికారి ప్రద్యుమ్నను మర్యాదపూర్వకంగా కలిశారు. అనంతరం ఎక్సైజ్ అధికారులను పరిచయం చేసుకున్నారు. బాధ్యతలు స్వీకరించిన మొదటి రోజే ఆమె అధికారులతో మాట్లాడుతూ.. ఎక్సైజ్ శాఖలో నిబంధనలను తూచా తప్పకుండా పాటించాలన్నారు. నాటు సారా స్థావరాలపై నిఘా ఉంచి.. ఊటలను ధ్వంసం చేయడమే కాకుండా అక్రమ రవాణాను అరికట్టాలన్నారు. గొలుసు దుకాణాలు ఎక్కడా కనిపించకూడదని ఆదేశించారు. ఎక్సైజ్ స్టేషన్ అధికారులతో పాటు ఎన్‌ఫోర్సుమెంట్, ప్రత్యేక టాస్క్‌ఫోర్సు బృందాలు కూడా అప్రమత్తంగా ఉండాలన్నారు. గొలుసు దుకాణాలు, కల్తీ మద్యం విక్రయాలు, మద్యం దుకాణాలు, బార్‌లలో నిబంధనల అతిక్రమణలపై దృష్టి పెట్టాలని చెప్పారు. అనంతరం అధికారులతో కలసి నూతన సంవత్సరం వేడుకలను జరుపుకున్నారు. ఈ కార్యక్రమంలో ఎక్సైజ్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



నాగలక్ష్మి

ఈ నెత్తుటి మరకల వెనక..!

● పక్షం రోజుల క్రితం క్రితం తిరుపతి ఆర్టీసీ బస్టాండ్ ఎదురుగా ఉన్న పాత తిరుచానూరు రోడ్డు రైల్వే ట్రాక్ పక్కన మరుగు ప్రదేశంలో ఓ యువకుడిపై దాడి జరిగింది. బ్లేడ్‌బ్యాచ్ ముఠా అతని వద్దనున్న డబ్బులు లాక్కొని పారిపోయింది. ఎవరికి చెప్పుకోవాలో తెలియని ఆ యువకుడికి పక్కనే ఉన్న మద్యం దుకాణంలో పనిచేసే సిబ్బంది ఛార్జీలకు డబ్బులు ఇచ్చి పంపారు. పోలీస్ స్టేషన్ గడపతొక్కని ఇలాంటి కేసులకు లెక్కేలేదు.

● తిరుపతి ఆర్టీసీ బస్టాండ్ సమీపంలో రాత్రి 11 నుంచి ఉదయం 5 గంటల వరకూ ఈ బ్యాచ్ అమ్మాయిలను ఎరగా వేసి చాటు ప్రదేశానికి తీసుకువెళ్తుంది. అక్కడికెళ్లాక బ్లేడ్‌తో బెదిరించడం, డబ్బులు లాక్కోవడం, తేడా వస్తే ప్రాణాలు తీయడం వీరికి వెన్నెతో పెట్టిన విద్య.

(మొదటి పేజీ తరువాయి) సమయంలో ఎలా నటించాలి.. వీరికి బాగా తెలుసు. దొంగతనాలు, పిక్ ప్యాకెటింగ్, బ్యాగులు తస్కరించడం, జేబుల్లోంచి సెల్‌ఫోన్లు కొట్టేయ్యడం వీరికి కొట్టిన పిండి. ఈ బ్లేడ్ బ్యాచ్‌ది ఒక ఊరు కాదు. తమిళనాడు, కర్ణాటక, ఆంధ్రా, తెలంగాణ రాష్ట్రాల నుంచి వచ్చి రైల్వే పట్టాలపై పెరిగి పెద్దయిన వారే. వీరు హత్యలు చేస్తే ఆనవాళ్లు లేకుండా చేయగల నేర్పరితనం ఉంది. వీరి ఆగడాలు పోలీసులకు తెలిసినా.. మనకెందుకులే అని తప్పించుకుంటుంటారు. వీరిని ప్రేమతో కూడిన అమర్యాదతో పోలీసులు పలకరిస్తుంటారు. వీరిని కింది స్థాయి సిబ్బంది పట్టుకుంటే పై అధికారి నుంచి వారికి ఎలా చీవాట్లు పెట్టించాలో ముఠాకు బాగా తెలుసు. ఏదైనా కేసులో అరెస్టు చేయగానే.. జైలుకు వెళ్లకుండా వెంటనే బ్లేడ్‌తో గాయపరుచుకుంటారు. తలను గోడకేసి రక్తం కారేలా బాదుకుంటారు. పోలీస్ స్టేషన్‌కు, జైలుకు వెళ్లకుండా ఆసుపత్రికి వెళ్లేలా డ్రామా సృష్టిసార్తు. "వాడు చస్తే నీ మీదకే వస్తుంద'ంటూ పై అధికారులు కిందిస్థాయి సిబ్బందిని హెచ్చరించే పరిస్థితి తీసుకువస్తారు. పైగా వీరిలో ఎక్కువ మంది హెచ్ఐవీ రోగులే. దీంతో వీరి జోలికి వెళ్లడానికి ఏ పోలీసూ సాహసించడం లేదు. అయితే, కొందరు పోలీసులు వీరిని తమ అదుపులో పెట్టుకొని, అవసరాన్ని బట్టి చిన్నచిన్న కేసుల్లో ఇరికిస్తూ రిమాండ్‌కు పంపుతున్నారు.



గ్రూప్ థియేటర్స్ సమీపంలో సంచరిస్తున్న బ్లేడ్ బ్యాచ్ ముఠా

స్టేషన్లు, జైళ్లు వీరికి లెక్కలేదు..

ఆధ్యాత్మిక నగరిలో వీరి కదలికలు హత్యా, నేర సామ్రాజ్యానికి కారణమవుతున్నాయి. కేసులు, రాణాలు, జైళ్లు అంటే.. వీరికి లెక్కలేదు. ఇలా పోయి.. అలా వస్తుంటారు. ఎక్కడున్నా వీరి అసలు నైజం మారదు. తిరుపతిలో సుమారు 20 మంది బ్లేడ్ బ్యాచ్ ఘనులున్నారు. ప్రధానంగా ముత్తు (తమిళనాడు), పవన్‌కుమార్ (కర్ణాటక), తోటరాముడు (కడప), పురుషోత్తం (నెల్లూరు), విజయేంద్రనాయక్ (అనంతపురం), మురళీ (చిత్తూరు) పేర్లు వినిపిస్తాయి. వీరిలో ఎక్కువ మంది ఇళ్లలోంచి పారిపోయి వచ్చిన వారే. బాల్యం నుంచే నేరాలకు, చోరీలకు పాల్పడి తిరుపతి రైల్వే స్టేషన్ పరిసరాల్లో మకాం ఏర్పర్చుకున్నారు. ఒక్కోసారి వీరికి వీరికే ఘర్షణలు చెలరేగి హత్యలకు తెగబడుతున్నారు. తాజాగా తిరుచానూరులో ఇదే జరిగింది. మద్యం సేవించేటప్పుడు, దోచుకున్నది పంచుకునేటప్పుడు ఘర్షణ పడటం, మళ్లీ ఒక్కటై యాత్రికులను, యువకులను దోచుకోవడం సాధారణమే. ఘర్షణలో కాళ్లు, చేతులు పోగొట్టుకుని భిక్షాటన చేస్తున్న వారూ ఉన్నారు.



బ్లేడ్ బ్యాచ్ ముఠా అడ్డా ఇదే..

ఆ నాలుగు కిలోమీటర్ల పరిధిలోనే..

తిరుపతిలో ఉన్న సుమారు 20 మంది బ్లేడ్‌బ్యాచ్ స్థావరాలు తిరుపతి రైల్వేస్టేషన్, బస్టాండ్ పరిసరాలు, కోనేటికట్ట, గ్రూప్ థియేటర్, భూమా సినీ కాంప్లెక్స్, డీఆర్‌మహల్ వంతెన కింద, చింతలచేను రైల్వే వంతెన కింద, సుబ్బులక్ష్మి విగ్రహం సమీపంలోని బస్టాప్, పల్లెవెలుగు బస్టాండ్ వెనుకవైపు, శ్రీనివాసం సబ్‌వే, చింతలచేను నిర్మానుష్య ప్రదేశం తదితర ప్రాంతాలు వీరి ఆవాసాలు. జనసమ్మర్ధమైన ప్రదేశాలు, ప్రయాణికులు, యాత్రికులు ఎక్కువగా తిరిగే ప్రదేశాలను ఎంచుకుంటారు.

అమ్మాయిలను ఎరగావేసి...

ఆధ్యాత్మిక నగరానికి వచ్చే చపలచిత్తం గల యువకులు బ్లేడ్‌బ్యాచ్ బారిన పడుతున్నారు. రాత్రి 11 గంటల నుంచి తెల్లవారుజామున 5 గంటల వరకూ వీరి విధులు నడుస్తాయి. నగరం నిద్రపోతున్న వేళ.. బ్లేడ్‌బ్యాచ్ విధులు ప్రారంభం అవుతాయి. తిరుపతి బస్టాండ్ పరిసరాల్లో యువతులను ఎరగా వేసి బేరమాడతారు. బేరం ఎంత అన్నది ముఖ్యం కాదు. ఆ యాత్రికుడ్ని పొదలమాటుకు, చీకటిలోకి, ఎంచుకున్న గదుల్లోకి తీసుకువెళ్లి చితక్కొడతారు. ఆ దెబ్బలకు బ్లేడ్ గాట్లకు తాళలేక వారు అడిగింది ఇవ్వాల్సిందే.. తిరగబడితే పీక కోసేస్తారు. క్షణాల్లో ప్రాణాలు గాల్లో కలవాల్సిందే. నవంబర్‌లో ఆర్టీసీ బస్టాండ్ సమీపంలో జరిగిన హత్య కూడా ఇలాంటిదే. రైల్వే వంతెన కింద ఉంటూ ఒంటరిగా వచ్చే వారికి బెదిరించి దోచుకోవడం మరో ఎత్తు. ఈ బ్లేడ్‌బ్యాచ్ 16 నుంచి 30 ఏళ్ల వయసున్న కొంతమంది అమ్మాయిలను, మహిళలను, హిజ్రాలను కూడా ఎరగా వేస్తున్నారు. చింతలచేను రైల్వే మార్గంలో ఈ తరహా దారుణాలు తరచూ చోటు చేసుకుంటున్నాయి. వీరు చేసే హత్యలను 'గుర్తు తెలియని వ్యక్తి ఆత్మహత్య'గా రైల్వే పోలీసులు లెక్కలు రాసుకుంటారు. నిత్యం మద్యం, గుట్కా, గంజాయి మత్తులో ఉండే వీరు.. పోలీసులు కనపడగానే బాధితులుగా మారిపోతారు. మద్యం సేవించి పడిపోయిన వ్యక్తి తమ బంధువైనట్లు, మిత్రుడైనట్లుగా నటిస్తూ "టైం అయిపోయింది ఇంటికి వెళదాం రా.. రాము.. సోము' అంటూ పోలీసులకే మస్కా కొడతారు.

విచ్చలవిడిగా విలాసాలు..

దోచుకున్న సొమ్ముతో సినిమాలు, షికార్లు, పీకల దాకా మద్య సేవనం, బిర్యానీ తినడం వీరి అలవాట్లు. ఈ బ్లేడ్ బ్యాచ్‌లోని కొందరు రైల్వే పట్టాలకు సమీపంలోని పాత ఇళ్లను అద్దెకు తీసుకొని నివాసం ఉంటున్నారు. తమ అకృత్యాలకు ఆ ఇళ్లను అడ్డాలుగా మారుస్తున్నారు. రూ.100కోసం కూడా హత్యకు వెనకాడని ఈ బ్లేడ్ బ్యాచ్ ఆగడాలను ఆధ్యాత్మిక నగరం నుంచి అంతమొందించాల్సిన అవసరం కన్పిస్తోంది. గత నాలుగైదు నెలలుగా తిరుపతి రైల్వేస్టేషన్, బస్టాండ్ సమీపంలో హత్య కేసులు పెరిగాయి. వీటిలో బ్లేడ్ బ్యాచ్ పాత్ర కూడా ఉన్నట్లు తేలింది. నేర సామ్రాజ్యాన్ని సృష్టిస్తున్న వీరిని అరికట్టేందుకు శాశ్వత మార్గాన్ని ఎంచుకోవాల్సిన అవసరం ఉంది.

రంగంపేటపై నుంచే.. నాలుగు వరుసలదారి!

(మొదటి పేజీ తరువాయి)అధిగమించారు. భాకరాపేట వద్ద అధికారులు ప్రతిపాదించిన మార్గం వన్యప్రాణుల సంరక్షణ పరిధిలోకి వస్తుందని తేలడంతో.. ఆ డిజైన్‌ను మార్చాల్సి వచ్చింది. అది కూడా అటవీ భూమి అయినప్పటికీ సేకరించేందుకు ఇబ్బందులు ఉండవని అధికారులు చెబుతున్నారు. ఈ ఘాట్ రోడ్డులో సుమారు 5 కి.మీల వరకూ తొలుత అనుకున్న వైపు నుంచి కాకుండా ఎదురు ప్రాంతం వైపు నుంచి మార్పు చేశారు. అలాగే చంద్రగిరి మండలం రంగంపేట నుంచి ఇప్పుడున్న రహదారినే నాలుగు వరుసలకు విస్తరించాలని తొలుత భావించారు. అయితే, ఇదీ అంత సులువు కాదని తేలింది. ఈ మార్గంలో భూసేకరణ జటిలం కానుందని అధికారులు చెబుతున్నారు. భవనాలు, శాశ్వత నిర్మాణాలు ఎక్కువగా ఉన్నాయి. వీటిని తొలగించడంతోపాటు భూసేకరణకు పెద్ద ఎత్తున నిధులు ఖర్చు చేయాల్సి ఉంటుందని గుర్తించారు. అందుకే రంగంపేట గ్రామం గుండా కాకుండా.. ఊరి వెలుపలి నుంచి బైపాస్ నిర్మాణానికి అనువుగా భూమిని సర్వే చేశారు. అక్కడి నుంచి నేరుగా తిరుపతి సమీపంలోని జూపార్కు దగ్గర చెర్లోపల్లి సర్కిల్ వరకూ నాలుగు వరుసల రహదారి నిర్మాణాన్ని చేపట్టనున్నారు. దీనివల్ల పనులు కూడా త్వరితగతంగా పూర్తవుతాయని అధికారులు చెబుతున్నారు.

రెండు ప్యాకేజీల కింద.... మదనపల్లి-తిరుపతి నాలుగు వరుసల రహదారిని రెండు ప్యాకేజీల కింద విభజించారు. ఒకటి మదనపల్లి నుంచి పీలేరు వరకు, కాగా మరొకటి పీలేరు నుంచి తిరుపతి వరకూ చేపట్టనున్నారు. ఒక్కో ప్యాకేజీకి సుమారు రూ.750 కోట్లు ఖర్చవుతుందని అంచనా వేశారు. రెండింటికి కలిపి రూ.1500 కోట్లు ఖర్చవుతుందని ప్రాథమికంగా అంచనా రూపొందించారు. దీనికి అనుగుణంగా భూసేకరణ నోటిఫికేషన్ జారీ చేసేందుకు అనుమతించాల్సిందిగా కేంద్రాన్ని కోరారు. ఇందుకు కేంద్రం నుంచి సైతం ఆమోదం లభించింది. దీంతో భూసేకరణకు నోటిఫికేషన్ జారీ చేయాల్సిందిగా సబ్‌కలెక్టర్‌కు పంపించారు. మరికొద్ది రోజుల్లోనే నోటిఫికేషన్ వెలువడే అవకాశాలున్నాయి. మరోవైపు సర్వే పూర్తి కావడంతో ఎక్కడి వరకూ భూమి కావాల్సి ఉందనే దానికి సంబంధించి మార్కింగ్ చేపడుతున్నారు. ఇప్పటికే భాకరాపేట వరకూ రాళ్లు వేసినట్లు అధికారులు చెబుతున్నారు. నెలాఖరు నాటికి మొత్తం పూర్తి చేస్తామని స్పష్టం చేస్తున్నారు. రహదారి నిర్మాణం కోసం త్వరలోనే టెండరు ప్రక్రియ చేపట్టేందుకు సిద్ధమవుతున్నారు. మొత్తంగా వచ్చే అక్టోబరు నాటికి పనులు ప్రారంభించేందుకు అనుగుణంగా ప్రణాళికలు రూపొందించారు. ఒక్కసారి రహదారి నిర్మాణం పూర్తయితే రవాణా సమయంతోపాటు ఇబ్బందులు తొలగుతాయని అధికారులు స్పష్టం చేస్తున్నారు.

రాష్ట్రంలో గొప్ప మార్పులు రానున్నాయి



మాజీ ఎంపీ చింతామోహన్

తిరుమల, న్యూస్‌టుడే: రాష్ట్రంలో గొప్ప మార్పులు చోటు చేసుకోనున్నాయని, త్వరలో మార్పును అందరూ చూస్తారని కేంద్ర మాజీ మంత్రి చింతా మోహన్ అన్నారు. తిరుమల శ్రీవారిని నూతన సంవత్సరం సందర్భంగా సోమవారం దర్శించుకున్న ఆయన ఆలయం ఎదుట విలేకరులతో మాట్లాడారు. రాష్ట్ర ముఖ్యమంత్రిగా ఎలాంటి లాభాపేక్షలేకుండా, ఆస్తులు సంపాదించుకోని వ్యక్తిగా, తప్పుడు పనులు చేయని నేత కావాలని శ్రీవారిని కోరుకున్నట్లు తెలిపారు. నిస్వార్థంతో ప్రజలకు సేవ చేసే వ్యక్తి రాష్ట్రానికి ముఖ్యమంత్రి అవుతారని జోస్యం చెప్పారు. రాష్ట్రంలో నిరుద్యోగులను ఆదుకోవాలని, ఆకలితో అలమటిస్తున్న ప్రజలకు అన్నం పెట్టే మార్గం చూపాలని స్వామివారిని వేడుకున్నట్లు తెలిపారు.

రజనీ నిర్ణయం శుభపరిణామం

నటుడు సాయికుమార్



తిరుమల, న్యూస్‌టుడే: ప్రముఖ నటుడు రజనీకాంత్ రాజకీయాల్లోకి రావడం శుభపరిణామమని, మంచి సంకల్పంతో ఆయన ప్రజలకు సేవ చేయాలని సినీనటుడు సాయికుమార్ ఆకాంక్షించారు. నూతన సంవత్సరం సందర్భంగా సాయికుమార్ సోమవారం ఉదయం కుటుంబ సభ్యులతో కలిసి తిరుమల శ్రీవారిని దర్శించుకున్నారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ... రజనీకాంత్ రాజకీయ రంగ ప్రవేశంపై స్పందించారు. ఆయనకు ప్రజలు అవకాశం ఇస్తే సమాజానికి మంచి చేస్తారనే నమ్మకం తనకుందన్నారు. అభిమానులకు ఆయనపై అపారమైన నమ్మకం ఉందని పేర్కొన్నారు. కలియుగ వైకుంఠనాథుడు తిరుమల శ్రీవారు, చిలుకూరు బాలాజీ అవతారాలు ఎలా ఆవిర్భవించాయన్న కథాంశంతో నిర్మిస్తున్న చిత్రంలో తాను ప్రముఖ పాత్ర పోషించానని, ఆ సినిమా త్వరలోనే విడుదల కానుందని తెలిపారు.

అడ్డుకునేవారు లేక.. ఆక్రమణలు ఆగక..

(మొదటి పేజీ తరువాయి) ఉద్యమించినా గత నాలుగేళ్ల కాలంలో మిగిలిన భూములు సైతం స్థానికేతరుల ఆక్రమణలకు గురికావడంతో స్థానికంగా భూమిలేనిపేదలకు మాత్రం మొండిచెయ్యే మిగిలింది. ఈ భూములు తమిళనాడు వాసులకు, ప్రభుత్వానికి నడుమ వివాదం దాదాపు 30 ఏళ్లుగా జేసీ కోర్టుపరిధిలో ఉండగా, అప్పటి జేసీగా ఉన్న ప్రద్యుమ్న(ప్రస్తుత జిల్లా పాలనాధికారి) అవి ప్రభుత్వ భూములేనని తీర్పును ఇచ్చారు. మళ్లీ వారు హైకోర్టును ఆశ్రయించడంతో ఇటీవలే అవి ప్రభుత్వ భూములేనని న్యాయస్థానం తీర్పు ఇచ్చిన విషయం తెలిసిందే. ప్రభుత్వ భూములుగా తీర్పు రావడంతో, అధికారులు ఇక ఆక్రమణలను అడ్డుకుంటారని ఆశించిన ప్రజలకు ఆశాభంగమే ఎదురైంది. స్థానికేతరులు ఈ భూములను ఆక్రమించి పుచ్చసాగు పనులు చేపడుతున్నా, అధికారులలో చలనం కరవైంది.

ఏటేటా..అదే ఆట...అదే పాట

స్థానికుల అధీనంలో ఉన్న భూములను మినహాయిస్తే, మిగిలిన భూములను పెద్దలు ముఠాగా ఏర్పడి విచ్చలవిడిగా విక్రయాలు చేపట్టారు. అడ్డుకోవాల్సిన అధికారులు సైతం ముఠాతో చేతులు కలపడంతో పేదలు ఈ అక్రమాలను మౌనంగా దిగమింగారు. ఇలా దొడ్డదారిన కొనుగోలు చేసిన స్థానికేతరులు నాలుగేళ్ల కిందట ఈ భూముల్లో సాగుపనులు చేపట్టారు. పత్రికల్లో కథనం మేరకు అధికారులు తూతూమంత్రంగా స్పందించి విచారణ చేపట్టడం..సాగు పనులు చేపట్టినందున, పంట పండిన తరవాత ఇక భూముల్లోకి ప్రవేశించరాదంటూ హెచ్చరికలు జారీ చేయడం రివాజుగా మారింది. ఆక్రమణదారుల నుంచి పోలీసుల సమక్షంలో లిఖితపూర్వకహామీ కూడా తీసుకున్నారు. అదంతా డ్రామా అని తేలిపోయిందని అంటున్నారు. ఇకనైనా జిల్లా అధికారులు చొరవ తీసుకొని కఠినచర్యలు తీసుకోకపోతే, ఈ భూములు అనర్హుల పాలు కావడం తథ్యం.

భూములకు ఎనలేని గిరాకీ

ఈ శోత్రీయభూములకు ఆనుకునే హీరో పరిశ్రమకు కేటాయించిన 600 ఎకరాల భూములున్నాయి. ఇటీవల సెజ్‌కు కేటాయించిన అపోలో పరిశ్రమ ఈ భూముల పక్కనే ఉన్నాయి. కొంతదూరంలోనే శ్రీసిటీ పరిశ్రమలు కూడా ఉంది. హీరో, అపోలో పరిశ్రమలు ప్రారంభమైతే ఈ ప్రాంతం కనివినీ ఎరుగని రీతిలో అభివృద్ధి చెందుతుంది. ఈ నేపథ్యంలో ఇక్కడి భూములకు ఎక్కడ లేని గిరాకీ పెరిగింది. అంతర్జాతీయ పరిశ్రమలు రావడంతో తమ భూముల్లో వ్యాపారం సాగించడానికి ఆక్రమణదారులు ప్రణాళికను రూపొందిస్తున్నారు. రాష్ట్రవిభజన దృష్ట్యా ప్రభుత్వం రాష్ట్రాన్ని పారిశ్రామికంగా అభివృద్ధి చేయాలని సంకల్పించింది. పెట్టుబడులు, పరిశ్రమల స్థాపనకు పెద్దపీట వేస్తోంది. ఇందుకు ప్రధానంగా భూములు అవసరం. వెయ్యి ఎకరాలున్న ఈ ప్రభుత్వ భూములను పరిశ్రమలకు కేటాయించాలని ఏపీఐఐసీ కోరుతోంది. ఇకనైనా వీటిని కాపాడేందుకు జిల్లా అధికారులు చర్యలు చేపట్టాల్సి ఉంది.



'తెలుగు వెలుగు' పల్లె కష్టమెరుగు!

తెలుగువెలుగు బస్సులకు ఆక్యుఫెన్సీ పూర్తిగా పడిపోతోంది. బస్సులు వచ్చే సమయానికి ముందుగా ఆటోలు వచ్చి ప్రయాణికులను తీసుకు వెళుతుండగా ఆర్టీసీ బస్సులు ఖాళీగా నడుస్తున్నాయి. పాసులున్న విద్యార్థులు, సీనియర్ సిటిజన్లే బస్సుల్లో ప్రయాణిస్తున్నారు. మిగిలిన వారు ప్రైవేటు వాహనాలు, ఆటోలపై ఆసక్తి చూపుతున్నారు. గ్రామాల్లో నిరుద్యోగ యువత షేర్ ఆటోలు, జీపులను కొనుగోలు చేసి నడుపుతూ ప్రజలకు అందుబాటులో ఉంచుతున్నారు. ఎప్పుడో వచ్చే బస్సుకోసం ఎదురు చూడకుండా ఎక్కువమంది షేర్ ఆటోల్లో వెళుతున్నారు. ఎక్కువ గ్రామాల్లో బస్సులు వచ్చే సమయానికి ముందుగా ఆటోలు వచ్చి అందర్నీ తీసుకువెళుతున్నాయి. దాంతో నష్టాలతో నడపలేం అంటూ తెలుగువెలుగు బస్సులు పల్లెలకు తిప్పడం మానేశారు. ఫలితంగా పల్లె ప్రజలకు ప్రయాణ కష్టాలు మొదలయ్యాయి.

- న్యూస్‌టుడే, తిరుపతి(ఆర్టీసీ)

- తగ్గుతున్న తెలుగువెలుగు బస్సులు
- షేర్ ఆటోలు, జీపుల పెరుగుదలే కారణమంటున్న ఆర్టీసీ వర్గాలు
- బస్సుల కోసం గ్రామీణుల నుంచి పెరుగుతున్న ఒత్తిడి


జిల్లాలో 14 డిపోలు ఉండగా.. ప్రతి డిపోలో పదుల సంఖ్యలో తెలుగువెలుగు బస్సులు ఉన్నాయి. ప్రయాణికుల ఆదరణ లేక ఏటా వీటి సంఖ్య తగ్గిపోతోంది. తిరుపతి రీజియన్‌లో 2010లో 714 పల్లెవెలుగు బస్సులు నడిచేవి. నేడు అవి 528కి తగ్గిపోయాయంటే పరిస్థితి ఎలా ఉందో అర్థం చేసుకోవచ్చు. జిల్లాలో అత్యధికంగా పీలేరు డిపోలో గత ఏడాది 76 సర్వీసులుండగా ఈఏడాది 3 బస్సులు పెంచారు. మిగిలిన అన్ని డిపోల్లో దాదాపుగా బస్సులు తగ్గించారు. జిల్లా వ్యాప్తంగా నేడు త్రి సీటర్ ఆటోలు 3000, 7 సీటర్ ఆటోలు 4800, టాటా మ్యాజిక్‌లు 16 ఉన్నాయి. ఇవి ఆర్టీసీ బస్సులకు వచ్చే కలెక్షన్‌ను తీసుకువెళుతున్నాయని ఆర్టీసీ వర్గాలు చెబుతున్నాయి. తెలుగు వెలుగు బస్సులకు కిమీకు రూ.27 ఖర్చు అవుతుండగా అనేక ప్రాంతాలలో పట్టుమని రూ. 10 కూడా రావడం లేదని, కొన్ని ప్రాంతాల్లో రూ.12 నుంచి రూ.13 వస్తోందని అధికారులు చెబుతున్నారు. గ్రామాలకు ఆర్టీసీ సర్వీసు నడపడం ద్వారా కిమీకు సుమారు రూ.15 నుంచి రూ.18 నష్టపోవాల్సి వస్తోందని ఆర్టీసీ అధికారులు అంటున్నారు.

పల్లెలపై పట్టులేని ఆర్టీసీ

పల్లెపట్టు, ఊతుకోట ప్రాంతాలలో ఆర్టీసీ బస్సులకు డిమాండ్ ఉన్నా ఆర్టీసీ తగినన్ని సర్వీసులు నడపడం లేదన్న విమర్శలు ఉన్నాయి. ఎస్‌ఆర్‌పురం, పాలసముద్రం మండలాల పరిధిలో వెంగళ్రాజుకుప్పం తదితర ప్రాంతాలో వారానికి మూడుసార్లు సంతలు జరుగుతున్నాయి. అక్కడకు ఒకే ఒక బస్సు నడుపుతున్నారు. వారంలో మూడు సంతలకు సుమారు 120 గ్రామాలకుపైగా ప్రజలు వస్తుంటారు. తిరుపతి నుంచి ఒకే ఒక బస్సు నడుస్తోంది. గతంలో మూడు సర్వీసులు ఉండేవి. రెంటిని రద్దుచేశారు.

షేర్ ఆటోల హవా

జిల్లాలోని అన్ని మండలాల్లో షేర్ ఆటోల హవా కొనసాగుతోంది. రామచంద్రాపురం మండలం నెత్తకుప్పం నుంచి తిరుపతికి 20 షేర్ ఆటోలు, చంద్రగిరి రూటుకు మరో 20షేర్ ఆటోలు ఉన్నాయి. అయినా ఆర్టీసీకి మంచి డిమాండ్ ఉంది. తగినన్ని బస్సులు లేవని, సమయానికి అందుబాటులో ఉండవని ప్రయాణికులు వాపోతున్నారు. బస్సులు అందుబాటులో లేకపోవడంతోనే తాము ఆటోల్లో ప్రయాణిస్తున్నామని పల్లె ప్రజలు చెబుతున్నారు. షేర్ ఆటోలు తమ బస్సులను ఖాళీగా తిప్పేవిధంగా చేస్తున్నాయని ఆర్టీసీ వర్గాలు చెతున్నాయి.



బస్సుల కోసం ధర్నా..

తిరుపతి నుంచి దనూజవారిపల్లె, చిత్తూరు నుంచి గానుగపెంటకు నిలిపివేసిన ఆర్టీసీ సర్వీసులను పునరుద్ధరించాలని కోరుతూ ఇటీవల చంద్రగిరి శాసన సభ్యుడు చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి ఆర్టీసీ ఆర్‌ఎంను కోరారు. ధనూజవారిపల్లె, గానుగపెంట గ్రామాలకు ఆర్టీసీ బస్సులు పునరుద్ధరించాలని కోరుతూ ఇటీవల తిరుపతి ఆర్‌ఎం కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించిన విషయం విధితమే. 1976 నుంచి ఈ రెండు గ్రామాలకు ఆర్టీసీ బస్సులు నడుస్తున్నాయని, ఇటీవల ఆటోలు పెరగడంతో బస్సు సర్వీసులను నిలిపివేశారంటూ గ్రామస్థులు మహిళలు, విద్యార్థులతో కలిసి ఆటోలకు వ్యతిరేకంగా నిరసనకు దిగారు. తిరుపతి నుంచి అర్ధగిరి క్షేత్రానికి ఆర్టీసీ బస్సులు నడపాలని కోరుతూ ఆలయ ఈవో ఆర్‌ఎంను కోరారు. ఇలా ప్రతి రోజూ ఏదో ఒక ప్రాంతానికి తెలుగువెలుగు బస్సులు నడపాలంటూ ఆర్టీసీ అధికారులపై ఒత్తిడి పెరుగుతోంది.


బస్సులు నడపాలని కోరుతూ ఆర్‌ఎం కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహిస్తున్న గానుగపెంట, ధనూజవారిపల్లె గ్రామస్థులు(పాతచిత్రం)

కూరగాయలు పండించే రైతుల తిప్పలు

చిత్తూరు 1వ డిపో నుంచి యాదమరి మండలం వేపనపల్లికి రైతు బజార్ల ప్రారంభం సందర్భంగా మొదటి ట్రిప్పు తెల్లవారుజామున 5 గంటలకు ఉచిత సర్వీసులు నడిపి రైతులకు అండగా నిలవాలని అప్పటి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆదేశాలు ఇచ్చారు. నేడు ఆ గ్రామానికి 10 రోజుల క్రితం తెలుగువెలుగు బస్సులను నిలిపివేశారు. చిత్తూరు నుంచి 20 కిలోమీటర్ల దూరంలో ఉన్న వేపనపల్లికి 30 సంవత్సరాలుగా బస్సు నడుస్తుండేది. ఈ గ్రామానికి రాత్రి 8.30 గంటలకు చివరి బస్సువెళుతుంది. రాత్రికి అక్కడే ఉండే ఈ బస్సు తెల్లవారుజామున 5గంటలకు చిత్తూరుకు బయలుదేరుతుంది. ఈ బస్సు వేపనపల్లితోపాటు ఓటేరుపల్లి, గొల్లపల్లి, కొత్తూరు, కాశీరాళ్లపల్లి, భూమిరెడ్డిపల్లి, యాదమరి మీదుగా చిత్తూరుకు వెళ్లేది. ఆయా గ్రామాల ప్రజలు తాము పండించే ఆకుకూరలు, కూరగాయలు బస్సులతో తెచ్చుకుని చిత్తూరులో విక్రయించుకుంటారు. అలాగే చిత్తూరు 1వ డిపో నుంచి 50 సంవత్సరాలుగా పూతలపట్టు మండలం కాళేపల్లికి ఆర్టీసీ బస్సు నడిచేది. ఈ గ్రామంనుంచి ప్రతి రోజూ చిత్తూరు నగరానికి పాలు తెచ్చుకుని విక్రయించుకునే వారు ఎక్కువగా ఉన్నారు. కాణిపాకం మీదుగా వచ్చే ఈ బస్సు రాత్రికి చేరుకుని ఉదయం 5 గంటలకు చిత్తూరుకు బయలుదేరుతుంది. బస్సు నిలిపివేయడంతో రైతులు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు.


తెలుగు వెలుగు బస్సుల కోసం ప్రయాణికుల నిరీక్షణ

మదనపల్లె డిపో నుంచి భారీగా తగ్గిన బస్సులు

మదనపల్లె 1వ డిపో నుంచి రెండు నెలల కాలంలో సుమారు 12 తెలుగువెలుగు సర్వీసులను నిలిపివేశారు. మదనపల్లె నుంచి బురకాయలకోట మీదుగా కొత్తకోటకు 30 సంవత్సరాలుగా నడుపుతున్న గోళ్లపల్లి సర్వీసులో ఒక ట్రిప్పును నిలిపివేశారు. సదుం - చింతామణి సర్వీసును ఏడాదిక్రితం రద్దుచేశారు. ఇలా మదనపల్లె నుంచి భారీగా తెలుగువెలుగు సర్వీసులను నిలిపివేశారు.

జిల్లాలో బస్సుల వివరాలు ఇలా..

చిత్తూరు1లో 32, చిత్తూరు2లో 43, కుప్పంలో 57, మదనపల్లె 1లో 79, మదనపల్లె 2లో 68 పీలేరులో 79, మంగళంలో 11, పలమనేరులో 54, పుత్తూరులో 35, సత్యవేడులో 35, శ్రీకాళహస్తిలో 43, తిరుపతిలో 43 తెలుగువెలుగు బస్సులు నడుస్తున్నాయి.

ఇలా చేస్తే ఆర్టీసీకి ఆదరణ

షేర్ ఆటోల విధానానికి చరమగీతం పాడాలంటే నిరుద్యోగ యువతకు ఉపాధి చూపాలి. అక్రమంగా తిరుగుతున్న ఆటోలపై దాడులు చేయాలి. పుణ్యక్షేత్రాల ఖిల్లా అయిన చిత్తూరు జిల్లాలో అన్ని పుణ్యక్షేత్రాలను కలుపుతూ సమీప దర్శనీయ క్షేత్రాల మీదుగా బస్సుల సంఖ్యను పెంచాలి. గ్రామాల్లో ఆర్టీసీ బస్సులపై ప్రజలకు అవగాహన కల్పించాలి. ఇందుకు ఆర్టీసీ చర్యలు తీసుకోవాలి.

బస్సుల ఖర్చులైనా రావాలి

తిరుపతి 1వ డిపో నుంచి సుమారు 20కిపైగా పల్లెవెలుగు సర్వీసులను నడుపుతున్నాం. కనీసం వాటి ఖర్చులైనా వస్తే నడిపేందుకు ఆర్టీసీ సిద్ధంగా ఉంది. ప్రజలు ఆర్టీసీకి సహకరించాలి. నష్టాల్లో ఉన్న ఆర్టీసీని కాపాడాలి. కిలోమీటరుకు రూ.15కుపైగా నష్టం వస్తోంది. ఈ నష్టాన్ని ప్రభుత్వమే భరించి ఆర్టీసీని ఆదుకోవాలి.

- సి.రాంబాబు, తిరుపతి 1వ డిపో ఎన్‌ఎంయూ కార్యదర్శి

బస్సులు నిలిపితే డిపోలు మూతపడతాయి

ప్రతిగ్రామానికి పల్లెవెలుగు బస్సులు నడపాలి. లేదంటే ప్రజలతో ఆర్టీసీకి సంబంధాలు తెగిపోతాయి. డిపోలు మూతపడతాయి. పరోక్షంగా ఆర్టీసీ మరింత నష్టపోతుంది. నష్టం ఎక్కడ జరుగుతుంది, ఎలా జరుగుతుందో గుర్తించి పరిష్కారమార్గం చూడాలేగానీ బస్సులు నిలిపివేయడం పరిష్కారం కాదు. అక్రమ వాహనాలను అరికట్టేందుకు అధికారులు చర్యలు తీసుకోవాలి.

- జి.ఎస్.మణ్యం, మంగళం డిపో అధ్యక్షుడు



కాయకష్టం.. కాటితో నష్టం

శ్మశానానికి దారిలేక పోవడంతో మిట్టపల్లూరు ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. చిత్తూరు జిల్లా పుత్తూరు మండలంలో సోమవారం చోటు చేసుకున్న సంఘటనే ఇందుకు నిదర్శనం. మిట్టపల్లూరు గ్రామానికి చెందిన తులశమ్మ(80) అనారోగ్యంతో సోమవారం ఉదయం మృతి చెందింది. శ్మశానానికి తీసుకెళ్లేందుకు దారి లేక పోవడంతో వరిపొలంలో నుంచి తీసుకెళ్లాల్సిన పరిస్థితి నెలకొంది. దీంతో బాధితులకు, రైతుకు మధ్య వాగ్వాదం చోటు చేసుకుంది.

- న్యూస్‌టుడే, పుత్తూరు

మరో మైలురాయిని అధిగమించిన ఏఎస్పీ రాధిక

చిత్తూరు (నేరవార్తలు), న్యూస్‌టుడే : అదనపు ఎస్పీ రాధిక మరో మైలురాయిని అధిగమించారు. డిసెంబరు 30వ తేదీన అర్జంటీనాలోని 6,962 మీటర్ల ఎత్తున్న అకంకగువా పర్వతాన్ని అధిరోహించారు. ఇప్పటికే ఏడు ఖండాల్లోని నాలుగు పర్వతాలను అధిరోహించిన ఆమె తాజాగా అకంకగువా పర్వతాన్ని అధిరోహించి మరో రికార్డును సొంతం చేసుకున్నారు. దక్షిణ అమెరికాలోని ఎత్తైన పర్వతాన్ని అధిరోహించిన మొదటి తెలుగు మహిళగా పేరుపొందారు. ఈ విజయాన్ని సాధించడానికి సహకరించిన పోలీసు శాఖ, ఆర్థికంగా సహకరించిన ఓఎన్‌జీసీకి ఆమె కృతజ్ఞతలు తెలిపారు. ప్రస్తుతం ఏడు ఖండాల్లోని ఎత్తైన ఐదు శిఖరాలను అధిరోహించగా.. మిగిలిన నార్త్‌అమెరికాలోని డెనాలి, అంటార్టికాలోని విన్‌సన్‌మాస్టిఫ్ పర్వతాలను ఈ ఏడాదిలోనే అధిరోహించడానికి కృషి చేస్తున్నట్లు ఆమె తెలిపారు. సాహసాలు చేయాలనకునే మహిళలకు తన విజయాలను అంకితం చేస్తున్నానని ప్రకటించారు. పర్వతారోహణతో జిల్లాకు పేరు తెచ్చిన ఏఎస్పీ రాధికను జిల్లా ఎస్పీ రాజశేఖర్‌బాబు ప్రత్యేకంగా అభినందించారు.

ఆర్‌ఎంఎస్‌ఏ అంచనా నిధుల వివరాలు

చిత్తూరు (విద్య), న్యూస్‌టుడే : రాష్ట్రీయ మాధ్యమిక శిక్ష అభియాన్(ఆర్‌ఎంఎస్‌ఏ) నిధులకు సంబంధించి అంచనా వివరాలను నేటి సాయంత్రంలోగా విద్యాశాఖ కార్యాలయానికి అందజేయాలని డీఈవో పాండురంగస్వామి తెలిపారు. 2018-19 సంవత్సరానికి విడుదల కావాల్సిన అంచనా నిధులను ఎక్సెల్ నమునాలో మండల విద్యాశాఖాధికారి ద్వారా పంపాలన్నారు. వివరాలు అందజేయని పాఠశాలలకు నిధులు విడుదల చేయడం జరగదని ఆయన పేర్కొన్నారు.

నేటి పున్నమి గరుడసేవ రద్దు

తిరుమల, న్యూస్‌టుడే: తిరుమల శ్రీవేంకటేశ్వరస్వామి వారికి మంగళవారం జరగాల్సిన పున్నమి గరుడసేవను తితిదే రద్దు చేసింది. శ్రీవారి ఆలయంలో గత నెల 18 నుంచి అధ్యయనోత్సవాలు జరుగుతున్న సంగతి తెలిసిందే. ఈ కారణంగా గరుడసేవను నిర్వహించలేకపోతున్నట్లు తితిదే ప్రకటించింది.

రేపు శ్రీవారికి వసంతోత్సవం రద్దు

తిరుమల, న్యూస్‌టుడే: తిరుమల శ్రీవేంకటేశ్వరస్వామివారికి వసంతోత్సవాన్ని బుధవారం తితిదే రద్దు చేసింది. శ్రీవారికి ప్రణయ కలహోత్సవం జరగనున్న నేపథ్యంలో రద్దు నిర్ణయం తీసుకుంది. సాయంత్రం 4 గంటలకు ఉత్సవం జరుగుతుంది. ఆలయానికి ఈశాన్యం దిక్కున తూర్పు మాడవీధిలో కార్యక్రమాన్ని తితిదే వైభవంగా నిర్వహించనుంది.

నేడు 'రైతు కోసం' ఫోన్-ఇన్

చిత్తూరు (వ్యవసాయం), న్యూస్‌టుడే : పంటల సాగులో నూతన విధానాలు తెలుసుకోవడం, ఎదురయ్యే సమస్యల పరిష్కారానికి 'రైతుకోసం' పేరుతో మంగళవారం ఫోన్-ఇన్ నిర్వహిస్తున్నట్లు ఇన్‌ఛార్జి వ్యవసాయ శాఖ సంయుక్త సంచాలకులు యుగంధర్ తెలిపారు. జిల్లా వ్యవసాయ శాఖ కార్యాలయంలో ఉదయం 10 నుంచి 10.30 గంటల మధ్య జరిగే ఫోన్-ఇన్‌కు రైతులు ఫోన్ చేసి తమ సమస్యలను పరిష్కరించుకోవాలని సూచించారు. రుణమాఫీ, పంట నష్టపరిహారం, ఎరువులు, విత్తనాలు, భూసార పరీక్షలు, అనుబంధ శాఖలైన పశుసంవర్ధక, ఉద్యాన, పట్టుపరిశ్రమ, సూక్ష్మనీటిసాగు పథకం, మత్స్యశాఖల్లో అమలు చేస్తున్న ప్రోత్సాహక రాయితీ పథకాలు, పంటల సాగుపై సందేహాలను నెం. 08572-241474కు ఫోన్ చేసి నివృత్తి చేసుకోవాలని ఆయన కోరారు.

ఈటీవీలో ఈనాడు

ఉదయం

05-45: ఆరాధన, 06-30: అన్నదాత, 07-00: ఈటీవీ న్యూస్, 07-30: శుభమస్తు: మంగళవారం గోంగూర దానంచేస్తే ఆర్థిక విషయాలు అనుకూలిస్తాయా?, వాస్తుదోషాలు ఆరోగ్యంపై ఎలాంటి ప్రభావం చూపిస్తాయి?, 08-30: టాలీవుడ్ టైమ్, 09-00: ఈనాడు సినిమా: అమ్మో! ఒకటో తారీఖు (శ్రీకాంత్, రాశి).

మధ్యాహ్నం

12-00: తెలుగు 'రుచి': ఘుమఘుమలు 'బెండకాయ కొబ్బరి వేపుడు', మీ చేతి వంట 'మలైకోఫ్తా కర్రీ', 'ఆలూకార్న్ సూప్', జస్ట్ ఎ మినిట్ 'గుమ్మడి పరోటా' తయారుచేసే విధానం, ఇంటింటి వంటింటి చిట్కాలు, 01-00: స్టార్ మహిళ: (మెగా గేమ్ షో), 02-00: అభిషేకం (డైలీ సీరియల్), 02-30: అత్తారింటికి దారేది (డైలీ సీరియల్), 03-00: సీతమ్మ వాకిట్లో సిరిమల్లె చెట్టు(విధి–2) (డైలీ సీరియల్), 03-30: ఆడదే ఆధారం (డైలీ సీరియల్).

సాయంత్రం

04-00: ఋతుగీతం (డైలీ సీరియల్), 04-30: వసంతం (డైలీ సీరియల్), 05-00: జబర్దస్త్ (రిపీట్), 06-00: ఒకరికి ఒకరు (డైలీ సీరియల్) 06-30: తేనె మనసులు (డైలీ సీరియల్)

రాత్రి

07-00: సావిత్రి (డైలీ సీరియల్), 07-30: మనసు మమత (డైలీ సీరియల్), 08-00: స్వాతిచినుకులు (డైలీ సీరియల్), 08-30: నా పేరు మీనాక్షి (డైలీ సీరియల్), 09-00: ఈటీవీ న్యూస్, 09-30: పైసై సయ్యారే: దర్శకేంద్రుడి పాటల సందడి..., 10-30: 'ఫన్' డే (స్పెషల్ కామెడీ ప్రోగ్రాం).

ఈటీవీ ప్లస్

ఉదయం 11:00 కిక్ రిపీట్

మధ్యాహ్నం

12:00 జబర్దస్త్ రిమిక్స్
01:00 అమ్మాయి క్యూటు అబ్బాయి నాటు రిపీట్
01:15 పిట్టగోడ రిపీట్
01:30 పటాస్ రిపీట్
02:00 అల్లరే అల్లరి రిపీట్
02:30 సరదాగా కాసేపు
03:00 తారక్ మామా అయ్యోరామ రిపీట్
03:30 పోవే..పోరా రిపీట్

సాయంత్రం

04:30 నా షో నా ఇష్టం రిపీట్
05:00 జిల్ జిల్ జిగా
06:00 అమృతం రిపీట్
06:30 ఎక్స్‌ప్రెస్ రాజా
రాత్రి 07:30 తారక్ మామా అయ్యోరామ
08:00 అల్లరే అల్లరి
08:30 సరదాగా కాసేపు
09:00 పటాస్
09:30 మహాతల్లి
09:45 ఫ్రూట్స్
10:00 నా షో నా ఇష్టం రిపీట్
11:00 పటాస్ రిపీట్
11:30 ఎక్స్‌ప్రెస్ రాజా రిపీట్

ఈటీవీ లైఫ్

- ★ మానస: సాఫ్ట్ స్కిల్స్ ఎవరికి ఎంత అవసరం - పార్ట్ 1 (ఉ. 6:00, రా. 11:30)
- ★ యోగమంత్ర (ఉ. 7:00, సా. 6:00, రా. 10:30)
- ★ గెట్‌సెట్‌ఫిట్ (ఉ. 7:30, సా. 6:30, రా. 10:00)
- ★ అమృతం: వండర్ వెజిటబుల్స్ (ఉ. 8:00, మ. 12:30, రా. 8:00)
- ★ హెల్దీ & టేస్టీ (ఉ. 8:30, మ. 1:00, రా. 8:30)
- ★ కౌంట్ యువర్ కేలరీస్ (మ. 1:30)
- ★ జీవనరేఖ – విమెన్స్ హెల్త్: మహిళల్లో గుండె జబ్బులా? ఎలా అడ్డుకుందాం? (ఉ. 9:30)
- ★ జీవనరేఖ – విమెన్స్ హెల్త్: స్త్రీలలో మూత్రనాళ సమస్యలా? ఎటువంటి జాగ్రత్తలు అవసరం? (మ. 2:00, రా. 7:00)
- ★ అంతరంగం: కొత్త సంవత్సరంలో తీసుకునే సంకల్పాలను..మీరు మధ్యలోనే వదిలేయకుండా ఉండాలంటే ఏంచేయాలి? (ఉ. 10:00)
- ★ అంతరంగం: మీ పిల్లల ఫోన్లను చెక్ చేయాలనుకుంటున్నారా? మరి వారిని ఎలా మ్యానేజ్ చేయాలి? (మ. 2:30, రా. 9:30)
- ★ ఆరోగ్యమస్తు: 1. నూతన సంవత్సరం - ఆరోగ్య సంకల్పాలు, 2. పూర్ణాయుషుకు పోషకాహారం, 3. లాలాజలం..ఓ దివ్యౌషధం (ఉ. 10:30)
- ★ ఆరోగ్యమస్తు: 1. రక్తంలో పూడికలు ఏర్పడడానికి కారణాలు, 2. మనం హోటళ్ళో తినగా మిగిలిన ఆహారాన్ని ప్యాక్ చేసి ఇంటికి తీసుకొని వెళ్లడం మంచిదేనా?, 3. శరీరంలో వాపుల వెనుక దాగున్న వాస్తవాలు (మ. 3:00, రా. 9:00)
- ★ డా. ఈటీవి: గుండె ఆరోగ్యం (ఉ. 11:00)
- ★ డా. ఈటీవి: చర్మ సంరక్షణ (ఉ. 11:15)
- ★ డా. ఈటీవి: మధుమేహం (మ. 3:30, రా. 7:30)
- ★ డా. ఈటీవి: ENT (మ. 3:45, రా. 7:45)

ఈటీవీ సినిమా

ఉదయం: 6-00: టెలీషాపింగ్ 7-00: సన్‌రైజ్ సినిమా: దొంగపెళ్ళి (శోభన్‌బాబు, విజయశాంతి) 10-00: మార్నింగ్ షో: బాలమిత్రుల కథ (మాస్టర్‌దేవానంద్, మాస్టర్ సురేంద్ర) మధ్యాహ్నం: 1-00: మాటినీ: ఘటోత్కచుడు (ఆలీ, రోజా) సాయంత్రం: 4-00: ఈవినింగ్‌షో : హృదయం (మురళి, హీరా) రాత్రి: 7-00: ఫస్ట్‌షో: బాగ్దాద్ గజదొంగ (ఎన్టీఆర్, జయలలిత) 10-00: మై ఛాయిస్ (స్పెషల్ ప్రోగ్రాం).

ఈటీవీ అభిరుచి

ఉ.6.00: బ్రేక్ ఫాస్ట్ షో - కోడిగుడ్డు శెనగల ఛాట్ & గోధుమగడ్డి బాదం పాన్‌కేక్, ఉ.8.00, రా.9.00: బ్రేక్ ఫాస్ట్ షో - కాబూలీ చెనా ముల్లంగి పరాటా & మష్రూమ్ మఫిన్స్, ఉ.8.45: టేస్ట్ ఆఫ్ ఇండియా (పంజాబీ క్యూసైన్) - చోలే ఆలూ ఔర్ గోబీ కా టిక్కీ ఛాట్, ఉ.9.30: సూపర్ భీమ్ - గేమ్ షో, ఉ.11.00: గోరుముద్దలు - కర్డ్ అండ్ ఓట్స్ సెరియల్, ఉ.11.15, రా.8.30: డైట్ మెనూ (మైగ్రేన్ నివారణకు) - స్పినాచ్ ఎగ్ పొంగణాలు, ఉ.11.30, రా.8:00: గోదావరి నెయ్యి "బాబాయ్ హోటల్" - మటన్ దమ్ బిర్యానీ & కార్జం వేపుడు, మ.12.00, సా.5.45: టేస్ట్ ఆఫ్ ఇండియా (కర్ణాటక క్యూసైన్) - అవలక్కి ఎర్రియప్ప, మ.12.15, రా.10.15: మమ్మీస్ కిచెన్ - అరవి కబాబ్, మ.12.30, రా.8.45: సూపర్ చెఫ్ - గుమ్మడికాయ హల్వా, మ.12.45, సా.6.15: ఛాట్స్ & సూప్స్ - గుమ్మడికాయ గింజలతో సూప్, మ.1.00, సా.4.30: వావ్ ఏమి రుచి (పారిస్ క్యూసైన్) - పార్శీ ఫ్రైడ్ చికెన్ & చికెన్ కర్రీ విత్ పొటాటోస్, మ.1.30, రా.10.00: చట్‌పట్ (అత్తమ్మ రుచుల స్పెషల్) ఇండియన్ కేక్, మ.1.45, రా.7.30: ట్రెండీ ట్రీట్స్ - స్టఫ్డ్ ఎగ్ విత్ చికెన్ & చాక్లెట్ ఎక్లైర్స్, మ.2.15: మటన్‌తో మస్తీ మస్తీ - పెరుగు మర్చీ మటన్ బిర్యానీ & కాజు మటన్ ఫ్రై, మ.2.30, సా.6.00: మంత్రా డిటర్జెంట్ సోప్ "చోటా షెఫ్" - ఉల్లి పునుగులు, మ.2.45, రా.10.30: ఎట్‌హోమ్ - మ్యాంగో స్క్వాష్ & క్లాసీ రంచ్ డ్రెస్సింగ్, మ.3.30: ఆహారవీధిలో - ప్రముఖ రెస్టారెంట్‌లో.

ఈటీవీ ఆంధ్రప్రదేశ్ కార్యక్రమాలు

ఉదయం: 05-30 తమసోమా జ్యోతిర్గమయ, 06-00 ఘంటారావం, 06-30 ప్రార్థనా సమయం, 07-00 అంతర్యామి, 07-30 ఈటీవీ 360 ^{0}, 08-30 యువ (రి), 09-00 ఘంటారావం, 09-30 సుఖీభవ, 10-00 ఘంటారావం, 10-30 ఈటీవీ టాకీస్, 11-00 ఘంటారావం, 11-30 ఇదీ సంగతి!, **మధ్యాహ్నం:** 12-00 ఘంటారావం, 12-30 కమర్షియల్ స్లాట్, 01-00 ఈటీవీ 360 ^{0}, 02-00 సఖి, 02-30 ఘంటారావం, 02-35 సఖి, 03-00 ఘంటారావం, 03-30 సుఖీభవ, **సాయంత్రం:** 04-00 ఘంటారావం, 04-30 తీర్థ యాత్ర: శ్రీ లక్ష్మీనారాయణ దేవాలయం, మధురవాడ, విశాఖపట్నం, 5-00 ఘంటారావం, 05-30 కమర్షియల్ స్లాట్, 06-00 ఘంటారావం, 06-30 జై కిసాన్, **రాత్రి:** 07-00 ఘంటారావం, 07-30 ఇదీ సంగతి, 08-00 ఈటీవీ 360 ^{0}, 09-00 ప్రతిధ్వని, 09-30 యువ, 10-00 ఘంటారావం, 10-30 బీబీసీ ప్రపంచం, 11-00 ఘంటారావం, 11-30 ఇదీ సంగతి.

ఈటీవీ తెలంగాణ కార్యక్రమాలు

ఉదయం: 05-30 తమసోమా జ్యోతిర్గమయ, 06-00 ఘంటారావం, 06-30 యువ (రి), 07-00 అంతర్యామి, 07-30 ఈటీవీ 360 ^{0}, 08-30 యువ, 09-00 ఘంటారావం, 09-30 ఈటీవీ టాకీస్, 10-00 ఘంటారావం, 10-30 సుఖీభవ, 11-00 ఘంటారావం, 11-30 ఇదీ సంగతి!, **మధ్యాహ్నం:** 12-00 ఘంటారావం, 12-30 ప్రత్యేక వాణిజ్య కార్యక్రమం, 01-00 ఈటీవీ 360 ^{0}, 02-00 సఖి, 02-30 ఘంటారావం, 02-35 సఖి, 03-00 ఘంటారావం, 03-30 తీర్థ యాత్ర: శ్రీ గోదారంగనాథస్వామి ఆలయం, ఎదులాబాద్, మేడ్చల్ జిల్లా, **సాయంత్రం:** 04-00 ఘంటారావం, 04-30 సుఖీభవ, 05-00 ఘంటారావం, 05-30 కమర్షియల్ స్లాట్, 06-00 ఘంటారావం, 06-30 జైకిసాన్, **రాత్రి:** 07-00 ఘంటారావం, 07-30 ఇదీ సంగతి!, 08-00 ఈటీవీ 360 ^{0}, 09-00 ఈటీవీ న్యూస్, 09-30 యువ, 10-00 ఘంటారావం, 10-30 బీబీసీ ప్రపంచం, 11-00 ఘంటారావం, 11-30 ఇదీ సంగతి.

ఏ ఛానల్లో ఏముంది.. 02-01-2018

SVBC: **ఉదయం:** 05-30 తిరుప్పావై - గోదాస్తుతి, 06-30 శుభోదయం నిత్యపూజలివిగో, 07-00 విష్ణు సహస్రనామస్తోత్రం, 07-30 శ్రీవారి సేవలు (అష్టాదళ పాదపద్మారాధన సేవ), 08-00 శతమానంభవతి, 08-30 పూజకు వేళాయె - ఆంజనేయ స్వామి, 09-00 ఆధ్యాత్మిక విశేషాలు, 09-30 భక్తిగీతమాలిక, 10-00 ఆధ్యాత్మిక విశేషగలు - కన్నడ, 10-30 లైవ్ శ్రీపద్మావతి అమ్మవారికల్యాణం - తిరుచానూరు, 11-30 స్పెషల్ న్యూస్ +ఆముక్తమాల్యద, **మధ్యాహ్నం:** 12-00 లైవ్ కల్యాణోత్సవం, 01-00 ఆధ్యాత్మిక విశేషాలు, 01-30 విష్ణుసహస్ర నామామృతం + లైవ్ డోలోత్సవం, 02-00 లైవ్ ఆర్జిత బ్రహ్మోత్సవం, 02-30 లైవ్ వసంతోత్సవం, 03-00 భగవద్గీత - బాలవికాసం, 03-30 అద్భుత ఆలయాలు - మురుడేశ్వర్ (రిపీట్), **సాయంత్రం:** 04-00 శ్రీదేవీ కటాక్షం, 04-30 విలువలు - విజ్ఞానం, 05-00 లైవ్ ఎస్.డి. సేవ - తిరుమల + స్పెషల్ న్యూస్ + ఆళ్వార్ శ్రీసూక్తి, 06-00 లైవ్ నాదనీరాజనం - తిరుమల, **రాత్రి:** 07-30 లైవ్ ఘంటానాదం + శ్రీనివాసగద్యం + శివపంచాక్షరి + లింగాష్టకం, 08-00 లైవ్ అధ్యయనోత్సవాలు - భక్తిచైతన్యం, 08-30 మల్లికార్జున సుప్రభాతం - చాగంటి, 09-00 ఆలయదర్శనం - గుహ్య అగష్టేశ్వరస్వామి ఆలయం, 09-30 శివమహాపురాణం - శ్రీసామవేదం, 10-00 ఆధ్యాత్మిక విశేషాలు, 10-30 శ్రీరామ రసవాహిని - సాటులూరి గోపాలకృష్ణమాచార్యులు.

భక్తి TV: **ఉదయం:** 06-00 శ్రీ లలితాసహస్రం, 06-30 హనుమాన్ చాలీసా, 07-00 అర్చన, 07-30 శ్రీ కనకధారాస్తోత్రం 08-00 పుణ్యక్షేత్రం, 08-30 ఆరుద్ర దర్శనం (లైవ్), 11-00 ధర్మ సందేహాలు, **సాయంత్రం:** 04-30 పుణ్యక్షేత్రం, 05-00 శ్రీ కనకధారాస్తోత్రం, 05-30 హనుమాన్ చాలీసా, 06-00 శ్రీ లలితాసహస్రం, **రాత్రి:** 07-00 భక్తి విశేషాలు, 07-30 అమృత కలశం 08-00 ఆరుద్ర దర్శన మహోత్సవం 08-30 శ్రీమద్భగవద్గీత, 09-00 దుర్గాసప్తశతి 09-30 మహా భారత పాత్రలు, 10-00 ధర్మ సందేహాలు, 10-30 భక్తి విశేషాలు, 11-00 గోదామృతం.

జీ తెలుగు: **ఉదయం:** 07-00 టెలిషాపింగ్, 07-30 శుభోదయం, 08-30 సినిమా: చందమామ, 11-30 వారెవా, **మధ్యాహ్నం:** 12-00 రారండోయ్ వేడుకచేద్దాం, 01-00 బతుకు జట్కా బండి, 02-00 గృహప్రవేశం, 02-30 నా కోడలు బంగారం, 03-00 సూర్యవంశం రిపీట్, 03-30 కళ్యాణ వైభోగం రిపీట్, **సాయంత్రం:** 04-00 డ్రామా జూనియర్స్ రిపీట్, 05-00 జై కృష్ణా ముకుంద మురారి, 05-30 కుంకుమభాగ్య, 06-00 పక్కింటమ్మాయి, 06-30 పున్నాగ, **రాత్రి:** 07-00 అమెరికా అమ్మాయి, 07-30 ముద్ద మందారం, 08-00 దట్ ఈజ్ మహాలక్ష్మీ, 08-30 ఎవరే నువ్వు మోహిని 09-00 కళ్యాణ వైభోగం, 09-30 ముత్యాల ముగ్గు, 10-00 సూర్యవంశం, 10-30 నా కోడలు బంగారం (రిపీట్).

మా: **ఉదయం:** 06-30 సిల్వర్ స్క్రీన్, 07-00 హరహర మహాదేవ, 08-00 రాశి ఫలాలు దినఫలం, 08-30 జానకి రాముడు, 09-00 సినిమా: పోకిరి, **మధ్యాహ్నం:** 12-00 కోడలా కోడలా కోడుకు పెళ్లామా, 12-30 చిన్నారి పెళ్లి కూతురు, 01-00 కుంకుమపువ్వు (రిపీట్), 01-30 చూపులు కలిసిన శుభవేళ, 02-00 కార్తీక దీపం, 02-30 సినిమా: లీడర్, **సాయంత్రం:** 06-00 ఉయ్యాలా జంపాలా, 06-30 అగ్నిసాక్షి, **రాత్రి:** 07-00 లక్ష్మీ కల్యాణం, 07-30 కార్తీకదీపం, 08-00 కోయిలమ్మ, 08-30 కుంకుమ పువ్వు, 09-00 సుందరకాండ, 09-30 పవిత్ర బంధం, 10-00 నీలికలువలు, 10-30 స్టార్ మా పరివార్ అవార్డ్స్.

జెమిని: **ఉదయం:** 06-00 టెలీషాపింగ్, 07-00 అమృతకలశం, 07-30 అనుగ్రహం, 08-00 శ్రీ ఆంజనేయం (రిపీట్), 08-30 సినిమా: నేనున్నాను, 11-30 నాగిని 2 (రిపీట్), **మధ్యాహ్నం:** 12-00 నువ్వు నాకు నచ్చావ్ (రిపీట్), 12-30 చక్రవాకం, 01-00 నందిని (రిపీట్), 01-30 మొగలి రేకులు, 02-00 అమ్మ నేను ఓ అమ్మాయి, 02-30 షిరిడి సాయి, 03-00 సినిమా: శంభో శివ శంభో, 06-00 ప్రతిఘటన, 06-30 శ్రీ ఆంజనేయం, **రాత్రి:** 07-00 నాతిచరామి, 07-30 జై జై వినాయక, 08-00 మాతృదేవోభవ, 08-30 శనీశ్వరుని దివ్యచరిత్ర, 09-00 నందిని, 09-30 జూలకటక, 10-30 సినిమా: మిస్టర్ పర్‌ఫెక్ట్.

HBO: **ఉదయం:** 06-00 స్నిచ్, 07-54 రాక్ ఆఫ్ ఏజెస్, 09-53 టీనేజ్ మ్యుటెంట్ నింజా టర్‌టిల్స్: ఔట్ ఆఫ్ ది షాడోస్, 11-52 300: రైజ్ ఆఫ్ యాన్ ఎంపైర్, **మధ్యాహ్నం:** 01-24 బ్యాట్‌మ్యాన్ వర్సెస్ సూపర్‌మ్యాన్: డాన్ ఆఫ్ జస్టిస్.

ETV అన్నదాతలో...

రేపు ఉదయం 6.30 గం.లకు

1. అరటి గెలల దిగుబడి, నాణ్యత పెంచే అంశాలు
2. కలుపు మందుల వాడకంలో జాగ్రత్తలు
3. దమ్ములో వరిని నేరుగా విత్తే విధానం

ఉచిత హెల్ప్‌లైన్ నెం.1800-425-4085కు ఉ.10-11 గం.ల మధ్య ఫోన్ చేయవచ్చు

రైతేరాజు

ETV ఆంధ్ర ప్రదేశ్ జైకిసాన్‌లో...

నేటి సాయంత్రం 6.30 గంటలకు

1. సేంద్రియ సాగులో సత్ఫలితాలు సాధిస్తున్న గ్రామాలు-ఆశాజనక ఫలితాలు
2. కొనుగోలు కేంద్రాల్లో హమాలీల దందా నష్టపోతున్న వేరుశనగ రైతులు

జైకిసాన్ కార్యక్రమాన్ని www.youtube.com/etv2jaikisan ద్వారా కూడా వీక్షించవచ్చు.

గులాబి పురుగును ముందే నివారించాలి

పత్తి పైరును ఆశించి తీవ్ర నష్టం కలిస్తున్న గులాబి రంగు పురుగు నివారణకు పైరు లేతదశ నుంచే సస్యరక్షణ చర్యలు చేపట్టాలని శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా చేజర్ల వ్యవసాయాధికారి శ్రీదేవి సూచించారు. బీటీ పత్తి రకాల సాగుతో కాయ తొలిచే పురుగులు తగ్గుముఖం పట్టినా, ఇటీవల గులాబి రంగు పురుగు, శనగపచ్చ పురుగు, పొగాకు లద్దె పురుగు ప్రస్తుతం అక్కడక్కడా కనిపిస్తున్నాయి. వీటి నివారణకు రైతులు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. గులాబి రంగు పురుగులు పంట చివరి దశలో గూడ, పూత, కాయలకు నష్టం కలుగజేస్తాయి.

★ గులాబి రంగు పురుగు నాలుగు దశల్లో పెరుగుతుంది. పైర్లు వేయక ముందు భూమిలో, పత్తి వ్యర్థాల్లో కోశస్థ దశలో దాగి ఉండి వర్షాలు కురిసిన వెంటనే గోధుమరంగుతో సన్నటి రెక్కల పురుగులుగా వెలువడతాయి. ఒక్కో పురుగు పత్తి మొక్కపై 400 పైగా గుడ్లు పెడుతుంది.

★ ఇవి ఎదిగి గులాబీ రంగు పురుగుల్లా మారి మొగ్గలు, లేత కాయలకు రంధ్రాలు చేసి నష్టం కలుగజేస్తాయి. పురుగులు లోపలి భాగంలో చేరిన తరువాత రంధ్రాలు మూసుకు పోవటంతో కీటకాలను గుర్తించటం కష్టం. మొక్కల్లో పదార్థాలు తినేయడం



ద్వారా పూత దశలో ఎక్కువ నష్టం కలుగుతుంది. గుడ్డిపూలు, కాయలు ఏర్పడతాయి. ఈ కీటకాలు పైరు పైభాగంలో కనిపించే అవకాశం తక్కువ. గుడ్డి కాయల్ని చీల్చి పురుగులను గుర్తించాలి.

సమష్టి యాజమాన్యం

పత్తి రైతులందరు సమష్టిగా సస్యరక్షణ చర్యలు చేపడితే పైరును ఆశించే కీటకాలు, తెగుళ్లను సులువుగా నివారించుకోవచ్చు.

★ లింగాకర్షణ బుట్టలను ఎకరానికి 4, 6 వరకు ఏర్పాటు చేయటం ద్వారా కోశస్థ దశలో ఉండే రెక్కల పురుగులు గుడ్లు పెట్టకముందే మగ పురుగుల్ని బంధించి నాశనం చేసి కీటకాల తీవ్రతను తగ్గించుకోవచ్చు. గులాబీరంగు పురుగు, పొగాకు లద్దె పురుగులకు వేర్వేరు లింగాకర్షణ బుట్టలు అమర్చుకోవాలి.

అగ్ని అస్త్ర ప్రయోగం : రైతులు తమ ఇళ్లలో దొరికే జీవ సంబంధ పదార్థాలతో తయారుచేసే ద్రావణంతో పురుగులను సమర్థంగా నివారించుకోవచ్చు. మట్టి కుండలో 10 లీటర్ల గోమూత్రంతో పాటు కిలో పొగాకు, అయిదు కిలోల వేపాకులు, అర కిలో పచ్చిమిరప కాయలు, అరకిలో వెల్లుల్లి ముద్దల్ని వేసి నాలుగుసార్లు పొంగు వచ్చేలా ఉడికించాలి. ఈ ద్రావణాన్ని 48 గంటలు చల్లార్చి వడకట్టి పిచికారీ చేయాలి. ఒక దఫాలో 3 లీటర్ల అగ్ని అస్త్రాన్ని 200 లీటర్ల నీటిలో కలిపి పైరుపై పిచికారీ చేయాలి.

తక్షణ సస్యరక్షణ: పత్తి చేలల్లో కాయతొలుచు పురుగు ఉద్ధృతి అధికంగా ఉన్నపుడు 1.5 గ్రా. థయోడికార్బ్ లీటరు నీటికి చొప్పున కలిపి పిచికారీ చేయాలి. పైరు చివరి దశలో ఉన్నప్పుడు సైపర్‌మిత్రిన్ 1 మి.లీ లేదా లామ్డా సైహాలోత్రిన్ 1 మి.లీ., లీటరు నీటికి చొప్పున కలిపి పిచికారీ చేయాలి. సింథటిక్ పైరిత్రాయిడ్లు మొదటి దశలో వాడితే పైరుపై రసం పీల్చే పురుగులు ఆశించి నష్టం కలుగుతుంది. బీటీ పత్తికి చుట్టూ కంచెలా సాధారణ పత్తిని నాటుకోవాలని ఆమె సూచించారు.

– న్యూస్‌టుడే, చేజర్ల (నెల్లూరు జిల్లా)

కొబ్బరిలో కొమ్ము పురుగు

అన్ని ప్రాంతాల్లో కొబ్బరిని కొమ్ము పురుగు ఆశించి నష్టం చేస్తోంది. దీని నివారణకు జాగ్రత్తలు తీసుకోవాలని ఉద్యానశాఖ అధికారి కోటేశ్వరరావు తెలిపారు.

లక్షణాలు: విప్పారిన ముదురు ఆకులపై 'వి' ఆకారంలో కత్తిరించినట్లు ఉంటుంది.

★ కొబ్బరి చెట్టు మొవ్వులో పురుగు తొలిచిన రంధ్రం, పురుగు వదిలిన పిప్పి ఉంటుంది. కొమ్ము పురుగు కొబ్బరి లేత మొవ్వు భాగాన్ని తొలవటం వల్ల విప్పారని లేత ఆకులు నష్టపోయి కొబ్బరి దిగుబడులు తగ్గుతాయి. చిన్న మొక్కలను ఈ పురుగు ఆశిస్తే మొవ్వు కుళ్లిపోయే ప్రమాదం ఉంది.

★ ఈ పురుగు ప్రత్యక్షంగా చేసే నష్టమే కాకుండా ఒక చెట్టు నుంచి మరొక చెట్టుకు తిరుగుతున్నప్పుడు మొవ్వుకుళ్లు తెగులును కూడా వ్యాప్తి చేస్తుంది. కొమ్ము పురుగు నష్టపరిచిన మొవ్వు భాగం నుంచి వచ్చే పులిసిన వాసనకు కొబ్బరిలో కాండం తొలిచే ఎర్ర ముక్కు పురుగు ఆశించే ప్రమాదం ఉంది.

నివారణ చర్యలు: కొబ్బరి తోటల్లో పడిపోయిన చెట్లను తొలగించి మొదలు (భూమిలో ఉన్న భాగం) తవ్వించి తగుల బెట్టాలి. తోటలో పశువుల ఎరువు కుప్పలు ఉంచరాదు. దగ్గరలోని పశువుల ఎరువుల కుప్పలను మూడు నెలలకొకసారి తిరగేస్తూ కార్బరిల్ (50 శాతం) 3 గ్రాములు లీటరు నీటిలో కలిపి పిచికారి చేయాలి. మూడు నెలలకొకసారి కొబ్బరి చెట్ల మొవ్వు ఆకుల వలయాలలో వేప పిండి లేదా వేప గింజల పొడి 100 గ్రాములను 150 గ్రాముల ఇసుకలో కలిపి వేయాలి.

– న్యూస్‌టుడే, చిత్తూరు (వ్యవసాయం)



ఆటాపాట.. యువత బాట



చిన్నారుల మ్యాజిక్ షో



హాజరైన నగరవాసులు



యాంకర్ల సందడి

వినోదం.. ఉల్లాసభరితం

శిల్పారామంలో నూతన సంవత్సర వేడుకలు

తిరుచానూరు రోడ్డులోని శిల్పారామంలో సోమవారం నూతన సంవత్సర వేడుకలను ఘనంగా నిర్వహించారు. తిరుపతికి చెందిన జియో ఎంటర్‌టైన్‌మెంట్ సంస్థ ఆధ్వర్యంలో ఉదయం నుంచి రాత్రి వరకు నిరవధిక వినోదాత్మక కార్యక్రమాలు జరిగాయి. అందులో భాగంగా గాయకులు సినీ పాటలను ఆలపించి సందర్శకులను ఉర్రూతలూగించారు. కళాకారులు చేసిన సినీ నృత్యాలకు ప్రేక్షకులు స్టెప్‌లు వేశారు. యువతీ, యువకుల కేరింతల నడుమ కార్యక్రమం ఉల్లాసభరితంగా సాగింది. చిన్నారుల కోసం ఏర్పాటు చేసిన కామెడీ, మిమిక్రీ ప్రదర్శన, జానపద నృత్యాలు, మ్యాజిక్ ప్రదర్శన ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. సందర్శకులు కోసం వివిధ వంటల స్టాల్స్ ఏర్పాటు చేసి ఇష్టమైన ఆహారాన్ని తినేలా ఏర్పాట్లు చేశారు. నగరవాసులు కుటుంబ సభ్యులతో కలిసి పెద్దఎత్తున పాల్గొని ఆనందంగా గడిపారు. కార్యక్రమంలో జియో ఎంటర్‌టైన్‌మెంట్ అధినేత సందీప్, శిల్పారామం పరిపాలనాధికారి కృష్ణప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

- న్యూస్‌టుడే, తిరుపతి(నగరం)



చిన్నారులం.. నృత్యంలో పిడుగులం

జన్మభూమిలో మంత్రి పర్యటన షెడ్యూలు

చిత్తూరు (జిల్లా పంచాయతీ), న్యూస్‌టుడే : జిల్లాలో నేటి నుంచి ప్రారంభం కానున్న జన్మభూమి-మాఊరు కార్యక్రమంలో రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి ఎన్.అమరనాథరెడ్డి పాల్గొననున్నారు. ఆయన 2న మంగళవారం చంద్రగిరి, పుంగనూరు నియోజకవర్గాల్లోను, 3వ తేదీన పలమనేరు నియోజకవర్గంలో జరిగే జన్మభూమి కార్యక్రమంలో పాల్గొంటారు. 4వ తేదీన ఉదయం తంబళ్లపల్లి, మదనపల్లి, మధ్యాహ్నం పీలేరు నియోజకవర్గంలో, 5వ తేదీన ఉదయం నగరి, మధ్యాహ్నం సత్యవేడు, 6వ తేదీన పలమనేరు, మదనపల్లి నియోజకవర్గాల్లో జరిగే గ్రామసభల్లో పాల్గొంటారు. 9వ తేదీన కుప్పం, 10వ తేదీన పలమనేరు, 11వ తేదీ చిత్తూరు, పూతలపట్టు నియోజకవర్గాల్లో జన్మభూమి మాఊరు కార్యక్రమంలో పాలుపంచుకుంటారు.

దాడి చేసిన యువకుడిపై కేసు నమోదు

చిత్తూరు (నేరవార్తలు), న్యూస్‌టుడే : చిత్తూరు నగరం దుర్గానగర్ కాలనీలో సోమవారం కత్తితో దాడి చేసిన యువకుడిపై చిత్తూరు రెండో పట్టణ పోలీసులు కేసు నమోదు చేశారు. స్థానిక రోసినగర్ కాలనీలోని ఓ యువతిని దుర్గానర్ కాలనీకి చెందిన పురుషోత్తం, బాలాలు ప్రేమిస్తున్నారు. యువతి పురుషోత్తంతో సన్నిహితంగా ఉండటాన్ని తట్టుకోలేని బాలా అసూయతో యువతిని దూషించాడు. దీన్ని ఓర్వలేని పురుషోత్తం నా ప్రేమికురాలిని దూషిస్తావా అంటూ అడ్డుపడి ప్రశ్నించగా. . బాలా ఆవేశానికి గురై, తన వద్ద ఉన్న చిన్న కత్తితో దాడి చేశాడు. గాయపడిన పురుషోత్తంను స్థానికులు చిత్తూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. దీనిపై పోలీసు అధికారులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.



అడవి పందులు నాశనం చేసిన వరి పంట

పంటలను నాశనం చేసిన అడవి పందులు

45రామభద్రాపురం (గుడిపాల), న్యూస్‌టుడే: మండలంలోని రైతులు సాగుచేస్తున్న పంటలపై అడవి పందులు దాడులు పెరిగాయి. ఏమి చేయాలో తెలియక రైతులు దిక్కుతోచని స్థితిలో తలలు పట్టుకొంటున్నారు. చుక్కావారిపల్లె గ్రామవాసి ఉమ్మాపతి నాయుడికి చెందిన రెండెకరాల వరి పంటను పూర్తిగా నాశనం చేశాయి. వర్షాలు కురవడంతో రైతులు వ్యయ ప్రయాసాల కోర్చి పంటను సాగుచేశారు. పంట చేతికొచ్చే సమయంలో అడవి పందులు తొక్కి నాశనం చేస్తుండడంతో దిక్కుతోచక అయోమయానికి గురవుతున్నారు. పలు గ్రామాలు అటవీ ప్రాంతానికి సమీపంలో ఉండడంతో రాత్రి వేళల్లో పందులు గుంపుగా పంటను తొక్కి పాడు చేస్తున్నట్లు రైతులు చెబుతున్నారు. సంబంధిత అధికారులు స్పందించి పందులు బెడద నివారణకు చర్యలు చేపట్టి తమను ఆదుకోవాలని రైతులు కోరుతున్నారు.

డీఆర్వోగా చంద్రమౌళి



వీఆర్ చంద్రమౌళి

చిత్తూరు (జిల్లా సచివాలయం), న్యూస్‌టుడే : జిల్లా రెవెన్యూ అధికారిగా వీఆర్ చంద్రమౌళి నియమితులైయ్యారు. డీఆర్వో రజియా బేగం ఆదివారం ఉద్యోగ విరమణ పొందారు. జిల్లా సంయుక్త పాలనాధికారి-2గా విధులు నిర్వహిస్తున్న వీఆర్ చంద్రమౌళికే డీఆర్వో బాధ్యతలు అప్పగిస్తూ జిల్లా పాలనాధికారి పీఎస్ ప్రద్యుమ్న సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు.

నేడు జూడాల ధర్నా

తిరుపతి(వైద్యవిభాగం), న్యూస్‌టుడే: కేంద్ర ప్రభుత్వం ఇటీవల తీసుకువచ్చిన నేషనల్ మెడికల్ కౌన్సిల్ బిల్లుకు వ్యతిరేకంగా ఎస్వీ వైద్యకళాశాల జూనియర్ డాక్టర్‌లు మంగళవారం ధర్నా చేపట్టనున్నట్లు జూడాల సంఘం అధ్యక్షుడు వెంకటరమణ, ఉపాధ్యక్షుడు డాక్టర్ విష్ణుభరద్వాజ్ తెలిపారు. కేంద్ర ప్రభుత్వం ఇటీవల ప్రవేశపెట్టిన ఎన్ఎంసీ బిల్లులో అనేక లోటుపాట్లు ఉన్నామని.. ఎన్ఎంసీలో ప్రభుత్వం ప్రతిపాదించిన వైద్యులు మాత్రమే ఉంటారనడం తగన్నారు. హోమియోపతి, యునాని, సిద్ధవైద్యులు కూడా అల్లోపతి వైద్యం చేసేందుకు అర్హులను చేస్తూ చేసిన ఈ బిల్లు లోపభూయిష్టమన్నారు. ఈ విధానాన్ని వ్యతిరేకిస్తూ తాము ధర్నా చేపట్టనున్నట్లు వెల్లడించారు. ప్రభుత్వం స్పందించకకపోతే అఖిల భారత స్థాయిలో వైద్యులందరూ ఉద్యమంలో పాల్గొంటారని హెచ్చరించారు.

జన్మభూమిలో సూక్ష్మసేద్య దరఖాస్తులు

చిత్తూరు (వ్యవసాయం), న్యూస్‌టుడే : సూక్ష్మసేద్యం విస్తరణే లక్ష్యంగా జన్మభూమి గ్రామసభల్లో రైతుల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తామని సూక్ష్మనీటిసాగు పథకం పథక సంచాలకులు విద్యాశంకర్ తెలిపారు. నూతన సంవత్సరాన్ని పురస్కరించుకుని సోమవారం స్థానిక జిల్లా కార్యాలయంలో నూతన సంవత్సర కేక్‌ను కోసి అందరికి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో మంగళవారం నుంచి ఈ నెల 11వ తేదీ వరకు జరిగే జన్మభూమి-మాఊరు గ్రామసభల్లో సూక్ష్మసేద్యం ఆవశ్యకత, ప్రయోజనాలు, రాయితీలపై వివరిస్తామని చెప్పారు. లబ్ధిదారులకు డ్రిప్ పరికరాల పంపిణీ చేస్తామన్నారు. సూక్ష్మసేద్యం రాయితీల మంజూరుకు రైతుల నుంచి దరఖాస్తుల స్వీకరించనున్నట్లు తెలిపారు. ప్రధానంగా మిని స్ప్రింక్లర్లపై క్షేత్రస్థాయిలో అవగాహన కార్యక్రమాలను ఏర్పాటు చేస్తున్నామన్నారు. ఎస్సీ, ఎస్టీ రైతులకు వంద శాతం, సన్న, చిన్నకారు రైతులకు 90 శాతం రాయితీపై మిని స్ప్రింకర్లు పంపిణీ చేస్తున్నట్లు వెల్లడించారు. మిని స్ప్రింక్లర్లతో తక్కువ నీటితో ఎక్కువ విస్తీర్ణంలో సాగు, నాణ్యమైన దిగుబడులు పొందవచ్చునన్నారు. వేరుసెనగ, ఆకుకూరలు, మొక్కజొన్న, జొన్న రకాల పశుగ్రాసం సాగుకు మిని స్ప్రింక్లర్లు ఎంతో ఉపయుక్తంగా ఉంటాయన్నారు. తుంపర్ల సేద్యాన్ని ప్రోత్సహించేందుకు అర్హులైన రైతులందరికి మిని స్ప్రింక్లర్లను అందచేస్తామన్నారు. ఇందుకోసం ప్రతి మండలానికి రెండు చొప్పున మిని స్ప్రింకర్లను సరఫరా చేశామని, ఆయా మండలాల సూక్ష్మసేద్యం అధికారులు, సిబ్బంది గ్రామసభలు జరిగే గ్రామాల్లో విధిగా మిని స్ప్రింక్లర్లు పనితీరు, ప్రయోజనాలపై రైతులకు అవగాహన కల్పిస్తారని చెప్పారు. గ్రామసభల్లో దరఖాస్తులు సమర్పించి సూక్ష్మసేద్యం రాయితీలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

మహిళలకు పోలీసులే.. కవచంలా నిలవాలి

చిత్తూరు (నేరవార్తలు), న్యూస్‌టుడే : జిల్లాలోని మహిళలకు పోలీసులే రక్షణ శక్తిగా.. కవచంలా నిలవాలని జిల్లా ఎస్పీ రాజశేఖర్‌బాబు అన్నారు. సోమవారం ఆయన డీఎస్పీలతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళా నేరాలను పూర్తిగా తగ్గించడానికి శక్తివంచన లేకుండా కృషి చేయాలని సూచించారు. ఈ ఏడాది మహిళల నేరాల నియంత్రణ అనే ఈ అంశంపైనే ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. ఎక్కడ కూడా ఎలాంటి మహిళా నేరాలు జరగకూడదని చెప్పారు. పాఠశాల స్థాయి నుంచి ఇంజినీరిగ్ కళాశాలల వరకు విద్యార్థుల్లో చైతన్యం తీసుకురావాలన్నారు. మహిళల నేరాలకు పాల్పడితే.. ఎలాంటి శిక్షలుంటాయోనని వివరించాలని తెలిపారు. ఈవ్‌టీజింగ్, ర్యాగింగ్, వేధింపులు, బెదిరింపులు, దౌర్జనం వంటివి విద్యార్థినులు, మహిళలకు ఇబ్బందికి గురి చేసినా సంబంధిత వ్యక్తుల పరిస్థితి వేరుగా ఉంటుందనే విషయాన్ని హెచ్చరించాలని సూచించారు. మహిళలకు పోలీసులే బలం కావాలన్నారు. మహిళలకు ఎలాంటి సమస్యలొచ్చినా పోలీసులే కవచంలా నిలవాలని సూచించారు. గ్రామాల్లో పర్యటించాలని.. డాక్యుమెంట్రీ ద్వారా మహిళల్లో చైతన్యం తీసుకురావాలని చెప్పారు. ప్రతి పంచాయితీలోని మహిళలు, మహిళా సంఘాలతో మాట్లాడాలన్నారు. మహిళా చట్టాలపై అవగాహన కల్పించాలని కోరారు. ప్రతి సబ్‌డివిజన్ అధికారులు మహిళా నేరాల నియంత్రణకు ప్రణాళికలు సిద్ధం చేసి.. వాటిని అమలు చేయాలన్నారు. అనంతరం అధికారులకు పలు సూచనలు, సలహాలను అందించారు. ఈ కార్యక్రమంలో డీఎస్పీలు, సీఐలు పాల్గొన్నారు.

రైతు శిక్షణ కేంద్రం డీడీగా సురేంద్ర బెనర్జీ

చిత్తూరు (వ్యవసాయం), న్యూస్‌టుడే : చిత్తూరు రైతు శిక్షణ కేంద్రం ఉపసంచాలకులుగా సురేంద్ర బెనర్జీ నియమితులయ్యారు. అనంతపురం జిల్లా రైతు శిక్షణ కేంద్రం డీడీగా పనిచేస్తున్న ఆయన డిప్యూటేషన్‌పై ఇక్కడ నియమిస్తూ రాష్ట్ర వ్యవసాయ శాఖ ఉత్తర్వులు జారీ చేసింది. కొంత కాలంగా భూసార సంరక్షణ శాఖ డీడీ యుగంధర్ చిత్తూరు రైతు శిక్షణ కేంద్రం ఇన్‌ఛార్జి డీడీగా కొనసాగుతున్నారు. నూతన డీడీగా ఈయన త్వరలో బాధ్యతలు స్వీకరించనున్నారు.

పాఠశాలలకు గణిత సైన్సు పరికరాలు

చిత్తూరు (విద్య), న్యూస్‌టుడే : రాష్ట్ర ప్రభుత్వం ఉన్నత పాఠశాలలను బలోపేతం చేయడంలో భాగంగా పాఠశాలల యాజమాన్యాలకు గణితశాస్త్రం, సైన్సుకు సంబంధించిన పరికరాలను త్వరలో సరఫరా చర్యల చేపట్టిందని డీఈవో పాండురంగస్వామి తెలిపారు. వాటిని అందుకున్న సంబంధిత పాఠశాలల ప్రధానోపాధ్యాయులు నిర్ణీత నమునాను పూరించి, మండల విద్యాశాఖాధికారి ద్వారా జిల్లా విద్యాశాఖ కార్యాలయంలో ఈ నెల 5లోగా అందజేయాలని చెప్పారు. 373 పాఠశాలలకు గణితం, 327 పాఠశాలలకు సైన్సు పరికరాలను ఆర్ఎంఎస్ఏ నిధుల ద్వారా అందజేయనున్నట్లు ఆయన పేర్కొన్నారు.

TENTH
Social Studies

Globalisation

2 Marks Questions

Q: Why do Government try to attract more foreign investment?

A: More foreign investment helps in increasing the economic activities. This helps in employment generation. So the Government try to attract more foreign investment.

Q: Where do MNC's setup offices and factories for production? Give reason.

A: MNC's establish offices and factories for production near the markets or places where skilled and unskilled labours are available or where factors of production is available.

Q: What are the various ways in which countries can be linked?

A: The various ways in which countries can be linked are

★ The movement of goods, services, investment and technology.

★ The movement of people between countries in search of better income, better jobs, better education.

Q: The impact of globalisation has not been Uniform. Explain the statement.

A: ★ It is benifitted to rich persons in the urban areas.

★ Some large Indian companies emerged as MNCs.

★ Thousands of small producers closed their units and met losses.

★ Many employees lost their employment and workers saw their rights erode.

Q: Why do developed countries want developing countries to liberalise their trade and investment? What do you think should the developing countries in return?

A: ★ Developed countries want developing countries to liberalise their foreign trade and foreign investment.

★ So that MNC's owned by these developed countries can expand into developing countries.

★ Developed countries with huge wealth, which is greater than the budgets of many developing countries can influence the world trade balance.

Q: Appreciate the role of WTO in promoting Globalisation.

A: W.T.O. is playing a crucial role in promoting globalisation. It promotes global business and international trade. It is the process of rapid integration of the countries. It provides a global platform to the countries for smoother solution for their problems and to establish greater free trade agreements on goods, services and technology.

Q: MNCs provide better quality products. Do you agree?

A: MNCs setup offices and factories for production in regions where they can get cheap labour and other resources.

★ The production process is divided into small parts and spread out across the globe.

★ This is done so that the cost of production is low and the MNC's can earn greater Profits giving quality products.

Q: What is the difference between foreign trade and foreign investment?

A: Foreign trade: It is any kind of trade (exports & imports) with other countries of the world.

Foreign investment: Private capital investment by firms of one country into those of another country is called foreign investment.

Q: What are the problems being faced by the small producers and workers by the impact of Globalisation? (2 Marks)

A: The MNC place orders for production with small producers. The products produced are sold by the MNCs under their own brand names. The MNC's have tremendous power to determine manufacturing conditions for the local producers. The History has shown the most of the local producers have failed to compete with the MNC's. So, either they have sold their units to the MNC's or have been wiped off.

ప్రతిభ

What was the previous name of WTO?

Q: Nearly all major multi nationals are American, Japanese or European such as Nike, Coca-Cola, Pepsi, Honda, Nokia. Can you guess why?

A: To start a MNC, enormous wealth is required. Only developed countries like the above can start MNC's as their wealth sometimes exceeds the entire budget of the developing countries. They are financially strong. So most of the MNC's are from America, Europe and Japan.

4 Marks Questions

Q: How has liberalisation of trade and investment policies helped the globalisation process?

A: ★ Liberalisation of trade and investment helped the Globalisation process.

★ Its policies removed many barriers and restrictions in Industrialisation.

★ Establishment of MNCs accelerated the globalisation.

★ Quality of goods increased

★ Goods and services availability is greatly increased throughout the world.

★ Due to liberalisation of trade and investment policies transport system developed well.

★ Mobile Phones, internet and computer facilities developed well.

★ We can access any information with low cost internet facilities within seconds.

Q: What were the reasons for putting barriers to foreign trade and investment by the Indian Government? Why did it wish to remove these barriers?

A: ★ To protect the producers within the country from foreign competition.

★ Industries were just coming up, with foreign competition they may not survive.

★ Foreign investment may be influence our economy.

★ Our goods quality is less than compare to foreign goods.



Writer:
K. Srinivasa Rao
Subject Expert

★ Around 1991, Indian government decided that the time had come for foreign competition.

★ It believed that competition would improve our goods quality.

★ Foreign technology help for us.

★ So it wished to removed these barriers.

Q: Globalisation will continue in the future. Can you imagine what the world would be like twenty years from now? Give reasons for your answer.

A: After 20 years the world would undergo a positive change with the features of the following.

★ Improved quality of products

★ More access to information technology

★ Healthy competition

★ Better living standards

★ Increased volume of output, income and employment.

The above changes are going to happen because-

★ Human resources are plenty.

★ Enterpreneurship will grow.

★ Domestic markets of all major countries will experience growth.

★ All major countries will have a broad resource and Industrial base.

Q: Elsewhere we read what may be development for one may be destructive for others. The setting of SEZs has been opposed by some people in India. Find out who are these people why are they opposing it.

A: ★ What may be development for one may be destructive for others.

★ The setting of Special Economic zones has been opposed by some people.

★ SEZs need not pay taxes for first five years

★ SEZs have flexible labour laws.

★ They have world class facilities

★ People are against SEZs as many companies which setup SEZs are not functioning well.

★ They were provided exemptions at the expense of other companies.

Q: How is information technology connected with globalisation? Would globalisation have been possible without the expansion of IT?

A: Information and communication technology has played a major role in spreading out production of service across countries.

★ The development in IT in the areas of computers Tele communications, internet have been changing rapidly.

★ Internet also allows us to send instant e -mail and talk across the world at negligible costs.

★ With the help of IT, Globalisation able to integrate of one's country's economy with world economy.

★ Globalisation would not have been possible without expansion of IT.

Q: Supposing you find two people arguing: One is saying that globalisation has hurt our country's development. The other is telling globalisation is helping India develop. How would you respond to these arguments?

A: Positive Impact

1) Increases in the volume of trade in goods and services.

2) Inflow of private foreign capital and export orientation of the economy.

3) Increases the volume of out put, income and employment

Negative impact

1) It may not help in achieving sustainable growth

2) It may lead to aggravation of income inequalities within countries.

3) Whatever may be the negative impacts of the globalisation I feel that it has now become a process which is catching the fancy of more and more nations. Hence we must become ready to accept globalisation with grace and also maximise economic gains from the world market.

1 Mark Questions

Q: What is Globalisation?

A: Globalisation is a major change that occurred across the globe in the late 20th century. This has political, cultural as well as economic dimensions.

Q: What is Arab spring?

A: Tunisia, Egypt were influenced by each other's revolutions and uprooting of dictators. This was called Arab spring in the media.

Q: Would you say Ford motors is an MNC? Why?

A: Yes, we can say Ford motors is an MNC, because its production units have spread over 26 countries of the world. This is the most important feature of an MNC.

Q: What was the previous name of WTO?

A: The previous name of WTO was GATT (General Agreement on Trade and Tariff)

Q: When was the W.T.O established?

A: The W.T.O was established on 01.01.1995

Q: How many countries are currently the members of the W.T.O.?

A: The W.T.O has 159 member countries as on 2.3.2013

Q: What is tariff?

A: A tax on a duty on imports which can be levied on physical units is called tariff.

Q: What is Privatisation?

A: Privatisation means encouraging private sector and discouraging public sector.

Q: Where is the Headquarters of W.T.O?

A: It is in Geneva - Switzerland.

Q: What is meant by MNC?

A: An MNC is a Multi National Corporation, owns and controls production in more than one nation.

Q: What is liberalisation?

A: Removing barriers or restrictions set by the Government is known as liberalisation.

Q: Why was World Trade Organisation setup?

A: The World Trade Organisation was setup to liberalise international trade.

Q: Define Economic reforms of New Economic Policy 1991.

A: The Economic Reforms of NEP 1991 was called liberalisation of trade and business.

Q: Expand I.B.R.D. and S.E.Z and IMF.

A: I.B.R.D: International Bank for Reconstruction and Development.

S.E.Z: Special Economic Zone

IMF: International Monetary Fund

Q: What is outsourcing?

A: Outsourcing means going out to a source outside the company to buy regular service.

Q: State the new strategies of New Economic Policy.

A: 1) Liberalisation

2) Privatisation

3) Globalisation

Q: Write any two impacts of liberalisation and globalisation in India?

A: 1) There are better services in communication sector.

2) Many food processing companies have taken over the market.

ప్రతిభ

ఏపీ టెట్
శిశువికాసం, పెడగాజి

★ అభ్యాసకుడు ఆలోచిస్తాడు, వివేచన చేస్తాడు. మొత్తాలను గ్రహించిన తర్వాత పరస్పర సంబంధాన్ని గుర్తించగలడు. సమస్యా పరిష్కార శక్తిని అంతర్గతంగా కలిగి ఉంటాడు అని తెలిపిన సిద్ధాంతం ఏది?
1) శిక్షణా సిద్ధాంతం 2) అనుకరణ సిద్ధాంతం
3) అంతర్ దృష్టి సిద్ధాంతం 4) సాంఘిక సిద్ధాంతం

జవాబు: 3

కార్యక్రమయుత అభ్యసనంలోని పరిమితి ఏది?



రచయిత
- కోటపాటి హరిబాబు
విషయ నిపుణులు

1. బి.ఎఫ్. స్కిన్నర్ అభ్యసనా సిద్ధాంతానికి సంబంధించి సత్యవాక్యాన్ని గుర్తించండి.
1) స్కిన్నర్ అభ్యసనా సిద్ధాంతం క్రియాశీలక నిబంధనం
2) ఒక జీవన వ్యవస్థతో వెలిపరిచే ఎలాంటి ప్రతిస్పందన అయినా అది పరికరాత్మక నిబంధనమే
3) పునర్బలనంతో బలపడిందే పరికరాత్మక నిబంధనం
4) పైవన్నీ

2. 'The Work of Digestive Glands' గ్రంథ రచయిత ఎవరు?
1) బి.ఎఫ్. స్కిన్నర్ 2) కోహిలర్
3) పావ్‌లోవ్ 4) థార్న్ డైక్

3. స్కిన్నర్ 'కార్యక్రమయుత అభ్యసనం'లో ఏ అంశానికి ప్రాధాన్యం లేదు?
1) బోధనాంశాలను క్లిష్టతర అంశాల ఆధారంగా అమర్చాలి
2) అభ్యాసకుడు క్రియాశీలకంగా ఉండటం జరుగుతుంది.
3) స్వీయ అభ్యసనం జరుగుతుంది
4) అభ్యసనాంశంలో బోధకుడికి అధిక ప్రాధాన్యం ఉంటుంది

4. 'అభిలషణీయమైన ప్రవర్తనను విద్యార్థుల నుంచి గుర్తించిన తర్వాత ఉపాధ్యాయుడు బహుమతి ఇవ్వడంతో ఆ ప్రవర్తన పునర్బలనం చెందేలా చేయొచ్చు' అని వివరించే అభ్యసనా సిద్ధాంతం ఏది?
1) S - R Type 2) R - Type
3) S - Type 4) R - S Type

5. నిబంధిత ప్రతిస్పందన బలపడేలా చేయడమనే ప్రక్రియ శాస్త్రీయ నిబంధనానికి ప్రధానమైంది. అయితే ఏ నియమం ఈ ప్రక్రియకు దోహదపడుతుంది?
1) పునర్బలన నియమం 2) విలుప్తీకరణం
3) అయత్నసిద్ధ స్వాస్థ్యం 4) సాధారణీకరణం

6. రాజు అనే బాలుడు ఒక మూర్తిమత్వ శోధికలోని ప్రశ్నల్లో ప్రతి 8 ప్రశ్నలు పూరించిన తర్వాత ప్రయోక్త రాజుకు మంచి బహుమతి ఇస్తున్నాడు. అయితే స్కిన్నర్ ప్రకారం ఇది ఏ రకమైన పునర్బలనం అవుతుంది?
1) స్థిరకాల పునర్బలనం 2) స్థిర నిష్పత్తి పునర్బలనం
3) చరశీల పునర్బలనం 4) నిరంతర పునర్బలనం

7. బాలుడు ఒక ప్రశ్నావళిలోని ప్రశ్నలను పూరించే సందర్భంలో ఉపాధ్యాయుడు ప్రతి 45 నిమిషాలకు ఒకసారి బాలుడిచ్చే సమాధానాలకు పొగడ్తను అందిస్తున్నాడు. అయితే ఈ ఉపాధ్యాయుడు అనుసరిస్తున్న స్కిన్నర్ సిద్ధాంతంలోని పునర్బలనం ఏది?
1) స్థిరకాల పునర్బలనం
2) స్థిరనిష్పత్తి పునర్బలనం
3) చరశీల పునర్బలనం 4) నిరంతర పునర్బలనం

8. పరికరాత్మక అభ్యసనంలో ఎలుక 'మీటను నొక్కడం' అనే చర్య దేనికి సంబంధించింది?
1) అసహజ ఉద్దీపన 2) నిర్నిబంధ ప్రతిస్పందన
3) అసహజ ప్రతిస్పందన 4) నిర్నిబంధిత ఉద్దీపన

9. పావ్‌లోవ్ నియమానికి సంబంధించి సత్యవాక్యాన్ని గుర్తించండి.
1) ఇందులో సాధారణంగా వదలబడిన ప్రతిస్పందనలు ఉంటాయి
2) ప్రతిస్పందన ఉంటేనే పునర్బలనం ఇవ్వబడుతుంది
3) జీవి ఎల్లప్పుడూ క్రియాత్మకంగా ఉంటుంది
4) జీవి ఎల్లప్పుడూ నిష్క్రియాత్మకంగా ఉంటుంది

10. కింద పేర్కొన్న వాక్యాల్లో ఏది సత్యం?
1) S-Type నిబంధనంలో కంటే R-Type నిబంధనంలో జీవి క్రియాత్మకం
2) R-Type నిబంధనంలో కంటే S-Type నిబంధనంలో జీవి క్రియాత్మకం
3) S-Type నిబంధనంలో కంటే R-Type నిబంధనంలో జీవి నిష్క్రియాత్మకం
4) S-Type, R-Type రెండు నిబంధనల్లో జీవి నిష్క్రియాత్మకం

11. Learning by doing అనే ప్రక్రియను ఇనుమడింపజేసుకున్న అభ్యసనా సిద్ధాంతమేది?
1) శాస్త్రీయ నిబంధనం 2) పరికరాత్మక అభ్యసనం
3) పరిశీలనాత్మక అభ్యసనం 4) బోధనా సిద్ధాంతం

12. ఒక ఉపాధ్యాయుడు తన పర్యవేక్షణలో ఒక విద్యార్థికి ఒక ప్రకల్పనను కల్పించి, ఆ విద్యార్థి చూపించే ప్రతిస్పందనలకు సరైన కాలంలో పునర్బలనం ఇవ్వలేదు. స్కిన్నర్ ప్రకారం దీన్ని ఏ పునర్బలనంగా పేర్కొనవచ్చు?
1) స్థిరకాల పునర్బలనం 2) స్థిరనిష్పత్తి పునర్బలనం
3) చరశీల పునర్బలనం 4) నిరంతర పునర్బలనం

13. ఒక ఉపాధ్యాయుడు సౌర కుటుంబం అనే పాఠ్యాంశాన్ని కృత్యాధార పద్ధతిలో బోధిస్తున్నాడు. ఈ బోధనకు ప్రేరేపితమైన విద్యార్థులు ఉపాధ్యాయుడు అడిగిన ప్రశ్నలకు సమాధానమిస్తున్నారు. విద్యార్థులకు వెంటనే పొగడ్త కల్పిస్తున్నట్లయితే ఇది స్కిన్నర్ ఏ పునర్బలనానికి చెందింది?
1) స్థిరకాల పునర్బలనం 2) స్థిరనిష్పత్తి పునర్బలనం
3) చరశీల పునర్బలనం 4) నిరంతర పునర్బలనం

14. పావ్‌లోవ్ నియమానికి చెందనిది ఏది?
1) పునర్బలన నియమం 2) ఆకృతీకరించడం
3) విరమణ 4) ఉద్దీపనా-సామాన్యీకరణం

15. కార్యక్రమయుత అభ్యసనంలో ఉన్న పరిమితి ఏది?
1) విద్యార్థి తన సందేహ భావనలను వ్యక్తపరచడం తక్కువ
2) సందేహ నివృత్తి జరగకపోవచ్చు
3) 1, 2
4) జీవి క్రియాత్మకంగా ఉంటుంది

16. ఏవాద అభ్యసనం అనేది పరిశీలించదగిన ప్రవర్తనలపై ఆధారపడి ఉంటుంది?
1) ప్రవర్తనా వాదం 2) నిర్మాణాత్మక వాదం
3) కార్యాత్మక వాదం 4) సంజ్ఞానాత్మకవాదం

17. విద్యార్థులందరూ పాఠశాల ఆటస్థలంలో ఆడుకుంటున్న సమయంలో ఒక విద్యార్థి 'పాము' అని అరవగా విద్యార్థులందరూ ఆ అరుపు విని పామును చూడకపోయినా పరిగెత్తారు. ఇందులో పాము అనేది?
1) నిబంధిత ఉద్దీపన 2) నిర్నిబంధిత ఉద్దీపన
3) నిబంధిత ప్రతిస్పందన 4) ఏదీకాదు

18. సంప్రదాయక నిబంధనంలో పసుపు వ్యానుకు బాలుడిని అలవాటు చేయగా, తర్వాతి రోజుల్లో ఆ బాలుడు ఏ పసుపు రంగు వ్యానును చూసినా అదేవిధంగా ప్రతిస్పందించడం అనేది?
1) ఉద్దీపన - విభేదీకరణం 2) ఉద్దీపన - విచక్షణ
3) ఉద్దీపన - సాధారణీకరణం 4) ఉద్దీపన - గుర్తింపు

19. శాస్త్రీయ నిబంధన ప్రక్రియలో అసహజ ప్రతిస్పందన క్రమంగా క్షీణించడానికి కారణం కిందివాటిలో...
1) సహజ ఉద్దీపన లేకపోవడం
2) ఉన్నత క్రమ నిబంధిత ఉద్దీపన లేకపోవడం
3) సహజ ఉద్దీపన పునర్బలనం కావడం
4) ఉద్దీపనాక్రమం ఉన్నత క్రమంగా ఉండటం

20. హరి అనే అధ్యాపకుడు కాబోయే ఉపాధ్యాయులకు 'మనోవిజ్ఞాన శాస్త్రాన్ని చక్కగా నేర్చుకుంటే ఏ విద్యార్థి ప్రవర్తనైనా అర్థం చేసుకోవచ్చు. తద్వారా కీర్తిప్రతిష్టలు వస్తాయి' అని బోధించి ఆ శాస్త్రంపై భయాన్ని పోగొట్టడం పావ్‌లోవ్ ఏ నియమాన్ని తెలుపుతుంది?
1) అయత్నసిద్ధ స్వాస్థ్యం 2) విరమణ
3) సామాన్యీకరణం 4) పునర్బలన నియమం

21. సహకార చింతనంతో ప్రభావితమైన ఒక వ్యక్తి పునర్బలనాన్ని ఆచరించకుండా సంతృప్తి కోసం ఇతరుల ప్రవర్తనాంశాలను పునరుత్పాదన చేయడం అనేది పరిశీలన ప్రకారం ఏ పునర్బలనం అవుతుంది?
1) స్వీయ పునర్బలనం 2) ప్రత్యక్ష పునర్బలనం
3) పరోక్ష పునర్బలనం 4) ప్రతికూల పునర్బలనం

22. సంసర్గవాద సిద్ధాంత ముఖ్య లక్షణం ఏది?
1) ప్రవర్తనా ప్రక్రియను అలవాటు చేయడం
2) ప్రవర్తనా ప్రక్రియ నిబంధనం
3) జ్ఞాన నిర్మాణాత్మకం 4) ఆలోచనా ప్రక్రియ

23. కోహిలర్ అంతర్‌దృష్టి అభ్యసన సిద్ధాంతానికి సంబంధించి అసత్య వాక్యాన్ని గుర్తించండి.
1) జీవికి జ్ఞానం స్వభావసిద్ధంగా కలుగుతుంది
2) అభ్యసనం యాంత్రికంగా జరుగుతుంది
3) ఆలోచనలు జ్ఞానాత్మక స్థాయిలో ఏర్పడే నిర్మాణాలు
4) అభ్యసనం అకస్మాత్తుగా జరుగుతుంది

24. కింది భావనల్లో ఏది నిర్మాణాత్మకవాదానికి చెందింది?
1) విషయాంశాలను బట్టీ విధానంతో నేర్చి అవసరమైనప్పుడు పునఃస్మరణ చేయడం
2) పిల్లలు క్రియాశీలకంగా ఉంటూ ప్రపంచంపై తమ స్వీయ అవగాహన పెంచుకోవడం
3) ఉపాధ్యాయుడు నిరంతరం క్రియాత్మకంగా ఉండటం
4) అభ్యసనానికి అనుకరణను ఆపాదించడం

25. 'హింసాత్మక సన్నివేశాలు చూసిన పిల్లలు అదే రకమైన ప్రవర్తనలను అలవరచుకుంటారు' అనే అంశానికి అధిక ప్రాధాన్యం ఇచ్చిన శాస్త్రవేత్త ఎవరు?
1) థార్న్ డైక్ 2) ఆల్బర్ట్ బండూరా
3) పావ్‌లోవ్ 4) స్కిన్నర్

26. 'The Gestalt Psychology' గ్రంథ రచయిత ఎవరు?
1) కోహిలర్ 2) థార్న్ డైక్
3) బండూరా 4) స్కిన్నర్

27. సాంఘిక సాంస్కృతిక అభ్యసన సిద్ధాంతం ఏ అంశాన్ని వివరించింది?
1) విద్యావిధానంలో వైయక్తిక నియోజనాలకు అవకాశం ఇవ్వడం.
2) విద్యార్థికి మొదట సహకారం అందించి, ఆ తర్వాత సహకారాన్ని ఆపివేయడం.
3) విద్యార్థులు తన కంటే అల్ప ప్రజ్ఞ ఉన్నవారి నుంచి నేర్చుకోవడం.
4) అభ్యసనాన్ని భాగస్వామ్యయుతంగా పొందడం

28. దొంగతనం చేసిన ఒక బాలుడిని గమనించిన మరొక బాలుడు కూడా దొంగతనం చేసి ఆ సందర్భంలో పట్టుబడి, శిక్షకు గురయ్యాడు. తర్వాత ఆ పనిచేయడానికి ఆసక్తి చూపలేదు. అయితే ఇక్కడ పునరావృతం కాకుండా నిరుత్సాహపరిచే పర్యవసానాలను ఏమంటారు?
1) అనుకూల పునర్బలనం 2) ప్రతికూల పునర్బలనం
3) విరమణ 4) 1, 2

29. నిర్మాణాత్మక విద్యావిధానంలో అభ్యసన పరిస్థితి కల్పించడంలో ఉపాధ్యాయుడి పాత్ర ఏది?
1) నియమ నిబంధనలను అమలుపరచడం
2) జ్ఞానాన్ని ఒకరి నుంచి మరొకరికి ప్రసారం చేయడం
3) విలువలను సృష్టించడం
4) అభ్యసనానికి వీలు కల్పించడం

30. 'Social Learning and Personality Development, Aggression : A Social Learning Analysis' గ్రంథ రచయిత?
1) బండూరా 2) వైగాట్ స్కీ
3) కోహిలర్ 4) బ్రూనర్

31. వైగాట్ స్కీ ఏ అంశాన్ని పేర్కొన్నారు?
1) భాష సముపార్జనలో పాఠశాల పాత్ర ముఖ్యం
2) భాష సముపార్జన అంశం సంజ్ఞానాత్మక సామర్థ్యాల సముపార్జనకు దారితీస్తుంది
3) సంజ్ఞానాత్మక జ్ఞానం భాషా జ్ఞానాన్ని పెంపొందిస్తుంది
4) వైగాట్ స్కీకి, భాషకు సంబంధం లేదు

32. రాజు అనే బాలుడు తన స్నేహితుడు మొదటి ర్యాంక్ సాధించినందుకు ఉపాధ్యాయుడు మెచ్చుకోవడాన్నే గమనించి తద్వారా విద్యను అభ్యసించడంలో ఎన్నో విషయాలు నేర్చుకుంటే దీన్ని ఏ అభ్యసనంగా చెప్పవచ్చు?
1) గెస్టాల్ట్ అధ్యయనం
2) పరికరాత్మక అధ్యయనం
3) సాంప్రదాయ నిబంధన
4) నమూనా అభ్యసనం

33. వైగాట్ స్కీ ప్రకారం పూర్వపాఠశాల దశలో పిల్లలు వారి చింతన, ప్రవర్తనలకు మార్గదర్శకంగా ఏ భాషను ఉపయోగిస్తారు?
1) అంతరంగిక భాష 2) అహంకేంద్ర భాష
3) సామాజిక భాష 4) వ్యక్తిగత భాష

34. ఏ విషయాన్నైనా విశ్లేషణా దృష్టితో కాకుండా సంశ్లేషణా దృష్టితో చూసి అర్థవంతంగా అభ్యసించవచ్చనే అంశాన్ని ఏ సిద్ధాంతం ప్రబోధిస్తుంది?
1) పరిశీలనాభ్యసనం 2) శాస్త్రీయ నిబంధనం
3) అంతర్‌దృష్టి అభ్యసనం 4) కార్యసాధక నిబంధనం

35. వైగాట్ స్కీ ప్రకారం ZPD గా వ్యవహరించేది?
1) సమవయస్కులు 2) సాంకేతిక పరిజ్ఞానం
3) ఉపాధ్యాయులు 4) పైవన్నీ

36. తరగతి గదిలో పిల్లలు పాఠ్యాంశాన్ని అభ్యసించడంలో కింది అంశాల్లో ఏది అంతర్‌దృష్టి అభ్యసనానికి సంబంధించింది?
1) నిదానంగా అభ్యసించడం
2) అర్థవంతంగా అభ్యసించడం
3) బట్టీ పద్ధతిలో చదవడం 4) ఏదీకాదు

37. సమస్యా పరిష్కార పద్ధతి, అన్వేషణ పద్ధతి అనేవి ఏ అభ్యసనా సిద్ధాంతాన్ని ప్రోత్సహిస్తాయి?
1) శాస్త్రీయ నిబంధనం 2) యత్నదోష అభ్యసనం
3) అంతరదృష్టి అభ్యసనం 4) పరిశీలనాభ్యసనం

38. కిందివాటిలో సరికాని జత ఏది?
1) మానవతావాదం - కార్ల్‌రోజర్స్
2) నిర్మాణాత్మకవాదం - పావ్‌లోవ్
3) సంజ్ఞానాత్మకవాదం - జీన్ పియాజె
4) సంసర్గవాదం - జె.బి. వాట్సన్

39. అంతర్ దృష్టికి సంబంధించి సరిపోని వాక్యమేది?
1) మెరుపులాంటి అభ్యసనం
2) సంశ్లేషణాత్మక అభ్యసనం
3) విశ్లేషణాత్మక అభ్యసనం
4) అభ్యసనం అవగాహనపై ఆధారపడుతుంది

40. వైగాట్‌స్కీ ప్రకారం...
1) వికాసం కల్పించుకున్న తర్వాత అభ్యాసం దాన్ని అనుసరిస్తుంది.
2) ముందుగా అభ్యసనం చోటు చేసుకున్న అనంతరం వికాస ప్రక్రియ దాన్ని అనుసరిస్తుంది
3) వికాసానికి, అభ్యసనానికి సంబంధం లేదు.
4) అభ్యసనం, వికాసం ఒకేసారి జరుగుతాయి.

జవాబులు

1-4	12-3	23-2	34-3
2-3	13-4	24-2	35-4
3-4	14-2	25-2	36-2
4-2	15-3	26-1	37-3
5-1	16-1	27-4	38-2
6-2	17-1	28-2	39-3
7-1	18-3	29-4	40-2
8-3	19-1	30-1	
9-4	20-2	31-2	
10-1	21-1	32-4	
11-2	22-2	33-4	



హార్సిలీహిల్స్ అటవీశాఖ ప్రాంగణంలో పర్యాటకుల రద్దీ



హార్సిలీహిల్స్ ప్రదర్శనశాలలో పక్షులను వీక్షిస్తున్న పర్యాటకులు




గాలిబండపై పర్యాటకుల సంచారం

ప్రకృతి ఒడిలో.. 'కొత్త' సంబురం..!

హార్సిలీహిల్స్‌లో సందడి చేసిన పర్యాటకులు

బి.కొత్తకోట, న్యూస్‌టుడే: హార్సిలీహిల్స్‌లో కొత్త సంవత్సర సంబరాలు ఉత్సాహంగా.. ఉల్లాసంగా సాగాయి. ప్రకృతి అందాలకు, ఆహ్లాదకరమైన వాతావరణానికి నెలవైన విడది కేంద్రంలో ఆనందోత్సాహాల మధ్య పర్యాటకులు నూతన సంవత్సరానికి స్వాగతం పలికారు. ఆదివారం సాయంత్రం ప్రారంభమైన కొత్త సంవత్సరపు సందడి సోమవారం రాత్రి వరకు కొనసాగింది. ప్రతి ఏడాదిలాగానే ఈసారి కూడా హార్సిలీహిల్స్‌కు సుదూర ప్రాంతాల నుంచి పర్యాటకులు తరలివచ్చారు. సోమవారం ఉదయం నుంచి మధ్యాహ్నం ఒంటిగంటవరకు కొండపై పెద్దగా రద్దీ కన్పించలేదు. ఆ తర్వాత పర్యాటకులు రావడం క్రమంగా పుంజుకుంది. కొండపై ఉన్న కొత్త, పాత వ్యూపాయింట్లతో పాటు అటవీ, పర్యాటక ప్రాంగణాలు, గాలిబండ ప్రాంతాల్లో పర్యాటకులు సందడి చేశారు. సోమవారం రాత్రి 12.30గంటల వరకు పర్యాటకశాఖహాలులో ట్రెడిషనల్ ఈవెంట్ పేరిట కార్యక్రమాన్ని నిర్వహించారు. తిరుపతి డీవీఎం సురేష్‌కుమార్‌రెడ్డి, జీడీ నెల్లూరు ఎమ్మెల్యే నారాయణస్వామి, స్థానిక మేనేజరు మురళీలతో పాటు వివిధశాఖల అధికారులు పాల్గొన్నారు. కొండపై ఉన్న ఓ ప్రైవేటు అతిథిగృహ ప్రాంగణంలో సోమవారం రాత్రి నిర్వహించిన వినోద కార్యక్రమం గందరగోళానికి దారి తీసింది. ఒక్కొక్కరి నుంచి రూ.1,500 టిక్కెట్టు ధరను వసూలు చేసిన నిర్వాహకులు తమకు కనీస వసతులు కల్పించకపోవడంపై పర్యాటకులు ఆగ్రహం వ్యక్తం చేశారు. గత ఏడాదితో పోల్చిచూస్తే ఈసారి కొండపై రద్దీ తగ్గినట్లు స్థానికులు చెబుతున్నారు.



ఆంగ్ల సంవత్సరం.. అచ్చు తెలుగు సంతకం

చిత్రంలో కనిపిస్తున్న తెలుగు రాత ఎవరిదో కిందున్న పేరును చూస్తే తెలిసిపోతుంది కదూ..! మీరు అనుకుంటున్నది నిజమే. ఈ సందేశం జిల్లా పాలనాధికారి పీఎస్ ప్రద్యుమ్న స్వహస్తాలతో రాశారు. ఆంగ్ల నూతన సంవత్సరం సందర్భంగా పలువురికి ఇలా కాగితంపై తెలుగులో శుభాకాంక్షలు తెలుపుతూ రాసి వాట్సప్ చేశారు.

- న్యూస్‌టుడే, చిత్తూరు (జిల్లా సచివాలయం)

అధికారంలోకి రాగానే.. చేనేతను ఆదుకుంటా!

ప్రజాసంకల్పయాత్రలో ప్రతిపక్షనేత వైఎస్ జగన్మోహన్‌రెడ్డి

మదనపల్లె (పట్టణం), న్యూస్‌టుడే : రాష్ట్ర ప్రజల అండదండలతో వైకాపా అధికారంలోకి వస్తే చేనేత రంగాన్ని పూర్తి స్థాయిలో ఆదుకుంటానని ప్రతిపక్షనేత జగన్మోహన్ రెడ్డి పేర్కొన్నారు. మదనపల్లె నియోజకవర్గంలో సోమవారం ప్రజాసంకల్పయాత్ర సాగింది. మండలంలోని చిన్నతిప్పసముద్రం(సీటీఎం)లో స్థానిక ఎమ్మెల్యే డాక్టర్ దేశాయ్ తిప్పారెడ్డి అధ్యక్షతన చేనేత సదస్సు నిర్వహించారు. సదస్సులో జగన్మోహన్‌రెడ్డి మాట్లాడుతూ.. తెదేపా అధికారంలోకి రాకముందు చేనేతరంగం అభివృద్ధి కోసం ఇచ్చిన హామీల్లో ఒక్కటీ అమలు చేయలేదన్నారు. రాష్ట్రంలో జరుగుతున్న దారుణమైన పాలనతో ప్రజలు విసిగిపోయారన్నారు. నాలుగు కత్రలు, నాలుగు ఇస్త్రీపెట్టెలు ఇచ్చి బీసీలపై ఎంతో ప్రేమ ఉన్నట్లు చంద్రబాబు చెబుతున్నారని విమర్శించారు. వైఎస్ రాజశేఖర్‌రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు వారి సంక్షేమానికి ఎన్నో పథకాలను అమలు చేశారని కొనియాడారు. ప్రతి పేదవానికి కొత్తగా ఇంటిని మంజూరు చేయించి, ఆ ఇంటిని నిర్మించి ఇచ్చే బాధ్యతను ప్రభుత్వమే తీసుకుంటుందన్నారు. వైకాపా అధికారంలోకి వస్తే ఆరోగ్యశ్రీ ద్వారా దీర్ఘకాలిక వ్యాధులకు శస్త్ర చికిత్సలు చేయించుకోవడంతో పాటు, మూడు రాష్ట్రాల్లో ఏ కార్పొరేట్ ఆసపత్రిలోనైనా వైద్యం చేయించుకునే విధంగా చర్యలు తీసుకుంటానన్నారు. పాదయాత్ర తర్వాత బీసీ గర్జన ఏర్పాటు చేసి, ఇందులో బీసీ డిక్లరేషన్ ప్రకటిస్తామని చెప్పారు. సదస్సులో రాజంపేట ఎంపీ పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డి, రాయచోటి ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి, పుంగనూరు ఎమ్మెల్యే పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, భూమన కరుణాకర్‌రెడ్డి, వైకాపా రాష్ట్ర కార్యదర్శి షమీం అస్లాం తదితరులు పాల్గొన్నారు.



మదనపల్లె మండలం సీటీఎంలో జరిగిన చేనేత సదస్సులో మాట్లాడుతున్న ప్రతిపక్షనేత వైఎస్ జగన్మోహన్‌రెడ్డి

కోడెగిత్తల పౌరుషం-యువత సాహసం

పక్షం రోజుల ముందే పల్లెకు పండుగ శోభ

దామరకుప్పం(వెదురుకుప్పం), న్యూస్‌టుడే: నూతన సంవత్సరాదిని పురస్కరించుకుని మండల పరిధి దామరకుప్పంలో పశువుల(పరస) పందేరాలను గ్రామస్థులు వైభవంగా నిర్వహించారు. సంక్రాంతి పండుగలో భాగంగా మండలంలో పశువుల పరస నిర్వహించడం ఆనవాయితీ. ఈ క్రమంలో దామరకుప్పం గ్రామస్థులు పక్షం ముందే పరసను నిర్వహించడంతో పల్లెకు పండుగ శోభ వచ్చింది. గ్రామాన్ని రంగు కాగితాలతో అలంకరించారు. కోడెగిత్తలు, ఎద్దులు, ఆలమందలను అలంకరించి కొమ్ములకు బహుమతులను ఉంచి జనంలోకి వదిలారు. యువత వాటిని నిలువరించడానికి పోటీ పడ్డారు. దీన్ని తిలకించేందుకు చుట్టుపక్కల గ్రామాలనుంచి ప్రజలు అధిక సంఖ్యలో తరలివచ్చారు. గ్రామస్థులు భోజన వసతి కల్పించారు. పశువులు తిలకించడానికి వచ్చిన వారివైపు దూసుకురావడంతో సుమారు పది మందికిపైగా గాయ పడ్డారు.



దామరకుప్పం: జనవాహినిలో నుంచి వస్తున్న కోడెగిత్త

వేపకుప్పంలో ఎద్దుల పరుష

వేపకుప్పం(రామచంద్రాపురం), న్యూస్‌టుడే: తొందరపడి ఓ కోయిల ముందే కూసిందన్నట్లు మండలంలోని వేపకుప్పంలో సంక్రాంతి ముందే వచ్చింది! అప్పుడు నిర్వహించాల్సిన పశువుల పందేలు వేపకుప్పం గ్రామస్థులు జనవరి మొదటి రోజునే సోమవారం జరిపారు. పశువుల పండుగను చూడటానికి, ఎద్దులను నిలువరించటానికి యువకులు పెద్ద సంఖ్యలో పోటీ పడ్డారు. పశువుల పందేల కోసం గ్రామంలో వెదురు తడికల దొడ్లను ఏర్పాటు చేశారు. నడివీధిలో మెత్తటి మన్ను పోశారు. పలువురు పశువుల పెంపకందారులు తమ ఎద్దులను దొడ్లలోకి తీసుకొచ్చారు. గ్రామంలోని యువకులు పశువుల కొమ్ములకు కట్టడానికి చెక్కపలకలను తయారుచేసి వాటిని అలంకరించారు. వాటిని దొడ్లలోని పశువుల కొమ్ములకు దారాలతో కట్టి పందేలకు సిద్ధం చేశారు. కొన్ని చురుకైన పశువులకు చెక్కపలకలతో పాటు నూతన వస్త్రాలు, ప్రోత్సాహకంగా కొంత నగదును కట్టారు. కోడెద్దులను చెక్కపలకలతో పాటు, వెదురుపుల్లలతో అలంకరించి గాలిబెలూన్లు కట్టారు. గ్రామ యువత పశువులకు ముందు దారి చూపుతూ పరిగెత్తుతూ డప్పుల చప్పుళ్లతో వాటిని బెదిరించారు. పశువులు దూసుకెళ్లగా యువకులు వేగంగా వస్తున్న ఎద్దులను నిలువరించటానికి పోటీ పడ్డారు. పశువుల పండుగ చూసేందుకు వచ్చిన ప్రజలకు గ్రామస్థులు అన్నదానం నిర్వహించారు.



వేపకుప్పంలో పశువులను తరుముతున్న జనం



దామరకుప్పం: కోడెగిత్తను పట్టుకోడానికి ప్రయత్నిస్తున్న యువత

చంద్రగిరి

అనాథలను ఆదరించాలి

సి.రామాపురం (రామచంద్రాపురం), న్యూస్‌టుడే: అనాథ పిల్లలను దాతలు ఆదరించాలి. వారికి మనమంతా ఉన్నామనే ధైర్యాన్నివ్వాలని దాత నంద్యాల బాలాజీ పిలుపునిచ్చారు. సోమవారం ఆంగ్ల సంవత్సర ప్రారంభాన్ని పురస్కరించుకుని సి.రామాపురంలోని అక్షయ క్షేత్రంలోని 180 మంది పిల్లలకు ఆయన అన్నదానం నిర్వహించారు.

అమ్మవారిసేవలో ఈనాడు

తిరుచానూరు;**ఉదయం:**4.00-4.30: సుప్రభాతం;4.30-5.00: ధనుర్మాసం గంట;5.00-6.00: ధనుర్మాస దర్శనం;6.00-6.30: సహస్రనామార్చన;6.30-7.00: నిత్యార్చన;7.00-8.00: మొదటి గంట, నైవేద్యం;10.30-12.00: కల్యాణోత్సవం;10.00-6.00: సర్వదర్శనం;6.00-7.00: రాత్రి గంట, నైవేద్యం;6.00-7.00: ఊంజల్ సేవ;7.00-8.45: సర్వదర్శనం;9.00: ఏకాంతసేవ. **-న్యూస్‌టుడే, తిరుచానూరు**

నేటి నుంచి 'జన్మభూమి-మన ఊరు'

చంద్రగిరి, న్యూస్‌టుడే: ప్రభుత్వం నేటి నుంచి 11వ తేదీ వరకు ప్రతిష్ఠాత్మకంగా జన్మభూమి-మాఊరు గ్రామసభలు నిర్వహించడానికి ప్రభుత్వం చర్యలు చేపట్టిందని ఎంపీడీవో డాక్టర్ వెంకటనారాయణ అన్నారు. పనపాకం, కల్‌రోడ్డుపల్లి, కాశిపెంట్ల గ్రామపంచాయతీల్లో గ్రామ పంచాయతీ సర్పంచుల అధ్యక్షతన మంగళవారం గ్రామసభలు నిర్వహిస్తామన్నారు.

రామచంద్రాపురంలో...

రామచంద్రాపురం, న్యూస్‌టుడే: మండలంలో అయిదో విడత 'జన్మభూమి-మన ఊరు' కార్యక్రమం నేటి నుంచి ఈ నెల 11వ తేది వరకు మండలంలోని 23 పంచాయతీల్లో జరగనున్నట్లు ఎంపీడీవో వెంకటేశులు సోమవారం తెలిపారు. మంగళవారం రావిళ్లవారిపల్లి, కమ్మపల్లి, సొరకాయలపాళ్యం పంచాయతీల్లో నిర్వహించనున్నట్లు వివరించారు.

పాకాలలో...

పాకాల, న్యూస్‌టుడే: జన్మభూమి-మాఊరు గ్రామసభలను మంగళవారం నుంచి నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో షణ్ముగం తెలిపారు. ఉదయం 9 గంటలకు గాదంకి ఉన్నత పాఠశాలలో, 11 గంటలకు నేంద్రగుంట అంగన్‌వాడీ కేంద్రంలో, మధ్యాహ్నం 2 గంటలకు ఆదెనపల్లి అంగన్‌వాడీ కేంద్రంలో, 3.30 గంటలకు శంఖంపల్లి ప్రాథమిక పాఠశాలలో గ్రామసభలు జరుగుతాయని వివరించారు. రాష్ట్ర మంత్రి అమరనాథరెడ్డి, జిల్లా పరిషత్తు ఛైర్‌పర్సన్ గీర్వాణి పాల్గొంటున్నట్లు సమాచార, పౌరసంబంధాల శాఖ అధికారులు తెలిపారు. ఉదయం నేంద్రగుంట శ్రీకల్యాణ వేంకటేశ్వరస్వామివారి ఆలయంలో పూజలు నిర్వహించిన అనంతరం గాదంకిలో జరిగే గ్రామసభలకు వారు హాజరవుతారని పేర్కొన్నారు.

ట్రస్టులకు రూ.12 లక్షల విరాళం

తిరుమల, న్యూస్‌టుడే: శ్రీవేంకటేశ్వర స్వామివారికి నగదు రూపంలో సోమవారం విరాళాలు వచ్చాయి. నిత్య అన్నప్రసాదం ట్రస్టు కింద రూ.లక్ష, బాలాజీ ఆరోగ్య వరప్రసాదిని ట్రస్టు కింద రూ.10 లక్షలు, ప్రాణదానం ట్రస్టుకు రూ.లక్ష వంతున మొత్తం రూ.12 లక్షల విరాళం సమకూరింది. ఆరుగురు భక్తులు ఈ విరాళం సమర్పించారు. తిరుమలలోని తితిదే దాతల విభాగంలో అధికారులను కలిసి డీడీలను సమర్పించారు. దాతలను తితిదే అధికారులు సత్కరించి శ్రీవారి తీర్థ ప్రసాదాలను అందచేశారు.



లబ్ధిదారులకు కానుకలు పంపిణీ చేస్తున్న తేదేపా నాయకులు

చంద్రన్న సంక్రాంతి కానుకలు పంపిణీ

భాకరాపేట, న్యూస్‌టుడే: సంక్రాంతి పండుగను పురస్కరించుకుని స్థానికంగా ఉన్న ముత్యాలమ్మ గుడివీధిలోని 23వ చౌకదుకాణంలో చంద్రన్న సంక్రాంతి కానుకలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా తెదేపా నాయకులు మాట్లాడుతూ పండుగ పూట ప్రజలందరూ సుఖ సంతోషాలతో ఉండాలనే ఉద్దేశంతో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు సంక్రాంతి కానుకలు అందిస్తున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యురాలు రమణమ్మ, గ్రామ కమిటీ అధ్యక్షుడు గంగయ్య, సుబ్రహ్మణ్యం, సేనాపతి, పురుషోత్తం, చెంగల్‌రాయులు తదితరులు పాల్గొన్నారు.


తుమ్మలగుంటలో...

తుమ్మలగుంట, (తిరుపతి గ్రామీణ), న్యూస్‌టుడే: పేదల కష్టం తెలిసిన నాయకుడు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడని తిరుపతి గ్రామీణ మండలం తుమ్మలగుంట గ్రామం తెదేపా అధ్యక్షుడు బి.భాస్కర్‌రెడ్డి అన్నారు. సోమవారం స్థానిక చౌకధరల దుకాణంలో 'చంద్రన్న సంక్రాంతి కానుకలు' పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యురాలు సరస్వతి, తెదేపా రైతు నాయకులు బిరుదాల కృష్ణారెడ్డి, ఎన్.సుధాకర్‌రెడ్డి, రేవంత్‌రెడ్డి, మధుసూదన్, చెంగల్‌రామానాయుడు తదితరులు పాల్గొన్నారు.

భక్తులతో పోటెత్తిన దేవాలయాలు



శ్రీశ్యామలాంబసమేత మల్లేశ్వరస్వామి



అలంకరణలో శంఖంపల్లి ఆంజనేయస్వామివారు



రామచంద్రాపురం: శ్రీ రాజరాజేశ్వరిదేవి



విశేష అలంకరణలో శ్రీవేంకటేశ్వర స్వామివారు



చిగురువాడ శివాలయంలో స్వామివారు

చంద్రగిరి, న్యూస్‌టుడే: ఆంగ్లసంవత్సరాది సందర్భంగా శ్రీనివాస మంగాపురంలోని శ్రీకల్యాణ వేంకటేశ్వరస్వామి వారి దేవాలయంతోపాటు ప్రధాన దేవాలయాలు సోమవారం భక్తులతో కిటకిటలాడాయి. శ్రీవారి మెట్టువద్ద పాదాలమండపం, చంద్రగిరిలోని శ్రీకోదండరామాలయంతోపాటు పలు దేవాలయాలు ఉదయం నుంచి సాయంత్రం వరకు భక్తులతో సందడిగా మారాయి. ఉదయం 3.30 నుంచి భక్తులకు కల్యాణ వేంకటేశ్వరస్వామివారి దర్శనం కల్పించారు. పట్టణంలోని శ్రీశ్యామలాంబసమేత మల్లేశ్వరాలయాన్ని పెద్ద సంఖ్యలో భక్తులు దర్శించుకున్నారు. తొండవాడ సమీపంలోని అగస్త్యేశ్వరాలయం, రాయలవారికోటలోని శ్రీఆంజనేయస్వామి ఆలయం, పట్టణంలోని శ్రీకోదండరామాలయం, శ్రీమూలస్థానమ్మ, షిర్డీసాయిబాబా దేవాలయాలు భక్తులతో పండుగ వాతావరణం సంతరించుకున్నాయి.

పాకాలలో...

పాకాల, న్యూస్‌టుడే: నేంద్రగుంటలోని శ్రీకల్యాణవేంకటేశ్వరాలయం, శంఖంపల్లిలోని ఆంజనేయస్వామి ఆలయాల్లో ఉదయం నుంచి ప్రత్యేక పూజలు నిర్వహించారు. పాకాలలోని సత్యమ్మగుడికి తెల్లవారుజాము నుంచి రాత్రి వరకు భక్తుల సందడి కొనసాగింది. గాంధీనగర్ శివాలయం, దామలచెరువులోని శ్రీ సీతారామాంజనేయస్వామిఆలయం, పత్తిపాటివారిపల్లివద్దగల శ్రీసప్తకన్యకల ఆలయం, మొరవపల్లిలోని ధనుమకొండ గంగమ్మగుడి వద్ద మహిళలు, పిల్లలు పూజలకు హాజరయ్యారు.



శ్రీనివాసమంగాపురంలోని శ్రీకల్యాణ వేంకటేశ్వరస్వామివారి దేవాలయం వద్ద బారులు తీరిన భక్తులు

రామచంద్రాపురంలో...

రామచంద్రాపురం, న్యూస్‌టుడే: మండలంలోని పారకాల్వ నవశక్తి పీఠం, రాయల చెరువు కట్ట సమీపంలోని భవానీ శంకర ఆలయం, రాయలచెరువు పేటలోని శ్రీరాధా రుక్మిణి సమేత వేణుగోపాల స్వామి ఆలయం, సూరావారిపల్లి ముత్యాలమ్మ, నెత్తకుప్పంలోని శ్రీ మూలస్థాన ఎల్లమ్మ ఆలయం, బ్రహ్మర్షి ఆశ్రమంలోని లక్ష్మీనారాయణ ఆలయం, కుప్పంబాదూరులోని బాదూరమ్మ, ఎన్ఆర్ కమ్మపల్లిలోని ద్రౌపది సమేత ధర్మరాజుల ఆలయాలు ఆంగ్ల నూతన సంవత్సరం సందర్భంగా సోమవారం భక్తజన సంద్రంగా మారాయి. వేకువనే అర్చకులు దేవతామూర్తులను అభిషేకించి, వివిధ రకాల పుష్పాలతో అలంకరించారు. దీప ధూప నైవేద్యాలు సమర్పించి భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు.

భాకరాపేటలో...

భాకరాపేట, న్యూస్‌టుడే: భాకరాపేటలోని ముత్యాలమ్మ ఆలయం, శ్రీ రాములవారి ఆలయం, చిన్నగొట్టిగల్లులోని తిరుపతి గంగమ్మ ఆలయం, రంగన్నగారిగడ్డలోని కొల్లాపురమ్మ ఆలయం, దేవరకొండ పంచాయతీలో వెలసిన శ్రీ వేంకటేశ్వర స్వామి వారిని సోమవారం భక్తులు పెద్దసంఖ్యలో దర్శించుకున్నారు. అనంతరం నిర్వాహకులు భక్తులకు ప్రసాదాలు పంపిణీ చేశారు.

తిరుపతి గ్రామీణంలో...

చిగురువాడ, (తిరుపతి గ్రామీణ), న్యూస్‌టుడే: చిగురువాడలోని పార్వతీ పరమేశ్వరాలయం, అంబేడ్కర్‌కాలనీలోని శివాలయం, గొల్లపల్లిలోని శివకోటి శివాలయం, దుర్గసముద్రంలోని వాల్మీకేశ్వరాలయం, అడపారెడ్డిపల్లిలోని శివగిరి శివాలయం, అవిలాలలోని శివాలయంలో భక్తుల రద్దీ నెలకొంది.

తలకోనలో...

ఎర్రావారిపాళెం, న్యూస్‌టుడే: మండలంలోని నెరబైలు పంచాయతీలోని సిద్ధేశ్వరస్వామి వారిని సోమవారం నూతన సంవత్సరాదిని పురస్కరించుకొని పలువురు ప్రముఖులు దర్శించుకున్నారు. ఎమ్మెల్యేలు చెవిరెడ్డి బాస్కర్‌రెడ్డి, పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి ప్రత్యేక పూజలు నిర్వహించారు. జిల్లా నలుమూలల నుంచీ అధిక సంఖ్యలో భక్తులు వచ్చారు. ఆలయంలో ప్రత్యేక క్యూలైన్లు ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ ధర్మకర్తల మండలి సభ్యులు శంకరనారాయణరెడ్డి, ఆలయ కార్యనిర్వహణాధికారి తిమ్మారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.



తలకోన సిద్ధేశ్వరస్వామి ఆలయంలో బారులు తీరిన భక్తులు

రాష్ట్రసంక్షేమాభివృద్ధి చంద్రన్నకే సాధ్యం

చంద్రగిరి, న్యూస్‌టుడే: రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు పాలనలో ఆంధ్రప్రదేశ్ అన్నిరంగాల్లో ప్రగతి సాధిస్తోందని మాజీ మంత్రి గల్లా అరుణకుమారి అన్నారు. దేశం గర్వించేలా అమరావతి నిర్మాణం జరుగుతోందని వివరించారు. ఆంగ్లసంవత్సరాది సందర్భంగా సోమవారం చంద్రగిరి నియోజకవర్గం నుంచి తెలుగు తమ్ముళ్లు కరకంబాడి తరలివెళ్లి మాజీ మంత్రి గల్లా అరుణకుమారి నివాసంలో పుష్పగుచ్ఛాలు అందించారు. ఈ సందర్భంగా తెదేపా మండల అధ్యక్షుడు పల్లినేని సుబ్రహ్మణ్యంనాయుడు గజపూలమాలతో ఆమెను సత్కరించారు. గల్లాయువసేన అధ్యక్షుడు సక్కూరి ధనంజయరెడ్డి ఆధ్వర్యంలో 2018 కాలమానపట్టిక ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యుడు గౌస్‌బాషా, ప్రధాన కార్యదర్శి గంగపల్లి భాస్కర్, సీనియర్ నాయకులు హేమాంబరధరరావు, గాలి సతీష్‌నాయుడు, గల్లా యువసేన అధ్యక్షుడు సక్కూరు ధనంజయరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మల్లంగుంట, (తిరుపతి గ్రామీణ), న్యూస్‌టుడే: నూతన సంవత్సరాదిని పురస్కరించుకుని తిరుపతి గ్రామీణ మండలంలోని తెదేపా నాయకులు చంద్రగిరి నియోజకవర్గ బాధ్యులు, మాజీమంత్రి గల్లా అరుణకుమారిని కలిసి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో మార్కెటింగ్ యార్డు డైరెక్టర్ మునికృష్ణారెడ్డి, ఉప సర్పంచి దిలీప్‌యాదవ్, నాగేశ్వర్‌రావు, మణి తదితరులు పాల్గొన్నారు.



చంద్రగిరి: జడ్పీ ఛైర్‌పర్సన్ గీర్వాణికి పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలుపుతున్న తెదేపా ప్రజాప్రతినిధులు



తిరుపతి గ్రామీణ: మాజీమంత్రి గల్లా అరుణకుమారికి పుష్పగుచ్ఛం అందిస్తు న్న తెదేపా నాయకులు



కాలమాన పట్టికను ఆవిష్కరిస్తున్న వీసీ హరిబాబు, అధికారులు

పశువైద్య విశ్వవిద్యాలయ కాలమానపట్టిక ఆవిష్కరణ

తిరుపతి(పశువైద్య విశ్వవిద్యాలయం), న్యూస్‌టుడే: తిరుపతిలోని శ్రీ వేంకటేశ్వర పశువైద్య విశ్వవిద్యాలయ కాలమానపట్టిక, డైరీని విశ్వవిద్యాలయ వీసీ వై.హరిబాబు సోమవారం ఆవిష్కరించారు. విశ్వవిద్యాలయ పరిపాలన భవనంలో నిర్వహించిన కార్యక్రమంలో వీసీ మాట్లాడుతూ ఆచార్య ఎన్జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం నుంచి పశువైద్య విశ్వవిద్యాలయం విడిపోయిన తరువాత ముద్రణకు సంబంధించి కొద్ది సమస్యలు ఉన్నాయని, వాటిని అధిగమించి నూతన సంవత్సరం ప్రారంభం రోజునే టేబుల్ కాలమానట్టిలు, సాధారణ కాలమానపట్టి, డైరీలను విడుదల చేయడం సంతోషంగా ఉందన్నారు. కార్యక్రమంలో విశ్వవిద్యాలయ అధికారులు, రిజిస్ట్రార్ డాక్టర్ శ్రీనివాసరావులు, ప్రజా సంబంధాల అధికారిణి త్రివేణి అధికారులు పాల్గొన్నారు.

హుండీ ఆదాయం రూ.2.75 కోట్లు

తిరుమల, న్యూస్‌టుడే: తిరుమల శ్రీవారి హుండీ ఆదాయం సోమవారం అధిక మొత్తంలో వచ్చింది. భక్తులు ఆదివారం సమర్పించిన కానుకలను లెక్కించగా రూ.2.75 కోట్ల ఆదాయం వచ్చినట్లు వివరాలు వెల్లడయ్యాయి. యాత్రికుల రద్దీ అత్యధికంగా ఉండడంతో హుండీ ఆదాయం మొత్తం ఎక్కువగా వచ్చింది.

చంద్రగిరి



అమ్మవారి ఆలయం ఎదుట ఎంపీ రాయపాటి సాంబశివరావు

హాకీలో చలాకీలు!

రజనీ స్ఫూర్తిగా రాణిస్తున్న విద్యార్థులు

భాకరాపేట, న్యూస్‌టుడే: భారత జాతీయ మహిళా హాకీ క్రీడాకారిణి రజనీ ఎంతోమందికి స్ఫూర్తిగా నిలుస్తున్నారు. చిన్నగొట్టిగల్లు మండలానికి చెందిన పలువురు విద్యార్థినులు ఆమె బాటలో నడిచే ప్రయత్నం చేస్తున్నారు. ముఖ్యంగా భాకరాపేటలోని విద్యార్థులు రాష్ట్రస్థాయి హాకీ పోటీల్లో పాల్గొని రాణిస్తున్నారు. చదువుతో పాటు జాతీయ క్రీడ హాకీలో వివిధ స్థాయిల్లో పాల్గొంటున్నారు. జిల్లా, రాష్ట్రస్థాయి పోటీల్లో విశేష ప్రతిభ కనబరుస్తున్నారు. భవిష్యత్తుపై ఆశలు రేకెత్తిస్తున్నారు.



అంతర్జాతీయ మహిళా హాకీ క్రీడాకారిణి రజనీతో హాకీ విద్యార్థినిలు

అంతర్జాతీయ స్థాయికి ఎదగడమే లక్ష్యం



మాది చిన్నగొట్టిగల్లు మండలం, భాకరాపేట గ్రామం. బీసీ కాలనీకి చెందిన ఆర్.రమేష్‌నాయుడు, ఆర్.సంధ్య మా అమ్మానాన్న. నెల్లూరులో జరిగిన రాష్ట్రస్థాయి అండర్ -14 పోటీల్లో పాల్గొన్నా. గ్రామీణం నుంచి ముఖ్యంగా మా ప్రాంతం నుంచి వచ్చి జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో హాకీలో విశేషంగా రాణిస్తున్న రజనీనే మాకు స్ఫూర్తి. నా తల్లితండ్రులు, ఉపాధ్యాయుల ప్రోత్సాహంతో అంతర్జాతీయ స్థాయిలో ఎదగడమే లక్ష్యంగా కృషి చేస్తున్నా. **-ఆర్.సాయినవ్య**

రజనీలా రాణిస్తా..



మాది చిన్నగొట్టిగల్లు మండలం, చిట్టేచర్ల పంచాయతీ, రెడ్డివారిపల్లి. కె.మునీంద్ర ప్రసాద్‌రెడ్డి, కె.ధనలక్ష్మీ మా తల్లిదండ్రులు. కర్నూలులో జరిగిన రాష్ట్రస్థాయి అండర్ -14 పోటీల్లో పాల్గొని పథకాలు సాధించారు. అంతర్జాతీయ హాకీ క్రీడాకారిణి రజనీ చూపిన మార్గంలోనే దేశానికి ప్రాతినిధ్యం వహించాలన్న కృతనిశ్చయంతో హాకీ క్రీడ ఎంచుకున్నా. అంతర్జాతీయ స్థాయికి ఎదిగి మా ఊరికి, జిల్లాకు పేరు తీసుకువస్తా. **-కె.లిఖిత**

అమ్మవారి సేవలో ఎంపీ రాయపాటి సాంబశివరావు

తిరుచానూరు, న్యూస్‌టుడే: తిరుచానూరు శ్రీపద్మావతీ అమ్మవారిని సోమవారం ఎంపీ రాయపాటి సాంబశివరావు దర్శించుకున్నారు. ఆయనకు ఆలయం వద్ద అధికారులు స్వాగతం పలికి ప్రత్యేక దర్శన ఏర్పాట్లు చేశారు. ఆలయంలో ఆయన అమ్మవారి కుంకుమార్చన సేవలో పాల్గొని పూజలు చేశారు. దర్శనానంతరం ఆయనకు ఆలయ అధికారులు అమ్మవారి ప్రసాదాలు అందించారు. ఆయన వెంట తిరుపతికి చెందిన పారిశ్రామికవేత్త అజయ్‌ప్రతాప్ ఉన్నారు.



నూతన సంవత్సర క్యాలెండర్లు ఆవిష్కరిస్తున్న సీఎం కేశవులు, దస్తావేజు లేఖర్లు

కాలమానపట్టిక ఆవిష్కరణ

చంద్రగిరి, న్యూస్‌టుడే: ఆంగ్లసంవత్సరాది సందర్భంగా ఎంపీటీసీ సభ్యుడు, శ్రీబాలాజీ అర్బన్‌జిల్లా దస్తావేజులేఖర్ల జేఏసీ అధ్యక్షుడు సీఎం కేశవులు 2018 కాలమాన పట్టిక ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన దస్తావేజులేఖర్లు, చంద్రగిరి పట్టణ ప్రజలకు నూతనసంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం ఆన్‌లైన్ విధానం అమలు చేయకుండా ఎప్పటిలాగే దస్తావేజు లేఖర్లు అందిస్తున్న సేవలను కొనసాగించాలన్నారు.

ఉద్యోగుల సమష్టి కృషితోనే ఎస్వీయూకు ఖ్యాతి

తిరుపతి(ఎస్వీ విశ్వవిద్యాలయం), న్యూస్‌టుడే: ఉద్యోగుల సమష్టి కృషితోనే శ్రీవేంకటేశ్వర విశ్వవిద్యాలయానికి అంతర్జాతీయ స్థాయి ఖ్యాతి లభిస్తోందని ఆ వర్సిటీ ఉపకులపతి ఆచార్య దామోదరం పేర్కొన్నారు. నూతన సంవత్సరం వేడుకల్లో భాగంగా పలువురు ఉద్యోగులు సోమవారం ఉన్నతాధికారులను కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా వీసీ మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సహకారం, ఉద్యోగుల అంకితభావంతో తాను వర్సిటీని సర్వతోముఖాభివృద్ధి దిశగా తీసుకెళ్లగలుగుతున్నానని పేర్కొన్నారు. ఇదే ఉత్సాహంతో వర్సిటీ అభివృద్ధికి పాటుపడి విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్తును అందజేద్దామని పిలుపునిచ్చారు. రెక్టార్ ఆచార్య భాస్కర్, రిజిస్ట్రార్ ఆచార్య దేవరాజులు మాట్లాడుతూ విద్యార్థులకు మౌలిక వసతులను కల్పించడంతో పాటుగా, ఉద్యోగుల సంక్షేమానికి నూతన సంవత్సరంలో పెద్దపీట వేస్తామని పేర్కొన్నారు. ఉన్నతాధికారులను కలిసిన వారిలో బోధన, బోధనేతర సిబ్బంది, పరిశోధక విద్యార్థులు, విద్యార్థులు తదితరులున్నారు.

అమరావతి నిర్మాణం చంద్రన్నకే సాధ్యం

చంద్రగిరి, న్యూస్‌టుడే: దేశవిదేశాలు గర్వించేలా చరిత్రపుటల్లో చిరస్థాయిగా నిలిచే విధంగా అమరావతి రాజధాని నిర్మాణం జరుగుతోంది. ఇది ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడికే సాధ్యమని చిత్తూరు ఎంపీ శివప్రసాద్ అన్నారు. ఆంగ్లసంవత్సరాది సందర్భంగా సోమవారం ఆయనకు చంద్రగిరి నియోజకవర్గం నుంచి తెదేపా ప్రజాప్రతినిధులు, నాయకులు పుష్పగుచ్ఛాలు, మిఠాయిలు అందించారు. అనంతరం దుశ్శాలువాలతో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా టీఎన్ఎస్ఎఫ్ జాతీయకార్యదర్శి రవినాయుడు మొక్కను అందించారు. ఈ కార్యక్రమంలతో తెదేపా మండల అధ్యక్షుడు సుబ్రహ్మణ్యంనాయుడు, ప్రధాన కార్యదర్శి గంగపల్లి భాస్కర్, జిల్లాసాంస్కృతిక విభాగం అధ్యక్షుడు పీఎస్ రామారావు, ఈశ్వర్ రెడ్డి, గౌస్‌బాషా తదితరులు పాల్గొన్నారు.



ఎంపీ శివప్రసాద్ దంపతులకు మొక్కను అందిస్తున్న టీఎన్ఎస్ఎఫ్ జాతీయకార్యదర్శి రవినాయుడు

తుమ్మలగుంట (తిరుపతి గ్రామీణ), న్యూస్‌టుడే: నూతన సంవత్సరం సందర్భంగా తుమ్మలగుంట గ్రామ కమిటీ అధ్యక్షుడు బి.భాస్కర్ రెడ్డి ఆధ్వర్యంలో తెదేపా నాయకులు చిత్తూరు ఎంపీ డాక్టర్ ఎన్.శివప్రసాద్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. సోమవారం ఉదయం ఆయనకు పుష్పగుచ్ఛం అందించి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో తెదేపా జిల్లా రైతు నాయకులు బిరుదాల కృష్ణారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

నేడు అర్ధగిరిలో పౌర్ణమి వేడుకలు

అర్ధగిరి (తవణంపల్లె), న్యూస్‌టుడే: అర్ధగిరి శ్రీవీరాంజనేయస్వామి ఆలయంలో మంగళవారం పౌర్ణమి వేడుకలను ఘనంగా నిర్వహించనున్నట్లు ఆలయ ఛైర్మన్ జెట్టిపల్లి శ్రీనివాసులు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. పౌర్ణమిని పురస్కరించుకుని స్వామి వారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేయనున్నారు. బంగారుపాళ్యం నుంచి భక్తులు అర్ధగిరిని చేరుకోవడానికి ఆర్టీసీ యాజమాన్యం ప్రత్యేక బస్సు సర్వీసులను నడుపుతోంది. అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చి స్వామి వారి సేవలో పాల్గొనాలని ఆలయ ఛైర్మన్ జెట్టిపల్లి శ్రీనివాసులు, ఇన్‌ఛార్జి ఈవో రామకృష్ణారెడ్డి కోరారు.



ఉరితాళ్లు చేతబట్టి నిరసన వ్యక్తం చేస్తున్న ఫార్మా-డి నిరుద్యోగులు

అందరికి జనవరి.. మాకేమో ఉరి

ఫార్మా-డి నిరుద్యోగుల వినూత్న నిరసన

తిరుపతి(వైద్యవిభాగం), న్యూస్‌టుడే: నూతన సంవత్సరం అందరి జీవితాల్లో వెలుగును తీసుకువస్తే నిరుద్యోగంతమను ఆత్మహత్య చేసుకోవాల్సిన పరిస్థితిని తీసుకువచ్చిందని ఫార్మా-డి నిరుద్యోగులు వాపోయారు. సోమవారం నగరపాలక సంస్థ కార్యాలయం వద్ద ఫార్మా-డి నిరుద్యోగులు ఉరితాళ్లు చేతబట్టి తమకు ప్రభుత్వం ఉద్యోగ అవకాశాలు కల్పించాలని లేనిపక్షంలో ఆత్మహత్యలు తప్పవని హెచ్చరించారు. ఈ సందర్భంగా డాక్టర్ ఆఫ్ ఫార్మశి రాష్ట్ర అధ్యక్షుడు పి.రాజశేఖర్ మాట్లాడుతూ.. గత కొన్ని రోజులుగా ఫార్మా-డి నిరుద్యోగులు రిలేనిరాహారదీక్షలతో తమ ఆవేదనను తెలిపినా ప్రభుత్వం పట్టించుకోక పోవడం దారుణమన్నారు. ప్రభుత్వం ఇప్పటికైనా స్పందించి ఉద్యోగ అవకాశాలు కల్పించాలని లేనిపక్షంలో ఆత్మహత్యలే శరణ్యమని అన్నారు. దీక్షలో ఫార్మా-డి నిరుద్యోగులు, వారి కుటుంబసభ్యులు పాల్గొన్నారు.



తిరుపతి

ప్రతాప్ - ఒక్కక్షణం
జయశ్యామ్- 2 కంట్రీస్
విఖ్యాత్- ఆక్సిజన్
బిగ్‌సినిమా- ప్రాజెక్టు జెడ్
వేల్‌రామ్స్- హలో
జగత్- - ఎమ్‌సీఏ
శ్రీనివాస- ఒక్కక్షణం
కృష్ణతేజ- ప్రాజెక్టు జెడ్
సంధ్య - ఎమ్‌సీఏ
సీవీఎస్- సప్తగిరి ఎల్ఎల్‌బీ
మినీప్రతాప్- టైగర్ జిందాహై
శ్రీనివాసతేజ- జ్యూమాంజి
పీజీఆర్- హలో
తేజ - సీత రామునికోసం
ఐ.ఎస్.మహల్- నెక్స్ట్ నువ్వే
పళని- వేళక్కారన్, సక్కా పోడు పోడు రాజా
సీఎస్ సినిమాస్(దేవేంద్ర)- జ్యూమాంజి

78 వేల మందికి దర్శనం

తిరుమల, న్యూస్‌టుడే: తిరుమల శ్రీవారిని 78 వేల మంది భక్తులు ఆదివారం దర్శించుకున్నారు. ఆరోజు తెల్లవారుజామున మూడు నుంచి అర్ధరాత్రి వరకు 78,478 మంది భక్తులు దర్శించుకున్నట్లు తితిదే తెలిపింది. సోమవారం తెల్లవారు జామున మూడు నుంచి సాయంత్రం 6 గంటల వరకు 69,096 మంది భక్తులు దర్శించుకున్నారు. సాయంత్రం 6 గంటల వరకు ప్రత్యేక ప్రవేశ దర్శనానికి భక్తులను అనుమతించారు. స్వామి సన్నిధిలో మహాలఘు దర్శనం అమలు చేశారు.

ఉద్యోగుల సమస్యలను పరిష్కరిస్తాం

తిరుపతి(తితిదే), న్యూస్‌టుడే: వైకుంఠ ఏకాదశి, ద్వాదశి దర్శన విషయంలో జరిగిన అవమానంపై తితిదే ఉద్యోగ సంఘాలు సోమవారం తితిదే ఈవో అనిల్‌కుమార్ సింఘాల్‌ను కలిశారు. ముందుగా పరిపాలనా భవనంలో సమావేశమైన నాయకులు మంగళవారం ఉదయం తితిదే పరిపాలనా భవనం ఎదుట ధర్నా చేయాలని నిర్ణయించుకున్నారు. భవిష్యత్తులో ఇలాంటివి పునరావృత్తం కాకుండా ఉండేలా తితిదే ఒక నిర్ణయానికి రావాలని తీర్మానించుకున్నారు. అనంతరం ఇదే విషయాన్ని ఈవో దృష్టికి తీసుకెళ్లగా ఉద్యోగుల మాట్లాడిన అనంతరం ఈవో తన అభిప్రాయాన్ని వివరించారు. జేఈవో సెలవుపై వెళ్తున్నారని, ఆయన వచ్చిన తరువాత పది రోజుల్లో చర్చించి ఉద్యోగుల సమస్యలను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. ఆయన హామీతో ధర్నాను పది రోజుల పాటు తాత్కాలిక వాయిదా వేస్తున్నట్లు ఉద్యోగ సంఘాల తెలిపారు. కార్యక్రమంలో నాయకులు నాగార్జున, వెంకటేశం, భాస్కర్, వెంకటరమణరెడ్డి, కల్పన, ఇందిర, శివ భాస్కర్‌రావు, శేషగిరి తదితరులు పాల్గొన్నారు.



ఈవోతో మాట్లాడుతున్న తితిదే ఉద్యోగులు

చిత్తూరు

బాధ్యతలు చేపట్టిన ఎస్సై విక్రమ్



నరహరిపేట (గుడిపాల), న్యూస్‌టుడే: గుడిపాల ఎస్సైగా ఎన్.విక్రమ్ సోమవారం ఉదయం పదకొండు గంటలకు పదవీ భాద్యతలు చేపట్టారు. నగిరి ఎస్సైగా పని చేస్తున్న ఆయన బదిలీపై ఇక్కడకు వచ్చారు. శాంతిభద్రతలు పరిరక్షణకు పెద్దపీఠ వేస్తామని ఆయన తెలిపారు. అలాగే శిరస్త్రాణాల ఉపయోగం, ప్రమాదాల నివారణకు ప్రత్యేక దృష్టి సారించనున్నట్లు వెల్లడించారు.



ఎంఈవో రామానాయక్‌ను సత్కరిస్తున్న దృశ్యం

ఎంఈవో రామానాయక్‌కు సన్మానం

గుడిపాల, న్యూస్‌టుడే: మండల పీఆర్‌టీయూ ఉపాధ్యాయుల సంఘం సోమవారం ఉదయం ఎంఈవో రామానాయక్‌ను దుశ్శాలువతో సన్మానించారు. నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలుపుతూ పీఆర్‌టీయూ శాఖ డైరీని అందజేశారు. ఈ కార్యక్రమంలో మండలశాఖ అధ్యక్షుడు డి.కుమార్, ప్రధానకార్యదర్శి సూర్యబాబు, గౌరవాధ్యక్షులు ఎన్.వెంకటేశులు పలువురు ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.



వ్యవసాయ సమాచార దర్శనిని ఆవిష్కరిస్తున్న జేడీ విజయకుమార్, తదితరులు

వ్యవసాయ సమాచార దర్శని ఆవిష్కరణ

చిత్తూరు (వ్యవసాయం), న్యూస్‌టుడే : నూతన సంవత్సరాదిని పురస్కరించుకుని జిల్లా వ్యవసాయ విస్తరణాధికారుల సంఘం రూపొందించిన సమాచార దర్శని-2018 దైనందిని ఆ శాఖ జిల్లా సంయుక్త సంచాలకులు విజయకుమార్ ఆవిష్కరించారు. సోమవారం జిల్లా వ్యవసాయ శాఖ కార్యాలయంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. జేడీ అధికారులు, సిబ్బందికి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో వ్యవసాయ శాఖను ప్రథమ స్థానానికి తీసుకెళ్లడానికి విస్తరణాధికారుల కృషి అభినందనీయమన్నారు. నూతన సంవత్సరంలో అన్నదాతలకు అందుబాటులో ఉంటూ మెరుగైన ఆధునిక సాగు విస్తరణ సేవలను అందించి అందరి మన్ననలను అందుకోవాలన్నారు. వ్యవసాయ శాఖకు మంచి పేరు తీసుకువచ్చేందుకు అందరూ కృషి చేయాలని ఆయన కోరారు. వ్యవసాయ శాఖ డీడీ రేణుకాదేవి, విస్తరణాధికారుల సంఘం జిల్లా అధ్యక్షుడు రాజేష్, కోశాధికారి ఖాధర్‌వల్లి, రాష్ట్ర ఉపాధ్యక్షుడు లక్ష్మీనారాయణ, జిల్లా ఉపాధ్యక్షుడు ఇంద్రసేనారెడ్డి, నాయకులు గోపికృష్ణ, జయంతి, నీలిమ, మురళీధర్, గుణశేఖర్, విస్తరణాధికారులు పాల్గొన్నారు.

జంగాలపల్లె శ్రీనివాసులుకు పురస్కారం

చిత్తూరు (సంతపేట), న్యూస్‌టుడే : చిత్తూరుకు చెందిన లలిత కళాసాగర్ సాంస్కృతిక సంస్థ వైకాపా చిత్తూరు పార్లమెంట్ ఇన్‌ఛార్జి జంగాలపల్లె శ్రీనివాసులుకు శ్రీకృష్ణదేవరాయలు రాష్ట్రీయ పురస్కారాన్ని ప్రదానం చేశారు. ఈ మేరకు ఆ సంస్థ వ్యవస్థాపకులు మర్రిపూడి దేవేంద్రరావు సోమవారం శ్రీనివాసులుకు కృష్ణదేవరాయలు పురస్కారాన్ని అందచేశారు. పురస్కారం తన బాధ్యతను మరింత పెంచిందని, నిరంతరం ప్రజాసేవకు అందుబాటులో ఉంటానని ఈ సందర్భంగా శ్రీనివాసులు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఉదయ్‌కుమార్, లక్ష్మీపతి, కోటేశ్వరమొదలియార్ తదితరులు పాల్గొన్నారు.



జంగాలపల్లె శ్రీనివాసులకు పురస్కారాన్ని అందిస్తున్న దృశ్యం



సమావేశంలో ప్రసంగిస్తున్న నగరపాలక కమిషనర్ బాలసుబ్రహ్మణ్యం



పాల్గొన్న ఉద్యోగులు

సమర్థంగా జన్మభూమి సభల నిర్వహణ

చిత్తూరు నగరం, న్యూస్‌టుడే: జన్మభూమి-మాఊరు డివిజన్ సభలను సమర్థంగా నిర్వహించాలని నగరపాలక కమిషనర్ బాలసుబ్రహ్మణ్యం ఆదేశించారు. స్థానిక నగరపాలక కార్యాలయంలో సోమవారం ఆయన జన్మభూమి సభల నిర్వహణకు నియమించిన హ్యాబిటేషన్ అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ మంగళవారం నుంచి ఈనెల 10వతేదీ వరకు నగరపాలక పరిధిలో జన్మభూమి సభలను నిర్వహించడానికి ప్రణాళిక సిద్ధం చేసినట్లు వెల్లడించారు. ఈ మేరకు సభల నిర్వహణకు డివిజన్ స్థాయిలో బృందాలను నియమించినట్లు వివరించారు. ప్రతి డివిజన్‌కు హ్యాబిటేషన్ అధికారి, సభ స్థలంలో ముందస్తు ఏర్పాట్లు చేయడానికి సిబ్బందిని కేటాయించామన్నారు. నిర్ణీత పనుల కోసం సంబంధిత సిబ్బంది కచ్చితంగా విధులకు హాజరు కావాలని సూచించారు. ప్రతి రోజు ఉదయం 9.00గంటలు, 11.00గంటలు, మధ్యాహ్నం 3గంటలకు మూడు ప్రాంతాల్లో సభలు జరుగుతాయని.. సభల నిర్వహణ అనంతరం ప్రజల నుంచి అందే అర్జీలను అంశాల వారీగా విభజించాలన్నారు. విధుల నిర్వహణలో నిర్లక్ష్యం ప్రదర్శిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.



సత్యప్రభకు శుభాకాంక్షలు తెలుపుతున్న మార్కెట్ కమిటీ ఛైర్మన్ మోహన్ తదితరులు

ప్రజాప్రతినిధులకు శుభాకాంక్షలు

చిత్తూరు (జిల్లా పంచాయతీ), న్యూస్‌టుడే : రాష్ట్ర శిశు, మహిళా, వృద్ధాప్య వికలాంగుల సంక్షేమ కమిటీ ఛైర్మన్, తెదేపా జాతీయ ఉపాధ్యక్షురాలు, ఎమ్మెల్యే సత్యప్రభకు పలువురు నేతలు, ప్రజా ప్రతినిధులు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. సోమవారం ఆమెను నివాసంలో కలిసి సత్కరించి, శుభాకాంక్షలు తెలిపారు. ఆమెను కలిసిన వారిలో చిత్తూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ ఛైర్మన్ మాపాక్షి మోహన్, తెదేపా బంగారుపాళ్యం మండల అధ్యక్షుడు ఎన్.పి.జయప్రకాష్ నాయుడు, కార్పొరేటర్ నళిని తిరుకుమరన్, బలిజ అభ్యుదయ సేవా సంఘం నాయకుడు రవినాయుడు, తెలుగు యువత జిల్లా ప్రధాన కార్యదర్శి రాజేష్, నగరపాలక సంస్థ కమిషనర్ బాలసుబ్రమణ్యం తదితరులున్నారు.

నేటి నుంచి జన్మభూమి సభలు

చిత్తూరు నగరం, న్యూస్‌టుడే: నగరపాలక సంస్థ పరిధిలో జన్మభూమి-మాఊరు సభలు మంగళవారం నుంచి ప్రారంభంకానున్నాయి. ఈ నెల 10వ తేదీ వరకు కొనసాగే ఈ సభలు ఎనిమిది రోజుల పాటు జరుగనున్నాయి. ఈ మేరకు నగరపాలక అధికారులు ఏర్పాట్లు పూర్తి చేశారు. ఎమ్మెల్యే, నగర మేయర్, కమిషనర్, కార్పొరేటర్లు సభలకు హాజరై ప్రజల నుంచి అర్జీలు స్వీకరించనున్నారు. గడచిన జన్మభూమిలో అందిన అర్జీలపై మంజూరు చేసిన రేషన్‌కార్డులు, పింఛన్లను లబ్ధిదారులకు అందజేయనున్నారు.

మధుసూదనరావుకు సన్మానం

కుప్పిగానిపల్లె (గుడిపాల), న్యూస్‌టుడే: జిల్లా వైకాపా యువజన సంఘం అధ్యక్షుడిగా ఎన్నికైన మధుసూదనరావును సోమవారం కుప్పిగానిపల్లె గ్రామస్థులు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా పార్టీ కార్యకర్తలు కేక్ కోసి ఆయనకు తినిపించి సంబరాలు చేసుకొన్నారు. మండల పార్టీ అధ్యక్షుడు ప్రసాద్‌రెడ్డి, నాయకులు శ్రీకాంత్‌రెడ్డి, శేఖర్, సుందరవరదయ్య, జయపాల్ పలువురు పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

పార్టీలకు అతీతంగా జన్మభూమి

చిత్తూరు (జిల్లా పంచాయతీ), న్యూస్‌టుడే : జన్మభూమి-మాఊరు కార్యక్రమాన్ని పార్టీలకు అతీతంగా ప్రజలందరూ భాగస్వాములై విజయవంతం చేయాలని తెదేపా నగర పార్టీ అధ్యక్షుడు మాపాక్షి మోహన్ సోమవారం ప్రకటనలో కోరారు. నేటి నుంచి ఈనెల 11వ తేదీ వరకూ 10 రోజులు పాటు, అధికారులు, ప్రజా ప్రతినిధులు కలిసి నగరంలోని 50 డివిజన్లలో జన్మభూమి కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. కొత్తగా మంజూరైన రేషన్ కార్డులు, పింఛన్లు, ఇంటి స్థలాలు పంపిణీ చేయనున్నట్లు వెల్లడించారు. ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమ పథకాలను క్షేత్ర స్థాయిలో అర్హులందరికీ అందించడమే లక్ష్యంగా ఈ కార్యక్రమాన్ని చేపట్టినట్లు తెలిపారు. ప్రభుత్వ ఫలాలు అందని అర్హులకు ఉంటే మంజూరు చేస్తామని స్పష్టం చేశారు. స్థానిక సమస్యల పరిష్కారంతో పాటు, మౌలిక వసతుల కల్పనకు జన్మభూమిని వినియోగించుకోవాలని ఆయన సూచించారు.

జన్మభూమికి తెదేపా బాధ్యుల నియామకం

చిత్తూరు (జిల్లా పంచాయతీ), న్యూస్‌టుడే : జన్మభూమి-మా ఊరు కార్యక్రమానికి ప్రతిపక్ష పార్టీ ఎమ్మెల్యేలున్న నియోజకవర్గాల్లో తెదేపా ప్రోటోకాల్ బాధ్యులను నియమించింది. జిల్లాలో నగరి నియోజకవర్గానికి ఎమ్మెల్సీ గాలి ముద్దుకృష్ణమనాయుడు, పూతలపట్టుకు ఎమ్మెల్సీ పోతుల సునీత, గంగాధర నెల్లూరుకు జిల్లా పరిషత్ అధ్యక్షురాలు గీర్వాణి, పుంగనూరుకు ఎమ్మెల్సీ గుండుమల్ల తిప్పేస్వామి, చంద్రగిరికి జి.నర్సింహయాదవ్ (తుడా ఛైర్మన్), పీలేరుకు గూడూరి ఎరిక్షన్ బాబు (లిడ్ క్యాప్ ఛైర్మన్), మదనపల్లి నియోజకవర్గానికి ఎమ్మెల్సీ బి.ఎన్.రాజసింహులును ఆపార్టీ అధిష్టానం నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది.

సంవత్సరాదికి అలయాల్లో సందడి

చిత్తూరు (సంతపేట), న్యూస్‌టుడే : నగరంలో సోమవారం నూతన సంవత్సర వేడుకలు ఘనంగా జరిగాయి. ఆదివారం అర్ధరాత్రి నుంచి యువత సంబరాల్లో మునిగితేలారు. పాత ఏడాదికి వీడ్కోలు పలికి, కోటి ఆశలతో కొత్త సంవత్సరానికి స్వాగతం పలికారు. నగరంలోని చర్చివీధి, బజారువీధి, సంతపేట, గిరింపేట, కొంగారెడ్డిపల్లె, కట్టమంచి, గంగనపల్లె, రాంనగర్‌కాలనీ తదితర ప్రాంతాల్లో యువత కేక్ కోసి సంబరాలు చేసుకున్నారు. కొత్త సంవత్సరాదికి నగరంలో దేవాదాయశాఖ పరిధిలోని ఆలయాల్లో ఎటువంటి ప్రత్యేక ఏర్పాట్లు చేయలేదు. దైవదర్శనార్థం భక్తులు అధిక సంఖ్యలో రావడంతో రద్దీ కొనసాగింది. గిరింపేట దుర్గాంబ దేవాలయం, శ్రీవీరాంజనేయస్వామి దేవస్థానంతో పాటు, శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయాల్లో పెద్ద సంఖ్యలో భక్తులు దర్శించుకున్నారు. కట్టమంచిలోని షిర్డీ విశ్వసాయిబాబా మందిరంలో భక్తులకు సాయినాథుని పాదాభివందనం చేసే అవకాశాన్ని కల్పించారు. అలాగే నగరంలోని సీఎస్ఐ టౌన్ చర్చితోపాటు పలు మందిరాల్లో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. మతపెద్దలు నూతన సంవత్సర సందేశాన్ని వినిపించి, భక్తుల్ని ఆశీర్వదించారు. స్థానిక గిరింపేటలోని శ్రీ సత్యసాయి సేవా సమితి మందిరంలో ఉదయం ఓంకారం, సుప్రభాతం, నగర సంకీర్తన జరిగింది. ఈ కార్యక్రమంలో సమితి ప్రతినిధులు పాల్గొన్నారు.



సాయిబాబా విగ్రహానికి పాదాభివందనం చేస్తున్న సీకేబాబు



నగర సంకీర్తనంలో సత్యసాయి సేవా సమితి ప్రతినిధులు

రైతు అభ్యున్నతే హెరిటేజ్ లక్ష్యం

తాళంబేడు (చిత్తూరు గ్రామీణ), న్యూస్‌టుడే : రైతుల సంక్షేమమే లక్ష్యంగా హెరిటేజ్ సంస్థ పని చేస్తోందని ట్రస్టు సభ్యులు రామచంద్రనాయుడు తెలిపారు. మండలం తాళంబేడు క్రాస్‌లో హెరిటేజ్ ఫుడ్స్ ప్రైవేట్ లిమిటెడ్ సోమవారం పాడి రైతులకు పాల క్యాన్ల పంపిణీ చేసింది. ఆయన మాట్లాడుతూ హెరిటేజ్ సంక్షేమ ట్రస్టు ద్వారా పాడి రైతులకు బీమా పథకాన్ని అమలు చేస్తోందన్నారు. ట్రస్టు సభ్యులైన రైతులకు నామమాత్ర రుసుం ద్వారా రూ.2 లక్షల నుంచి రూ.50 వేల వరకు బీమా నగదుతో పాటు ఉచిత వైద్యసేవలు అందిస్తున్నట్లు చెప్పారు. రైతుల అభ్యున్నతికి హెరిటేజ్ ట్రస్టు ద్వారా ఉచిత వైద్యశిబిరాలు, పశుపోషణ సదస్సులు, ప్రోత్సహక బహుమతులు, గృహోపకరాణాలు అందజేస్తోందని తెలిపారు. రైతులందరూ హెరిటేజ్ సేవలను సద్వినియోగం చేసుకొని, మరింతగా ఆర్థిక ప్రగతి సాధించాలని కోరారు. కార్యక్రమంలో హెరిటేజ్ సంస్థ ప్రతినిధులు హరిప్రసాద్, పద్మనాభనాయుడు, పర్యవేక్షకులు సుబ్రహ్మణ్యం, శంకర్, రైతులు పాల్గొన్నారు.



పాల క్యాన్లను పంపిణీ చేస్తున్న హెరిటేజ్ ట్రస్టు సభ్యులు

సీకేబాబు నివాసంలో సంవత్సరాది వేడుకలు

చిత్తూరు (సంతపేట), న్యూస్‌టుడే : భాజపా నాయకులు మాజీ ఎమ్మెల్యే సీకేబాబు నివాసంలో సోమవారం నూతన సంవత్సర వేడుకల్ని ఘనంగా నిర్వహించారు. పలువురు కార్పొరేటర్లు, భాజపా శ్రేణులు ఆయన్ను కలసి పుష్పగుచ్ఛాల్ని అందచేసి శుభాకాంక్షల్ని తెలిపారు. అనంతరం కేక్‌ను కోసి అభిమానులకు పంచిపెట్టారు. ఈ కార్యక్రమంలో భాజపా నాయకులు సీకేలావణ్య, గోళ్ల హరిప్రసాద్‌చౌదరి, ఆంధ్రప్రదేశ్ ఓంశక్తి భక్తుల సంఘం అధ్యక్షుడు శంకర్‌బాబు, కార్పొరేటర్ గడ్డంరమణ, భాజపా మైనారిటీ మోర్చా నాయకులు గఫార్ ఖాన్ తదితరులు పాల్గొన్నారు.



సీకేబాబుతో ఓంశక్తి భక్తుల సంఘం ప్రతినిధులు

చిత్తూరు



దైనందినిని ఆవిష్కరిస్తున్న డీఎస్పీ గిరిధర్

సాధుశెట్టి దైనందిని ఆవిష్కరణ

చిత్తూరు (గ్రామీణ), న్యూస్‌టుడే : జిల్లా సాధుశెట్టి సంఘం దైనందిని స్థానిక కరియప్పమేస్త్రీ వీధిలోని ఆ సంఘం కార్యాలయంలో చిత్తూరు ఎర్రచందన విభాగం డీఎస్పీ గిరిధర్ సోమవారం ఆవిష్కరించారు. సాధుశెట్టి సంఘం రాష్ట్ర అధ్యక్షులు కోదండరాం మాట్లాడుతూ ఈ నెల ఏడో తేదిన తమిళనాడు రాష్ట్రం కాంచీపురం(కంచి)లో అఖిలభారత సాధుశెట్టి సమావేశం జరుగుతుందన్నారు. జిల్లాలోని సాధుశెట్టులందరూ ఈ సమావేశానికి హాజరై జయప్రదం చేయాలని ఆయన కోరారు. కార్యక్రమంలో సంఘం నాయకులు లోక, జయచంద్ర, కుప్పస్వామి, రాజా తదితరులు పాల్గొన్నారు.



ప్రతిజ్ఞ చేస్తున్న పోలీసు అధికారులు

చట్టబద్ధంగా విధులు నిర్వహిస్తాం..

చిత్తూరు నగరంలోని గాంధీ విగ్రహ కూడలిలో సోమవారం పోలీసు అధికారులు ప్రతిజ్ఞ చేశారు. జిల్లా ఎస్పీ రాజశేఖర్‌బాబుతో పాటు డీఎస్పీలు, సీఐలు, ఎస్సైలు, కానిస్టేబుళ్లందరూ కలసికట్టుగా ప్రమాణం చేశారు. పోలీసు శాఖలో పనిచేస్తున్న అందరం చట్టబద్ధంగా పనిచేస్తామని.. ఎలాంటి ఒత్తిడికి తలొగ్గమని.. నిజాయితీగా విధులు నిర్వహిస్తామన్నారు. ప్రజల మాన, ప్రాణాలను కాపాడుతామని.. అత్యాచారాలను నిరోధిస్తామని.. మహిళా నేరాలను పూర్తిగా తగ్గిస్తామని ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమంలో డీఎస్పీలు, సీఐలు, ఎస్సైలు, కానిస్టేబుళ్లు పాల్గొన్నారు.


- చిత్తూరు (నేరవార్తలు), న్యూస్‌టుడే



ఎంపీ శివప్రసాద్‌ను సత్కరించి, శుభాకాంక్షలు తెలుపుతున్న మండల తెదేపా నాయకులు

ఎమ్మెల్యే, ఎంపీలకు శుభాకాంక్షలు

చిత్తూరు (గ్రామీణ), న్యూస్‌టుడే : చిత్తూరు శాసనసభ్యురాలు సత్యప్రభ, ఎంపీ శివప్రసాద్‌లను సోమవారం సర్పంచుల సంఘం ఉపాధ్యక్షుడు మోహన్‌రాజ్, తెదేపా మండల నాయకులు మర్యాదపూర్వకం కలసి, పుష్పగుచ్ఛం, కాణిపాకం ప్రసాదాల్ని అందించి, ఆంగ్ల నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. ఎమ్మెల్యే సత్యప్రభ, ఎంపీ శివప్రసాద్‌లు తెదేపా పార్టీ పటిష్ఠతకు అందరూ సమన్వయంతో పని చేయాలని వారికి సూచించారు. పది రోజుల పాటు జరిగే జన్మభూమి-మా ఊరు గ్రామ సభల్లో పార్టీ శ్రేణులు భాగస్వామ్యమై, విజయవంతం చేయాలని చెప్పారు. కార్యక్రమంలో మండల నాయకులు శశికర్‌బాబు, కుమార్ తదితరులు పాల్గొన్నారు.



ఘన వ్యర్థ పదార్థాల నిర్వహణపై శిక్షణ

చిత్తూరు (జిల్లాపరిషత్), న్యూస్‌టుడే : గ్రామ పంచాయతీల్లో ఘన వ్యర్థ పదార్థాల నిర్వహణపై నిర్వహించే శిక్షణ కార్యక్రమానికి జిల్లా నుంచి 36మంది సభ్యులతో బృందం సోమవారం సాయంత్రం బయలుదేరి వెళ్లింది. తూర్పుగోదావరి జిల్లాలో చెత్తనుంచి సంపద తయారీ కార్యక్రమంలో మన జిల్లా బృందం నేడు, రేపు పాల్గొని శిక్షణ పొందనున్నారు. బృంద సభ్యులను తీసుకెళ్తున్న బస్సును జడ్పీ ఛైర్‌పర్సన్ గీర్వాణి జెండా ఊపి ప్రారంభించారు.

జిల్లా ప్రగతి పథంలో పరుగు



నూతన సంవత్సర కేక్‌ను కోస్తున్న జడ్పీ ఛైర్‌పర్సన్ గీర్వాణి, పక్కన జడ్పీ సీఈవో తుకారాం

చిత్తూరు (జిల్లాపరిషత్), న్యూస్‌టుడే : జిల్లాను అభివృద్ధి చేసి ప్రగతి పథం వైపు పరుగులు తీయడానికి ప్రతి ఒక్కరు సహాయ సహకారాలు అందించాలని జడ్పీ ఛైర్‌పర్సన్ గీర్వాణి కోరారు. ఆంగ్ల నూతన సంవత్సరాదిని పురస్కరించుకుని సోమవారం జడ్పీ కార్యాలయంలో ఛైర్‌పర్సన్ ఆధ్వర్యంలో కేక్‌ను కోసి అందరికీ పంచిపెట్టారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఛైర్‌పర్సన్‌గా బాధ్యతలు స్వీకరించిన తరువాత ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఆశీస్సులతో జిల్లాలను అన్ని విధాలుగా అభివృద్ధి చేయడానికి కృషి చేస్తున్నట్లు చెప్పారు. ప్రజాప్రతినిధులు, అధికారుల సహకారంతో ప్రగతి కార్యక్రమాలను దిగ్విజయంగా నిర్వహించడం ఆనందంగా ఉందన్నారు. నేటి నుంచి జరిగే జిల్లాలో నిర్వహించే జన్మభూమి గ్రామసభల్లో పాల్గొంటామని, ప్రజల నుంచి వచ్చే విజ్ఞాపనలను త్వరితగతిన పరిష్కరించే విధంగా అధికారులు, ప్రజాప్రతినిధుల సమన్వయంతో పనిచేయాల్సిన అవసరం ఉందని తెలిపారు. ఈ కార్యక్రమంలో జడ్పీ ఏవోలు వెంకటరత్నం, ప్రభాకరరెడ్డి, ఏపీ పంచాయతీరాజ్ మినిస్ట్రీరియల్ సంఘం జిల్లా అధ్యక్షుడు కనకరాజులు, జడ్పీ ఉద్యోగులు, జడ్పీటీసీ సభ్యులు, ఎంపీపీలు పాల్గొన్నారు.

పలువురు శుభాకాంక్షలు

నూతన సంవత్సరాదిని పురస్కరించుకుని జిల్లాపరిషత్ కార్యాలయంలో జడ్పీ ఛైర్‌పర్సన్ గీర్వాణిని పలువురు అధికారులు, ఎంపీపీలు, జడ్పీటీసీ సభ్యులు సన్మానించి పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. వీరిలో డీఈవో పాండురంగస్వామి, డీఎంహెచ్‌వో విజయగౌరి, డీసీహెచ్ సరళ, పీఆర్ ఈఈ నెథానియల్, పెనుమూరు ఎంపీపీ హరిబాబునాయుడు, పలువురు ఎంపీపీలు, జడ్పీటీసీ సభ్యులు, సర్పంచుల సంఘం జిల్లా అధ్యక్షుడు యధుశేఖరనాయుడు, అధికారులు, జడ్పీ ఉద్యోగులు, ఎంపీడీవోలు, సర్పంచులు, తెదేపా నాయకులు, కార్యకర్తలు, శుభాకాంక్షలు తెలిపిన వారిలో ఉన్నారు.



జడ్పీ ఛైర్‌పర్సన్‌కు శుభాకాంక్షలు అందజేస్తున్న డీఈవో పాండురంగస్వామి తదితరులు

ప్రజాసంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

చిత్తూరు (జిల్లాపరిషత్), న్యూస్‌టుడే : ప్రజల అభివృద్ధి ధ్యేయంగా తెదేపా ప్రభుత్వం పనిచేస్తోందని జడ్పీ ఛైర్‌పర్సన్ గీర్వాణి తెలిపారు. నూతన సంవత్సరాదిని పురస్కరించుకుని సోమవారం జడ్పీ ఆధ్వర్యంలో రూపొందించిన పంచాయతీరాజ్ శాఖ దైనందిని (డైరీ) ఆమె ఆవిష్కరించారు. ఆమె మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఆశయ సాధనకు అందరూ కష్టపడి పనిచేసి నవ్యాంధ్ర నిర్మాణంలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. పంచాయతీరాజ్ శాఖ మంత్రి నారా లోకేష్ ఆ శాఖను బలోపేతం చేయాలని కృతనిశ్చయంతో ఉన్నారని చెప్పారు. ఉద్యోగులకు అన్ని వివరాలు అందుబాటులో ఉండే విధంగా పంచాయతీరాజ్ శాఖ దైనందని రూపొందించడం హర్షనీయమన్నారు. ఈ కార్యక్రమంలో జడ్పీ సీఈవో తుకారాం, డిప్యూటీ సీఈవో రవికుమార్, ఏవోలు వెంకటరత్నం, ప్రభాకరరెడ్డి, ఏపీ పంచాయతీరాజ్ మినిస్ట్రీరియల్ ఉద్యోగుల సంఘం జిల్లా గౌరవాధ్యక్షుడు చంద్రప్రకాష్, అధ్యక్షుడు కనకరాజులనాయుడు, పంచాయతీరాజ్ ఈఈ నెథానియల్, అధికారులు, ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వాసుపత్రిలో.. ఘనంగా వేడుకలు

చిత్తూరు (నేరవార్తలు), న్యూస్‌టుడే : ప్రభుత్వాసుపత్రిలో సోమవారం నూతన సంవత్సరం వేడుకలు ఘనంగా జరిగాయి. జిల్లా ఆస్పత్రుల సేవల సమన్వయాధికారిణి సరళమ్మ, ఆస్పత్రి అధికారులు, సిబ్బంది కలసి కేక్ కోసి అందరికీ పంచిపెట్టి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. వైద్యాధికారులతో పాటు, కార్యాలయ అధికారులు, సిబ్బంది కొత్త సంవత్సరంలో నిరుపేదలకు సాయం చేయడమే లక్ష్యంగా పనిచేయాలన్నారు. వైద్యాధికారులు వైద్యసేవలు అందిస్తే.. కార్యాలయ అధికారులు రోగులకు అందాల్సిన పథకాలు, ఇతరత్రా సదుపాయాలను అందించాలని సూచించారు. ఆస్పత్రికి వచ్చే నిరుపేదలకు ఎక్కడా అసౌకర్యం, ఇబ్బందులు తలెత్తకుండా పనిచేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారులు, కార్యాలయ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

డీఈవోకి పలువురు శుభాకాంక్షలు

చిత్తూరు (విద్య), న్యూస్‌టుడే : ఆంగ్ల నూతన సంవత్సరాన్ని పురస్కరించుకుని ప్రభుత్వ, ప్రైవేటు కార్యాలయాల్లో సందడి నెలకుంది. సోమవారం సంబంధిత శాఖాధిపతులకు శుభాకాంక్షలను అధికారులకు ఉద్యోగులు తెలిపారు. తీపి పదార్థాలతో పాటు పుష్పగుచ్ఛాలను అందజేశారు. పరస్పరం శుభాకాంక్షలు తెలియజేసుకుని కొత్తఏడాది రోజున ఆనందంగా ఉంటే ఈ సంవత్సరమంతా సంతోషంగా ఉండవచ్చునని పలువురు పేర్కొన్నారు. జిల్లా విద్యాశాఖ కార్యాలయంలో డీఈవో పాండురంగస్వామికి కార్యాలయ ఉద్యోగులు, ఉప, మండల విద్యాశాఖాధికారుల్లో పలువురు, పలు ఉపాధ్యాయ సంఘాల నాయకులు, ఉపాధ్యాయులు కొత్త సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు.

జన్మభూమిని విజయవంతం చేయండి

చిత్తూరు (జిల్లాపరిషత్), న్యూస్‌టుడే : జన్మభూమి ఐదో విడత కార్యక్రమాన్ని పకడ్బందీగా నిర్వహించడానికి అధికారులు, ప్రజాప్రతినిధులు సహాయసహకారాలు అందించాలని జడ్పీ ఛైర్‌పర్సన్ గీర్వాణి అన్నారు. సోమవారం సాయంత్రం జడ్పీ కార్యాలయంలో ఆమె విలేకర్లతో మాట్లాడుతూ సర్పంచులు, వార్డు సభ్యులు, ఎంపీటీసీ సభ్యులు, జడ్పీటీసీ సభ్యులు, ఎంపీపీలు ఈ బృహత్తర కార్యక్రమంలో విధిగా పాల్గొనాలని కోరారు. జిల్లాలో మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు పాల్గొంటారని చెప్పారు. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు అమలు చేస్తున్న ప్రజాసంక్షేమ కార్యక్రమాలతో రాష్ట్రం అభివృద్ధి పథం వైపు పయనిస్తోందని, ఈ విషయాలను ప్రజలకు వివరించాలని సూచించారు. జనవరి రెండు నుంచి 11వరకు జరిగే ఈ కార్యక్రమాల్లో ప్రజలందరిని భాగస్వామ్యం చేయాల్సిన బాధ్యత ఎంపీడీవోలు, తహసీల్దార్లపై ఉందని పేర్కొన్నారు. క్షేత్రస్థాయిలో అదికారులు, ఉద్యోగులు, ప్రజాప్రతినిధులు ప్రజలతో మమేకమై వారి సమస్యలను తెలుసుకుని వాటిని పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. గ్రామాలను పరిశుభ్రంగా ఉంచాలని తెలిపారు. వీధి దీపాలు లేని చోట వెంటనే ఏర్పాటు చేయాలి ఆమె పేర్కొన్నారు.



కోళ్ల సమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడు సుందరనాయుడుకు శుభాకాంక్షలు తెలుపుతున్న రెవెన్యూ సంఘం నేతలు

రెవెన్యూ సంఘం నేతల శుభాకాంక్షలు..

చిత్తూరు (జిల్లా సచివాలయం), న్యూస్‌టుడే : నూతన ఆంగ్ల సంవత్సరాది పురస్కరించుకొని జిల్లా రెవెన్యూ సర్వీసు అసోషియేషన్ నేతలు పలువురు ప్రముఖులను కలసి శుభాకాంక్షలు తెలిపారు. జిల్లా సచివాలయంలో పాలనాధికారి పీఎస్ ప్రద్యుమ్న, ప్రధాన న్యాయమూర్తి దుర్గారావు, ఎస్పీ రాజశేఖర్‌బాబు, సంయుక్త పాలనాధికారులు పీఎస్ గిరీష, జేసీ-2 చంద్రమౌళి, కోళ్ల సమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడు సుందరనాయుడులను కలిసి పుష్పగుచ్ఛాలు అందించిన శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమాల్లో జిల్లా రెవెన్యూ సంఘం అధ్యక్షుడు విజయసింహారెడ్డి, రాష్ట్ర కార్యదర్శి నరసింహులు నాయుడు, వీఆర్వోల సంఘం అధ్యక్షుడు బాలాజీరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ప్రజలతో.. నూతన సంవత్సరం వేడుకలు

చిత్తూరు (నేరవార్తలు), న్యూస్‌టుడే : జిల్లా ఎస్పీ రాజశేఖర్‌బాబు సోమవారం ప్రజలతో కలసి నూతన సంవత్సర వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. ప్రభుత్వాసుపత్రిలో ప్రజల కోసం ఏర్పాటు చేసిన ఛారిటీవాల్‌లో తన సతీమణి మంజులతో కలసి 25 కేజీల కేక్‌ను కోశారు. స్థానిక ప్రజలు, ఆస్పత్రిలోని రోగులకు పంచి పెట్టి నూతన సంవత్సరం శుభాకాంక్షలు తెలిపారు. ఆహార పొట్లాలు, మహిళలకు చీరలను పంచిపెట్టారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ నిరుపేదలు, నిర్వాసితుల ఆకలి తీర్చడానికే ఛారిటీవాల్‌ను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. దీంతో పాటు వారికి దుస్తులను అందించడాని ఛారిటీవాల్‌ను ఏర్పాటు చేసి.. తమవంతు సేవ చేస్తున్నామన్నారు. ప్రజలందరూ స్వచ్ఛందంగా ముందుకు వస్తే.. పేదలకు సాయం చేసిన వారవుతారని గుర్తు చేశారు. మిగిలిపోయిన అన్నం, వాడని దుస్తులను ఛారిటీవాల్‌లో ఉంచితే అవి ఎందరికో ఉపయోగపడుతాయని తెలిపారు. అనంతరం అందరికీ నూతనసంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. పోలీసుల సేవలను చూసిన స్థానికులు అధికారులను ప్రశంసించారు. ఈ కార్యక్రమంలో డీఎస్పీలు, సీఐలు, ఎస్సైలు పాల్గొన్నారు.



దుస్తులను పంపిణీ చేస్తున్న ఎస్పీ రాజశేఖర్‌బాబు సతీమణి మంజుల

గంగాధర నెల్లూరు

మంచిమాట



పేదలకై పరితపించే హృదయం ఉన్నవాడినే మహాత్ముడు అని నేనంటాను. అది లోపిస్తే వాడు దురాత్ముడే.

-స్వామి వివేకానంద

మత్తులో వాహనాలు నడపరాదు

బలిజకండ్రిగ(పాలసముద్రం), న్యూస్‌టుడే: మత్తులో వాహనాలు నడపరాదని ఎస్సై జయప్ప వాహనదారులకు సూచించారు. సోమవారం నూతన సంవత్సర వేడుకల సందర్భంగా మండలంలోని బలిజకండ్రిగ కూడలి తితిదే కల్యాణ మండపం వద్ద వాహనాల రికార్డులను తనిఖీ చేశారు. ఆటోడ్రైవర్లు, వాహనచోదకులు ట్రాఫిక్ నియమాలు పాటించాలన్నారు.

అతివలు.. ఆదర్శం

☛ మగ్గాలపై చీరలు నేస్తున్న మహిళలు ☛ కుటుంబపోషణలో కీలకపాత్ర

గొడుగుమానుపల్లె (పెనుమూరు), న్యూస్‌టుడే: ఇంటి పనులే కాదు తాము కూడ ఆదాయార్జనలో పురుషులకు తీసిపోమని నిరూపిస్తున్నారు అతివలు. మగ్గాలపై పట్టు చీరలు తయారు చేయడం, నూలు ఒడుకుతూ ఆదాయాన్ని పొందుతూ చేతి వృత్తుల్లో రాణిస్తున్నారు. ఓ పక్క వంట పనులు చేసుకుంటూనే మరోపక్క చేనేత రంగంలో ప్రతిభ చూపుతున్నారు. కుటుంబానికి వంట లేకాదు మహిళలకు అందాన్ని ఇచ్చే పట్టుచీరలను సుందరంగా నేత నేస్తున్నారు. కొందరు మగ్గంపై చీరలను తయారు చేస్తుండగా మరికొందరు నూలును తయారు చేస్తూ ఆర్థికంగా ఎదుగుతున్నారు. కులవృత్తిని నమ్ముకుంటే భవిష్యత్తుకు ఇబ్బంది ఉండదనే నమ్మకంతో ముందుకు సాగుతున్నారు. నెలకు సుమారు ఏడు వేల నుంచి తొమ్మిది వేలు వరకు ఆదాయం గడిస్తూ కుటుంబ పోషణలో తమవంతు పాత్ర పోషిస్తున్నారు మండలంలోని పులికల్లు పంచాయతీ గొడుగుమానుపల్లె గ్రామానికి చెందిన మహిళ చేనేత కార్మికులపై ప్రత్యేక కథనం..

నూలు ఒడకడంలో చేయి తిరిగిన లక్ష్మి



గొడుగుమానుపల్లెకు చెందిన జి.లక్ష్మి నూలు ఒడకడంతో నిపుణురాలు. చేనేత కుటుంబం నుంచి వచ్చిన ఆమె ఈ రంగంలోనే రాణించి, పేదరికాన్ని జయిస్తోంది. భర్తకు తోడుగా పని నేర్చుకున్న ఆమె అన్నీ తానై కుటుంబ పోషణలో కీలకపాత్ర పోషిస్తోంది. ఇంటిలోనే నూలు ఒడికే రాట్నం సిద్ధం చేసుకుంది. ఇంటి పనులతో పాటు చేనేత రంగంలో రాణిస్తోంది. నూలు తయారుచేస్తూ నెలకు సుమారు రూ. 8 వేలు వరకు ఆదాయం పొందుతూ కుటుంబపోషణకు తనవంతు చేయూతనందిస్తోంది.

పట్టుచీర తయారీలో దిట్ట ధనలక్ష్మి




మగ్గంపై పట్టుచీర నేస్తున్న మహిళ ధనలక్ష్మి. చేనేత రంగంపై ఆసక్తి ఉన్న ఈ రంగంలో బాగా రాణిస్తోంది. ఇంటిపై భాగంలో చేనేత మగ్గాన్ని ఏర్పాటు చేసుకుంది. ఇతర ప్రాంతాల నుంచి పట్టు నూలు తీసుకు వచ్చి ఇంటి వద్దనే పట్టుచీరలను తయారు చేస్తోంది. పట్టు చీరలతో పాటు పురుషులకు అవసరమైన లుంగీలను మగ్గంపై తయారు చేస్తున్నారు. పట్టుచీరలు నేయడం ఆమెకు వెన్నతో పెట్టిన విద్యగా మారింది. ఇంటి పనులకు ఏమాత్రం ఇబ్బంది లేకుండా విడిగా మగ్గం ఏర్పాటు చేసుకుంది. భర్త ఒకపక్క మగ్గంపై నేస్తుంటే తాను మరోపక్క వేరు మగ్గంపై తయారు చేస్తోంది. ఇంటి పనులు చేస్తూనే మగ్గం పనుల్లో రాణించి అందరి మన్ననలు అందుకుంటోంది. కుటుంబ పోషణలో భర్తకు తోడుగా ధనలక్ష్మి తనవంతు సహకారం అందిస్తోంది

నూలు తయారీలో



చిన్న రాట్నంపై నూలు ఒడుకుతున్న మహిళ పేరు మునెమ్మ. వయస్సు మీదపడుతున్నా.. చేనేత పనుల్లో తనవంతు సాయం చేస్తోంది. ముడి సరుకును మగ్గంపై వాడేందుకు వీలుగా రాట్నం ద్వారా నూలు సిద్ధం చేయడంలో ఆమె దిట్ట. ఇంటి ముందు భాగంలోనే రాట్నం ఏర్పాటు చేసుకుని కుటుంబ సభ్యులకు వంటలు చేసుకుంటూ తన పనిలో రాణిస్తోంది. కుటుంబ పోషణలో తనవంతు సాయం అందిస్తోంది. నెలకు దాదాపు రూ.6 వేలు ఆదాయాన్ని అందుకుంటోంది.

చీరల తయారీలో దిట్ట..



మగ్గంపై పట్టుచీరను తయారు చేస్తున్న మహిళ పేరు సుమతి. గృహిణిగా ఇక్కడకు వచ్చిన ఆమె చేనేత రంగంపై మక్కువ పెంచుకుంది. కుటుంబపోషణలో భాగస్వాములు కావాలని నిర్ణయించుకున్న ఆమె భర్తకు తోడుగా మగ్గం పనులు చేయడం నేర్చుకుంది. ఇంటిపై భాగంలోనే మగ్గం ఏర్పాటు చేసుకుని పట్టుచీరలు తయారు చేస్తోంది. ఇంటి పనులతో పాటు మగ్గం పనులు చేస్తూ రాణిస్తోంది. తీరిక సమయంలో నూలు సిద్ధం చేసేందుకు తనవంతు సహకారం అందిస్తూ నెలకు సుమారు రూ.ఏడు వేలు ఆదాయం ఆర్జిస్తూ కుటుంబంలో కీలకంగా వ్యవహరిస్తోంది.

నూలు తయారీలో మేటి



ఇంట్లోనే రాట్నంపై నూలు తయారు చేస్తున్న మహిళ పేరు ఎ.నిర్మల. గృహిణిగా ఇంటిలో అడుగుపెట్టిన ఆమె భర్త ప్రోత్సాహంతో చేనేత రంగంలో రాణిస్తోంది. ఇంటి పనులు చేసుకుంటూనే నూలు ఒడుకుతూ ఆదాయాన్ని గడిస్తోంది. తమిళనాడు నుంచి తీసుకువచ్చిన ముడి నూలు నుంచి మగ్గంపై వాడేందుకు సిద్ధం చేస్తుంది. నేర్చుకున్న కులవృత్తిలో రాణిస్తూ పలువురికి ఆదర్శంగా నిలుస్తోంది. సొంత సంపాదనతో కుటుంబానికి అండగా నిలుస్తోంది. తీరిక సమయాల్లో మగ్గం పనులు చేస్తుంది. ఇలా నెలకు ఆదాయార్జనలో భర్తకు చేదోడువాదోడుగా నిలుస్తూ.. తనవంతు సహకారం అందిస్తోంది.



ఆలయంలో పూజలు నిర్వహిస్తున్న గ్రామస్థులు

ఆలయాల్లో నూతన సంవత్సర వేడుకలు

పాలసముద్రం, న్యూస్‌టుడే: నూతన సంవత్సరాన్ని పురస్కరించుకుని మండలంలోని ప్రజలు పలు ఆలయాల్లో ప్రత్యేక పూజలు, ప్రార్థనలు నిర్వహించారు. ఉదయం మండలంలోని క్రిష్ణజిమ్మాపురం పంచాయతీలోని శ్రీవలంపురి విఘ్నేశ్వర ఆలయంలో నూతన సంవత్సరాన్ని పురస్కరించుకుని అభిషేకాలు నిర్వహించారు. బలిజకండ్రిగ, పాలసముద్రం, శ్రీబొమ్మరాజుపురం, మఠవలం, ఆముదాల గ్రామాల్లోని ఆలయాల్లో భక్తులు పోటెత్తారు. ఈ పూజల్లో జడ్పీటీసీ సభ్యులు భీమనేని చిట్టిబాబునాయుడు, ఎంపీటీసీ సభ్యులు, అధికారులు, కొన్ని ఆలయాల్లో భక్తులకు అన్నదానం, తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు.

పెనుమూరు, న్యూస్‌టుడే: నూతన సంవత్సర వేడుకలను మండలంలో సోమవారం ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా మండలంలోని వివిధ ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. పెనుమూరులోని కోదండరామ స్వామి ఆలయంలో మూలవిరాట్టును విశేషంగా అలంకరించారు. అర్చనలు, ప్రత్యేక పూజలు చేశారు. శ్రీకాశీవిశాలాక్షి అమ్మవారి ఆలయంలో విశేష పూజలు నిర్వహించారు. కళాశాల ఆవరణలోని ఆంజనేయస్వామికి అభిషేకాలు, పూజలును చేశారు. రామలింగేశ్వరాలయం, కన్నికలకొండ సుబ్రమణ్యస్వామి ఆలయాల్లో విశేష పూజలు చేశారు. పెనుమూరులోని సాయిపదం మందిరంలో అర్ధరాత్రి వరకూ భజనలు చేసి కేకు కోసి భక్తులకు పంచిపెట్టారు.. ఏనుగు కొండయ్యపల్లె గ్రామంలోని శ్రీషిర్డిసాయిబాబా ఆలయాన్ని సుందరంగా ముస్తాబు చేశారు. నూతన ఏడాది సందర్భంగా స్వామివారికి విశేష పూజలను నిర్వహించారు. నూతన సంవత్సరాది సందర్భంగా చుట్టుపక్కల గ్రామాలకు చెందిన భక్తులు ఆలయాలకు వెళ్లి స్వామివార్లను దర్శించుకుని ప్రత్యేక పూజలు చేసుకున్నారు.

పథకాల విజయవంతానికి అధికారులు సహకరించాలి

పాలసముద్రం, న్యూస్‌టుడే: తెదేపా ప్రభుత్వం అమలు చేస్తున్న పలు సంక్షేమ పథకాల విజయవంతానికి అధికారుల సహకారం అవసరమని జడ్పీటీసీ సభ్యుడు భీమనేని చిట్టిబాబు నాయుడు పేర్కొన్నారు. సోమవారం నూతన సంవత్సర వేడుకల్లో భాగంగా ఎంపీడీవో రుక్మిణమ్మ, సిబ్బంది, జడ్పీటీసీ సభ్యులు చిట్టిబాబునాయుడు కేకును కోశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లడంలో మండల పరిషత్ శాఖ కృషి అభినందనీయమన్నారు. సంవత్సర కాలంగా సమస్యల పరిష్కారానికి కృషి చేసినట్లు ఈ నూతన సంవత్సరంలోనూ కృషిచేసి ప్రజల మన్ననలు పొందాలని ఆకాంక్షించారు. అనంతరం ఒకరి కొకరు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేసుకున్నారు. నేటి నుంచి ప్రారంభం కానున్న జన్మభూమి-మాఊరు కార్యక్రమం విజయవంతానికి కలిసికట్టుగా ముందుకు సాగుదామని తీర్మానించుకున్నారు. తహసీల్దారు మోహనవల్లి, పంచాయతీ కార్యదర్శి కుమార్, రమేష్ బాబుశరత్, రెవెన్యూశాఖ సిబ్బంది, అధికారులు పాల్గొన్నారు.



జడ్పీటీసీ సభ్యుడు భీమనేని చిట్టిబాబునాయుడిని అభినందిస్తున్న ఎంపీడీవో రుక్మిణమ్మ, అధికారులు

జన్మభూమి-మా ఊరును విజయవంతం చేయాలి

పెనుమూరు, న్యూస్‌టుడే: మండలంలో మంగళవారం నుంచి నిర్వహించే జన్మభూమి-మా ఊరు కార్యక్రమాన్ని విజయ వంతం చేయాలని ఎంపీపీ హరిబాబునాయుడు, జడ్పీటీసీ సభ్యులు రుద్రయ్యనాయుడు కోరారు. తొమ్మిది రోజుల పాటు నిర్వహించే ఈ కార్యక్రమంలో ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను ప్రజలకు వివరించనున్నట్లు తెలిపారు. అలాగే ప్రజల సమస్యలను తెలుసుకుని వాటి పరిష్కారానికి చర్యలు తీసుకునేందుకు గ్రామ సభలు వేదికలుగా నిలుస్తాయని పేర్కొన్నారు. ప్రతి పంచాయతీలో అధికారులు అందుబాటులో ఉండి ప్రజల సమస్యలను తెలుసుకోనున్నట్లు తెలిపారు. అధికారులు, ప్రజాప్రతినిధులు అందరూ ఇందులో భాగస్వాములు కావాలని కోరారు. ప్రజలు ఈ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

ఉపాధ్యాయుల కాలమాన పట్టికలు ఆవిష్కరణ

శ్రీరంగరాజపురం, న్యూస్‌టుడే: ఉపాధ్యాయ సంఘాలు యూటీఎఫ్, ఎస్టీయూ, ఏపీటీఎఫ్ కాలమాన పట్టికలను మండల విద్యాశాఖాధికారి అరుణాచలంరెడ్డి, ఉపాధ్యాయ సంఘాల నాయకులు సోమవారం ఆవిష్కరించారు. 2018 కాలమాన పట్టికలు ఆవిష్కరించి ఉపాధ్యాయులకు అందజేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఒకరికొకరు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేసున్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయ సంఘాల నాయకులు రాఘవులునాయుడు, వివేకానందపిళ్లై, పాపయ్య, శెల్వరాజ్, గిరి, పరదేశి, కోదండబాబు, మోహన్, సుదర్శన్, మునిక్రిష్ణయ్య, పులువురు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



కాలమాన పట్టికలను ఆవిష్కరిస్తున్న ఎంఈవో, ఉపాధ్యాయ సంఘాల నాయకులు

పులిగుండుపై పూజలు

గుంటిపల్లె(పెనుమూరు), న్యూస్‌టుడే: మండలంలోని గుంటిపల్లె పంచాయతీ పరిధిలో పర్యాటక ప్రాంతమైన పులిగుండు వద్ద నూతన సంవత్సర వేడుకల సందర్భంగా పర్యాటకులు అధిక సంఖ్యలో తరలి వచ్చారు. ఉదయం గుంటీశ్వరస్వామి ఆలయంలో వివిధ రకాల అభిషేకాలు నిర్వహించారు. నూతన సంవత్సర వేడుకల్లోనూ పాల్గొన్నారు. వేలాది మంది సందర్శకులు పులిగుండుపైకి ఎక్కారు. అక్కడ ఉన్న ఆలయాల్లో పూజలు నిర్వహించారు. యువతీ యువకులు పులిగుండుపైకి ఎక్కి నూతన సంవత్సర వేడుకలను ఉల్లాసంగా చేసుకున్నారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పాకాల సీఐ రామలింగమయ్య ఆధ్వర్యంలో ఎస్సై ఎ.ఛాన్‌బాషా సిబ్బందితో బందోబస్తు నిర్వహించారు. సందర్శకులకు ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా ఆలయ నిర్వాహకులు అన్ని చర్యలు తీసుకున్నారు.



పులిగుండుపైకి ఇనుప మెట్ల ద్వారా ఎక్కుతున్న సందర్శకులు

నేటి నుంచి జన్మభూమి-మా ఊరు

కార్వేటినగరం, న్యూస్‌టుడే: మండలంలో జన్మభూమి-మా ఊరు కార్యక్రమాన్ని మంగళవారం నుంచి నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో వెంకటరత్నమ్మ సోమవారం తెలిపారు. ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్న ఈ కార్యక్రమాన్ని జయప్రదం చేయడానికి అందరూ సహకరించాలన్నారు. ఈ కార్యక్రమంలో అధికారులు, ప్రజా ప్రతినిధులు తప్పనిసరిగా పాల్గొనాలని కోరారు. జన్మభూమిలో ప్రజా సమస్యల పరిష్కారానికి అధికారులు సంసిద్ధం కావాలన్నారు. ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను అర్హులైన పేదలందరికీ అందేలా చర్యలు తీసుకోవాలన్నారు.

గంగాధర నెల్లూరు

ఆలయంలో ప్రత్యేక పూజలు

కనకమ్మసత్రం(నింద్ర), న్యూస్‌టుడే: నూతన సంవత్సరాన్ని పురస్కరించుకుని విజయపురం మండల పరిధిలోని కనకమ్మసత్రంలోని శ్రీకలివేంకటేశ్వరస్వామి ఆలయంలో సోమవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం స్వామివారి ఉత్సవమూర్తికి పాలాభిషేకం, కుంకుమార్చన, కర్పూరహారతి, తీర్థప్రసాద పంపిణీ కార్యక్రమాలు నిర్వహించారు.



నిందితుడితో సహా స్వాధీనం చేసుకున్న ఎర్ర చందనం దుంగలు

ఎర్రచందనం స్వాధీనం

వెదురుకుప్పం, న్యూస్‌టుడే: వాహనాల తనిఖీలో భాగంగా అనుమానాస్పదంగాడి వెళుతున్న ద్విచక్రవాహనదారుడి నుంచి 30 కిలోల ఎర్రచందన దుంగలను స్వాధీనం చేసుకున్నట్లు స్థానిక పోలీసులు తెలిపారు. పోలీసుల కథనం మేరకు... సోమవారం తెల్లవారు జామున నిర్వహించిన నాకాబందీలో పచ్చికాపల్లం-తిరుపతి రహదారిపై స్థానిక ఎర్రగుంట మలుపు వద్ద వాహనాలను తనిఖీ చేసినట్లు తెలిపారు. ఈక్రమంలో తమిళనాడుకు చెందిన ద్విచక్రవాహనంపై గోనె సంచిలో 30 కిలోల బరువుగల ఎర్రచందనం దుంగలను ఓ వ్యక్తి అక్రమంగా తరలిస్తూ పట్టుబడినట్లు తెలిపారు. తదుపరి విచారణలో నిందితుడు తమిళనాడు రాష్ట్రం తిరువణ్ణామలై ప్రాంతానికి చెందిన కుప్పన్‌గా గుర్తించి కేసు నమోదు చేసి కోర్టులో హాజరుపరిచినట్లు తెలిపారు. ఎర్రచందనం దొంగలను అదుపులోకి తీసుకున్న సిబ్బందిని ఎస్సై రామకృష్ణ అభినందించారు.

దండుమారెమ్మ ఆలయంలో ప్రత్యేకాభిషేకం



చెర్లోపల్లె: విశేషాలంకారంలో భక్తులకు దర్శనమిస్తున్న దండుమారెమ్మ

గంగాధరనెల్లూరు, న్యూస్‌టుడే: మండలంలోని పెద్దకాల్వ పంచాయతీ చెర్లోపల్లెలో వెలసిన దండుమారెమ్మ, నాగాలమ్మ ఆలయాల్లో సోమవారం ప్రత్యేకాభిషేకాలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఉదయం భక్తులు సామూహికంగా ఆలయానికి చేరుకొని అమ్మవార్లకు ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేశారు. అనంతరం భక్తులు కుంకుమార్చనసేవ, సహస్రనామార్చనసేవలు నిర్వహించి మొక్కులు తీర్చుకున్నారు. ఉభయదారులు, ఆలయ నిర్వాహకులు కలసి భక్తులకు తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు.

కోలాహలంగా వేడుకలు

వెదురుకుప్పం, న్యూస్‌టుడే: నూతన సంవత్సరాదిని పురస్కరించుకుని సోమవారం మండలంలో నిర్వహించిన పలు కార్యక్రమాల్లో ప్రజలు కోలాహలంగా పాల్గొన్నారు. ఈ క్రమంలో ఆదివారం అర్ధరాత్రి నుంచే నూతన సంవత్సరాది వేడుకలను నిర్వహించారు. ఈ సందర్భంగా మండల పరిధిలోని కొమరగుంట శ్రీవేంకటేశ్వరుడి ఆలయం, డీఆర్‌యన్‌కండ్రిగ వద్ద వెలసిన శ్రీజ్ఞాన ప్రసూనాంబ సమేత కొండమల్లీశ్వరాలయం, టీకేయంపురంలోని సాయిబాబా ఆలయం తదితర ఆలయాల్లో జరిగిన ప్రత్యేక పూజల్లో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులు, గ్రామస్థులు పాల్గొన్నారు.



ప్రత్యేక అలంకరణలో దర్శనమిస్తున్న సాయిబాబా, శ్రీ కొండమల్లీశ్వరుడు

కిటకిటలాడిన ఆలయాలు



గంగాధరనెల్లూరు, న్యూస్‌టుడే: నూతన సంవత్సరాది సందర్భంగా సోమవారం మండలంలోని ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. ముఖ్యంగా జీడీ నెల్లూరు అల్లియల్లమ్మ, శివాలయం, సత్యమ్మ, మోతరంగనపల్లె ముత్యాలమ్మ, వేల్కూరు శివాలయం, ఆంజనేయస్వామి, ఓంశక్తి, ఎస్‌ఎస్ కొండ, కొట్రకోన, మహదేవమంగళం శివాలయాలు, ఎట్టేరి, ఎస్‌ఎస్ కొండ సుబ్రహ్మణ్యస్వామి ఆలయాలను నిర్వాహకులు ప్రత్యేకంగా అలంకరించారు. ఉదయం ప్రజలు సామూహికంగా ఆలయాలకు చేరుకొని ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ నిర్వాహకులు స్వామివార్లను, అమ్మవార్లను విశేషంగా అలంకరించి భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. భక్తుల కాలక్షేపానికి నిర్వాహకులు ఆలయ ఆవరణలో హరికథ, భక్తిగీతాలు వంటి పలురకాల సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. ఉభయ దారులు భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు.



వృద్ధాశ్రమంలోని వృద్ధులకు దుస్తులు పంపిణీ చేస్తున్న న్యాయవాది జానకీరాం

వృద్ధాశ్రమం అభివృద్ధికి చేయూత


కార్వేటినగరం, న్యూస్‌టుడే: వృద్ధాశ్రమం అభివృద్ధికి అందరూ తమవంతు చేయూత నందించాలని న్యాయవాది జానకీరాం కోరారు. స్థానిక గాంధీభవన్ వృద్ధాశ్రమంలో వృద్ధులకు దుస్తులను ఆయన సోమవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అవసాన దశలోఉన్న వృద్ధులను ఆదుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. వృద్ధాశ్రమం అభివృద్ధికి తనవంతు ఆర్థికసాయం అందజేస్తామన్నారు. అనంతరం వృద్ధులకు అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో న్యాయవాది దినకర్, వృద్ధాశ్రమం పర్యవేక్షకుడు ప్రకాష్, తదితరులు పాల్గొన్నారు.



జీడీ నెల్లూరు ఇండియన్ బ్యాంకులో మిఠాయిలు పంచుతున్న ఖాతాదారులు, రైతులు

ఘనంగా నూతన సంవత్సరాది వేడుకలు

గంగాధరనెల్లూరు, న్యూస్‌టుడే: మండలంలోని ప్రభుత్వ కార్యాలయాల్లో సోమవారం నూతన సంవత్సరాది వేడుకలను అధికారులు ఘనంగా నిర్వహించారు. కార్యాలయ ఆవరణలో ఉన్నతాధికారులు కేకుకోసి సిబ్బందికి, ప్రజలకు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ శ్రీకాంత్, తహసీల్దారు సుశీల, ఎంపీడీవో షైలా, సీడీపీవో పద్మసునంద, ఎస్సై రాజశేఖర్, ఏవో బిందుప్రియ, ఏపీవో కిరణ్, ఎంఈవో రాజేంద్రప్రసాద్, పంచాయతీరాజ్ డీఈ చంద్రశేఖర్‌రెడ్డి, ఏఈలు జయచంద్రారెడ్డి, వెంకటేశ్వరి, మునిరత్నం, గృహనిర్మాణశాఖ ఏఈ వెంకటరమణ, వెలుగు ఏపీఎం ఫరీద్‌మస్తాన్, వైద్యాధికారి బ్రహ్మాజీ, ఇండియన్ బ్యాంకు మేనేజరు ఉదయ్ కుమార్ పాల్గొన్నారు.



చిత్తూరు

రాఘవా: టైగర్ జిందా హై (హి)
విజయలక్ష్మి: జవాన్
గురునాథ: హలో
ఎం.ఎస్.ఆర్: ఎంసీఏ
చాణక్య: సప్తగిరి ఎల్‌ఎల్‌బీ
దేవి: జూలియట్ లవ్ ఆఫ్ ఇడియట్
ఆనందా: వెలైకారన్ (త)
వెంకటేశ్వర: సక్కాపోడు పోడు రాజా(త)

పెనుమూరు

రాధాకృష్ణ: ఎంసీఏ (మిడిల్‌క్లాస్ అబ్బాయిలు)

నీటి నిల్వతోనే భూగర్భ జలాల పరిరక్షణ

గంగాధరనెల్లూరు, న్యూస్‌టుడే: కురిసే ప్రతి వర్షపు నీటి బొట్టును నిల్వ చేసుకోవడంతోనే భూగర్భ జలాల పరిరక్షణ సాధ్యమవుతుందని ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ శ్రీకాంత్ అన్నారు. సోమవారం ఆయన మండలంలోని వింజం పంచాయతీలో చిత్తూరు ఎస్వీసెట్ ఇంజినీరింగ్ కళాశాల విద్యార్థులతో కలసి గ్రామీణ తాగునీటిపై నిర్వహించిన ప్రాజెక్టు పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇంటి, పొలాల్లో ఇంకుడు గుంతలు తవ్వుకోనందున వర్షపునీరు నిలవడంలేదన్నారు. ఫలితంగా భూగర్భ జలాల సమస్య ఎదురవుతున్నట్లు పేర్కొన్నారు. గ్రామీణ తాగునీటి సరఫరా ద్వారా ప్రతి ఇంటికి తాగునీటి కొళాయి వేస్తున్నట్లు తెలిపారు. ప్రజలు నీటిని వృథా చేయడంవల్ల రక్షిత మంచినీటి ట్యాంకులు, చేతిపంపుల వద్ద పారిశుద్ధ్యం అధ్వానంగా మారుతున్నట్లు ఆవేదన వ్యక్తం చేశారు. ప్రతికుటుంబం వ్యక్తిగత మరుగుదొడ్డి నిర్మించుకోవాలని ప్రజలకు సూచించారు. అనంతరం రక్షిత మంచినీటి ట్యాంకు నుంచి ప్రతి ఇంటికి తాగునీరు అందించే విధంగా చేపట్టాల్సిన పనులను సర్వే చేయించి ఇంజినీరింగ్ విద్యార్థులకు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో జియాలజిస్టు ఓబుల్‌రెడ్డి, సర్పంచి అనూరాధ, సహకార సంఘ డైరెక్టర్ బాలచంద్రారెడ్డి పాల్గొన్నారు.



స్థలాన్ని పరిశీలిస్తున్న ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ శ్రీకాంత్, ఎస్వీసెట్ ఇంజినీరింగ్ కళాశాల విద్యార్థులు

ఉపాధ్యాయులు అంకిత భావంతో పని చేయాలి



ఎంఈవో విజయకుమార్‌ను సన్మానిస్తున్న ఉపాధ్యాయ సంఘాలు

కార్వేటినగరం, న్యూస్‌టుడే: ఉపాధ్యాయులు అంకిత భావంతో పని చేయాలని ఎంఈవో విజయకుమార్ కోరారు. స్థానిక ఎమ్మార్సీ భవనంలో నూతన సంవత్సరాదిని పురస్కరించుకుని ఉపాధ్యాయ సంఘాల నాయకులు ఆయనను సోమవారం ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధ్యాయ సంఘాలు విద్యారంగ అభివృద్ధికి కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో యూటీఎఫ్ మండల అధ్యక్షుడు లక్ష్మణ్‌రెడ్డి, కార్యదర్శి వేణుగోపాల్, ఎస్టీయూ మండల అధ్యక్షుడు చంద్రశేఖర్, కార్యదర్శి వెంకటేష్, ఏపీటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి గోవిందయ్య, నాయకులు మధుసూదన్‌రెడ్డి, కృష్ణమందడి, హేమాద్రి, తదితరులు పాల్గొన్నారు.



పుల్లూరుక్రాస్‌లో కేకును పంచుతున్న యువకులు

ఆకట్టుకున్న ప్రదర్శనలు

పుల్లూరుక్రాస్(శ్రీరంగరాజపురం), న్యూస్‌టుడే: మండలంలో యువకులు నూతన సంవత్సరాది వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఆదివారం అర్ధరాత్రి నుంచి ఒకరికొకరు శుభాకాంక్షలు తెలియజేసుకున్నారు. కొత్తపల్లిమిట్ట దీపికా కల్యాణ మండలంలో బాలల నృత్య ప్రదర్శన ఆకట్టుకుంది. పుల్లూరు కుప్పమ్మ, పుల్లూరుక్రాస్‌లోని సాయిబాబా, ఆత్మలింగేశ్వరస్వామి, ఆరిమాకులపల్లిలో వెలసిన ఆరిమానుగంగమ్మ ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయాలు భక్తజన సంద్రంగా మారాయి. నిర్వాహకులు ఆలయాలకు వచ్చిన భక్తులకు తీర్థ ప్రసాదాలు అందించారు.

కుప్పం

నీట మునిగి యువకుడు గల్లంతు

ఉర్లఓబనపల్లె (కుప్పం గ్రామీణ), న్యూస్‌టుడే: మండల పరిధి ఉర్లఓబనపల్లె పంచాయతీ కూర్మానిపల్లె సమీప చెరువులో ఓ యువకుడు గల్లంతయ్యాడు. కూర్మానిపల్లె గ్రామానికి చెందిన సుబ్రహ్మణ్యం కుమారుడు గోవిందరాజులు (26) సోమవారం సాయంత్రం గ్రామ సమీపంలో ఉన్న చెరువులో పడిన గొర్రెపిల్లను కాపాడేందుకు నీటిలోకి దిగి ప్రమాదవశాత్తు మునిగిపోయాడని గ్రామస్థులు చెబుతున్నారు. సమాచారం అందుకున్న కుప్పం పోలీసులు చెరువును పరిశీలించారు. చెరువులో నీరు ఎక్కువగా ఉండటంతో మంగళవారం యువకుడి ఆచూకీ కోసం గాలించనున్నారు.

కర్ణాటక మద్యం సీసాలతో చిక్కిన గౌరన్‌తో ఎక్సైజ్ అధికారులు →



ప్రజల భాగస్వామ్యం ముఖ్యం

☛ పార్టీలకు అతీతంగా గ్రామసభలకు హాజరు కావాలి ☛ 'జన్మభూమి'పై శాసనమండలి సభ్యుడు శ్రీనివాసులు



జన్మభూమి ప్రచార కరదీపికలను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్సీ గౌనివారి శ్రీనివాసులు, నాయకులు

శాంతిపురం, న్యూస్‌టుడే: సమగ్ర అభివృద్ధి, సమస్యల సత్వర పరిష్కారం లక్ష్యంగా ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్న 'జన్మభూమి- మాఊరు' కార్యక్రమం ప్రజల భాగస్వామ్యంతోనే విజయవంతం కాగలదని శాసనమండలి సభ్యుడు గౌనివారి శ్రీనివాసులు పేర్కొన్నారు. మండల తెదేపా కార్యాలయంలో సోమవారం 'జన్మభూమి- మాఊరు' గ్రామసభల ప్రచార కరదీపికలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గ్రామసభలకు పార్టీలకు అతీతంగా పాలకులు, ప్రజలు హాజరు కావాలని కోరారు. క్షేత్రస్థాయిలో ప్రజల వ్యక్తిగత, సామాజిక సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకొచ్చి పరిష్కారానికి సహకరించాలని విజ్ఞప్తి చేశారు. జిల్లావ్యాప్తంగా పెద్దఎత్తున 'ఎన్టీఆర్ భరోసా' సామాజిక పింఛన్లు, రేషన్‌కార్డులను లబ్ధిదారులకు అందించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందన్నారు. దేశ, విదేశాల్లో స్థిరపడిన ఉద్యోగులు, వ్యాపారులు 'జన్మభూమి'కి వచ్చి స్థానికంగా అభివృద్ధిలో భాగస్వాములు కావాలని విజ్ఞప్తి చేశారు. గ్రామాలను దత్తత తీసుకొని అభివృద్ధికి తోడ్పాటును అందించాలని కోరారు. నియోజకవర్గంలో జరిగే జన్మభూమి కార్యక్రమానికి ముఖ్యమంత్రి హాజరు కానున్నారని తెలిపారు. ఈనెల 9, 10 తేదీల్లో జరిగే జన్మభూమి గ్రామసభల్లో ముఖ్యమంత్రి పాల్గొంటారని పేర్కొన్నారు. ఆయన పర్యటనను విజయవంతం చేయడానికి నాయకులు, కార్యకర్తలు కృషి చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో మండల తెదేపా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఇ.జనార్ధన్‌రెడ్డి, ఆర్.ఎస్.మణి, పీహెచ్‌సీ అభివృద్ధి కమిటీ ఛైర్మన్ ఉయ్యాల జయరామిరెడ్డి, రెస్కో మాజీ వైస్ ఛైర్మన్ డి.చలపతి, నాయకులు విజయ్‌కుమార్, నర్సరీ శేఖర్, నాగరాజు, రామకృష్ణప్ప, మంజునాథ్, మునివెంకట, ఉయ్యాల మునిరెడ్డి, సింగిరి శ్రీనివాసులు, ఆనందరెడ్డి, నర్శింహప్ప, మండల తెలుగు మహిళ అధ్యక్షురాలు సుగుణమ్మ తదితరులు పాల్గొన్నారు.

తొలిరోజు మూడు గ్రామాల్లో...

మండల పరిధిలో తొలి రోజున మంగళవారం సొన్నేగానిపల్లె, ఎంకేపురం, మఠం పంచాయతీల్లో గ్రామసభలు నిర్వహించనున్నట్లు ఎంపీపీ పుష్ప, వైస్ ఎంపీపీ ఉదయ్‌కుమార్, ఎంపీడీఓ సత్యనారాయణ తెలిపారు. ప్రజలు, పాలకులు, నాయకులు, అధికారులు పాల్గొని విజయవంతం చేయాలని వారు కోరారు.

రామకుప్పం: మండల పరిధిలో మంగళవారం నుంచి 'జన్మభూమి- మా ఊరు' గ్రామసభలు జరుగుతాయని ఎంపీపీ హేమలత, మండల తెదేపా అధ్యక్షుడు సి.ఆంజనేయరెడ్డి, జడ్పీటీసీ సభ్యుడు మునస్వామి, ఎంపీడీఓ శివప్రసాద్‌లు కోరారు. పది రోజుల పాటు 17 పంచాయతీల్లో జరిగే గ్రామసభలను విజయవంతం చేయాలని వారు కోరారు. మంగవారం పంద్యాలమడుగు, గొరివిమాకులపల్లె పంచాయతీ కేంద్రాల్లో జరిగే కార్యక్రమంలో పాలకులు, అధికారులు, ప్రజలు పాల్గొనాలని వారు విజ్ఞప్తి చేశారు.

'జన్మభూమి' బాధ్యుల నియామకం

కుప్పం, న్యూస్‌టుడే: మండల పరిధిలోని కమతమూరు, చందం, నూలుకుంట గ్రామాల్లో మంగళవారం ఉదయం 8.30 గంటలకే 'జన్మభూమి - మాఊరు' కార్యక్రమాలు ప్రారంభమవుతాయని ఎంపీపీ సాంబశివం, ఎంపీడీవో రామచంద్రులు చెప్పారు. మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం రెవెన్యూ, పంచాయతీ కార్యదర్శులను ఆయా గ్రామ పంచాయతీలకు బాధ్యులుగా నియమించామన్నారు. ఈ సందర్భంగా ఎంపీపీ సాంబశివం మాట్లాడుతూ వ్యక్తిగత మరుగుదొడ్లు నిర్మించుకోని వారి జాబితా సిద్ధం చేయాలన్నారు. చంద్రన్న బీమా, ఉపాధి హామీ పథకం ద్వారా శ్మశానాలు, చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాల నిర్మాణాల ప్రారంభానికి ఏర్పాట్లు చేయాలన్నారు. వివిధ సంక్షేమ పథకాలకు అర్హుల జాబితాను రూపొందించాలన్నారు. మండల పరిధిలో కొత్తగా 1800 రేషన్‌కార్డులు పంపిణీ చేస్తారని, అర్హులను గుర్తించాలన్నారు. కొత్తగా 500 మందికి పింఛన్లు పంపిణీ చేస్తారన్నారు. ఎన్టీఆర్ గృహాలకు అర్హులైన పేదలను ఎంపిక చేయాలని కోరారు. గ్రామ పంచాయతీల పరిధిలో సమాఖ్య ప్రతినిధులు, సీసీలు, సంఘమిత్రలు, సాధికార మిత్రలు, అంగన్‌వాడీ, జన్మభూమి కమిటీల సహకారం తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జడ్పీటీసీ సభ్యుడు రాజ్‌కుమార్, ఈవోపీఆర్డీ వెంకట్రమణ, తదితరులు పాల్గొన్నారు.

గ్రామసభల్లో రుణమాఫీపై అవగాహన

జన్మభూమి గ్రామసభల్లో రైతులకు మూడో విడత రుణమాఫీ, రైతు సాధికారతపై అవగాహన సదస్సులు నిర్వహించనున్నట్లు మండల వ్యవసాయాధికారి మహబూబ్ బాషా చెప్పారు. సోమవారం ఆయన 'న్యూస్‌టుడే'తో మాట్లాడుతూ రైతు సాధికారత సంస్థ కుప్పం నియోజకవర్గాన్ని పైలట్ ప్రాజెక్టులో భాగంగా ఎంపిక చేసిందన్నారు. ఇందులో భాగంగా 10 ఏళ్ల పాటు రైతులకు సేంద్రియ ఎరువుల వాడకం, వ్యవసాయ సాగుపై ఆయా గ్రామాల్లో శిక్షణ ఇస్తారన్నారు. ఇందుకు కుప్పం మండలం నుంచి 11 మంది సీఆర్‌పీలు, అయిదుగురు సీఏలను ఎంపిక చేసి సాధికారక సంస్థ ఆధ్వర్యంలో శ్రీకాకుళం, విశాఖపట్నం, తదితర ప్రాంతాల్లో శిక్షణ ఇస్తున్నట్లు చెప్పారు.



ఏర్పాట్లపై అవగాహన కల్పిస్తున్న ఎంపీపీ సాంబశివం, జడ్పీటీసీ సభ్యుడు రాజ్‌కుమార్

కర్ణాటక మద్యంతో చిక్కిన నిందితుడు

పెద్దబంగారునత్తం (కుప్పం గ్రామీణ), న్యూస్‌టుడే: కుప్పం - మల్లానూరు ప్రధానమార్గంలో ఓ వ్యక్తి కర్ణాటక మద్యం సీసాలను ద్విచక్ర వాహనంలో తరలిస్తూ సోమవారం సాయంత్రం ఎక్సైజ్ పోలీసులకు చిక్కాడు. ఎక్సైజ్ పోలీసుల కథనం మేరకు కుప్పం మండలం పెద్దబంగారునత్తం వద్ద వాహనాలు తనిఖీ చేస్తూండగా తమిళనాడు రాష్ట్రం వాణియంబాడి తాలూకా వెంకటేశపురం గ్రామానికి చెందిన గౌరన్ అనే వ్యక్తి కర్ణాటక నుంచి 52 టెట్రా మద్యం ప్యాకెట్లతో చిక్కినట్లు ఎక్సైజ్ అధికారులు తెలిపారు. ఈ కేసుకు సంబంధించి నిందితుడు గౌరన్‌తోపాటు ద్విచక్ర వాహనాన్ని స్వాధీనం చేసుకొని న్యాయస్థానంలో హాజరుపరిచినట్లు వారు తెలిపారు. ఈ దాడుల్లో ఎక్సైజ్ సీఐ చంద్రశేఖర్‌నాయుడు, ఎస్సైలు వీరాస్వామి, సూర్యప్రకాష్, సిబ్బంది పాల్గొన్నారు.



క్రికెట్ టోర్నీలో ఫైనల్‌కు చేరుకున్న శాంతిపురం జట్టు సభ్యులతో సీపీఎస్ సంఘం నాయకులు

తుదిపోరుకు శాంతిపురం జట్టు

కుప్పం గ్రామీణ, న్యూస్‌టుడే: కుప్పంలో గత నాలుగైదు వారాలుగా సెలవు రోజుల్లో సీపీఎస్ ఉద్యోగుల ఆధ్వర్యంలో క్రికెట్ టోర్నమెంట్‌ను నిర్వహిస్తున్నారు. ఈ క్రికెట్ పోటీలలో వివిధ ప్రాంతాలకు చెందిన ఉద్యోగులు పాల్గొని తమ సత్తాను ప్రదర్శించారు. మంగళవారం జరిగిన పోటీలలో రామకుప్పం రైడర్స్‌పై శాంతిపురం జట్టు గెలుపొంది ఫైనల్‌కు చేరింది. ఈనెల ఏడున ఆదివారం జరిగే ఫైనల్ పోటీలో మదనపల్లె, శాంతిపురం జట్లు తలపడనున్నట్లు సీపీఎస్ ఉద్యోగుల సంఘం అధ్యక్షులు వెంకటరమణ తెలిపారు. ఈ కార్యక్రమంలో టీఎన్‌యూఎస్ జిల్లా ఉపాధ్యక్షులు నాగేశ్వరరావు, కుప్పం డివిజన్ సీపీఎస్ నాయకులు సుబ్రహ్మణ్యం, మదన్ మోహన్, చిరంజీవి, బాలకృష్ణ, రాజ్‌కుమార్, జ్యోతికృష్ణ తదితరులు పాల్గొన్నారు.

కలుషితమవుతున్న పాలారు జలాలు



పాలారు నీటిలో పేరుకుపోయిన వ్యర్థాలు

శాంతిపురం, న్యూస్‌టుడే: శాంతిపురం మండల కేంద్రం సమీపంలోని పాలారు నదిలోని నీరు కలుషితమవుతోంది. దాదాపు పుష్కర కాలం అనంతరం వర్షాలకు పాలారు నది కళకళలాడుతూండగా స్థానికులు సంతోషం వ్యక్తం చేస్తున్న నేపథ్యంలో.. నదిలోని నీరు కలుషితం కావడం పట్ల ఆవేదన చెందుతున్నారు. మండల కేంద్రంలోని వ్యాపారులు దుకాణాల్లోని వ్యర్థాలతోపాటు చెత్తను నదిలో పడేస్తున్నారు. స్థానికంగా నివాసాల వద్ద సెప్టిక్ ట్యాంకుల పైపులను నదిలోకి ఏర్పాటు చేయడం వల్ల నదీ జలాలు మలినమవుతున్నాయి. నదిలో ఎక్కడ చూసినా వ్యర్థాలు నిలిచి కనిపిస్తున్నాయి. కపిలరామ్ ఒడ్డులో నీటి వసతి సమకూరితే ఏటా డిసెంబరు, జనవరి నెలల్లో అయ్యప్ప భక్తులు స్నానాలు చేసేవారు. అయితే ప్రస్తుతం నదికి సమీపంలోని మాంసపు దుకాణాల నుంచి వ్యర్థాలను నీటిలో పడేస్తున్నారు. దీని వల్ల కలుషితమైన నీటిలో స్నానాలకు భక్తులు సాహసించడం లేదు. ప్రతి ఆదివారం స్థానికంగా జరిగే వారపు సంతకు పశువులు వస్తుంటాయి. మూగజీవాల తాగునీటి వసతికి ఆధారంగా ఉన్న పాలారు జలాలు కలుషితం కావడంతో రైతులకు నీటి సమస్య ఎదురవుతోంది. స్థానిక పాలకులు, అధికారులు తక్షణం స్పందించి పాలారు జలాలను పరిరక్షించాలని స్థానికులు కోరుతున్నారు.



విద్యార్థులకు చలి దుస్తులు పంపిణీ చేస్తున్న వక్కలిగర సేవా సంఘం అధ్యక్షుడు ఎంఎల్.గోపాల్, తదితరులు

'బధిర విద్యార్థులకు అండగా ఉంటాం'

శెట్టిపల్లె (గుడుపల్లె), న్యూస్‌టుడే: ఏటా బధిర విద్యార్థులకు సహాయ, సహకారాలు, సేవలందించేందుకు కృషి చేస్తామని కుప్పం నియోజకవర్గం వక్కలిగర సేవా సంఘం అధ్యక్షుడు ఎం.ఎల్.గోపాల్ అన్నారు. శెట్టిపల్లె పంచాయతీ పరిధి బధిర పాఠశాలలో సోమవారం విద్యార్థులకు చలి దుస్తులు, భోజనం ప్లేట్లు, తాగునీటి గ్లాసులు, పెన్నులు, పుస్తకాలను సేవా సంఘం సభ్యులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా గోపాల్ మాట్లాడుతూ పేదరిక నిర్మూలనే లక్ష్యంగా కుప్పం నియోజకవర్గం వక్కలిగర సేవా సంఘం అవసరమైన సేవలు, కష్టంలో ఉన్న కుటుంబాలను ఆదుకునేందుకు నిరంతర కృషి చేస్తోందని చెప్పారు. అనంతరం ప్రాంతీయ ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతున్న వంద మందికి పాలు, రొట్టె, పండ్లను అందజేశారు. ఈ కార్యక్రమంలో సంఘం ప్రతినిధులు తులసికుమార్, హేమాంబరగౌడు, శీనప్ప, వెంకటాచలం, రవి, సుబ్బు, హరీష్, రామచంద్రగౌడు తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధిలో ఆదర్శం... బెగ్గిలిపల్లె

✳ వంద శాతం మరుగుదొడ్ల నిర్మాణం ✳ ప్రభుత్వ ప్రోత్సాహం ✳ నిధుల విడుదల



సిమెంటు రోడ్డుతో కొత్తశోభ

బెగ్గిలిపల్లె (గుడుపల్లె), న్యూస్‌టుడే: మండలంలోని బెగ్గిలిపల్లె పంచాయతీ కేంద్రం అభివృద్ధిలో ఆదర్శంగా నిలుస్తోంది. నాలుగేళ్ల కిందట వీధుల్లో నడవాలంటే ముక్కుమూసుకొని వెళ్లాల్సిన దుస్థితిలో ఉన్న గ్రామం నేడు చూడ చక్కనైన రీతిలో దర్శనమిస్తోంది. స్వచ్ఛభారత్ పథకం అమలుతో బహిరంగ మల మూత్ర విసర్జనలు కనుమరుగైపోయింది. వర్షాలు సమృద్ధిగా కురవడంతో తాగునీటి బెంగ తీరిపోయింది. గ్రామంలో 205 కుటుంబాలు వ్యవసాయం, పాడిపరిశ్రమ, కూలీపైనే జీవనం సాగిస్తున్నాయి. పలమనేరు- కుప్పం జాతీయ రహదారి నుంచి కిలోమీటరు దూరంలో ఉన్న బెగ్గిలిపల్లె గ్రామం వరకు తారు రోడ్డు, ఆపై గ్రామంలో ప్రతి వీధిలో సిమెంటు రోడ్డు నిర్మాణంతో పాటు మురుగు నీటి కాలువలు నిర్మించారు. గతేడాది స్వచ్ఛభారత్ పథకం కింద ప్రతి ఇంటా మరుగుదొడ్డి నిర్మించుకోవడంతో దాదాపుగా వంద శాతం పారిశుద్ధ్యం మెరుగుపడింది. గ్రామంలో ప్రతి వీధిలో ఎల్ఈడీ వీధి దీపాలను గ్రామ పంచాయతీ ఏర్పాటు చేసింది. జాతీయ గ్రామీణ ఉపాధి పథకం, స్థానిక పంచాయతీ నిధులతో గ్రామ సచివాలయం భవనం పనులు తుది మెరుగులు దిద్దుకుంటున్నాయి. నూతన సంవత్సరం జన్మభూమి- మాఊరు సందర్భంగా సచివాలయ భవనాన్ని ప్రారంభించనున్నారు. బహిరంగ మల మూత్ర విసర్జన నివారణకు ప్రతి ఇంటా మరుగుదొడ్డి నిర్మించడంతో ప్రభుత్వం ప్రోత్సాహకంగా గ్రామ పంచాయతీ అభివృద్ధికి రూ.75 వేలు మంజూరు చేసిందని సర్పంచి సుబ్రహ్మణ్యం తెలిపారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ప్రత్యేక శ్రద్ధతో ఎస్‌డీఎఫ్ నిధులతో గ్రామంలో పది వీధుల్లో సిమెంటు రోడ్లు మంజూరు చేశారన్నారు. గ్రామ పంచాయతీ నిధులతో మురుగు నీటి కాలువ పనులు పూర్తి చేశామని, నెల నెలా కాలువ పనులు, నీటి ట్యాంకును పరిశుభ్రం చేస్తున్నట్లు చెప్పారు. బోరు బావుల్లో పెరిగిన నీటిమట్టంతో నీటి బెంగ తీరిపోయిందన్నారు.



స్వచ్ఛభారత్‌లో నిర్మించిన మరుగుదొడ్డి (అంతర చిత్రం) సుబ్రహ్మణ్యం, సర్పంచి

మదనపల్లె

నేడు జన్మభూమి గ్రామసభలు

రామసముద్రం,న్యూస్‌టుడే: మండలంలోని నారిగానిపల్లె గ్రామపంచాయతీ కార్యాలయంలో మంగళవారం ఉదయం 10 గంటలకు జన్మభూమి-మాఊరు గ్రామసభను ప్రారంభించనున్నట్లు ఎంపీడీవో వెంకటసిద్ధయ్య తెలిపారు. అనంతరం మధ్యాహ్నం 2 గంటలకు పెద్దకురప్పల్లె గ్రామపంచాయతీ కార్యాలయంలో జన్మభూమి గ్రామసభ జరుగుతుందన్నారు. ఆయా గ్రామ పంచాయతీల పరిధిలోని ప్రజాప్రతినిధులు, గ్రామ పెద్దలు, రాజకీయపార్టీ నాయకులు, ప్రజలు పాల్గొని గ్రామసభలను విజయవంతం చేయాలని కోరారు.

ద్విచక్రవాహనం ఢీకొని వృద్ధుడి మృతి



మదనపల్లె (నేరవార్తలు), న్యూస్‌టుడే : ద్విచక్రవాహనం ఢీకొని వృద్ధుడు మృతి చెందిన సంఘటన మదనపల్లె గ్రామీణ మండలంలో ఆదివారం రాత్రి జరిగింది. పోలీసుల కథనం మేరకు.. వలసపల్లె పంచాయతీ కృష్ణాపురానికి చెందిన లాజర్ (65) వ్యవసాయం చేస్తాడు. ఆయన రాత్రి గ్రామంలో ఉన్న చిల్లర అంగడి వద్దకు వెళ్తుండగా.. మదనపల్లె నుంచి వలసపల్లె వైపు వెళ్తున్న ద్విచక్రవాహనం ఢీకొంది. ఈ ప్రమాదంలో ఆయనతో పాటు ద్విచక్రవాహనంలో ఉన్న వసంతకుమార్ (35), మంజునాథ్ (36) గాయపడ్డారు. గాయపడిన వారిని స్థానికులు మదనపల్లె ప్రాంతీయ వైద్యశాలకు తరలించారు. వీరిలో లాజర్ పరిస్థితి విషమంగా ఉండటంతో బెంగళూరుకు తరలిస్తుండగా.. మార్గమధ్యలోనే మృతి చెందాడు. రూరల్ ఎస్సై సునీల్‌కుమార్ కేసు విచారణ చేస్తున్నారు.



గ్రామీణ మండలం సీటీఎంలో జరిగిన ప్రజాసంకల్ప యాత్రలో పాల్గొన్న ప్రజలు

ప్రజాసంకల్ప యాత్ర విజయవంతం

మదనపల్లె (పట్టణం),న్యూస్‌టుడే : నియోజకవర్గంలో జరిగిన వైకాపా ప్రజా సంకల్పయాత్ర విజయవంతమైంది. స్థానిక ఎమ్మెల్యే దేశాయ్ తిప్పారెడ్డి గత కొద్ది రోజులుగా అందరు నాయకులతో, అన్ని వర్గాల ప్రజలతో సమావేశమై కార్యక్రమం విజయవంతం కావడానికి ప్రణాళికను తయారు చేశారు. సీటీఎంలోకి సంకల్పయాత్ర చేరుకోగానే ప్రజలు పెద్దఎత్తున హాజరయ్యారు. ఉదయం నుంచి సాయంత్రం 6 గంటల వరకు మదనపల్లె నియోజకవర్గంలో యాత్ర కొనసాగింది. మదనపల్లె ఎమ్మెల్యే డాక్టర్ దేశాయ్ తిప్పారెడ్డి పాదయాత్రలో పాల్గొని స్వల్ప అస్వస్థతలకు గురయ్యారు. దీంతో ఆయన కొంతసేపు సీటీఎం పాదయాత్ర నుంచి పక్కకు వెళ్లారు. సమస్యను ప్రతిపక్షనేత జగన్మోహన్‌రెడ్డికి చెప్పడంతో ఆయన విశ్రాంతి తీసుకోవాలని సూచించినట్లు తెలిసింది. తర్వాత జరిగిన చేనేత సదస్సులో ఎమ్మెల్యే యథావిధిగా హాజరయ్యారు.



శ్రీషిర్డీసాయి ఆలయం వద్ద వృద్ధులకు దుప్పట్లు పంచుతున్న ఆలయ కమిటీ సభ్యులు

వృద్ధులకు దుప్పట్లు పంపిణీ

తవళం(నిమ్మనపల్లె),న్యూస్‌టుడే: మండలంలోని తవళం శ్రీషిర్డీసాయి అలయం వద్ద కమిటీ సభ్యులు సోమవారం వృద్ధులకు దుప్పట్లు పంపిణీ చేశారు. ఆలయంలో నూతన సంవత్సరం సందర్భంగా ప్రత్యేక పూజలు జరిగాయి. అన్నదానం చేశారు. రాబోయే రోజుల్లో ఆలయం వద్ద పలు కార్యక్రమాలు చేపట్టనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు చంద్రశేఖర్, ప్రసన్న, రమణ, ఉమారాణి, సుజాత, రవి, పురుషోత్తం తెలిపారు.

మహిళ ఆత్మహత్యాయత్నం

మదనపల్లె (నేరవార్తలు), న్యూస్‌టుడే : కుటుంబ కలహాలతో మహిళ ఆత్మహత్యకు యత్నించిన సంఘటన తంబళ్లపల్లె మండలంలో ఆదివారం రాత్రి జరిగింది. పోలీసుల కథనం మేరకు.. మండలంలోని కోటకొండ గ్రామానికి చెందిన లలిత (35) కుటుంబ విషయమై భర్తతో గొడవపడి ఇంట్లోనే పురుగుల మందు తాగి ఆత్మహత్యకు యత్నించింది. కుటుంబ సభ్యులు ఆమెను మదనపల్లె ప్రాంతీయ వైద్యశాలకు తరలించారు.



మదనపల్లె గ్రామీణ మండలంలో నిర్మాణంలో ఉన్న హంద్రీనీవా కాలువ



పట్టు దారానికి రంగులు అద్దుతున్న చేనేత కార్మికులు



కళాశాలలో చదువుకుంటున్న విద్యార్థులు

కొత్తకొత్తగా ఉండాలని..కోటి ఆశలతో..!

మదనపల్లె (విద్యావిభాగం), రామసముద్రం, న్యూస్‌టుడే : కొత్త సంవత్సరం కొత్తగా ఉండాలని.. పాత జ్ఞాపకాలను మరిపించాలని.. అన్నివిధాలుగా..అందరికీ ఉపయోగకరంగా ఉండాలని మదనపల్లె నియోజకవర్గ ప్రజలు భావిస్తున్నారు.. ప్రజలు, ఉద్యోగులు, చేనేత కార్మికులు, రైతులు, యువత, మహిళలు కొత్త సంవత్సరంలో కొత్తదనం కోరుకుంటున్నారు..గత సంవత్సరం పడ్డ కష్టాలను గట్టెక్కించేలా కొత్త సంవత్సరం ఉండాలని ఆశిస్తున్నారు.

ధరల స్థిరీకరణ నిధి ఏర్పాటు

వ్యవసాయ రంగం ప్రస్తుతం ఇబ్బందుల్లో ఉంది. 2017 సంవత్సరంలో పంటల ధరలు హెచ్చుతగ్గులతో రైతులు అవస్థలు పడ్డారు. దీంతో ప్రభుత్వం ఈ ఏడాదైనా ధర స్థిరీకరణ నిధిని ఏర్పాటు చేయాలని రైతులు కోరుతున్నారు. టమోటా, బంగాళాదుంప, కొత్తిమీర పంటలు నష్టాలను మిగిల్చాయి. పంటలకు నష్టం వాటిల్లినప్పుడు, ధరలు పతనమైనప్పుడు ధరల స్థిరీకరణ నిధి నుంచి కొంత నగదు తీసి, రైతులకు గిట్టుబాటు ధర కల్పించేలా చూడాలని వారు కోరుతున్నారు. గత కొన్ని సంవత్సరాలుగా డార్క్ ఏరియా పేరుతో ప్రభుత్వం కొత్త మోటార్లకు విద్యుత్తు సరఫరా ఇవ్వడం లేదు. గతంలో వెయ్యి అడుగుల లోతులో ఉన్న భూగర్భ జలాలు ఇప్పుడు 300 నుంచి 200 మీటర్ల పైకి వచ్చాయి. జల వనరుల శాఖ అధికారులు నీటి పెరుగుదలను పరిశీలించి ప్రభుత్వానికి తెలియజేసి.. కొత్త కనెక్షన్లు ఇస్తే మరింత భూమి సాగులోకి రావడంతో పాటు చాలా మంది రైతులు వృద్ధి సాధిస్తారని రైతులు అంటున్నారు. అలాగే హంద్రీనీవా సుజల స్రవంతి పనులు పూర్తి చేసి రైతులకు నీరు అందేలా చూడాలని రైతులు కోరుతున్నారు.

చేనేత రంగంపై జీఎస్‌టీ రద్దు

చేనేత రంగం ఇప్పుడే ఇబ్బందుల్లో ఉంది. గోరుచుట్టుపై రోకటి పోటులా ప్రభుత్వం చేనేత రంగంపై జీఎస్‌టీ పెట్టింది. దీనివల్ల చాలా మంది నష్టపోతున్నారు. మదనపల్లె పట్టణంలో వేల మంది చేనేత రంగాన్ని నమ్ముకుని జీవనం సాగిస్తున్నారు. జీఎస్‌టీ కారణంగా చేనేత ముడి సరకులతో పాటు వస్త్రాలపై అదనపు పన్ను పడుతోంది. దీనివల్ల ఈ రంగంపై తీవ్ర ప్రభావం పడుతోంది. ఇప్పటికే చాలా మందికి పనులు లేక ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పుడు ఈ అదనపు పన్ను కారణంగా చాలా మంది వృత్తిని మానేసి వేరే రంగాలవైపు వెళ్తున్నారు. 2018 సంవత్సరంలో అయినా ప్రభుత్వం చేనేత రంగంపై జీఎస్‌టీని తొలగించాలని కార్మికులు కోరుతున్నారు. అలాగే ముడిసరకులో రాయితీ ఇవ్వడంతో పాటు చేనేత కార్మికులకు సకాలంలో రుణాలు అందేలా చూడాలని వారు కోరుతున్నారు.

☛ పోటీ పరీక్షలకు శిక్షణ కేంద్రాల ఏర్పాటు

విద్యారంగంలో మదనపల్లె పట్టణం తిరుపతి, చిత్తూరు పట్టణాలతో పోటీ పడుతోంది. అయితే జిల్లాకు చివరలో ఈ ప్రాంతం ఉండటం వల్ల విద్యారంగంపై అధికారులు చిన్నచూపు చూస్తున్నారని విద్యార్థులు అభిప్రాయపడుతున్నారు. పోటీ పరీక్షలకు శిక్షణ కోసం తిరుపతి, హైదరాబాదు వంటి ప్రాంతాలకు వెళ్లాల్సి వస్తోందని, మదనపల్లె పట్టణంలో ప్రభుత్వమే పోటీ పరీక్షలకు అవసరమైన శిక్షణ కార్యక్రమాలు నిర్వహిస్తే బాగుంటుందని విద్యార్థులు అంటున్నారు. పడమటి మండలాల్లో ఉన్న విద్యార్థులు ఉన్నత విద్య కోసం వేరే ప్రాంతాలకు వెళ్లాల్సిన పరిస్థితి ఇప్పుడుందని, అదే మదనపల్లెలో విశ్వవిద్యాలయం ఏర్పాటు చేస్తే అవసరమైన విద్య విద్యార్థులకు అందుతుందని వారు అంటున్నారు. వంద సంవత్సరాల క్రితమే మదనపల్లెలో విద్యావ్యాప్తికి ఎంతో మంది కృషి చేశారని, ఈ ఏడాది అయిన ప్రస్తుత ప్రభుత్వాలు విద్యావ్యాప్తికి కృషి చేయాలని విద్యార్థులు, యువత కోరుతున్నారు.

☛ అందుబాటులో..అందరికీ ఉచిత వైద్యం

పేదలకు ప్రభుత్వ ఆసుపత్రుల్లో సరైన వైద్యం అందడం లేదు. దీంతో ప్రైవేటు ఆసుపత్రులను ఆశ్రయించాల్సి వస్తోంది. ఇదే అదునుగా ప్రైవేటు ఆసుపత్రుల వైద్యులు ప్రజలను పీల్చి పిప్పి చేస్తున్నారు. జిల్లాలోని పడమటి మండలాల్లో పారిశుద్ధ్యం అధ్వానంగా ఉండటం వల్ల వ్యాధులు కూడా ఎక్కువగా ప్రబలుతున్నాయి. అన్ని వ్యాధులకు ప్రభుత్వాసుపత్రిలో వైద్యులు లేకపోవడంతో ప్రజలు 120 కిలోమీటర్ల దూరంలో ఉన్న తిరుపతి, బెంగళూరుకు వెళ్లాల్సి వస్తోందని రోగులు అంటున్నారు. ఆసుపత్రిలో కిడ్నీ సంబంధిత వ్యాధిగ్రస్తులు చాలా మంది ఉన్న నేపథ్యంలో ఈ ప్రాంతంలో కిడ్నీ చికిత్సల విభాగాన్ని ఏర్పాటు చేయాలని రోగులు కోరుతున్నారు. 2018 సంవత్సరంలో అయినా ప్రభుత్వాసుపత్రిలో అన్ని జబ్బులకు చికిత్సలు అందించేలా చూడాలని వారు కోరుతున్నారు.

☛ మహిళలకు స్వయం ఉపాధి కల్పన

మహిళలకు స్వయం ఉపాధి కల్పించేందుకు ప్రభుత్వం పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో కుట్టు శిక్షణలతో పాటు వివిధ రకాల శిక్షణలు ఉచితంగా అందజేయాలి. కొన్ని ప్రాంతాల్లో వీటిని నిర్వహిస్తున్నప్పటికి కొంత మంది మాత్రమే వీటిని సద్వినియోగం చేసుకుంటున్నారు. మహిళలందరికీ శిక్షణ ఇవ్వాలంటే చాలా శిక్షణ కేంద్రాలు ఏర్పాటు చేసి, మహిళలను స్వయం ఉపాధి వైపు నడిపించాలని కోరుతున్నారు. కుట్లు, అల్లికలు, బ్యూటీప్యార్లర్ వంటి వాటిలో శిక్షణ పొందిన మహిళలకు ప్రభుత్వం రుణాలు మంజూరు చేయాలని, మహిళలు తయారు చేసిన వస్తువులను ప్రభుత్వమే కొనుగోలు చేయాలని, మహిళాభ్యుదయానికి కృషి చేయాలని కోరుతున్నారు.



ఆసుపత్రిలో చికిత్సలు పొందుతున్న రోగులు



కుట్టులో శిక్షణ పొందిన మహిళలు

సైకిల్‌పై శబరిమలై యాత్ర

మదనపల్లె (విద్యావిభాగం), న్యూస్‌టుడే : మదనపల్లె వాసి సైకిల్‌పై శబరిమలై యాత్ర ప్రారంభించాడు. స్థానిక నీరుగట్టువారిపల్లెలోని మాయబజార్‌కు చెందిన రంగనాయకులు (57) చేనేత కార్మికుడిగా పనిచేస్తాడు. ఆయన 40 రోజుల క్రితం అయ్యప్పమాల వేశాడు. సోమవారం ఉదయం స్థానిక చౌడేశ్వరిదేవి అమ్మవారి ఆలయంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి సైకిల్ యాత్రను ప్రారంభించాడు. ఈ సందర్భంగా రంగనాయకులు మాట్లాడుతూ.. గత నాలుగు సంవత్సరాలుగా సైకిల్‌పై శబరిమలైకు వెళ్లి అయ్యప్ప దర్శనం చేసుకుంటున్నానని తెలిపారు.



సైకిల్‌పై వెళ్తున్న చేనేత కార్మికుడు రంగనాయకులు

జన్మభూమి కార్యక్రమం విజయవంతం చేయాలి

రామసముద్రం,న్యూస్‌టుడే: జనవరి 2వ తేదీ నుంచి 11వ తేదీ వరకు జరగనున్న జన్మభూమి-మాఊరు కార్యక్రమంలో తెదేపా ప్రజాప్రతినిధులు, నాయకులు, జన్మభూమి కమిటీ సభ్యులు విధిగా పాల్గొని విజయవంతం చేయాలని మండల తెదేపా అధ్యక్షుడు కృష్ణమరాజుయాదవ్ పిలుపునిచ్చారు. రామసముద్రంలో సోమవారం జరిగిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ .. గ్రామపంచాయతీ స్థాయిలో జరిగే జన్మభూమి గ్రామసభలకు ఆయా పంచాయతీలోని తెదేపా అనుబంధ కమిటీ సభ్యులు పాల్గొనాలని కోరారు. గ్రామాల్లో ఉన్న సామాజిక సమస్యలను గ్రామసభ దృష్టికి తీసుకురావాలన్నారు. వివిధ సంక్షేమ పథకాల కోసం దరఖాస్తు చేసుకునే లబ్ధిదారులకు తెదేపా నాయకులు దగ్గరుండి న్యాయం చేయాలన్నారు. కార్యక్రమంలో మండల తెదేపా నాయకులు రామకృష్ణారెడ్డి, చలపతినాయుడు, సుధాకర్‌రెడ్డి, శివశంకర్, గోపాల్‌రెడ్డి, వెంకటప్ప, శివకుమార్‌రెడ్డి, శివప్ప, చిన్నాస్వామి, అమరప్ప, వీరప్ప తదితరులు పాల్గొన్నారు.



విలేకర్ల సమావేశంలో మాట్లాడుతున్న మండల తెదేపా అధ్యక్షుడు కృష్ణమరాజు యాదవ్

మదనపల్లె

కాలువపల్లెలో నేడు జన్మభూమి

ములకలచెరువు, న్యూస్‌టుడే : కాలువపల్లె, గూడుపల్లె గ్రామాల్లో మంగళవారం జన్మభూమి కార్యక్రమం ఉంటుందని ఎంపీడీవో రాజగోపాల్ తెలిపారు. ప్రజలందరూ జన్మభూమి కార్యక్రమంలో పాల్గొని వారి సమస్యలు పరిష్కరించుకోవాలని కోరారు. కొత్తరేషన్‌కార్డులు, ఎన్టీఆర్ సామాజిక భద్రతా పింఛన్లు, ఎన్టీఆర్ గృహకల్ప, ఇతర సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలకు సంబంధించి ప్రజల నుంచి దరఖాస్తులు తీసుకుంటారని తెలిపారు. సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు, డ్వాక్రా సంఘాల మహిళలు జన్మభూమి కార్యక్రమంలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

డెంగీ లక్షణాలతో బాలుడి మృతి

తుమ్మరకుంట (పెద్దతిప్పసముద్రం), న్యూస్‌టుడే: డెంగీ లక్షణాలతో పీటీఎం మండలం తుమ్మరకుంట పంచాయతీ పరిధిలోని నవాబుకోటలో రెడ్డెప్ప కుమారుడు గౌతం (1) సోమవారం మృతిచెందాడు. బాలుడికి మూడు రోజులుగా జ్వరం వస్తుండగా స్థానికంగా వైద్యం చేయించారు. ఫలితం లేకపోగా బాలుడు మరింతగా నీరసించిపోయాడు. ఆందోళన చెందిన తల్లిదండ్రులు మెరుగైన చికిత్స కోసం మదనపల్లెలోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తీసుకెళ్లారు. బాలుడి ఆరోగ్య పరిస్థితి ఆందోళనకరంగా ఉండడంతో వైద్యుల సలహా మేరకు శనివారం తిరుపతి రుయాకు తరలించారు. చికిత్స పొందుతూ బాలుడు సోమవారం మృతి చెందాడు. పల్లెలో మరింత మంది జ్వరాలతో అల్లాడుతున్నారని, వైద్యసిబ్బంది ఇటువైపు కన్నెత్తి చూడలేదని స్థానికులు ఆరోపిస్తున్నారు.

పతకాలు సాధించిన కవలలు

కరాటేలో దిట్టలు ఈ సోదరులు

పలమనేరు, న్యూస్‌టుడే: ముంబయి అంధేరిలో భోషాల్ స్పోర్ట్సు కాంప్లెక్సులో జరిగిన 2017 సంవత్సరం అఖిలభారత కరాటే ఫెడరేషన్ కప్ పోటీలో భరత్, భగత్ అనే కవలలు తొలి రెండుస్థానాలను సాధించారు. పలమనేరు మహిళా పోలీసు స్టేషన్‌లో కానిస్టేబిలుగా పనిచేస్తున్న రాజేశ్వరి కుమారులైన ఈ కవలలు మదనపల్లె కేశవరెడ్డి పాఠశాలలో ఏడో తరగతి చదువుతున్నారు. డిసెంబరు 30న జరిగిన ఈ కరాటే పోటీలో దేశంలోని అన్ని రాష్ట్రాల చిన్నారులు పాల్గొన్నారు. ఫైనల్స్‌లో 40 కిలోల కేటగిరి పోటీలో ఇద్దరూ ప్రథమ స్థానం సాధించారు. ఇద్దరూ కవలలు కావడంతో ఒకరికి బంగారు, ఒకరికి వెండి పతకాలను నిర్వాహకులు ప్రకటించారు. గతంలో కూడా వివిధ జాతీయ స్థాయి కరాటే పోటీలో వీరు గెలుపొందినట్లు తల్లి రాజేశ్వరి సోమవారం ఇక్కడ తెలిపారు.




ముంబయిలో నిర్వాహకుల నుంచి పతకాలు పొందిన చిన్నారులు

ప్రజాసంకల్పయాత్రకు తరలింపు

మదనపల్లె (పట్టణం),న్యూస్‌టుడే : నియోజకవర్గంలో సోమవారం జరిగిన ప్రజాసంకల్పయాత్రకు అధికసంఖ్యలో ప్రజలు తరలి వెళ్లారు. పలువురు నాయకులు తమ సొంత ఖర్చులతో వాహనాలను ఏర్పాటు చేసుకుని జనాలను తీసుకెళ్లారు. పురపాలక సంఘం కౌన్సిలర్ జింకా వెంకటచలపతి రెండు బస్సులు, నాలుగు కార్లను ఏర్పాటు చేసి యాత్రకు ప్రజలను తీసుకెళ్లారు.



రామసముద్రంలో కొలువు తీరిన దుర్గాదేవి



పూజలు అందుకుంటున్న వినాయకస్వామి



అలంకరణలో శ్రీనేలమల్లేశ్వరస్వామి



కేసీపల్లెలో పుష్పపల్లకిపై కొలువు తీరిన వేణుగోపాలస్వామి

వైభవంగా నూతనోత్సవం

రామసముద్రం,న్యూస్‌టుడే: రామసముద్రం, కర్ణాటక రాష్ట్ర సరిహద్దులోని ముళబాగల్, శ్రీనివాసపురం తాలూకాల్లో సోమవారం నూతన సంవత్సరం వేడుకలను ప్రజలు వైభవంగా జరుపుకున్నారు. రామసముద్రంలోని దుర్గాదేవి, జనార్దనస్వామి, వాలీశ్వరస్వామి, చెంబకూరులోని రామాలయం, గుంతఎంబాడిలోని పుండరీశ్వరస్వామి, చౌడేశ్వరీదేవి ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. ఆలయాల్లో స్వామివారికి విశేషంగా పూజలు, అభిషేకాలు నిర్వహించారు. ఆంధ్ర, కర్ణాటక సరిహద్దులోని ముళబాగల్, శ్రీనివాసపురం నియోజకవర్గాల్లోనూ ప్రజలు నూతన సంవత్సరం వేడుకలను ఘనంగా జరుపుకున్నారు.

ప్రజలు సుఖసంతోషాలతో వర్ధిల్లాలి

మదనపల్లె (గ్రామీణ), న్యూస్‌టుడే : నూతన సంవత్సరంలో ప్రజలందరూ సుఖసంతోషాలతో వర్ధిల్లాలని ఉపపాలనాధికారిణి వెట్రిసెల్వి ఆకాంక్షించారు. నూతన సంవత్సర వేడుకల్లో భాగంగా స్థానిక ఉపపాలనాధికారి కార్యాలయంలో సోమవారం రెవెన్యూ అధికారుల సమక్షంలో ఆమె కేక్ కట్ చేసి అందరికీ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. అధికారులు ప్రజలకు అందుబాటులో ఉండి సమస్యల పరిష్కారానికి కృషి చేయాలన్నారు. భూసేకరణ విభాగం ప్రత్యేక డిప్యూటీ కలెక్టర్ గుణభూషన్‌రెడ్డి, డీఎస్పీ చిదానందరెడ్డితోపాటు సీఐ నిరంజన్‌రెడ్డి, పట్టణంలోని ఎస్సైలు, ఏవో రమేష్‌బాబు తదితరులు ఉపపాలనాధికారిణిని మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛాలతో నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు



నూతన సంవత్సర వేడుకల్లో కేక్‌కట్ చేస్తున్న ఉపపాలనాధికారిణి వెట్రిసెల్వి

ఆలయాల్లో ప్రత్యేక పూజలు

నిమ్మనపల్లె,న్యూస్‌టుడే: నూతన సంవత్సరం సందర్భంగా సోమవారం మండలంలోని పలు ఆలయాల్లో ప్రత్యేక పూజలు జరిగాయి. మండలంలోని శ్రీనేలమల్లేశ్వరస్వామి, నిమ్మనపల్లె, ఎగువమాచిరెడ్డిగారిపల్లె అభయాంజనేస్వామి ఆలయాలు, అగ్రహారం, రాచవేటివారిపల్లె, ముష్టూరు చెన్నకేశవస్వామి, నిమ్మనపల్లె, తవళం, గుర్రెడ్డిగారిపల్లెలో వెలసిన శ్రీషిర్డిసాయి అలయాల్లో ప్రత్యేక పూజలు జరిగాయి. మండలంలోని పలు చర్చిల్లో ప్రత్యేక ప్రార్థనలు జరిగాయి. నిమ్మనపల్లె, వెంకోజిగారిపల్లె, కందూరు రోడ్డు, పిట్టావారిపల్లె, బండ్లపై, తవళం, ఎగువమాచిరెడ్డిగారిపల్లె, రాచవేటివారిపల్లె, గుండ్లబురుజు గ్రామాల్లోని ప్రార్థన మందిరాల్లో ప్రత్యేక ప్రార్థనలు చేశారు.



కురుడుమల్లె వినాయకస్వామి ఆలయం వద్ద దర్శనం కోసం క్యూల్లో భక్తుల పాట్లు

కిటకిటలాడిన ఆలయాలు

మదనపల్లె (అర్బన్), న్యూస్‌టుడే : పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో నూతన సంవత్సర వేడుకను ప్రజలు ఘనంగా జరుపుకున్నారు. సోమవారం ఉదయమే ప్రజలు ఆలయాలకు వెళ్లారు. దేవాలయాల దర్శనానంతరం ప్రజలు పరస్పరం నూతన సంవత్సరం శుభాకాంక్షలు తెలుపుకున్నారు. ఆలయాలన్నీ భక్తులతో కిటకిటలాడాయి. పట్టణంలోని శ్రీప్రసన్న వెంకటరమణస్వామి ఆలయంలో, మడికయ్యల శివాలయంలో, సాయిబాబా దేవాలయాలు, వినాయక దేవాలయాలు, నీరుగట్టువారిపల్లెలోని చౌడేశ్వరీ ఆలయంలో, సీటీఎంలోని గంగమ్మ ఆలయం, గెవిగుండు, సీటీఎంలోని ఆంజనేయ ఆలయంలో జన సందడి అధికంగా కనిపించింది. స్థానిక అయ్యప్ప ఆలయంలో స్థానిక ఎస్ఎల్‌టీ యజమాని నవాజ్‌బాషా అయ్యప్ప స్వాములకు అన్నదాన కార్యక్రమం పెద్ద ఎత్తున నిర్వహించారు. తొలిసారిగా ఆయన ఆలయంలో మాలధారులకు అన్నదానం నిర్వహించడానికి ముందుకు రావడాన్ని పలువురు ఆయనను ప్రశంసించారు. ఆలయంలో సేవా సంఘం సభ్యులు జీవీ రమణ, భాస్కర్, పగడాల రాజన్న, రెడ్డెప్పరెడ్డి, చంద్రశేఖర్ నాయుడు, ఢంకణాచారి తదితరుల ఆధ్వర్యంలో స్వామి వారి దర్శనానికి భక్తులకు ప్రత్యేక ఏర్పాట్లను చేశారు.



రామసముద్రంలో ప్రత్యేక అలంకారంలో లక్ష్మీజనార్దనస్వామి.

నూతన సంవత్సర వేడుకల్లో నాయకులు

మదనపల్లె (పట్టణం),న్యూస్‌టుడే : నూతన సంవత్సరం సందర్భంగా పలువురు నాయకులకు పలువురు శుభాకాంక్షలు తెలిపారు. పురపాలక సంఘం ఛైర్మన్ కొడవలి శివప్రసాద్‌కు కార్యాలయం సిబ్బంది సోమవారం ఉదయం పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. డీఈఈ పి.ఎస్.మహేష్, మేనేజరు రాంబాబు, ఏఈఈ గోపినాథ్, టీపీవో మధుసూదన్, టీపీఎస్ వంశీ, ఆర్వో పల్లవి తదితరులు ఛైర్మన్‌కు శుభాకాంక్షలు తెలిపారు. మాజీ ఎమ్మెల్యే దొమ్మలపాటి రమేష్‌కు ఎస్టీయూ నాయకులు పుష్పగుచ్ఛం ఇచ్చి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. ఇందులో ఎస్టీయూ నాయకులు ఢిల్లీప్రసాద్, గిరిధర్‌నాయక్, ఆర్.వి.రమణ తదితరులు పాల్గొన్నారు.



పురపాలక సంఘం ఛైర్మన్ శివప్రసాద్‌కు పుష్పగుచ్ఛం ఇచ్చి శుభాకాంక్షలు తెలుపుతున్న పురపాలక సంఘం డీఈఈ సిబ్బంది



మాజీ ఎమ్మెల్యే రమేష్‌కు పుష్పగుచ్ఛం ఇచ్చి శుభాకాంక్షలు తెలుపుతున్న ఎస్టీయూ నాయకులు.



మదనపల్లె

ఎంఎస్ఆర్: ఎంసీఏ
సిద్ధార్థ: హలో
శ్రీకృష్ణా: 2 కంట్రీస్
సాయిచిత్ర: ఒక్క క్షణం
సునీల్: జుమాంజి
మినీసిద్ధార్థ : టైగర్ జిందగి హై
ఎంఎస్ఆర్: ప్రాజెక్ట్ 2
రవి: ఎంసీఏ

విశిష్టమైన సేవలతో ప్రజాదరణ పొందండి

మదనపల్లె (అర్బన్), న్యూస్‌టుడే : క్రైస్తవులు అన్ని వర్గాల వారికి సేవలు పెంచుతూ ప్రజల మన్నన పొందాలని స్థానిక జేసీఎం చర్చి పాస్టర్ థామస్ ప్రసాదరావు పిలుపునిచ్చారు. స్థానిక జేసీఎం చర్చి ప్రాంగణంలో నూతన సంవత్సర వేడుకలను సోమవారం క్రైస్తవులు ఘనంగా జరుపుకున్నారు. ఇందులో భాగంగా చర్చి ప్రాంగణాన్ని సుందరంగా అలంకరించారు. ఈ సందర్భంగా ప్రార్థనా మందిరంలో పాస్టర్ థామస్ ప్రసాదరావు ఆరాధన కార్యక్రమం కన్నుల పండువగా నిర్వహించారు. చర్చి కమిటీకి చెందిన డేవిడ్ సంజయ్ ఆధ్వర్యంలో ప్రార్థనా కార్యక్రమాలను చక్కగా నిర్వహించారు. నూతన సంవత్సర వేడుకల్లో పెద్ద ఎత్తున క్రైస్తవులు ఆరాధన నిర్వహించారు. కార్యక్రమంలో చర్చి కమిటీ కార్యదర్శి క్రిష్టఫర్ శామ్యూల్, భక్తవత్సలం, జలజ ప్రసాదరావు తదితరులు పాల్గొన్నారు.



చర్చిలో ప్రసంగిస్తున్న పాస్టర్ థామస్ ప్రసాదరావు

నగరి

మంచిమాట



పాశ్చాత్య ప్రపంచంలో జీవితం పైకి నవ్వులమయంగా ఉంటుంది. కానీ లోలోపంతా విషాదం; చివరికి అది వేదనగా పరిణమిస్తుంది. భారతీయ సమాజం నిరాశా నిస్పృహలు ఆవరించినట్లు కనిపిస్తుంది. కానీ లోపలంతా ఉల్లాసాలతో నిండి ఉంటుంది.

-స్వామి వివేకానంద



సీరీడ్స్ విద్యార్థులకు మూడు చక్రాల సైకిళ్లు అందిస్తున్న నిర్వాహకులు

వికలాంగులకు సైకిళ్లు వితరణ

నగరి, న్యూస్‌టుడే: స్థానిక సీరీడ్స్ మానసిక వికలాంగుల పాఠశాల, పునరావాస కేంద్రంలో సోమవారం 15 మంది విద్యార్థులకు మూడు చక్రాల సైకిళ్లను సంస్థ కార్యదర్శి శ్రీనివాసులు పంపిణీ చేశారు. వికలాంగులైన విద్యార్థులకు నూతన ఉత్సాహం కలిగించడానికి నూతన సంవత్సరం ప్రారంభం రోజున దాతల ఔదార్యంతో మూడు చక్రాల సైకిళ్లను అందించినట్లు తెలిపారు. దాతలు నగరి ఎస్ఐవెంకటేశ్వర్లు, డెల్‌కంపెనీ ఉద్యోగులు జనత్, వెంకటేశ్, ఉపాధ్యాయులు వెంకటాచలపతి, మోహన్‌లు విద్యార్థులకు నూతన సంవత్సరం సందర్భంగా భోజన వసతిని ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో సంస్థ నిర్వాహకులు తనూజ, రోజ, సుందరి, నేతాజీ, టెర్రెన్స్, బాబూరావు విద్యార్థులు పాల్గొన్నారు.



బహుమతులు ప్రదానం చేస్తున్న క్రైస్తవ మత పెద్దలు, దొరై వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు

వృద్ధులు దుస్తులను సద్వినియోగం చేసుకోవాలి

కేఆర్‌పాళెం(నింద్ర), న్యూస్‌టుడే: మండల పరిధిలోని కెఆర్‌పాళెం దళితవాడలోని వృద్ధులకు సోమవారం క్రైస్తవ మత పెద్దలు దుస్తులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశానికి హాజరైన వైకాపా రాష్ట్ర యువజన కార్యదర్శి శ్యాంలాల్ మాట్లాడుతూ వృద్ధులను ఆదుకోవాలనే సంకల్పంతో పంపిణీ చేస్తున్న దుస్తులను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. నూతన సంవత్సరం సందర్భంగా ప్రత్యేక ప్రార్థనా కార్యక్రమాలను ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో పాస్టర్ సాల్మన్, వైకాపా జిల్లా మహిళా కార్యదర్శి మేరి, కార్యకర్తలు ధర్మన్, రాము పాల్గొన్నారు.

యువకులకు బహుమతులు ప్రదానం

పన్నూరు(నింద్ర), న్యూస్‌టుడే: విజయపురం మండలంలోని పన్నూరు దళితవాడలోని చర్చి వద్ద యువకులకు సోమవారం వివిధ రకాల ఆటల పోటీలు నిర్వహించారు. ప్రతిభ కనబరచిన చిన్నారులకు దళితవాడకు చెందిన దొరై వెల్ఫేర్ అసోషియేషన్ సభ్యులు, క్రైస్తవ మత పెద్దల సహకారంతో బహుమతులు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశానికి హాజరైన మండల ఉపాధ్యక్షులు హంసగోవిందరాజులు మాట్లాడుతూ యువకులను ఆటల పోటీల్లో ఉత్తేజ పరచాలనే లక్ష్యంతో ఏర్పాటు చేసే ఇలాంటి ఆటల పోటీలను యువకులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఆటల పోటీలతో పాటు విద్యలో రాణించి ఉన్నత స్థాయికి ఎదగాలని కోరారు. ఈ కార్యక్రమంలో దొరై వెల్ఫేర్ అసోషియేషన్ సభ్యులు, క్రైస్తవ మతమ పెద్దలు, గ్రామస్థులు పాల్గొన్నారు.



బహుమతులు ప్రదానం చేస్తున్న క్రైస్తవ మత పెద్దలు, దొరై వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు



భూమిపూజ చేస్తున్న జిల్లా కలెక్టర్ (దాచినచిత్రం)

సాకార బాటలో... స్వచ్ఛ పల్లెలు

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు బహిరంగ మల, మూత్ర విసర్జన లేని గ్రామాలు(ఓడీఎఫ్)గా తీర్చిదిద్దాలనే సంకల్పంతో ముందుకు సాగుతున్నాయి. ఆ కలను సాకారం చేయడానికి రెండు మాసాలుగా అధికారులు గ్రామాల్లో తిష్టవేసి వ్యక్తిగత మరుగుదొడ్లు నిర్మాణం చేసుకునేలా చర్యలు చేపడుతున్నారు. పుత్తూరు మండలంలో ఇప్పటికే అయిదు పంచాయతీలను ఓడీఎఫ్ కింద ప్రకటించారు. త్వరలోనే మరికొన్ని గ్రామ పంచాయతీలు కూడా ఓడీఎఫ్ క్రింద ప్రకటించే విధంగా చర్యలు చేపడుతున్నారు.

ఓడీఎఫ్ గ్రామాల కోసం అధికారుల కృషి

పుత్తూరు, న్యూస్‌టుడే: బహిరంగ మల, మూత్ర విసర్జన లేని గ్రామాల కళ సాకారం కానుంది. 2014లో కేంద్రం, రాష్ట్ర ప్రభుత్వాలు స్వచ్ఛ భారత్ మిషన్ చేపట్టాయి. బహిరంగ మల, మూత్ర విసర్జన నిర్మూలనకు అధికారులు నడుంకట్టారు. తొలి దశలో పట్టణాలు, నగరాల్లో ఈ ప్రగతిని సాధించారు. అనంతరం గ్రామాలపై దృష్టి సారించారు. సర్వే ద్వారా మరుగుదొడ్డి లేని గృహాలు గుర్తించి నిర్మాణాలకు పూనుకున్నారు. దీని కోసం ప్రభుత్వాలు రూ.15వేలను ప్రతి మరుగుదొడ్డికి అందించాయి. ఈ నేపథ్యంలో మరుగుదొడ్ల నిర్మాణం ఊపందుకుంది. డిసెంబరు నాటికి బహిరంగ మల, మూత్ర విసర్జనరహిత గ్రామాలుగా గుర్తించాలని అధికారులు, ప్రజాప్రతినిధులు నిత్యం గ్రామాల్లో పర్యటిస్తున్నారు. మండలంలోని 14 పంచాయతీల్లో ఇప్పటికే 5 పంచాయతీలు ఓడీఎఫ్ హోదాను అందుకున్నాయి. మరో 9 పంచాయతీలు ఇప్పటికే 80శాతం పూర్తి అయ్యాయి. గ్రామాల్లో మరుగుదొడ్ల నిర్మాణాలను పంచాయతీరాజ్, గ్రామీణ తాగునీటి సరఫరా, ఎంపీడీవోలు, రెవెన్యూ అధికారులు పనులు పర్యవేక్షిస్తున్నారు.

భగీరథ యత్నం...

2014వ సంవత్సరం నుంచి పుత్తూరు మండలంలో మరుగుదొడ్ల నిర్మాణాలు జరుగుతున్నాయి. మొత్తం 2081 మరుగుదొడ్లు నిర్మించాలని లక్ష్యంగా నిర్ణయించారు. ఇప్పటి వరకు 1122 పూర్తి చేశారు. మరో 454 మరుగుదొడ్ల నిర్మాణ పనులు తుది దశలో ఉన్నాయి. ఇంక 407 పునాదుల దశ దాటలేదు. అన్నింటినీ మరో 20 రోజుల్లో పూర్తి చేసేందుకు అధికారులు గ్రామాల్లో పర్యటిస్తున్నారు. నగరి నియోజకవర్గంలోని పుత్తూరు మండలం ఆదర్శంగా నిలుస్తోంది.



కృష్ణసముద్రం గ్రామంలో సర్వే చేస్తున్న దృశ్యం

అందరి సహకారంతోనే లక్ష్యం



మరుగుదొడ్లు పూర్తి చేసేందుకు గ్రామాల్లోనే పర్యటిస్తున్నాం. అన్ని శాఖల అధికారులు కూడా గ్రామాల్లోనే ఉన్నారు. జిల్లా కలెక్టర్ డిసెంబరు నాటికి లక్ష్యం చేరుకోవాలని నిర్దేశించారు. అయితే ఆ సమయం లోపు పూర్తి చేయాలని ప్రజలను కోరుతున్నాం. ప్రజలు కూడా సహకరించాలి. మండలంలోని అన్ని గ్రామ పంచాయతీలను ఓడీఎఫ్‌గా ప్రకటించేందుకు కృషి చేస్తున్నాం.

- నిర్మిలాదేవి, ఎంపీడీవో, పుత్తూరు.



తడుకులో నిర్మాణంలో ఉన్న మరుగుదొడ్డి

పంచాయతీల వారీగా...

పంచాయతీలు	మ.ని.లక్ష్యం	పూర్తియినవి	జరుగుతున్నవి
1.గోపాలకృష్ణాపురం	79	79	0
2.కనకంపాళెం	19	19	0
3.కృష్ణసముద్రం	30	18	12
4.కేబీఆర్ పురం	39	04	35
5.నేషనూరు	242	182	60
6.పరమేశ్వరమంగళం	216	66	150
7.రామకృష్ణాపురం	126	90	37
8.రామసముద్రం	74	74	0
9.శిరుగురాజుపాళెం	54	54	0
10.తడుకు	599	321	268
11.తొరూరు	32	32	0
12.తిరుమలకుప్పం	228	75	111
13.ఉత్తరపు కండ్రిగ	171	32	52
14.వేపగుంట	172	144	24

ఆలయాల్లో ప్రత్యేక పూజలు

కనకమ్మసత్రం(నింద్ర), న్యూస్‌టుడే: నూతన సంవత్సరాన్ని పురస్కరించుకుని విజయపురం మండల పరిధిలోని కనకమ్మసత్రంలోని శ్రీకలివేంకటేశ్వరస్వామి ఆలయంలో సోమవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం స్వామివారి ఉత్సవమూర్తికి పాలాభిషేకం, కుంకుమార్చన, కర్పూర హారతి, తీర్థప్రసాద పంపిణీ కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం స్వామివారికి ప్రత్యేకాలంకరణలు చేశారు. చుట్టు పక్కల గ్రామాలకు చెందిన భక్తులు ఆలయానికి చేరుకుని అర్చనలు నిర్వహించారు. ఈ కార్యక్రమాలను గ్రామ పెద్దలు, స్థానిక భక్తులు పర్యవేక్షించారు.

నింద్ర, న్యూస్‌టుడే: నూతన సంవత్సరాన్ని పురస్కరించుకుని మండలంలోని పలు ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ప్రుడెన్షియల్ కూడలి వద్ద శ్రీవేంకటేశ్వరస్వామి, ఎలకాటూరులోని శ్రీతాక్షమ్మ, అత్తూరులోని శ్రీకామాక్షి సమేత నాగేశ్వరస్వామి సన్నిధిలో, కేఆర్‌పాళెంలోని శ్రీమహాలక్ష్మి ఆలయాల్లో సోమవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. మధ్యాహ్నం ఆలయాలకు వచ్చిన భక్తులకు దాతల సహకారంతో అన్నదానం చేశారు. ఈ కార్యక్రమాలను ఆలయ అర్చకులు శ్రీనివాసాచార్యులు, వరదానందాచారి, గ్రామ పెద్దలు, యువకులు పర్యవేక్షించారు.





ప్రత్యేకాలంకరణలో శ్రీవేంకటేశ్వరస్వామివారు..



తాక్షమ్మ ఆలయంలో అన్నదానం చేస్తున్న దృశ్యం

పుత్తూరు గ్రామసభల వివరాలు

గేటుపుత్తూరు (పుత్తూరు), న్యూస్‌టుడే: పుత్తూరు మున్సిపాలిటీలో జన్మభూమి-మా ఊరు గ్రామ సభల వివరాలను మున్సిపల్ కమిషనర్ శ్రీహరిబాబు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 2వ తేదీన 1, 2, 3 వార్డుల్లో, 3న 10, 5, 6వార్డుల్లో, 4న 7, 8, 9 వార్డుల్లో, 5న 4, 11, 24 వార్డుల్లో, 6న 12, 13 వార్డుల్లో, 7న 14, 15వార్డుల్లో, 8న 16, 17 వార్డుల్లో, 9న 18, 19వార్డుల్లో, 10న 20, 21 వార్డుల్లో, 11న 22, 23 వార్డుల్లో గ్రామ సభలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. జన్మభూమి గ్రామ సభలకు అధికారులు, కౌన్సిలర్లు, కో-ఆప్షన్ సభ్యులు హాజరై జయప్రదం చేయాలని కోరారు.

మండలంలో..

పుత్తూరు, న్యూస్‌టుడే: పుత్తూరు మండలంలో జన్మభూమి-మా ఊరు గ్రామ సభల వివరాలను సోమవారం ఎంపీడీవో నిర్మలాదేవి ప్రకటించారు. ఈ నెల 2 నుంచి 11వ తేదీ వరకు గ్రామ సభలు నిర్వహించనున్నట్లు తెలిపారు. 2వ తేదీ ఉదయం గోపాలకృష్ణాపురం, మధ్యాహ్నం నేషనూరు గ్రామ పంచాయతీల్లో గ్రామ సభలు నిర్వహించనున్నట్లు తెలిపారు. 3వ తేదీన కేబీఆర్ పురం, తిరుమలకుప్పం, 4న రామకృష్ణాపురం, శిరుగురాజుపాళెం, 5న రామసముద్రం, కృష్ణసముద్రం, 6న తడుకు, 7న తొరూరు, 8న పరమేశ్వరమంగళం, వేపగుంట, 9న ఉత్తరపు కండ్రిగ, 10న కనకంపాళెం గ్రామ పంచాయతీల్లో గ్రామ సభలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. అన్ని శాఖల అధికారులు, ప్రజా ప్రతినిధులు, సర్పంచులు పాల్గొని జయ ప్రదం చేయాలన్నారు.

నగరి



చంద్రన్న సంక్రాంతి కానుకలు అందిస్తున్న కౌన్సిలర్, తెదేపా నాయకులు

జన్మభూమి-మా ఊరును విజయవంతం చేయాలి

వడమాలపేట, న్యూస్‌టుడే: రాష్ట్ర ప్రభుత్వం జనవరి 2 నుంచి 11వ తేదీ వరకు నిర్వహించనున్న జన్మభూమి-మా ఊరు కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొని విజయవంతం చేయాలని ఎంఈవో పద్మావతి కోరారు. సోమవారం స్థానిక ఎమ్మార్సీ కార్యాలయంలో ఉపాధ్యాయుల సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పండుగ వాతవరణంలో ఈ కార్యక్రమం జరిగేందుకు అధికారులు సహకరించాలన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులకు ఆటల పోటీలు, ముగ్గుల పోటీలు నిర్వహించి బహుమతులు అందజేయాలన్నారు. ఈ కార్యక్రమంలో సీఆర్పీలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



విద్యార్థులకు ఉపకరణాలను అందిస్తున్న దాతలు

వికలాంగులకు దాతల వితరణ

నగరి, న్యూస్‌టుడే: పట్టణంలో నూతన సంవత్సరం సందర్భంగా వికలాంగుల సంక్షేమ సంఘం పాఠశాలలో సోమవారం దాతలు విద్యార్థులకు విద్యా ఉపకరణాలు, వీల్ ఛైర్‌లను వితరణగా అందించారు. ఓంశక్తి హెల్పింగ్ హ్యాండ్స్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో విద్యార్థులకు అవసరమైన ఉపకరణాలను అందించారు. పాఠశాలలో ప్రత్యేక గేటు ఏర్పాటుకు విరాళాన్ని ప్రకటించారు. ఈ సందర్భంగా దాతలు విద్యార్థులకు భోజన ఏర్పాట్లు చేశారు. ఈ కార్యక్రమంలో ఓంశక్తి హెల్పింగ్ హ్యాండ్స్ సభ్యులు జ్యోతినాయుడు, వెంకట్ సర్వాప్, వెంకట్ సందీప్, వంశీ, విజయ్, మురళి, చైతన్య, అశోక్, రాజేష్, వంశి, పాఠశాల కార్యదర్శి శ్రీధర్, కల్పన, తదితరులు పాల్గొన్నారు.



వసతి గృహంలో విద్యార్థులకు విద్యా ఉపకరణాలు అందిస్తున్న లయన్స్ క్లబ్ సభ్యులు

విద్యార్థులకు లయన్స్‌క్లబ్ వితరణ

నగరి, న్యూస్‌టుడే: నూతన సంవత్సరం సందర్భంగా స్థానిక ప్రభుత్వ ఎస్సీ బాలుర, బాలికల వసతి గృహంలో విద్యార్థులకు లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో సోమవారం విద్యా ఉపకరణాలను వితరణగా అందించారు. ఈ సందర్భంగా లయన్స్‌క్లబ్ మాజీ అధ్యక్షుడు రవిబాబు మాట్లాడుతూ తల్లిదండ్రులకు దూరంగా ఉంటూ చదువుకుంటున్న విద్యార్థులు పట్టుదలతో చదవాలన్నారు. వసతి గృహంలో విద్యార్థులకు పరుగు పందెం, కోకో, కబడ్డీ, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించి ప్రతిభ కనపరిచినవారికి బహుమతులు అందించారు. ఈ కార్యక్రమంలో నగరి లయన్స్‌క్లబ్ సభ్యులు హరిహరన్, కోశాధికారి మహ్మద్ షఫీ, విశ్రాంత సీడీపీవో శకుంతలమ్మ, వసతి గృహ పర్యవేక్షకుడు వినాయకం, సురేష్, సుధా, అరుణ్, శివ, పృథ్వీ, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.





నూతన సంవత్సర వేడుకల్లో పాల్గొన్న మున్సిపల్ ఛైర్‌పర్సన్ కె.శాంతి, సిబ్బంది, కార్మికులు.. పుత్తూరు మున్సిపాలిటీలో కేక్ కోస్తున్న మున్సిపల్ కమిషనర్

ఘనంగా నూతన సంవత్సర వేడుకలు

నగరి, న్యూస్‌టుడే: స్థానిక మున్సిపల్ కార్యాలయంలో సోమవారం నూతన సంవత్సర వేడుకలను మున్సిపల్ ఛైర్‌పర్సన్ కె.శాంతి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నూతన సంవత్సరంలో నగరి పట్టణాన్ని పరిశుభ్రంగా ఉంచేందుకు కార్యాలయ సిబ్బంది, కార్మికులు కలసి ప్రజల్లో చైతన్యం తీసుకొచ్చేందుకు అవగాహన కల్పించాలని ఆమె పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా కేకుకోసి కార్మికులకు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మాజీఛైర్మన్ కేజే కుమార్, మున్సిపల్ అధికారులు, సిబ్బంది, కార్మికులు పాల్గొన్నారు.

ప్రజలు సుఖసంతోషాలతో ఉండాలి

గేటుపుత్తూరు(పుత్తూరు), న్యూస్‌టుడే: పుత్తూరు మున్సిపాలిటీలోని ప్రజలు 2018లో సుఖసంతోషాలతో ఉండాలని మున్సిపల్ ఛైర్మన్ యుగంధర్ పేర్కొన్నారు. సోమవారం పుత్తూరు మున్సిపల్ కార్యాలయంలో అధికారులు, పాలకవర్గ సభ్యులు నూతన సంవత్సరాదిని పురస్కరించుకుని కేక్‌కోసి సంబరాలు చేసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొత్త ఏడాదిలో మున్సిపాలిటీలో అభివృద్ధి పనులు వేగవంతం చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ ఛైర్మన్ భాస్కర్, మున్సిపల్ కమిషనర్ శ్రీహరిబాబు, డీఈ ఎండీ రఫీ, ఆర్ఐ రవిరెడ్డి, కౌన్సిలర్లు, కో-ఆప్షన్ సభ్యులు, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

చంద్రన్న సంక్రాంతి కానుకలు పంపిణీ

నగరి, న్యూస్‌టుడే: పట్టణంలోని 22వ వార్డులో సోమవారం చంద్రన్న సంక్రాంతి కానుకలను మున్సిపల్ కౌన్సిలర్ సలీం ఆధ్వర్యంలో లబ్ధిదారులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి పండుగను పేదలు సంతోషంగా చేసుకోవాలని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు కానుకలను అందిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో తెదేపా నాయకులు రమేష్, సికిందర్, బాబు, చౌకదుకాణం నిర్వాహకులు ఆర్ముగం, తదితరులు పాల్గొన్నారు.

సాయిదివ్యధామంలో నూతన సంవత్సర పూజలు

రాజీవ్‌నగర్(నగరి), న్యూస్‌టుడే: నగరి పట్టణ శివారులోని సాయిదివ్యధామంలో సోమవారం నూతన సంవత్సర వేడుకలను ఘనంగా నిర్వహించారు. దేవాలయంలో సాయిబాబాను ప్రత్యేక పుష్పాలతో అలంకరించి అభిషేకాలు చేశారు. జిల్లా నలుమూలల నుంచి, తమిళనాడు నుంచి భక్తులు ఆలయానికి తరలి వచ్చారు. ఈ సందర్భంగా భక్తులకు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. మాజీ మంత్రి ఆర్.చెంగారెడ్డి ఆధ్వర్యంలో భక్తులకు అన్నదానం, ప్రసాదాలు పంపిణీ చేశారు.

అప్పలాయిగుంట(వడమాలపేట), న్యూస్‌టుడే: అప్పలాయిగుంట శ్రీప్రసన్న వేంకటేశ్వరస్వామి ఆలయం సోమవారం నూతన సంవత్సరం సందర్భంగా భక్తులతో కిటకిటలాడింది. ఈసందర్భంగా స్వామి వారిని సుప్రభాత సేవతో మేల్కొలిపి నిత్యకట్ల కైంకర్య సేవలు నిర్వహించారు. అనంతరం నిజాలయంలో కొలుఉన్న ప్రసన్న వేంకన్నస్వామి వారిని పుష్పాలతో అలంకరించారు. భక్తుల రద్దీ పెరగడంతో స్వామి వారి దర్శనానికి గంట సమయం పట్టింది. ఆలయం వద్ద పలువురు దాతలు భక్తులకు ప్రసాదాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయాధికార్లు రాజేష్, శ్రీనివాసులురాజు, అర్చకులు పాల్గొన్నారు.

పుత్తూరు, న్యూస్‌టుడే: నూతన సంవత్సరాదిని పురస్కరించుకొని సోమవారం పుత్తూరు పట్టణంలోని ఆలయాలన్ని భక్తులతో కిటకిటలాడాయి. పట్టణంలోని షిర్డీసాయిబాబా ఆలయంలో నూతన సంవత్సరాది వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయాన్ని ప్రత్యేక పుష్పాలతో అలంకరించారు. ఆదివారం అర్ధరాత్రి నుంచే భక్తుల దర్శనార్థం ఆలయాన్ని తెరిచి ఉంచారు. ఈ సందర్భంగా ఆలయంలో సాయినామ సంకీర్తనలతో ఆలయం మారుమ్రోగింది. ఈ కార్యక్రమంలో ఆలయ కార్యనిర్వాహకులు, భక్తులు పాల్గొన్నారు. కళ్యాణపురంలోని శ్రీషిర్డీసాయినాధుని ఆలయంలోను నూతన సంవత్సరాది వేడుకలను ఘనంగా నిర్వహించారు.

ఆరేటమ్మ ఆలయంలో..

పట్టణంలోని గ్రామదేవత ఆరేటమ్మ ఆలయంలో నూతన సంవత్సరాదిని పురస్కరించుకొని ప్రత్యేకపూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమాలను ఆలయ ఛైర్మన్ పాండురంగయాదవ్ ఆధ్వర్యంలో నిర్వహించారు. శ్రీకామాక్షీ సమేత శ్రీసదాశివేశ్వర ఆలయం, శ్రీవల్లీదేవసేన సమేత శ్రీసుబ్రహ్మణ్యేశ్వర ఆలయం, శ్రీభక్త ఆంజనేయస్వామి, శ్రీసెల్వగణపతి, పిళ్లారిపట్టులోని శ్రీ విజయగణపతి ఆలయాల్లో నూతన సంవత్సరాదిని పురస్కరించుకొని విశేష పూజలు నిర్వహించారు. వాసవీమహిళా మండలి సభ్యులు పాల్గొన్నారు. పుత్తూరు పట్టణంలోని శ్రీద్రౌపదీదేవి సమేత శ్రీధర్మరాజుల ఆలయంలోనూ పూజలను ఘనంగా నిర్వహించారు. కావమ్మ, మారయ్య ఆలయంతో పాటు రామలింగేశ్వరఆలయంలోను ప్రత్యేకకార్యక్రమాలను ఏర్పాటు చేశారు.



పుత్తూరు: విశేష అలంకరణలో శ్రీకృష్ణుడు



స్వామి వారిని దర్శించుకునేందుకు బారులు తీరిన భక్తులు







నగరి సాయిదివ్యధామంలో.. పుత్తూరులో.. పుత్తూరు: సాయినాధుని ఆలయంలో పూలతో అలంకరించిన దృశ్యం



పుత్తూరు

శాంతి: ఎంసీఏ
శ్రీనివాస: టు కంట్రీస్
విష్ణుమహల్: హలో

నగరి

శ్రీనివాస: .టు కంట్రీస్
ఎన్.ఎం.సి: ఎంసిఏ
రాజేశ్వరి: వేలకారన్(త)

నిండ్ర

ఎస్వీటాకీస్: అన్నాదురై(త)

కలాం జీవితం ఆదర్శం కావాలి

నగరి, న్యూస్‌టుడే: మాజీ రాష్ట్రపతి అబ్దుల్ కలాం జీవితం విద్యార్థులకు ఆదర్శం కావాలని స్థానిక పీసీఎన్ ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ కుసుమాంబ కోరారు. కళాశాలలో అబ్దుల్ కలాం విగ్రహాన్ని ఆమె సోమవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఏపీజే అబ్దుల్ కలాం పేరులోనే సర్వమత సమానత్వం వినిపిస్తుందని, ఎ అంటే అబ్దుల్లా, పీ అంటే పరమేశ్వర, జే అంటే జీసస్ అనే అర్థం దాగుందని ఆమె పేర్కొన్నారు. దేశానికి తన సేవలను అందించి భరతమాత ముద్దుబిడ్డగా నిలిచిపోయారని కొనియాడారు. ఈ సందర్భంగా అధ్యాపకులు మాట్లాడుతూ కళాశాలలో ప్రిన్సిపల్ కుసుమాంబ తన సొంత నిధులతో కలాం విగ్రహాన్ని ప్రతిష్ఠించడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.



అబ్దుల్‌కలాం విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న ప్రిన్సిపల్ కుసుమాంబ

సమస్యలను పరిష్కరించాలి

పుత్తూరు, న్యూస్‌టుడే: రాష్ట్ర ప్రభుత్వం ఈనెల 2 నుంచి 11వ తేదీ వరకు నిర్వహిస్తున్న జన్మభూమి-మాఊరు కార్యక్రమంలో ప్రజలు అందించే వినతులకు పరిష్కారం చూపని పక్షంలో అధికారులను నిలదీస్తామని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు శ్రీనివాసులు, సీపీఎం పట్టణ కార్యదర్శి వెంకటేష్‌లు సోమవారం తహసీల్దార్ లావణ్యకు వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పుత్తూరు మున్సిపాలిటీలో పేదలకు ఇంటి స్థలాలు, ఇళ్ల మంజూరు వంటి విషయాల్లో ప్రభుత్వం వైఫల్యం చెందిందన్నారు. ఎస్ఎస్ ట్యాంకు ద్వారా పుత్తూరు ప్రజల దాహార్తిని తీర్చాలన్నారు. పుత్తూరు మండలంలోని చాలా గ్రామాల్లో శ్మశాన వాటికలు కబ్జాకు గురవుతున్నట్లు తెలిపారు. శ్మశాన వాటికలకు హద్దులు ఏర్పాటు చేయాలన్నారు. సబ్‌జైలు నిర్మాణాన్ని చేపట్టాలన్నారు. వినతి అందించిన వారిలో సీపీఎం నాయకులు విజయ్, కృష్ణమూర్తి, సుబ్రహ్మణ్యంపిళ్లై, భాస్కర్, నందయ్య, తదితరులు పాల్గొన్నారు.

పలమనేరు

నేడు జగమర్లలో 'జన్మభూమి- మాఊరు'

పలమనేరు గ్రామీణ, న్యూస్‌టుడే: 'జన్మభూమి-మాఊరు' కార్యక్రమం మండలంలోని జగమర్ల గ్రామంలోని రచ్చబండ వద్ద మంగళవారం జరుగుతుందని ఎంపీడీవో హుర్మత్ తెలిపారు. గ్రామానికి సంబంధించిన అన్ని శాఖల అధికారులు తప్పనిసరిగా పాల్గొని గ్రామంలో అభివృద్ధి కార్యక్రమాలు, గ్రామస్థులు అందించిన అర్జీలు, వాటికి పరిష్కారాలు సూచించాలని కోరారు.





జనం లేక బోసిపోయిన కౌండిన్య ప్రాజెక్టు.. ఆంజనేయస్వామికి పూజలు నిర్వహిస్తున్న భక్తులు.. ఆలయం వద్ద భక్తుల రద్దీ

సందడి లేని నవ వత్సరం

- బోసిపోయిన కౌండిన్య ప్రాజెక్టు
- పట్టణంలో కనిపించని సంబరాలు

పలమనేరు గ్రామీణ, న్యూస్‌టుడే: మండలంలో కొత్త సంవత్సరం వేడుకల పట్ల జనంలో పెద్దగా ఆసక్తి కనిపించలేదు. సాధారణంగా ఏటా ఒకటో తేదీన ముసలి మడుగు, కౌండిన్య ప్రాజెక్టుల వద్ద సందడి కనిపించేది. ప్రజలు పెద్దఎత్తున చేరి ఉల్లాసంగా గడిపి వెళ్లేవారు. కౌండిన్య ప్రాజెక్టు వద్ద నీరు లేకపోయినా జనం పెద్దఎత్తున ఇక్కడికి వచ్చి కుటుంబసమేతంగా ఆహ్లాదంగా గడిపివెళ్లేవారు. ప్రాజెక్టులో నిండా నీరున్నా సోమవారం మాత్రం జనం పెద్దగా కనిపించలేదు. పలమనేరువాసులకు అందుబాటులో ఉన్న మరో పర్యాటకప్రాంతం ముసలిమడుగు కూడా జనం లేక బోసిపోయింది. ఆలయాలలో పండుగ సందర్భంగా ప్రత్యేక అలంకరాలు ఏర్పాట్లు చేయకూడదన్న నిర్ణయం, సామాజిక మాధ్యమాలలో జరిగిన ప్రచారంతో ఆలయాలలో కూడా అంతంతమాత్రంగానే సందడి కనిపించింది. పట్టణంలో సైతం జనం పెద్దగా హడావిడి లేకుండా మామూలుగా ఎవరి పనులు వారు చేసుకున్నారు. ఇక్కడి యువత సంబరాలు చేసుకునేందుకు పెద్ద సంఖ్యలో కర్ణాటక, తమిళనాడు, బయటి ప్రాంతాలకు వెళ్లిపోవడంతో వారి సందడి కూడా కనిపించలేదు. సమీప బెంగళూరు వంటి ప్రాంతాలలో ప్రైవేటు కంపెనీలు సోమవారం ఉద్యోగులకు సెలవు ఇవ్వకపోవడంతో అక్కడ ఉద్యోగాలు చేసుకుంటున్న ఇక్కడివారు రాకపోవడం కూడా ఉత్సాహం తక్కువగా కనిపించడానికి కారణమైంది.

అంజనాద్రి ఆలయంలో ప్రత్యేక పూజలు

ఆంగ్ల సంవత్సర ప్రారంభం రోజున మండలంలోని మొరం గ్రామం వద్ద ఉన్న ఆంజనేయస్వామి అంజనాద్రి ఆలయంలో భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. ఈ పూజల్లో గ్రామప్రజలే కాకుండా చుట్టుపక్కల గ్రామాలు, పట్టణం నుంచి భక్తులు పెద్దఎత్తున పాల్గొన్నారు. ఆలయ ఆవరణ ఉత్సవాలను తలపించింది. ఆలయ ఆవరణలో అన్నదానం చేశారు.



బోస్‌ను అభినందించిన మాజీ ఎంపీపీ కృష్ణవేణి

సంక్షేమం తప్ప మరో ధ్యాస లేని చంద్రబాబు

సుభాష్‌చంద్రబోస్ వెల్లడి

పలమనేరు, న్యూస్‌టుడే: కొత్త రాష్ట్రాన్ని కొంత పుంతలు తొక్కిస్తున్న ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ప్రజల సంక్షేమం తప్ప మరో ధ్యాస లేకుండా పని చేస్తున్నారని రాష్ట్ర తెలుగుదేశం పార్టీ కోశాధికారి సుభాష్ చంద్రబోస్ పేర్కొన్నారు. నూతన సంవత్సరం సందర్భంగా సోమవారం నియోజకవర్గం పరిధిలోని అన్ని మండలాల నుంచి పార్టీ నాయకులు వచ్చి బోస్‌కు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా జవిళివీధిలోని పార్టీ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ కార్యకర్తలు ఎంతో ఉత్సాహంగా పని చేయడానికి ముఖ్యమంత్రి పనితీరే మంత్రంగా పని చేస్తోందన్నారు. ఈ కొత్త సంవత్సరంలో రాష్ట్రాన్ని నాలెడ్జిహబ్‌గా మార్చడానికి ఆయన చేస్తున్న కృషి ఎనలేనిదన్నారు. వైద్యానికి పెద్దపీట వేస్తున్నారని చెప్పారు. ఈ తరుణంలో రాబోయే రోజుల్లో ప్రతి ఒక్కరూ ముఖ్యమంత్రి చేస్తున్న అభివృద్ధి కార్యక్రమాలకు అండగా నిలవాలని ఆయన కోరారు. కొత్త ఏడాది తనకు శుభాకాంక్షలు చెప్పడానికి వచ్చిన వారికి ఆయన కృతజ్ఞతలు తెలిపారు. బైరెడ్డిపల్లె మాజీ ఎంపీపీ కృష్ణవేణి, పార్టీ నాయకులు జయకుమార్, జిల్లా పార్టీ ఉపాధ్యక్షులు డాక్టర్ కదిరప్ప, స్థానిక నాయకులు శుభాకాంక్షలు చెప్పిన వారిలో ఉన్నారు.



పట్నపల్లెలో శ్రీరామకోటి భజన చేస్తున్న భజన బృందం



కోనేటిరాయస్వామి ఆలయంలో భక్తులకు ప్రసాదం పంపిణీ



రక్షకభట నిలయంలో ఎస్సై రాజశేఖర్ ఆధ్వర్యంలో సంబరాలు చేసుకుంటున్న పోలీసులు



జలపాతం సందర్శనకు వచ్చి నిరాశతో వెనుదిరుగుతున్న ప్రజలు

నూతన సంవత్సరం... భక్తి పరవశం



శ్రీదేవి, భూదేవి సమేత శ్రీకల్యాణ వేంకటరమణస్వామి

బైరెడ్డిపల్లె, న్యూస్‌టుడే: ఆంగ్ల సంవత్సరాదిని పురస్కరించుకుని సోమవారం ప్రజలు ఆలయాలకు వెళ్లి భక్తిశ్రద్ధలతో పూజలు చేశారు. ఆదివారం అర్ధరాత్రి యువత కేకులు కోసి సంబరాలు చేసుకున్నారు. నూతన సంవత్సరంలో సిరి సంపదలు, సుఖసంతోషాలు కలగాలని ప్రజలు పరస్పరం శుభాకాంక్షలు తెలుపుకున్నారు. పట్నపల్లె సమీపంలో వెలసిన హస్తగిరి శ్రీకల్యాణ వేంకటరమణస్వామి ఆలయంలో అర్చకులు మురళీకృష్ణమాచార్యులు, శ్రీనివాసాచార్యులు స్వామివారికి అభిషేకం, ప్రత్యేక పూజలు చేశారు. సోమవారం ఉదయం నుంచి ఆలయంలో భక్తుల సందడి నెలకొంది. ఆలయ నిర్వాహకులు భక్తులకు తీర్థప్రసాదాల పంపిణీ, అన్నదానం చేశారు. ఆలయ ధర్మకర్త నారాయణమొదలి, ఆలయ నిర్వాహకులు భక్తులకు ఇబ్బంది కలగకుండా ఏర్పాట్లను పర్యవేక్షించారు. ఆలయం వద్ద కంగాణం బండ శ్రీరామలింగేశ్వరస్వామి భజన మండలి ఆధ్వర్యంలో అఖండజ్యోతి వెలిగించి శ్రీరామకోటి భజన ప్రారంభించారు. బైరెడ్డిపల్లెలో వెలసిన శ్రీశేషాద్రిస్వామి, శ్రీకోదండరామస్వామి, సల్లాపురమ్మ, సాయిబాబా, అయ్యప్పస్వామి, ఆంజనేయస్వామి, తొరడి భక్తాంజనేయస్వామి, దాసార్లపల్లె శ్రీధ్యానాభిరామస్వామి, తీర్థం శ్రీకాళభైరవేశ్వరస్వామి ఆలయాల్లో భక్తులు స్వామివారికి విశేష పూజలు, అభిషేకాలు చేయించారు. నిర్వాహకులు ఆలయాల వద్ద భక్తులకు అన్నప్రసాదాలు వితరణ చేశారు. లక్కనపల్లె, శెట్టిపల్లె, గడ్డిండ్లు గ్రామాల నుంచి 50 మంది భక్తులు కాలినడకన తిరుమలకు పయనమయ్యారు.

బారులు తీరిన భక్తులు

గంగవరం, న్యూస్‌టుడే: నూతన ఆంగ్ల సంవత్సరాదిని ప్రజలందరూ ఆనందోత్సాహాల నడుమ ఘనంగా చేసుకున్నారు. ఆదివారం అర్ధరాత్రి కేకులు కత్తిరించి పిల్లలు, పెద్దలు కలిసి సంబరాలు చేసుకున్నారు. ప్రతి ఇంటి ముంగిట ఆంగ్ల సంవత్సరానికి స్వాగతం పలుకుతూ మహిళలు రంగులతో తీర్చిదిద్దిన ముగ్గులు ఆకట్టుకున్నాయి. మండలంలోని ప్రముఖ దేవాలయాలైన కీలపట్ల శ్రీ కోనేటిరాయ స్వామి ఆలయం భక్తులతో కిటకిటలాడింది. స్వామివారి దర్శనానికి చుట్టుపక్కల మండలాల నుంచి వేలాది మంది బారులు తీరారు. మండల కేంద్రంలోని సాయిబాబా ఆలయంలో బాబాను ప్రత్యేకంగా అలంకరించి పూజలు నిర్వహించారు. పోలీసులు ఆలయాల వద్ద ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా గట్టి భద్రత కల్పించారు.



ప్రత్యేక అలంకరణలో సాయిబాబా

ఆలయాలు కిటకిట

పెద్దపంజాణి, న్యూస్‌టుడే: నూతన సంవత్సర వేడుకలను సోమవారం మండలంలోని ప్రజలు ఆనందోత్సాహాలతో చేసుకున్నారు. మండలంలోని ప్రధాన ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. వీరప్పల్లె సమీపంలోని యోగనందీశ్వరాలయం, ముద్దేపల్లె సమీపంలోని శ్రీదేవి భూదేవి సమేత గోవిందరాజులస్వామి, చలమంగళం గ్రామంలోని ప్రసన్న పార్వతీసమేత సోమేశ్వరాలయం, ముత్తుకూరులోని శ్రీదేవి భూదేవి సమేత కల్యాణ వెంకటేశ్వరస్వామి, కాశీవిశ్వేశ్వరస్వామి ఆలయం, కోగిలేరు సమీపంలోని జలకంఠేశ్వరాలయం, మాదనపల్లె వద్ద వెలసిన షిర్డీసాయిబాబా ఆలయాలకు భక్తులు అధికసంఖ్యలో తరలి వచ్చి దర్శించుకున్నారు. ఆలయాల్లో ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. భక్తులకు ఆలయ కమిటీ సభ్యులు, అర్చకులు స్వామివారి తీర్థప్రసాదాలను అందజేశారు.



ప్రత్యేకాలంకరణలో శ్రీదేవి, భూదేవి సమేత గోవిందరాజులస్వామి

కైగల్ జలపాతం సందర్శనపై నిషేధం

కైగల్ (బైరెడ్డిపల్లె), న్యూస్‌టుడే: జిల్లాలో ప్రసిద్ధిగాంచిన కైగల్ జలపాతం సందర్శనకు పోలీసులు శాశ్వతంగా అడ్డుకట్ట వేశారు. పోలీసు ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు స్థానిక రక్షకభట నిలయాధికారి సోమవారం కైగల్ జలపాతం సందర్శనకు వెళ్లే ప్రధాన రహదారి వద్ద కైగల్ జలపాతం సందర్శనను నిషేధిస్తున్నట్లు సూచిక ఏర్పాటు చేయించారు. నూతన సంవత్సరం సంబరాల కోసం కైగల్ జలపాతం సందర్శనకు విచ్చేసిన ప్రజలకు నిరాశే ఎదురైంది. జిల్లాలోని వివిధ ప్రాంతాలతో పాటు కర్ణాటక, తమిళనాడు సరిహద్దుల నుంచి ప్రజలు అధిక సంఖ్యలో తరలి వచ్చారు. జలపాతానికి వెళ్లే ప్రధాన రహదారిలో పోలీసులు బారికేడ్లు ఏర్పాటు చేసి జలపాతం సందర్శనకు ఎవరూ వెళ్లరాదని అడ్డుకున్నారు. కొత్త సంవత్సరం జలపాతం వద్ద ఆనందోత్సాహాలతో సందడి చేద్దామని సుదూర ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజలు నిట్టూర్చారు. జలపాతాన్ని పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేయాల్సిన ప్రభుత్వం పట్టించుకోకపోవడం, జలపాతం సందర్శనను నిషేధించడం పట్ల సర్వత్రా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.



కైగల్ జలపాతం సందర్శనను నిషేధిస్తూ సూచిక ఏర్పాటు చేస్తున్న పోలీసులు

పలమనేరు

దళితులపై దాడులను అరికట్టాలి

పలమనేరు, న్యూస్‌టుడే: కర్నూలు జిల్లా నక్కలదిన్నెలో దళితులపై అగ్ర వర్ణాల వారి దౌర్జన్యాలను ప్రభుత్వం అరికట్టాలని ప్రగతిశీల కార్మిక సమాఖ్య జిల్లా కన్వీనర్ డీవీ మునిరత్నం కోరారు. దళితులను గ్రామ బహిష్కరణకు గురిచేసిన వారిపై చర్యలు తీసుకోవాలని సోమవారం ఇక్కడ విడుదల చేసిన ప్రకటనలో కోరారు. దళితుల మీద దాడులను అరికట్టడానికి చర్యలు తీసుకోవాలన్నారు.

బ్యాంకులో డిపాజిట్లపై అపోహలొద్దు

బైరెడ్డిపల్లె, న్యూస్‌టుడే: ప్రజలు తమ వద్ద ఉన్న నగదును బ్యాంకులో డిపాజిట్ చేయడానికి ఎలాంటి అపోహలు పెట్టుకోవద్దని బైరెడ్డిపల్లె సప్తగిరి గ్రామీణ బ్యాంకు మేనేజరు సుబ్రహ్మణ్యం పేర్కొన్నారు. స్థానిక సప్తగిరి గ్రామీణ బ్యాంకులో సోమవారం నూతన సంవత్సర క్యాలెండర్లను బ్యాంకు ఉద్యోగులతో కలిసి ఆయన ఆవిష్కరించారు. బ్యాంకు ఖాతాదారులకు 2018 సంవత్సర క్యాలెండర్లను పంపిణీ చేసి శుభాకాంక్షలు తెలియజేశారు. పెద్దనోట్ల రద్దు, జీఎస్టీ పరిణామాలతో ప్రజలు బ్యాంకుల్లో నగదు డిపాజిట్ చేయడానికి ఆందోళన చెందుతున్నారని పేర్కొన్నారు. ప్రజలు, బ్యాంకు ఖాతాదారులు తమ వద్ద ఉన్న నగదును డిపాజిట్ చేయడం వలన ఎలాంటి ఇబ్బంది ఉండదని తెలియజేశారు. రైతులు బ్యాంకులో ఎంత సొమ్ము డిపాజిట్ చేసినా ఆదాయపన్ను నుంచి మినహాయింపు ఉంటుందని పేర్కొన్నారు. సప్తగిరి గ్రామీణ బ్యాంకు ఖాతాదారులు బ్యాంకులో సంప్రదించి రూపే కార్డులు, ఏటీఎం కార్డులను పొందవచ్చని తెలిపారు. బ్యాంకు ఖాతాదారులు పాత రూపే కార్డులతో 10 వేలు, కొత్తగా వచ్చిన నల్లని రూపే కార్డులతో రూ.50 వేల వరకు ఆన్‌లైన్ షాపింగ్ చేసుకోవచ్చని చెప్పారు. కార్యక్రమంలో బ్యాంకు ఉద్యోగులు ఝాన్సీలక్ష్మి, శశికుమార్, సత్యరాజ్ పాల్గొన్నారు.


క్యాలెండర్లను ఆవిష్కరిస్తున్న సప్తగిరి గ్రామీణ బ్యాంకు మేనేజరు సుబ్రహ్మణ్యం, ఉద్యోగులు

ఉన్నత శిఖరాలు అందుకోవాలి

రాయలపేట (పెద్దపంజాణి), న్యూస్‌టుడే: క్రమశిక్షణతో చదివి ఉన్నత శిఖరాలు అందుకోవాలని పెద్దపంజాణి ఎస్సై చంద్రమోహన్ విద్యార్థులకు ఉద్బోధించారు. రాయలపేటలోని బాలికల వసతిగృహంలో సోమవారం విద్యార్థుల నడుమ నూతన సంవత్సర వేడుకలను నిర్వహించారు. విద్యార్థులచే కేకును కోయించి పంచి పెట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థి దశలోనే ఉన్నత లక్ష్యాలను ఎంచుకుని ఆ దిశగా పట్టుదలతో కృషి చేయాలని సూచించారు. పెద్దపంజాణి పోలీసులు బాలికల వసతిగృహాన్ని దత్తత తీసుకుని, విద్యార్థులకు అవసరమైన వసతులను కల్పించి, చదువుకోవడానికి పూర్తి సహకారం అందిస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో వసతిగృహం వార్డెన్ లక్ష్మమ్మ, ఏఎస్సై మునివేలు, పోలీసు కానిస్టేబుల్ ఉమాశంకర్ పాల్గొన్నారు.


రాయలపేట బాలికల వసతిగృహంలో కేకును కోయిస్తున్న ఎస్సై చంద్రమోహన్, సిబ్బంది

భాషాభిమానులకు తీపికబురు

పలమనేరు, న్యూస్‌టుడే: రాష్ట్ర ముఖ్యమంత్రి ఈ ఏడాదిని తెలుగుభాషా పరిరక్షణ సంవత్సరంగా ప్రకటించడం భాషాభిమానులకు తీపికబురని తెలుగు సాహిత్య సాంస్కృతిక సమితి అధ్యక్షులు తులసీనాథంనాయుడు పేర్కొన్నారు. 29వ పుస్తకోత్సవంలో పాల్గొన్న సందర్భంగా ముఖ్యమంత్రి ఈ ప్రకటన చేశారని సోమవారం విడుదల చేసిన ప్రకటనలో వివరించారు. అమరావతిలో వీధులకు తెలుగు భాషావేత్తల పేర్లను పెట్టాలనడం కూడా సంతోషకరమైన విషయమని ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

జగన్ పాదయాత్రలో శారద

పలమనేరు, న్యూస్‌టుడే: మదనపల్లె నియోజకవర్గంలో జరుగుతున్న వైకాపా అధినేత వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి పాదయాత్రలో పలమనేరు మున్సిపల్ ఛైర్‌పర్సన్ శారద పాల్గొన్నారు. ముదివేడుక్రాస్ నుంచి సోమవారం జగన్‌తో కి.మీ. దూరం ఆమె నడిచారు. ఈ సందర్భంగా ఆమె ఇక్కడ విలేకరులతో మాట్లాడుతూ జగన్ తనకు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారన్నారు. తన పాదయాత్ర పూర్తయిన తర్వాత పలమనేరు నియోజకవర్గంలో బస్సు యాత్ర చేపట్టనున్నట్లు జగన్ తనతో చెప్పారని ఆమె పేర్కొన్నారు. ఈ పాదయాత్రలో స్థానిక వైకాపా నాయకులు సీవీ కుమార్, మండి సుధాకర్, శశిధర్ పాల్గొన్నారు.


జగన్‌తో పాదయాత్రలో పాల్గొన్న శారద

పెద్దిరెడ్డిని కలిసిన నాయకులు

వైకాపా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డిని స్థానిక వైకాపా నాయకులు సదుంలో కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా వైకాపా జిల్లా మైనారిటీ ప్రధాన కార్యదర్శి సుహేబ్ ముద్రించిన పార్టీ క్యాలెండర్లను పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, ఎమ్మెల్యే సునీల్‌కుమార్ ఆవిష్కరించారు. మైనారిటీ నాయకులు కూడా పెద్దిరెడ్డికి శుభాకాంక్షలు తెలిపారు.

విద్యార్థులకు సైకిళ్ల పంపిణీ

గంగవరం, న్యూస్‌టుడే: మండల పరిధిలోని కీలపట్ల ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో పేద విద్యార్థులకు దాతలు ఆంగ్ల సంవత్సరాదిని పురస్కరించుకుని ఉచితంగా సైకిళ్లను పంపిణీ చేశారు. మండల కేంద్రంలోని సాయిగార్డెన్‌లో నివసిస్తున్న సుబ్బరాయుడు, శ్యామలాదేవి, కుమారుడు చంద్రశేఖర్, స్నేహితులు కలిసి రూ.35 వేల విలువ చేసే 11 సైకిళ్లను పేద విద్యార్థులకు అందజేశారు. దూర ప్రాంతాల నుంచి పాఠశాలకు వచ్చే విద్యార్థులకు వీటిని పంపిణీ చేసినట్లు దాతలు తెలిపారు. అమెరికాలో తెలుగు ప్రజల ఆధ్వర్యంలో 'జెర్సీ జాగర్స్' అనే స్వచ్ఛంద సంస్థను ఏర్పాటు చేస్తున్నామని, ఆ సంస్థ ద్వారా మున్ముందు మరిన్ని కార్యక్రమాలను చేపట్టనున్నట్లు దాతలు తెలిపారు. దాతలను పాఠశాల ప్రధానోపాధ్యాయులు దామోదరం, కిరణ్‌కుమార్, దేవేంద్రనాయుడు, చైతన్య, రెడ్డెప్ప తదితరులు అభినందించారు.


సైకిళ్ల పంపిణీలో దాతలు, ఉపాధ్యాయులు

కృష్ణమ్మకొండపై సందడి

వి.కోట, న్యూస్‌టుడే: మండలంలో నూతన ఆంగ్ల సంవత్సరాది వేడుకలను ప్రజలు ఘనంగా చేసుకున్నారు. సమీపంలోని కోటిలింగాల క్షేత్రం, బంగారు తిరుపతికి భక్తులు పెద్ద సంఖ్యలో తరలి వెళ్లారు. మండల పరిధిలోని కృష్ణమ్మ కొండ, స్థానిక వీరాంజనేయ స్వామి తదితర దేవాలయాల్లో భక్తులు పెద్దఎత్తున వెళ్లి స్వామివార్లను దర్శించుకున్నారు. ముదరందొడ్డి గ్రామంలోని రత్నాల కొండ మీద ముగ్గుల పోటీలు నిర్వహించి విద్యార్థులకు బహుమతులు అందజేశారు. అనంతరం నిర్వాహకులు భక్తులకు ఉచిత తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా పోలీసులు భారీ బందోబస్తు నిర్వహించారు.


ప్రత్యేక అలంకరణలో వీరాంజనేయస్వామి

పతకాలు సాధించిన కవలలు

కరాటేలో దిట్టలు ఈ సోదరులు

పలమనేరు, న్యూస్‌టుడే: ముంబయి అంధేరిలో భోషాల్ స్పోర్ట్సు కాంప్లెక్సులో జరిగిన 2017 సంవత్సరం అఖిలభారత కరాటే ఫెడరేషన్ కప్ పోటీలో భరత్, భగత్ అనే కవలలు తొలి రెండుస్థానాలను సాధించారు. పలమనేరు మహిళా పోలీసు స్టేషన్‌లో కానిస్టేబిలుగా పనిచేస్తున్న రాజేశ్వరి కుమారులైన ఈ కవలలు మదనపల్లె కేశవరెడ్డి పాఠశాలలో ఏడో తరగతి చదువుతున్నారు. డిసెంబరు 30న జరిగిన ఈ కరాటే పోటీలో దేశంలోని అన్ని రాష్ట్రాల చిన్నారులు పాల్గొన్నారు. ఫైనల్స్‌లో 40 కిలోల కేటగిరి పోటీలో ఇద్దరూ ప్రథమ స్థానం సాధించారు. ఇద్దరూ కవలలు కావడంతో ఒకరికి బంగారు, ఒకరికి వెండి పతకాలను నిర్వాహకులు ప్రకటించారు. గతంలో కూడా వివిధ జాతీయ స్థాయి కరాటే పోటీలో వీరు గెలుపొందినట్లు తల్లి రాజేశ్వరి సోమవారం ఇక్కడ తెలిపారు.


ముంబయిలో నిర్వాహకుల నుంచి పతకాలు పొందిన చిన్నారులు

తారురోడ్డు నిర్మాణానికి సర్వే

బైరెడ్డిపల్లె, న్యూస్‌టుడే: మండలంలోని లక్కనపల్లె క్రాస్ నుంచి- బురిశెట్టిపల్లె క్రాస్ వరకు తారురోడ్డు నిర్మాణానికి సోమవారం ఓ బృందం సర్వే చేసింది. పంచాయతీరాజ్ ఏఈ శ్రీనివాసులు ఆధ్వర్యంలోని బృందం రహదారి అభివృద్ధికి సర్వే నిర్వహించింది. పుంగనూరు రహదారిలోని లక్కనపల్లె క్రాస్ నుంచి శెట్టిపల్లె, చిక్కనపల్లె, బురిశెట్టిపల్లె మీదుగా మదనపల్లె- కృష్ణగిరి జాతీయ రహదారిలోని బురిశెట్టిపల్లె క్రాస్ వరకు 5 కి.మీ. తారు రోడ్డు నిర్మాణం చేపట్టనున్నట్లు చెప్పారు. ప్రభుత్వం టెండర్ల ప్రక్రియ చేపట్టిన తర్వాత తారురోడ్డు నిర్మిస్తామని పంచాయతీరాజ్ ఏఈ శ్రీనివాసులు పేర్కొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న ఎస్సై రాజశేఖర్

కేజీబీవీని దత్తత తీసుకున్న పోలీసులు

గంగవరం, న్యూస్‌టుడే: ఇక్కడి కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాల (కేజీబీవీ)ను స్థానిక పోలీసులు దత్తత తీసుకున్నట్లు ఎస్సై రాజశేఖర్ తెలిపారు. సోమవారం కేజీబీవీ పాఠశాలలో విద్యార్థులతో సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తల్లిదండ్రులను విడిచి సుదూర ప్రాంతాల నుంచి వచ్చి చదువుకుంటున్న విద్యార్థినులకు పోలీసు శాఖ నుంచి సహాయ సహకారాలను అందించటానికి కృషి చేస్తామన్నారు. విద్యార్థులకు అవసరమైన అన్ని మౌలిక వసతులను కల్పించేందుకు సన్నాహాలు చేస్తున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రాంగణం, వసతి గృహాన్ని పరిశీలించారు. వసతిగృహానికి ఒకవైపు ప్రహరీ గోడ ఎత్తు తక్కువగా ఉన్నందున ఇతరులు ప్రవేశించే అవకాశం ఉందని గుర్తించారు. వెంటనే గుత్తేదారును పిలిపించి ప్రహరీ ఎత్తు పెంచాలని ఆదేశించారు. విద్యార్థినులు చలికాలంలో చన్నీటి స్నానం చేయలేక ఇబ్బందులు పడుతున్న విషయాన్ని ఉపాధ్యాయులు ఆయన దృష్టికి తీసుకువచ్చారు. వేడినీటి ఏర్పాటుకు ఎక్కువ మొత్తం నిధులు అవసరమైనందున దాతల సహకారాన్ని తీసుకుని త్వరలో వాటర్ హీటర్స్ ఏర్పాటు చేయిస్తామని హామీ ఇచ్చారు. రక్షణలో భాగంగా పాఠశాలలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేస్తున్నట్లు ప్రకటించారు. పాఠశాలకు వెళ్లే ప్రధాన రహదారి, క్రీడా మైదానం రాళ్లు, గుంతలతో అధ్వానంగా ఉండటాన్ని గమనించి వెంటనే చదును చేస్తున్నట్లు తెలిపారు. అంతకు ముందు పిల్లలతో కలిసి నూతన సంవత్సరం వేడుకల్లో పాల్గొని కేకును కత్తిరించి సంబరాలు చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఏఎస్సై సదాశివరెడ్డి, సుబ్రహ్మణ్యం, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



పలమనేరు

మంజునాథ:	2 కంట్రీస్
రంగమహల్:	హలో
పద్మశ్రీ:	ఎంసీఏ
వి.వి.మహల్:	ఒక్క క్షణం

పీలేరు

పింఛన్ల పంపిణీ ప్రారంభం

కలికిరి, న్యూస్‌టుడే : కలికిరి మేజరు పంచాయతీ కార్యాలయంలో జనవరి నెలకు సంబంధించి సామాజిక పింఛన్ల పంపిణీ సోమవారం ప్రారంభించారు. పంచాయతీలోని 1720 మందికి మంజూరైన రూ.18,10,600 నిధుల నుంచి పింఛన్‌దారులకు పింఛన్ల సొమ్మును అందించేందుకు చర్యలు తీసుకున్నారు. మొదటిరోజు 250 మందికి రూ.2.50 లక్షలు పంపిణీ చేసినట్లు ఈవో తరుణాక్షరెడ్డి తెలిపారు. సకాలంలో పింఛన్ సొమ్ము అందజేస్తామని పేర్కొన్నారు. వైకల్యంతో నడవలేని వృద్ధులు, వికలాంగులకు వారి ఇంటి వద్దే సొమ్ము అందజేస్తామని వివరించారు.

కోడిపందెం జూదరుల అరెస్టు

కలకడ, న్యూస్‌టుడే : మండలంలోని కోన పంచాయతీ పరిధిలోని గంగిరెడ్డిగారిపల్లె సమీపంలోని కొత్తచెరువు దగ్గర చెట్ల కింద కోడిపందెం ఆడుతున్న 11 మందిని సోమవారం సాయంత్రం అరెస్టు చేసినట్లు ఎస్సై కృష్ణమోహన్ తెలిపారు. తమకు అందిన ముందస్తు సమాచారంతో సిబ్బందితో వెళ్లి దాడి చేసి 11 మంది పందెంరాయుళ్లను అరెస్టు చేసి వారి రూ.7460 నగదు, 6 కోళ్ల స్వాధీనం చేసుకున్నట్లు ఆయన తెలిపారు. దాడిలో ఎస్సైతో పాటు హెడ్‌కానిస్టేబుల్ కోదండరామయ్య, పోలీసులు కుమార్, ప్రసాద్, సురేంద్ర, శ్రీనివాసులు, రఫీ పాల్గొన్నారు.

ప్రజాసంకల్పయాత్రకు సర్వం సిద్ధం

నేడు జగన్ వాల్మీకిపురానికి రాక

వాల్మీకిపురం, న్యూస్‌టుడే : ప్రజాసంకల్పయాత్ర సందర్భంగా వైకాపా అధినేత జగన్మోహన్‌రెడ్డి చేపట్టిన పాదయాత్ర మంగళవారం తంబళ్లపల్లె నియోజకవర్గం నుంచి వాల్మీకిపురానికి చేరుకోనుంది. వాల్మీకిపురానికి రానున్న జగన్మోహన్‌రెడ్డికి స్వాగతం పలికేందుకు ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి ఆధ్వర్యంలో పీలేరు వైకాపా నేతలు ఏర్పాట్లు చేస్తున్నారు. పెద్దఎత్తున రోడ్డుకు ఇరువైపులా భారీఫ్లెక్సీలు ఏర్పాటుచేశారు. ఉదయం 9 గంటలకు స్థానిక గాంధీసర్కిల్‌లో బహిరంగ సభలో మాట్లాడతారు. వైకాపా పట్టణ యూత్ అధ్యక్షులు శ్రీనాథ్ శాలివాహన ఆధ్వర్యంలో స్వాగతం పలికేందుకు సమాయత్తమయ్యారు.

చిత్రం సంధించండి.. సమస్యలు పరిష్కరించుకోండి

ప్రమాదకరంగా విద్యుత్ నియంత్రిక



సమస్య : తరిగొండలోని శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయం పక్కనున్న విద్యుత్ నియంత్రిక చుట్టూ కంపచెట్లు, పిచ్చిమొక్కలు, తీగలు అల్లుకున్నాయి. దీంతో మంచుకు, వర్షానికి పచ్చనిచెట్లకు కరెంటు సరఫరా అవుతుండటం వల్ల విద్యుదాఘాతం జరిగే ప్రమాదం ఉంది. కంపచెట్లు తొలగించాలి. **- రామచంద్ర, భక్తుడు, వాల్మీకిపురం.**

సమాధానం : కంపచెట్ల విషయం నా దృష్టికి రాలేదు. వెంటనే విద్యుత్ నియంత్రిక చుట్టూ పిచ్చిమొక్కలు, కంపచెట్లు తొలగించడానికి చర్యలు తీసుకుంటాం. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా చూస్తాం. **- సత్యం, విద్యుత్ ఏఈ, గుర్రంకొండ**

గుర్రంకొండ మండలంలో సమస్యలు తీవ్రంగా ఉన్నాయి. వాటిని మండల పౌరులు 'ఈనాడు-వాట్సాప్'నకు సచిత్రంగా పంపారు. అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేయాలని కోరారు. మీరూ స్పందించండి. సమస్యలను 'క్లిక్' చేసి 'ఈనాడు-వాట్సాప్'నకు పంపించండి.
- గుర్రంకొండ, న్యూస్‌టుడే

వాట్సాప్ నంబర్
76759 19089



పునాదులకే పరిమితం..

సమస్య : గుర్రంకొండలోని కొత్తపేట పోలేరమ్మ ఆలయ సమీపంలో అంగన్‌వాడీ భవన నిర్మాణానికి పునాది తవ్వారు. ఇంతవరకు ఎలాంటి నిర్మాణ పనులు చేపట్టలేదు. ఎన్నోఏళ్లుగా అంగన్‌వాడీ భవనం నిర్మించకపోవడం వల్ల చిన్నారులు ఇబ్బందులు పడుతున్నారు. వెంటనే చొరవ చూపాలి. **- లక్ష్మమ్మ, విద్యార్థిని తల్లి, గుర్రంకొండ**

సమాధానం : మొన్నటివరకు స్థల వివాదం ఉండేది. దీని వల్ల భవన నిర్మాణం ఆగిపోయింది. ఇటీవలే ఆ సమస్య పరిష్కారం అయింది. ఇక భవన నిర్మాణానికి చర్యలు తీసుకుంటాం. **- రవిచంద్రన్, తహసీల్దారు**

మురుగుకు మంగళం





మర్రిపాడు (గుర్రంకొండ) : మురుగునీటితో మర్రిపాడు ప్రజలు అవస్థలు పడేవారు. 'మర్రిపాడులో మురుగుకంపు' శీర్షికన డిసెంబరు 10వ తేదీన 'ఈనాడు'లో కథనం ప్రచురితమైంది. సర్పంచి జయసూరి, కార్యదర్శి లక్ష్మి స్పందించి 12వ తేదీ ఈ గ్రామంలోని మురుగుకాలువల్లో పారిశుద్ధ్యం చేయించారు. చెత్తాచెదారం, పిచ్చిమొక్కలు తొలగించారు. గ్రామస్థులకు మురుగుబారి నుంచి విముక్తి కల్పించారు.

స్పందనకు వందనం

వైకాపాలో చేరిక

వాల్మీకిపురం, న్యూస్‌టుడే : గ్రామాల్లో మనకు పార్టీలొద్దని అందరం కలిసి అభివృద్ధి చేసుకుందామని ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి పిలుపునిచ్చారు. సోమవారం నూతన సంవత్సరాన్ని పురస్కరించుకుని స్థానిక తెదేపా మైనార్టీ నాయకులు కాదరి, నాయకుడు రాము తదితరులు వారి కుటుంబసభ్యులు మరో 30 మంది అనుచరులతో ఎమ్మెల్యే సమక్షంలో వైకాపాలో చేరారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వారికి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.

ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు అవసరం

పీలేరు గ్రామీణ, న్యూస్‌టుడే : అన్నిరంగాల్లో వెనుకబడిన కురబ సామాజికవర్గ ప్రజల అభివృద్ధికి ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేయాల్సిన అవసరం ఏర్పడిందని నియోజకవర్గ కురబకుల సంఘం అధ్యక్షుడు అమరనాథ్ అన్నారు. సోమవారం పీలేరులో నియోజకవర్గ స్థాయి కురబల సంఘం నాయకులు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కురబ సామాజిక వర్గ ప్రజలు, వ్యవసాయ కూలీలు, గొర్రెల కాపరులుగానే మిగిలిపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఆర్థికంగా అభివృద్ధి చెందాలంటే ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేసి విరివిగా రుణాలు మంజూరు చేయడానికి ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఆర్థికంగా ఎదిగిన నాడే రాజకీయంగా రాణించే అవకాశం ఉంటుందని అన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు చొరవ చూపించి ఎస్సీ, ఎస్టీ, రజక, కాపు, మైనార్టీ కార్పొరేషన్ల తరహాలో కురబ సామాజివర్గ ప్రజల అభివృద్ధికి ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని కోరారు. సమావేశంలో కృష్ణమూర్తి, ఉపాధ్యక్షుడు సురేష్, కార్యదర్శి సహదేవ, సహ కార్యదర్శి శ్రీనివాసులు, కోశాధికారి జగన్ మోహన్, సభ్యులు నాగభూషణం, వెంకటయ్య, సిద్ధరాజులు తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి జన్మభూమి - మాఊరు

మేళ్లచెరువు (పీలేరు గ్రామీణ), న్యూస్‌టుడే : మండల పరిధి మేళ్లచెరువు గ్రామంలో మంగళవారం జన్మభూమి-మాఊరు కార్యక్రమం జరుగుతుందని తెదేపా మండల అధ్యక్షుడు కేశవర్దన్ సోమవారం తెలిపారు. సమస్యల పరిష్కారమే లక్ష్యంగా అధికార యంత్రాంగం ప్రజల వద్దకు వస్తోందని అన్నారు. ప్రజలు, రైతులు, డ్వాక్రా మహిళలు జన్మభూమి గ్రామసభల్లో పెద్దసంఖ్యలో పాల్గొని సమస్యలను అక్కడిక్కడే పరిష్కరించుకోవాలని పేర్కొన్నారు.

కలికిరి : మండలంలో మంగళవారం నుంచి 11వ తేదీ వరకు జన్మభూమి-మాఊరు కార్యక్రమం జరుగుతుందని ఎంపీడీవో ఇందిర సోమవారం తెలిపారు. 2న ఉదయం టి.చంద్రావారిపల్లె, మధ్యాహ్నం మునోల్లపల్లె, 3న మహల్, 4న ఉదయం పత్తేగడ, మధ్యాహ్నం గుట్టపాలెం, 5న మేడికుర్తి, 6న పల్లవోలు, 7న అద్దవారిపల్లె, 8న ఉదయం గుండ్లూరు, మధ్యాహ్నం మర్రికుంటపల్లె, 9న ఉదయం చీకటిపల్లె, మధ్యాహ్నం పారపట్ల, 10న మొర్రంకిందపల్లె, 11న కలికిరి పంచాయతీల్లో జన్మభూమి మాఊరు జరుగుతుందిన తెలిపారు.

❖ జన్మభూమి మా-ఊరు కార్యక్రమంలో భాగంగా మండలంలోని 14 గ్రామ పంచాయతీలకు నూతనంగా 340 పింఛన్లు మంజూరైనట్లు ఎంపీడీవో ఇందిర తెలిపారు. అర్హులైన వారికి జన్మభూమి గ్రామసభలో మంజూరు పత్రాలు అందజేస్తామన్నారు. నూతన పింఛన్‌దారులకు ఫిబ్రవరి నుంచి పింఛన్ సొమ్ము అందుతుందని చెప్పారు.

గుర్రంకొండ : ఐదోవిడత గ్రామసభలు ఆయా గ్రామ పంచాయతీ కార్యాలయాల్లో నిర్వహించాలని ఇన్‌ఛార్జి ఎంపీడీఓ దివాకర్‌రెడ్డి తెలిపారు. సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఇదివరకు కొన్ని గ్రామాల్లో గ్రామ పంచాయతీల వద్ద, మరికొన్ని ఆయా గ్రామాల్లోని ప్రభుత్వ పాఠశాలల వద్ద నిర్వహించాలని నిర్ణయించామన్నారు. గ్రామసభల్లో ప్రతిరోజు 2-3 గంటల మధ్య ముఖ్యమంత్రి ప్రసంగం ఉన్నందున గ్రామ పంచాయతీ కార్యాలయాల వద్ద నిర్వహించాలని తెలిపారు.



ఎర్రయ్యగారిపల్లె వద్ద జాతీయ రహదారి పక్కన ఉన్న విద్యుత్ నియంత్రిక

కంచె లేని నియంత్రిక

కలకడ, న్యూస్‌టుడే : మండలంలోని బాలయ్యగారిపల్లె పంచాయతీ పరిధిలోని ఎర్రయ్యగారిపల్లె వద్ద జాతీయ రహదారి పక్కన ఏర్పాటుచేసిన విద్యుత్ నియంత్రికకు కంచె వేయకపోవడంతో ప్రమాదం పొంచి ఉంది. నియంత్రిక రోడ్డుపక్కనే ఉండటంతో పాటు పక్కనే పలు కుటుంబాల ప్రజలు కూడా ఇక్కడే జీవనం సాగిస్తున్నారు. నియంత్రికకు కంచెను ఏర్పాటు చేయడంలో సంబంధిత అధికారులు అలసత్వం వహిస్తున్నారని గ్రామస్థులు వాపోతున్నారు. కంచెను ఏర్పాటు చేసి ప్రమాదసూచిక బోర్డులు ఏర్పాటు చేయాలని కోరుతున్నారు.

మేళ్లచెరువు విద్యార్థులకు బహుమతులు

మేళ్లచెరువు (పీలేరు గ్రామీణ), న్యూస్‌టుడే : మదనపల్లెలో గతవారం జరిగిన జవహర్‌లాల్ నెహ్రూ జిల్లాస్థాయి వైజ్ఞానిక ప్రదర్శనలో మేళ్లచెరువు జడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులకు బహుమతులు లభించాయని ప్రధానోపాధ్యాయుడు గంగాధర్ తెలిపారు. ప్రదీప్‌రెడ్డి, హర్షవర్ధన్‌రెడ్డి డిజిటల్ టెక్నాలజి పొల్యూషన్ విను విభాగంలో వెహికల్ డిటెక్షన్ స్ట్రీట్‌లైటింగ్ బై యూజింగ్ మైక్రో కంట్రోలర్ అనే పరికరాన్ని ఆవిష్కరణను ప్రదర్శించారని తెలిపారు. ఈ ప్రదర్శనను పరిశీలించిన న్యాయ నిర్ణేతలు తృతీయ బహుమతిని ప్రకటించి విద్యార్థులను ప్రోత్సహించారని వివరించారు. ఈ విద్యార్థులను పాఠశాల బోధన సిబ్బంది కుసుమాంబ, గోవర్ధన్, మహేష్, కృష్ణయ్య, రెడ్డిశేఖర్, ఫరూక్, ప్రభావతి అభినందించారు.



వైజ్ఞానిక ప్రదర్శనలో బహుమతి పొందిన విద్యార్థులతో ఉపాధ్యాయులు

రూ.లక్షలు వ్యయం .. మరుగుదొడ్లు నిష్ప్రయోజనం

కంభంవారిపల్లె మండలం వగళ్ల పంచాయతీ బుర్రావారిపల్లె కాలనీలో నిర్మించిన సామూహిక మరుగుదొడ్లు పిచ్చిమొక్కలు మొలిచి నిరుపయోగంగా ఉన్నాయి. ఈ కాలనీలో ఇళ్ల వద్ద మరుగుదొడ్లు నిర్మించుకోవడానికి వీలు లేదని అధికారులు కాలనీకి దగ్గరలో ఒకేచోట రూ.లక్షలు వెచ్చించి సామూహిక మరుగుదొడ్లు నిర్మించారు. కానీ గ్రామస్థులు వాటిని ఉపయోగించకపోవడంతో, నిరుపయోగంగా మారాయి. **- కంభంవారిపల్లె, న్యూస్‌టుడే**



యాంత్రీకరణతో ఊపందుకున్న వరిసాగు

రొంపిచెర్ల, న్యూస్‌టుడే : మండలంలో పంటల సాగులో యాంత్రీకరణ బాగా ఉపయోగిస్తున్నట్లు రైతులు అంటున్నారు. ఇంతకుముందు వరిపంటను నూర్పిడి చేయాలంటే చాలామంది కూలీలు వచ్చి పంటను కోసి కుప్పవేసిన తరువాత నూర్పిడి చేసేవారు. ప్రస్తుతం ఆ పరిస్థితి మారింది. యాంత్రీకరణ పెరగడంతో తమిళనాడుకు చెందిన నూర్పిడి యంత్రాలు గ్రామానికి వచ్చి కొద్దిపాటి పొలమైనా నూర్పిడి చేసేందుకు వస్తున్నాయి. దీంతో రైతులకు కూలీల సమస్య తీరింది.

నేడు సోమలలో మంత్రి పర్యటన

ఉప్పరపల్లె (సోమల), న్యూస్‌టుడే : సోమల మండలంలోని 81.ఉప్పరపల్లె పంచాయతీ శీలంవారిపల్లె సమీపంలోని మైదానంలో మంగళవారం జన్మభూమి కార్యక్రమం జరుగుతుందని ఎంపీడీవో శ్రీనివాసులు తెలిపారు. జన్మభూమి కార్యక్రమానికి మధ్యాహ్నం రెండుగంటలకు పరిశ్రమలశాఖ మంత్రి అమరనాథరెడ్డి హాజరవుతారని అన్నిశాఖల అధికారులు పూర్తిస్థాయి నివేదికలతో రావాలని తెలిపారు.

పీలేరు

మంచిమాట



భారతదేశంలో ముగ్గురు వ్యక్తులు కలిసికట్టుగా అయిదు నిమిషాలైనా పనిచేయలేరు. ప్రతి ఒక్కరూ అధికారం కోసమే అర్రులు చాస్తారు. చివరికి మొత్తం వ్యవస్థ కుప్పకూలుతుంది.

–స్వామి వివేకానంద

దేవుడా దీవించు..

భక్తులతో కిటకిటలాడిన ఆలయాలు



కలికిరిలో ప్రత్యేక అలంకరణలో యల్లమ్మ అమ్మవారు

పీలేరు ఆర్‌ఎస్ మెయిన్, న్యూస్‌టుడే : నూతన ఏడాదిని పురస్కరించుకుని ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. ఉదయం నుంచి భక్తులు పట్టణంలోని కడప మార్గం వేంకటేశ్వరాలయం, కోటపల్లె వేంకటేశ్వరాలయం, కాశీవిశ్వేశ్వరాలయం, సాయిబాబా, శ్రీరౌద్రాల అంకాళమ్మ, వినాయక ఆలయాలకు వెళ్లి ప్రార్థనలు చేశారు. ఆలయాల్లో విగ్రహాలకు ప్రత్యేక అలంకారాలతో పాటు ప్రత్యేకపూజలు చేశారు.

కోటపల్లె (పీలేరు గ్రామీణ) : పీలేరు మండలంలోని ఆలయాలన్నీ భక్తులతో కిటకిటలాడాయి. కోటపల్లె జీవీ చంద్రశేఖర్‌రెడ్డి నగర్‌లోని పద్మావతి ఆండాళ్ సమేత శ్రీవేంకటేశ్వర స్వామి ఆలయంలో ఉదయం ప్రత్యేక దర్శన ప్రవేశాలు కల్పించారు. పెద్ద సంఖ్యలో తరలివచ్చిన భక్తులు స్వామివారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. ఆలయ కమిటీ ఛైర్మన్, మాజీ ఎమ్మెల్యే జీవీ శ్రీనాథరెడ్డి కార్యక్రమాన్ని పర్యవేక్షించారు. ముడుపులవేముల పంచాయతీ వెంకటాద్రి ఇళ్ల వద్ద ఉన్న శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయం, అగ్రహారం లక్ష్మీనరసింహస్వామి ఆలయం, శివరాంపురంలోని శివాలయంలో ప్రత్యేక ప్రత్యేక పూజా కార్యక్రమాల్లో పెద్ద ఎత్తున భక్తులు పాల్గొన్నారు.

వాల్మీకిపురం : పట్టణంలోని వివిధ ఆలయాలు, చర్చిలు, మసీదుల్లో సోమవారం నూతన సంవత్సర వేడుకలు ఘనంగా జరుపుకొన్నారు. పెద్దఎత్తున ప్రజలు ఆలయాలకు తరలివెళ్లి భక్తిశ్రద్ధలతో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. స్థానిక శ్రీ షిర్డిసాయినాథుడి ఆలయంలో ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. ఆలయానికి భక్తులు, పర్యాటకులు తరలిరావడంతో ఆలయ ప్రాంగణమంతా కిక్కిరిసిపోయింది. విదేశీ పుష్పాలంకరణ విశేషంగా ఆకట్టుకుంది. స్థానిక సీఎస్ఐ చర్చిలో పాస్టర్ నెల్సన్‌బాబు ప్రార్థనలు చేశారు. అలాగే ముస్లింలు ప్రధాన మసీదులకు వెళ్లి నూతనసంవత్సర వేడుకలు జరుపుకొన్నారు.

గుర్రంకొండ : మండలంలోని చిట్టిబోయనపల్లె సమీపంలో యువత పెద్దఎత్తున ఉత్సవాలు నిర్వహించి కేకు కోసి అందరికీ పంచిపెట్టారు. బాణసంచా పేల్చారు. గుర్రంకొండ కోట ప్రాంగణంలోని శ్రీలక్ష్మీనరసింహస్వామి, శ్రీవినాయక స్వామి, శ్రీఆంజనేయస్వామి, తరిగొండ శ్రీలక్ష్మీనరసింహ స్వామి, చెర్లోపల్లె రెడ్డెమ్మదేవత ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. గుర్రంకొండ, కలకడ, పెద్దమండ్యం, గాలివీడు, మదనపల్లె, రాయచోటి, కడప తదితర ప్రాంతాల నుంచి పెద్దఎత్తున ప్రజలు తరలివచ్చి గుర్రంకొండ రంగిణీ మహల్‌కోటను సందర్శించారు. సంగసముద్రం నివాసులు నారాయణ, రామచంద్ర సందర్శకులకు, భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.



గర్నిమిట్ట ఆలయంలో అమ్మవారి విగ్రహం



గోపాలపురం శ్రీ సాయిబాబా

కలకడ : గ్రామాలలో ఇళ్లముందు కల్లాపుచల్లి రంగులతో ముగ్గులు వేసి నూతన సంవత్సరం శుభాకాంక్షలు తెలిపారు. గోపాలపురంలోని శ్రీసాయిబాబా ఆలయం, కలకడలో శ్రీకామాక్షి సమేత సిద్ధేశ్వరాలయం, ఎర్రకోటపల్లె శ్రీ ఆంజనేయ స్వామి ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. అధికారులు, ప్రజాప్రతినిధులు, విద్యార్థులు, యువకులు ఒకరికొకరు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలుపుకున్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ శ్యామల ఆధ్వర్యంలో అధికారులు, ప్రజాప్రతినిధులు కేకు కోసి వేడుకలు జరుపుకున్నారు.

కంభంవారిపల్లె : మండలంలోని గర్నిమిట్ట యల్లమ్మ ఆలయం, కంభంవారిపల్లెలోని ఆంజనేయస్వామి ఆలయం, చీనేపల్లెలో చిన్నక్కమ్మ, పెద్దక్కమ్మ ఆలయం, చిన్నకమ్మపల్లెలో వెంకటేశ్వరస్వామి ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. ప్రజలు పెద్ద సంఖ్యలో ఆలయాలకు తరలివచ్చి, కొబ్బరికాయలు కొట్టి పూజలు చేశారు. ఆలయాలను విద్యుత్ దీపాలతో అలంకరించారు.



వాల్మీకిపురంలో శ్రీ షిర్డి సాయినాథుడు

కె.రెడ్డివారిపల్లె (కలికిరి గ్రామీణ) : మండలంలోని అన్ని ఆలయాలు సోమవారం భక్తులతో కిటకిటలాడాయి. కలికిరి గ్రామదేవత యల్లమ్మ ఆలయంలో అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. ఆలయ నిర్వాహకులు భక్తులకు తీర్థప్రసాదాలు అందజేసి అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. పట్టణంలోని సోమేశ్వరస్వామి ఆలయం, సుబ్రహ్మణ్యస్వామి, లక్ష్మీనరసింహస్వామి, సాయినగర్‌లో వెలసిన షిర్డిసాయిబాబా ఆలయం, గుండ్లూరు చెన్నకేశవస్వామి ఆలయాల్లోనూ ప్రత్యేక పూజలు చేశారు.



పీలేరులో విశేషాలంకరణలో సాయిబాబా



విశేషాలంకరణలో శ్రీరౌద్రాల అంకాళమ్మదేవత



పీలేరు గ్రామీణ.. కోటపల్లె వెంకటేశ్వరస్వామి ఆలయంలో..

కలిసి నడుద్దాం.. ముందుకు సాగుదాం

కొత్త సంవత్సరాదిన నాయకుల సంబరాలు



కేకు కోస్తున్న ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి

వాల్మీకిపురం, న్యూస్‌టుడే : పీలేరు నియోజకవర్గంలో కొత్త సంవత్సరాన్ని పురస్కరించుకుని అందరం కలిసి అభివృద్ధిలో ముందుకు సాగుదామని, ఈ నూతన సంవత్సరం అందరికీ సంతోషం, సౌభాగ్యం తెచ్చిపెట్టాలని ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి ఆకాంక్షించారు. కొత్త ఏడాదిని పురస్కరించుని ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి వైకాపా నాయకులు, కార్యకర్తలు, అధికారుల సమక్షంలో నూతన సంవత్సరం కేకు కోసి అందరికీ పంచిపెట్టారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీలు అరుణమ్మ, నక్కా చంద్రశేఖర్, హరిత జడ్పీటీసీ సభ్యులు శ్రీవల్లి, జయరామయ్య, పార్టీ నాయకులు నీళ్లభాస్కర్, వెంకట్రమణారెడ్డి, సర్పంచులు చంద్రశేఖర్, కుమార్, సుశీల, గాంధీపేట రఘు, ఆనందరెడ్డి పాల్గొన్నారు.

పీలేరు ఆర్‌ఎస్ మెయిన్ : పీలేరులో ఉపాధ్యాయ సంఘం నాయకులు రహత్‌బాష, సుబ్రమణ్యం, సుధాకరబాబు నూతన ఏడాదిని పురస్కరించుకుని మాజీ ఎమ్మెల్యే జీవీ శ్రీనాథరెడ్డిని ఆయన స్వగృహం కోటపల్లెలో కలసి కొత్త సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు.

వాల్మీకిపురం : రాష్ట్ర సమాచారహక్కు చట్టం మాజీ కమిషనర్, తెదేపా సీనియర్ నాయకులు షేక్ ఇంతియాజ్ అహ్మద్‌ను ఆయన అభిమానులు, తెదేపా నాయకులు, ప్రజాప్రతినిధులు కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన కేకు కోసి అందరికీ పంచిపెట్టారు. కార్యక్రమంలో సర్పంచి రాజేంద్రచారి, మార్కెట్‌కమిటీ మాజీ వైస్ ఛైర్మన్ కోసూరి చంద్రమౌళి, తెదేపా నాయకులు గాంధీపేట రమణ, పీవీ నారాయణ, కేకే, గంగులప్ప, గోవిందు, నారాయణ, రెడ్డిరాం పాల్గొన్నారు.

కలికిరి, కలికిరి (గ్రామీణ) : నియోజకవర్గ తెదేపా ఇన్‌ఛార్జి నల్లారి కిషోర్‌కుమార్‌రెడ్డి, ఆయన కుటుంబసభ్యులకు పలువురు పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు శుభాకాంక్షలు తెలిపారు. సోమవారం కలికిరి సమీపం నగిరిపల్లెలోని స్వగృహంలో కలిసి పుష్పగుచ్ఛాలు అందించి కేకు కోశారు. ఎంపీటీసీల సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు జనార్దన్ గౌడ్, ఆయన సోదరుడు రెడ్డిశేఖర్ ఏర్పాటుచేసిన 70 కిలోల భారీ కేకును కిషోర్‌కుమార్‌రెడ్డి, ఆయన కుమారుడు, తెలుగు యువత నాయకుడు అమరనాథరెడ్డి, కుటుంబసభ్యులతో కలిసి కోశారు. కార్యక్రమంలో ఎంప్లాయీస్ యూనియన్ గౌరవ అధ్యక్షుడు నాగేశ్వర్‌రెడ్డి(చిన్నబాబు), సర్పంచుల సంఘం మండల నాయకులు పత్తేగడ సర్పంచి వాసనూరి రెడ్డినాగయ్య, వాసనూరి చంద్రశేఖర్, చీకటిపల్లె సర్పంచి సుధాకర్‌రెడ్డి, నీలావతి, గుట్టపాలెం సర్పంచి రూపవెంకట్రమణరెడ్డి, మహల్ సర్పంచి ఖాజాహుస్సేన్, అద్దవారిపల్లె సర్పంచి వెంకట్రమణ (పెద్దన్న), పల్లవోలు సర్పంచి షాబుద్దీన్, ఎంపీటీసీలు శ్యామల, మోహన, లక్ష్మీనరసింహస్వామి ఆలయ మాజీ ఛైర్మన్ హరిస్వామి, కలికిరి తెదేపా అధ్యక్షుడు నిజాముద్దీన్, చెరువుముందరపల్లె వెంకటనారాయణరెడ్డి, గుట్టపాలెం జన్మభూమి కమిటీ సభ్యుడు వెంకట్రమణ, జడ్పీటీసీ మాలతి, ఎంపీటీసీ బసిరి, పదవీవిరమణ చెందిన పోస్ట్ మాస్టర్ క్రిష్ణయ్య, మండల కో-ఆప్షన్ సభ్యుడు మహ్మదాలీ, మున్వర్‌అలీ, ఆనందరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



శ్రీనాథరెడ్డిని కలసిన ఉపాధ్యాయ సంఘం నాయకులు

కోళ్లఫారం (పీలేరు గ్రామీణ) : పీలేరు పోలీసుల దత్త పుత్రికైన చిత్తూరు మార్గంలోని బాలికల గురుకుల పాఠశాలలో సోమవారం సీఐ వేణుగోపాల్, ఎస్సై సుధాకర్‌రెడ్డి, సిబ్బంది విద్యార్థినులతో కలిసి వేడుకలను జరుపుకొన్నారు. 615 మంది విద్యార్థినిలకు ఒక్కో కేకు, మిఠాయిలు పంచి కార్యక్రమాన్ని జరుపుకొన్నారు.





70 కిలోల భారీకేకును కోస్తున్న నల్లారి కిషోర్, కుటుంబసభ్యులు



మాజీ సబ్‌జడ్జి ఇంతియాజ్‌కు ప్రజాప్రతినిధుల, నాయకుల శుభాకాంక్షలు



కిషోర్‌కు శుభాకాంక్షలు తెలుపుతున్న పారపట్ల, చీకటిపల్లె పంచాయతీ నాయకులు

సినిమా	
పీలేరు	
షుకూర్:	ఎంసీఏ
అజంతా:	ఒక్క క్షణం
ఎస్వీమహల్:	హలో
ఎస్వీడీలక్స్:	టూ కంట్రీస్
కలికిరి	
విష్ణు:	టూ కంట్రీస్
ప్రసాద్:	ఎంసీఏ
మదనపల్లె	
ఎవన్ఆర్:	ఎంసీఏ
సిద్ధార్థ:	హలో
శ్రీకృష్ణా:	2 కంట్రీస్
సాయిచిత్ర:	ఒక్క క్షణం
సునీల్:	జుమాంజి
మినీసిద్ధార్థ:	టైగర్ జిందగీ హై
ఎంఎస్ఆర్:	ప్రాజెక్ట్ 2
రవి:	ఎంసీఏ

పుంగనూరు


ఎన్టీఆర్ కూడలిలో చేపట్టిన మానవ హారం

చంద్రన్న సంక్రాంతి కానుకల పంపిణీ

సదుం, న్యూస్‌టుడే : మండలంలోని వారణాసివీధిలోని 19వ నంబరు చౌక దుకాణంలో సోమవారం తెదేపా నాయకుడు శ్రీనివాసులురెడ్డి చంద్రన్న సంక్రాంతి కానుక సరకులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి కార్డుదారునికి చంద్రన్న సంక్రాంతి కానుకలో భాగంగా మండలంలోని 9,867 కార్డుదారులకు శనగలు, కందిబేడలు, బెల్లం, నూనె, గోధుమపిండి, నెయ్యి అందిస్తున్నట్లు చెప్పారు.

పరిశుభ్రతకై చిత్తశుద్ధితో కదులుదాం

పుంగనూరు, న్యూస్‌టుడే : పట్టణ పరిశుభ్రత కోసం ప్రతి ఒక్కరూ చిత్తశుద్ధితో కదులుదామని పురపాలక కమిషనరు లోకేశ్వరవర్మ పిలుపునిచ్చారు. సోమవారం పట్టణంలోని ఇందిరా కూడలి నుంచి ఎన్టీఆర్ కూడలి వరకు స్వచ్ఛసర్వేక్షన్ ర్యాలీ, ఎన్టీఆర్ కూడలిలో మానవహారం చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పట్టణ పరిశుభ్రత ప్రతి పౌరుని బాధ్యత అనే విషయాన్ని ప్రతిఒక్కరూ గుర్తించాలని కోరారు. నిషేధిత ప్లాస్టిక్ కవర్లను వాడరాదని, ప్రతి ఒక్కరూ ఇళ్లల్లో వెలువడే తడిచెత్తను ఆకుపచ్చ, పొడిచెత్తను నీలంరంగు బుట్టల్లో నిల్వచేసి ఉదయం ఇళ్ల వద్దకు వచ్చే పురపాలక సిబ్బందికి అందించే అలవాటును అనుసరించాలని కోరారు. పట్టణంలో ఇప్పటికే కరపత్రాలు, ఫ్లెక్సీలు, హోర్డింగ్‌లు ఏర్పాటు చేసి స్వచ్ఛసర్వేక్షన్ లక్ష్యాన్ని వివరించామన్నారు. స్వచ్ఛఆసుపత్రులు, స్వచ్ఛ ఆలయాలు, స్వచ్ఛ విద్యాలయాలు, స్వచ్ఛవార్డులు, ఉత్తమ వార్డులు, కౌన్సిలర్లను ఎంపిక చేస్తున్నట్లు ప్రకటించామన్నారు. పురపాలక సంఘ సేవలకు 'పురసేవ' యాప్‌ను గూగుల్‌ప్లే స్టోర్ నుంచి డౌన్‌లోడ్ చేసుకోవాలని కోరారు. సమావేశంలో కౌన్సిలర్లు, నేతలు, అధికారులు ఫకృద్దీన్‌షరీఫ్, అమరేంద్ర, సురేంద్రబాబు వారి సిబ్బంది, లయన్స్‌క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు డా.పి.శివ, వరదారెడ్డి, మాజీ అధ్యక్షుడు ముత్యాలు, టీఎంసీ మధుసూదనరెడ్డి, సీసీలు పాల్గొన్నారు.

యాంత్రీకరణతో ఊపందుకున్న వరిసాగు

రొంపిచెర్ల, న్యూస్‌టుడే : మండలంలో పంటల సాగులో యాంత్రీకరణ బాగా ఉపయోగిస్తున్నట్లు రైతులు అంటున్నారు. ఇంతకుముందు వరిపంటను నూర్పిడి చేయాలంటే చాలామంది కూలీలు వచ్చి పంటను కోసి కుప్పవేసిన తరువాత నూర్పిడి చేసేవారు. ప్రస్తుతం ఆ పరిస్థితి మారింది. యాంత్రీకరణ పెరగడంతో తమిళనాడుకు చెందిన నూర్పిడి యంత్రాలు గ్రామానికి వచ్చి కొద్దిపాటి పొలమైనా నూర్పిడి చేసేందుకు వస్తున్నాయి. దీంతో రైతులకు కూలీల సమస్య తీరింది. కాస్త వ్యయంతో కూడుకున్నదైనా పనులు సులభంగా జరుగుతున్నాయని రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. దీనిపై వ్యవసాయాధికారి సూర్యప్రకాష్‌రెడ్డి మాట్లాడుతూ గతంలో కంటే ప్రస్తుతం రైతులు వరిపంట సాగుకు మొగ్గు చూపుతున్నారని అన్నారు.

వినతులకు మోక్షం.. సమస్యలు పరిష్కారం

☛ గత ఏడాది సభలు విజయవంతం ☛ నేటినుంచి ఐదోవిడత జన్మభూమి - మా ఊరు

పుంగనూరు, న్యూస్‌టుడే : కుటుంబ వికాసమే సమాజ వికాసం నినాదంతో గత ఏడాది జనవరి 2నుంచి 11వ తేదీ వరకు నియోజకవర్గంలో నిర్వహించిన జన్మభూమి మా ఊరు కార్యక్రమంలో స్వీకరించిన అర్జీల్లో సింహభాగం అర్జీలు పరిష్కారమయ్యాయి. ఫలితంగా మంగళవారం నుంచి ప్రారంభమయ్యే అయిదోవిడత జన్మభూమి గ్రామసభల కోసం ప్రజలు ఎదురుచూస్తున్నారు. గత ఏడాది గ్రామ


నేతిగుట్లపల్లెలో వినతిపత్రాలు స్వీకరిస్తున్న అధికారులు, ప్రజాప్రతినిధులు (పాతచిత్రం)


పురపాలకలో వైకాపా, తెదేపా నేతల మధ్య చోటుచేసుకున్న వాగ్వాదం (పాతచిత్రం)

సభల్లో వచ్చిన అర్జీలపై తక్షణం చర్యలు తీసుకోవడంతో క్షేత్రస్థాయిలో అర్జీలు ఇవ్వడానికి ప్రజలు సిద్ధమయ్యారు. గతంలో నియోజకవర్గంలోని పుంగనూరు పురపాలక, గ్రామీణ మండలం, చౌడేపల్లె, సోమల, సదుం, పులిచెర్ల, రొంపిచెర్ల మండలాల్లో నిర్వహించిన జన్మభూమి కార్యక్రమాల్లో వచ్చిన 12,509 అర్జీల్లో 10,725 అర్జీలను అధికారులు పరిష్కరించారు. మిగిలిన 1784 అర్జీలు అనర్హమైనవిగా గుర్తించారు. ఈ విడత జన్మభూమిలో రేషన్‌కార్డులు, పింఛన్లు, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ, కాపు కార్పొరేషన్ల రాయితీలు, పక్కాగృహాలు మంజూరు చేయడమే ప్రధాన లక్ష్యంగా పెట్టుకోవడంతో ప్రజల్లో ఆశలు రేకెత్తుతున్నాయి. గత ఏడాది నిర్వహించిన జన్మభూమి మాఊరు నాలుగోవిడత కార్యక్రమంలో చిన్న, చిన్న వివాదాలు జరిగాయి. ఈ ఏడాది జన్మభూమి అర్జీలకే ప్రాధాన్యత ఇచ్చారు.

నాలుగోవిడత జన్మభూమిలో వచ్చిన అర్జీలు పరిష్కారమైన వాటి వివరాలు

మండలం	గ్రామ పంచాయతీలు	మొత్తం అర్జీలు	పరిష్కారమైనవి
పురపాలక	24 వార్డులు	2409	2080
పుంగనూరు	22 పంచాయతీలు	2935	2620
చౌడేపల్లె	19	2424	1854
సోమల	14	841	507
సదుం	16	1019	1019
పులిచెర్ల	25	1976	1790
రొంపిచెర్ల	10	905	855
మొత్తం:	106	12,509	10,725

● నా పేరు ఇందుమతి. పుంగనూరు పురపాలకలోని తాటిమాకులపాళ్యంలో నివసిస్తున్నా. కొన్నేళ్లుగా రేషన్‌కార్డుల కోసం ప్రయత్నం చేశా. అయితే గత ఏడాది మా వార్డులో జరిగిన జన్మభూమి గ్రామసభలో అర్జీ పెట్టుకోమన్నారు. దీంతో నాకు నెలల వ్యవధిలోనే రేషన్ కార్డు అందించారు.



● నాపేరు వెంకటలక్ష్మి, భీమగానిపల్లె. నా భర్త చనిపోవడంతో వితంతు పింఛను కోసం పలువిధాలుగా ప్రయత్నించా. అయితే జన్మభూమిలో అర్జీ ఇచ్చిన తర్వాతనే పింఛను మంజూరైంది. జన్మభూమిలో వినతులు ఇవ్వాలని పలువురికి సూచించా.



గ్రామసభల్లోనే పరిష్కారం

ఈ దఫా సాధ్యమైనంత వరకు గ్రామసభల్లోనే సమస్యలను పరిష్కరించాలని కృషి చేస్తున్నాం. రాష్ట్రప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా జన్మభూమి మాఊరు గ్రామసభలను నిర్వహిస్తుండటంతో గ్రామసభలకు మంచి ప్రజాదరణ ఉంది. అందరూ ఈ గ్రామసభలను సద్వినియోగం చేసుకోవాలి.- **వెంకట్రమణరాజు, తెదేపా నియోజకవర్గ బాధ్యుడు, పుంగనూరు**

ప్రజలు సుఖసంతోషాలతో వర్ధిల్లాలి : ఎమ్మెల్యే

యర్రాతివారిపల్లె (సదుం) న్యూస్‌టుడే : కొత్త సంవత్సరంలో ప్రజలందరు సుఖసంతోషాలు, పాడిపంటలతో వర్ధిల్లాలని ఎమ్మెల్యే పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి ఆకాంక్షించారు. సోమవారం ఆంగ్ల సంవత్సరాదిని పురస్కరించుకుని జిల్లా నలుమూలల నుంచి ఆయన అభిమానులు, నాయకులు, కార్యకర్తలు వివిధ శాఖల అధికారులు శుభాకాంక్షలు తెలిపేందుకు పెద్దసంఖ్యలో తరలివచ్చారు. యర్రాతివారిపల్లెలోని అతిథిగృహం వద్ద ఎమ్మెల్యేను కలసి పుష్పగుచ్ఛాలు అందజేశారు. ఎమ్మెల్యేను కలసిన వారిలో వైకాపా జిల్లా మహిళవిభాగం అధ్యక్షురాలు గాయత్రీదేవి, పీలేరు, చౌడేపల్లె ఎంపీపీలు హరిత, అంజిబాబు, ముర్వాల నరసింహులుశెట్టి, హబీబ్, పుగనూరు జడ్పీటీసీ వెంకటరెడ్డి యాదవ్, పుంగనూరు మున్సిపల్ మాజీ ఛైర్మన్ నాగభూషణం, ముత్యాలు, డాక్టర్ శివ, వరదారెడ్డి స్థానిక నాయకులు ఉన్నారు.

దేవళంపేట (కల్లూరు) : మండలంలోని ఆలయాలన్నీ భక్తులతో కిటకిటలాడాయి. భక్తులు స్వామివారి స్వామివారి దర్శనకోసం క్యూకట్టారు. దేవళంపేటలో వెలసిన శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయసేవలో ఎమ్మెల్యే పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి పాల్గొన్నారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో రాష్ట్ర వైకాపా నాయకులు పోకల అశోక్‌కుమార్, ఎంపీపీ మురళీధర్ ఆధ్వర్యంలో కేకు కోసి ఎమ్మెల్యే పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డితో పాటు పూజలకు హాజరైన భక్తులకు పంచి నూతన సంవత్సర శుభకాంక్షలను తెలిపారు. కల్లూరు - పుంగనూరు రోడ్డులో వెలసిన శ్రీచంద్రమౌళేశ్వరస్వామి ఆలయంలో దీక్షితులు రాజశేఖర్ ప్రత్యేక పూజలను నిర్వహించారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు మురళీమోహన్‌రెడ్డి, నాయకులు ఎన్.ఎస్.రెడ్డిప్రకాష్, రాయల్‌మోహన్, అబ్దుల్‌కలామ్ ఆజాద్, శంకర తదితరులు పాల్గొన్నారు.

● పేదల అభ్యున్నతి కోసం చంద్రబాబు చేపడుతున్న సంక్షేమ పథకాలను ప్రజలకు తెలియజేయాలని జిల్లా తెదేపా అధ్యక్షుడు పులివర్తి నాని, జడ్పీ ఛైర్‌పర్సన్ గీర్వాణి సూచించారు. సోమవారం మాజీ మండల అధ్యక్షుడు ముల్లంగి వెంకటరమణ, కల్లూరు గ్రామానికి చెందిన తెదేపా నాయకులు ఎస్.కరీముల్లా, హెచ్.ఎస్.అష్రూఫ్ తదితరులు చిత్తూరులోని తెదేపా పార్టీ కార్యాలయంలో పులివర్తి నానితో కలిసి పుష్పగుచ్ఛం అందజేసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేశారు. జిల్లా పరిషత్తు కార్యాలయంలో జడ్పీ ఛైర్‌పర్సన్ గీర్వాణిని కలిసి నూతన శుభాకాంక్షలు తెలిపారు.

● నూతన సంవత్సరంలో ప్రతిఇంటా కొత్త సంవత్సరం ఆనందంగా ఉండాలని తెదేపా మండల అధ్యక్షుడు కృష్ణమూర్తినాయుడు ఆకాంక్షించారు. సోమవారం కల్లూరుకు విచ్చేసిన ఆయన చంద్రన్న సంక్రాంతి కానుకల వస్తువులను రేషన్‌కార్డుదారులకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చంద్రబాబునాయుడు ప్రజాసంక్షేమం కోసం అనేక పథకాలను ప్రవేశ పెడుతున్నారని అన్నారు. కార్యక్రమంలో ఆ పార్టీ నాయకులు ఎస్.కరీముల్లా, హెచ్.ఎస్.అష్రూఫ్, రామకృష్ణమనాయుడు తదితరులు పాల్గొన్నారు.

పుంగనూరు : రాష్ట్రంలో జరిగే ఎన్నికలలో అత్యధిక సానాలను కైవశం చేసుకుని చంద్రబాబును మళ్లీమళ్లీ సీఎంని చేద్దామని నియోజకవర్గ తెదేపా సమన్వయకర్త ఎన్.శ్రీనాథరెడ్డి కోరారు. సోమవారం స్థానిక రామకృష్ణారెడ్డి ప్రజాభవనంలో తెదేపా నేతలు, కార్యకర్తల మధ్య నూతన సంవత్సర కేకు కోసి పంచిపెట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నూతన సంవత్సరంలో ప్రతి కార్యకర్త, నేత రాష్ట్రప్రభుత్వం అమలుచేస్తున్న ప్రజాసంక్షేమ పథకాలను ప్రజలకు వివరించి స్థానిక సంస్థల నుంచి ప్రతి ఎన్నికలలో తెదేపా అభ్యర్థులు, మద్దతుదారులను గెలిపించుకుంటే శాసనసభ, పార్లమెంటు ఎన్నికలలో విజయం సునాయాసమవుతుందన్నారు. జన్మభూమి గ్రామసభలు ప్రజల సమస్యల పరిష్కారానికి మంచి వేదిక అవుతుందన్నారు. ఈ కార్యక్రమంలో నేతలు అనిషారెడ్డి, రామ్‌ప్రజ్వలరెడ్డి, రత్నమ్మ, అంజిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.


సదుంలో ఎమ్మెల్యే పెద్దిరెడ్డికి శుభాకాంక్షలు తెలుపుతున్న నాయకులు, కార్యకర్తలు


జడ్పీ ఛైర్‌పర్సన్ గీర్వాణిని కలిసి పుష్పగుచ్ఛం అందజేస్తున్న కల్లూరు తెదేపా నాయకులు


కేకు కోస్తున్న ఎన్.శ్రీనాథరెడ్డి. చిత్రంలో ఆయన సతీమణి అనిషారెడ్డి

పుంగనూరు

అర్హులందరికీ పింఛన్లు పంపిణీ

పుంగనూరు, న్యూస్‌టుడే : పురపాలక పరిధిలో 24 వార్డుల్లో ఎన్టీఆర్ భరోసా పింఛన్లు అర్హులందరికీ అందించాలని పురపాలక కౌన్సిలర్ త్యాగరాజు అన్నారు. సోమవారం పట్టణంలోని కాశీవిశ్వేశ్వరుని ఆలయం వద్ద పురపాలక అధికారులు చేపట్టిన పింఛన్ల పంపిణీలో ఆయన పాల్గొన్నారు. వృద్ధులకు, వికలాంగులకు, వితంతువులకు అనుకూలమైన చోట పింఛన్లు అందిస్తున్నారన్నారు. ఎలాంటి సమస్యలు ఉత్పన్నమైనా తమ దృష్టికి తీసుకురావచ్చన్నారు.

నేడు సోమలలో మంత్రి పర్యటన

ఉప్పరపల్లె (సోమల), న్యూస్‌టుడే : సోమల మండలంలోని 81. ఉప్పరపల్లె పంచాయతీ శీలంవారిపల్లె సమీపంలోని మైదానంలో మంగళవారం జన్మభూమి కార్యక్రమం జరుగుతుందని ఎంపీడీవో శ్రీనివాసులు తెలిపారు. జన్మభూమి కార్యక్రమానికి మధ్యాహ్నం రెండుగంటలకు పరిశ్రమలశాఖ మంత్రి అమరనాథరెడ్డి హాజరవుతారని అన్నిశాఖల అధికారులు పూర్తిస్థాయి నివేదికలతో రావాలని తెలిపారు.


ప్రత్యేక అలంకారంలో కల్యాణ వేంకటరమణ స్వామి ఉత్సవ విగ్రహాలు


యర్రాతివారిపల్లె అయ్యప్ప ఆలయంలో


సోమల అభయాంజనేయస్వామి ఆలయంలో


పెద్దగొట్టిగల్లు ఓంకారేశ్వరస్వామి ఆలయంలో..

భక్తిశ్రద్ధలతో కొత్త సంవత్సర పూజలు

పుంగనూరు, న్యూస్‌టుడే : నూతన ఆంగ్ల సంవత్సరాదితో సోమవారం పట్టణంలోని ఆలయాల్లో భక్తుల రద్దీ నెలకొంది. వేకువజామున నుంచే ఆలయాల్లో దర్శనాలు ప్రారంభమయ్యాయి. స్థానిక కళ్యాణ వెంకటరమణ స్వామి, భోగనంజుండేశ్వరస్వామి, విరూపాక్షి మారెమ్మ, కాశీవిశ్వేశ్వర స్వామి తదితర ఆలయాల్లో ప్రత్యేక పూజలు జరిగాయి. కల్యాణ వేంకటరమణస్వామి ఆలయంలో స్వామివారి మూలవిరాట్, ఉత్సవ విగ్రహాలను, అష్టలక్ష్మి దేవతలను, సత్యనారాయణస్వామిని ప్రత్యేకంగా అలంకరించారు. ప్రత్యేక క్యూలైన్లు, చలువపందిళ్లు ఏర్పాటు చేశారు. అలాగే భోగనంజుండేశ్వరస్వామి, షిర్డీసాయిబాబా, సుబ్రమణ్యస్వామి, సోమేశ్వరస్వామి ఆలయాల్లో విశేష పూజలు చేపట్టారు. ఆలయాలను విద్యుద్దీపాలతో అలంకరించారు.


విరూపాక్షి మారెమ్మ

కిక్కిరిసిన ఆలయాలు

● పట్టణంలోని తాటిమాకులపాళ్యంలో సోమవారం ఆరుపాదాల నందీశ్వరునికి ప్రజలు పూజలు చేశారు. కడప పట్టణం ఇందిరా నగర్‌కు చెందిన వీరయ్య మూడురోజులుగా పట్టణంలో ఈ నందీశ్వరుని ఊరేగిస్తున్నారు. పోతులూరి వీరబ్రహ్మయ్యస్వామి ఆశీస్సులు ప్రజలకు అందివ్వాలనే ఉద్దేశంతో 91 రోజుల జోగి యాత్రను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. తమ గ్రామ సమీపంలో ఓ రైతు ద్వారా పొందిన ఈ నందీశ్వరుడిని పోషించుకుంటూ గ్రామాల్లో యాత్రను కొనసాగిస్తున్నట్లు పేర్కొన్నారు.

మర్రిమాకులపల్లె (పుంగనూరు గ్రామీణ) : శ్రీ కల్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయంలో సోమవారం భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. స్వామివారికి అభిషేకం, అర్చనలు చేసి మొక్కులు తీర్చుకున్నారు. నూతన సంవత్సరం ప్రారంభం రోజును పురస్కరించుకుని భక్తులు వివిధ గ్రామాల నుంచి వచ్చారు. గూడూరుపల్లె గుట్టపై వెలసిన శ్రీ లక్ష్మీనరసింహ ఆలయంలోను భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు.


భోగనంజుండేశ్వర స్వామి

యర్రాతివారిపల్లె (సదుం) : మండలంలోని యర్రాతివారిపల్లెలోని అయ్యప్ప ఆలయం సోమవారం భక్తులతో కిటకిటలాడింది. ఆలయాన్ని పుష్పాలు, విద్యుత్‌దీపాలతో సుందరంగా అలంకరించారు. ఆలయ ప్రధాన అర్చకులు నంబూద్రి నారాయణన్ ఆలయంలో ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేశారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా జడ్పీ మాజీ ఉపాధ్యక్షుడు పెద్దిరెడ్డి ఏర్పాట్లను పర్యవేక్షించారు. పీలేరు డిగ్రీ కళాశాల ఎన్‌సీసీ, సదుం జడ్పీఉన్నత పాఠశాల ఎన్‌సీసీ విద్యార్థులు భక్తులకు సేవలందించారు. పీలేరు ఆర్టీసీ డిపో వారు ప్రత్యేక బస్సులు నడిపారు.


కాశీవిశ్వేశ్వరుడు


సోమల : మండలంలోని 81. ఉప్పరపల్లె పంచాయతీ కమ్మపల్లె, ఆవులపల్లె, సోమల, మిట్టపల్లె, నంజంపేట, చింతలవారిపల్లె, ఇరికిపెంట, నెల్లిమంద, చెన్నయ్యగారిపల్లె, సూరయ్యగారిపల్లె, పెద్దఉప్పరపల్లె తదితర గ్రామాల్లో ఆలయాలు సోమవారం భక్తులతో కిటకిటలాడాయి. సోమలలోని అభయాంజనేయస్వామిని వివిధ మండలాల భక్తులు అధికసంఖ్యలో తరలివచ్చి దర్శించుకున్నారు. పలు ఆలయాలను విద్యుద్దీపాలతో అలంకరించారు. ఆలయ ప్రాంగణాల్లో రాత్రి సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. భక్తులకు అన్నదాన కార్యక్రమం జరిగింది.


ఆవులపల్లెలో సతీసమేత శ్రీవారు

రొంపిచెర్ల : ప్రజలు నూతన సంవత్సరాదిని పురస్కరించుకొని 2018కి ఘనంగా స్వాగతం పలికారు. కొత్త సంవత్సరంలో అన్ని విజయాలే చేకూరాలని ప్రార్థిస్తూ ఆలయాలకు వెళ్లి పూజలు నిర్వహించారు. కట్టక్రింద శివాలయం, పెద్దగొట్టిగల్లు ఓంకారేశ్వరాలయం, మాధవరాయస్వామి ఆలయంలో భక్తులు క్యాకట్టి పూజలు నిర్వహించారు.

సేవాగుణం పెంపొందాలి

పుంగనూరు, న్యూస్‌టుడే : సమాజంలో అన్నివర్గాల వారు విద్య, వైద్య, ఉపాధి, రాజకీయరంగాల్లో రాణించడానికి ప్రతి ఒక్కరిలో సేవాగుణం పెంపొందాలని ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వర్గాల ఐక్యవేదిక అధ్యక్షుడు ఎన్. రెడ్డెప్ప అన్నారు. ఆదివారం రాత్రి స్థానిక అంబేడ్కర్ ప్రగతిభవన్‌లో నిర్వహించిన ఆత్మీయ సదస్సులో ఆయన మాట్లాడారు. 2017 ఏడాదికి వీడ్కోలు, 2018 ఏడాదికి స్వాగతం పలుకుతూ చేపట్టిన ఈ సమావేశంలో సమాజంలో ప్రతి పౌరుడు హక్కులను సద్వినియోగం చేసుకోవాలని బాధ్యతగా వ్యవహరించాలని కోరారు. నాడు విశ్రాంత ఎస్ఈవో గుండాల రామకృష్ణయ్య గ్రామాల్లో మౌలికవసతుల కల్పనకు, ప్రభుత్వ పథకాల అమలుకు యువతలో చైతన్యం తీసుకువచ్చారని అన్నారు. ఎదుటివారికి సహాయపడే గుణాన్ని అలవర్చుకోవాలని కోరారు. ఈ సమావేశంలో వివిధ ప్రజా సంఘాల నేతలు గుండాల రామకృష్ణయ్య, అంజిబాబు, మనోహర్, రామచంద్రయ్య, రామలింగప్ప, మునస్వామి, శ్రీరాములు, శ్రీనివాసులు, జేవీనాగరాజ, రమణ, షంషేర్ తదితరులు పాల్గొన్నారు.



పుంగనూరు

గోకుల్:	హలో
ఎంఎస్ఆర్:	ఒక్క క్షణం
తాజ్‌మహల్:	ఎంసీఏ
వెంకటేశ్వర:	2 కంట్రీస్

మదనపల్లె

ఎఎస్ఆర్:	ఎంసీఏ
సిద్దార్థ:	హలో
శ్రీకృష్ణా:	2 కంట్రీస్
సాయిచిత్ర:	ఒక్క క్షణం
సునీల్:	జుమాంజి
మినీసిద్ధార్థ :	టైగర్ జిందగి హై
ఎంఎస్ఆర్:	ప్రాజెక్ట్ 2
రవి:	ఎంసీఏ

పురపాలకకు ఎల్ఈడీ టీవీల వితరణ

పుంగనూరు, న్యూస్‌టుడే : పట్టణానికి చెందిన విద్యాసంస్థల అధినేత రామచంద్రయాదవ్ సోమవారం పురపాలక కార్యాలయానికి రెండు ఎల్ఈడీ టీవీలను వితరణగా అందించారని పురపాలక కమిషనరు లోకేశ్వరవర్మ తెలిపారు. సుమారు లక్ష రూపాయల విలువ చేసే టీవీలను ఆయన తరపున కాంట్రాక్టర్ ప్రభాకర్ తమకు స్వాధీనపరిచారన్నారు. కార్యాలయంలో దృశ్యశ్రవణ మాధ్యమ కార్యక్రమాల నిర్వహణకు, ప్రభుత్వ పథకాలను ప్రజలకు వివరించడానికి, పలు ప్రజాచైతన్య కార్యక్రమాలు ప్రసారాలు చేపట్టడానికి ఈ టీవీలు దోహదపడతాయన్నారు. పట్టణవాసులు 'మై పుంగనూరు- నా పుంగనూరు' గా భావించి డస్ట్‌బిన్‌లు, పారిశుద్ధ్య విభాగానికి అవసరమైన వాహనాలు, పరికరాలు అందిస్తే మరింత పటిష్టంగా పరిశుభ్రత కార్యక్రమాలు అమలు చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ త్యాగరాజు, దాత బంధువులు ప్రభాకర్, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.


పురపాలక కార్యాలయానికి ఎల్ఈడీ టీవీలను వితరణగా కమిషనరు లోకేశ్వరవర్మకు అందిస్తున్న దాతలు

రోడ్డు నియమాలను పాటించాలి: వైస్ ఛైర్మన్

పుంగనూరు, న్యూస్‌టుడే : రోడ్డు రవాణా నియమాలను పాటిస్తూ వాహనాల చోదకులు ప్రమాదాల నివారణకు సహకరించాలని పురపాలక వైస్‌ఛైర్మన్ అమరేంద్ర కోరారు. సోమవారం స్థానిక అంబేడ్కర్ కూడలిలో మెప్మా ఆర్పీ రెడ్డికుమారి కుమారుడు ప్రథమవర్ధంతి సందర్భంగా ఏర్పాటుచేసిన హెల్మెట్ల పంపిణీ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. గల ఏడాది డిసెంబరు 31వ తేదీ రాత్రి ఇదే కూడలిలో జరిగిన రోడ్డు ప్రమాదంలో తన కుమారుడు హెల్మెట్ పెట్టుకోనందున మృతి చెందాడని రెడ్డికుమారి తెలిపారు. ఆ గర్భశోకం మరొకరికి కలగకుండా తనవంతుగా 40 హెల్మెట్‌లు అందించానన్నారు. కమిషనరు లోకేశ్వరవర్మ మాట్లాడుతూ దస్త్రాలు లేకుండా ద్విచక్ర వాహనదారులు వాహనాలు నడపరాదన్నారు. హెల్మెట్ విధిగా ధరించి డ్రైవింగ్ చేయాలని, ఆటోలలో పరిమితికి మించి ప్రయాణికులను, సరకులను తరలించడం ప్రమాదకరమన్నారు. ప్రమాదం జరిగిన వెంటనే క్షతగాత్రులను ఆసుపత్రికి తరలిస్తే ప్రాణాపాయం నుంచి బయటపడతారని అన్నారు. కార్యక్రమంలో నేతలు ఫకృద్దీన్‌షరీఫ్, త్యాగరాజు, మనోహర్, అమ్ము, ఇబ్రహీం, రేష్మా, దివ్యలక్ష్మి, టీఎంసీ మధుసూదనరెడ్డి, సీవో అనిత పాల్గొన్నారు.


ద్విచక్రవాహనదారులకు హెల్మెట్లను వితరణగా అందిస్తున్న దాత రెడ్డికుమారి

చర్చిలలో ప్రత్యేక ప్రార్థనలు

పుంగనూరు గ్రామీణ, న్యూస్‌టుడే : నూతన సంవత్సరాన్ని పురస్కరించుకుని క్రైస్తవ సోదరులు సోమవారం ఉదయం ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అనంతరం వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా పాస్టర్ పసల యేషయ్య మాట్లాడుతూ పాత సంవత్సరం గతించి.. కొత్త సంవత్సరం ప్రారంభమైందని, అందరూ సుఖసంతోషాలతో ఆనందంగా ముందుకెళ్లాలన్నారు. చర్చిలో కర్త భోజన కార్యక్రమం నిర్వహించారు. పాస్టర్ నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. మధ్యాహ్నం సీఎంసీ బంగ్లా మైదానంలో క్రైస్తవులు క్రీడలు, వివిధ సాంస్కృతిక కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఈ కార్యక్రమాల్లో గెలుపొందిన వారికి బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో సంఘ కార్యదర్శి భక్తవత్సలం ఆండ్రూస్, కోశాధికారి సుధాకర్, మాజీ కార్యదర్శి భరత్‌భూషణ్, సభ్యులు సత్యరాజ్, సురేష్ క్రిస్టఫర్, జాషువా ప్రేమకుమార్, రవికుమార్, చిన్నాపాల్, ఈఎస్. భాస్కర్, ఏస్తేర్‌రాణి, సుకన్య స్త్రీలమైత్రి సభ్యులు, యువత పాల్గొన్నారు.


చర్చిలో ప్రత్యేక ప్రార్థనలు చేస్తున్న క్రైస్తవ సోదరులు

పూతలపట్టు

మంచిమాట

జీవన మరణాలు, సుఖ దుఃఖాల్లో భగవంతుడి కృప సమానంగా ప్రసరిస్తుంది. ఆయన ప్రపంచమంతా నిండి ఉన్నాడు. మనో నేత్రాన్ని తెరచి, ఆయన్ని గ్రహించండి.

-స్వామి వివేకానంద



అర్ధగిరిలో ఈనాడు

తవణంపల్లి; **ఉదయం:**5.00-5.30 - సుప్రభాత సేవ, అలంకారం;5.30-7.00 - దర్శనం;7.00-7.30 - నైవేద్యం;7.30-9.00 - దర్శనం;9.00-10.00 - పంచామృతాభిషేకం, చందన అలంకారం;10.00-11.30 - దర్శనం;11.30-12.00 - ఆకుపూజ;**మధ్యాహ్నం:**12.00-12.30 - వడమాలసేవ, నైవేద్యం;12.30-1.15 - దర్శనం;1.15-1.45 - విరామం;1.45-3.30 - దర్శనం;3.30-4.00 - సహస్ర నామార్చన;**సాయంత్రం:**4.00-5.00 - దర్శనం;5.00-5.30 - ఆకుపూజ;5.30-7.00 - దర్శనం;రాత్రి: 7.00-7.30 - నైవేద్యం;7.30-9.00 - దర్శనం;ఉదయం 11-00 గంటలకు సుదర్శనహోమం;రాత్రి 7-30 గంటలకు ప్రాకారోత్సవం.

-న్యూస్‌టుడే, తవణంపల్లె

ఎస్సైగా మనోహర్ బాధ్యతల స్వీకరణ

జోడిచింతల (యాదమరి), న్యూస్‌టుడే: యాదమరి ఎస్సైగా మనోహర్ సోమవారం ఉదయం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పనిచేస్తున్న ఎస్సై రఘుపతి చిత్తూరు స్పెషల్ బ్రాంచికి బదిలీ అయ్యారు. పలమనేరు అర్బన్ ఎస్సైగా పనిచేస్తున్న మనోహర్‌ను యాదమరికి బదిలీ చేశారు. సోమవారం ఉదయం యాదమరి పోలీసు స్టేషన్‌కు చేరుకున్న మనోహర్ ఎస్సైగా బాధ్యతలు స్వీకరించారు. మండలంలో శాంతిభద్రతల నిర్వహణకు అధిక ప్రాధాన్యం ఇస్తానని ఈ సందర్భంగా ఆయన అన్నారు. ట్రాఫిక్ నియంత్రణకు కృషి చేస్తామని వివరించారు.



కాణిపాకం; ఉదయం: 4.00-4.15 - సుప్రభాత సేవ;4.15-4.30 - గోపూజ;4.30-5.00 - బిందుతీర్థ అభిషేకం;5.00-5.30 - నిజరూప దర్శనం;5.30-6.00 - పంచామృతాభిషేకం;6.00-7.00 - సర్వదర్శనం;7.00-7.30 - నిజరూప దర్శనం;7.30-8.00 - క్షీరాభిషేకం;8.00-8.30 - సర్వదర్శనం;8.30-9.00 - నిజరూప దర్శనం;9.00-10.00 - పంచామృతాభిషేకం;10.00-10.30 - సర్వదర్శనం;10.30-11.00 - నిజరూప దర్శనం;11.00-12.00 - అభిషేకం; **మధ్యాహ్నం:** 12.00-4.30 - సర్వదర్శనం; **సాయంత్రం:** 4.30-5.00 - నిజరూప దర్శనం;5.00-5.15 - ప్రమాణాలు;5.15-5.45 - ఆలయ శుద్ధి;5.45-6.15 - క్షీరాభిషేకం;6.15-6.30 - మహాహారతి; రాత్రి: 6.30-9.30 - సర్వదర్శనం;9.30-10.00 - ఏకాంత సేవ; అన్వేటి మండపంలో ఉదయం 7.00- సాయంత్రం 6.00 వరకు అష్టోత్తర శతనామార్చన; 9.30-10.30 - గణపతి హోమం; 11.00-12.00 - గణపతి హోమం; 11.30-12.30 - కల్యాణోత్సవం; రాత్రి 7.00-7.30 - ఊంజల్ సేవ.

-న్యూస్‌టుడే, కాణిపాకం



అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేస్తున్న దళితనాయకులు

ఐక్యతతో సమస్యలు పరిష్కరించుకోవాలి

పూతలపట్టు, న్యూస్‌టుడే: మండలంలోని దళితులు పార్టీలకతీతంగా ఐక్యమత్యంగా సమస్యలను పరిష్కరించుకోవాలని దళితనాయకులు డాక్టర్ మునిరత్నం అన్నారు. సోమవారం నూతన సంవత్సరం సందర్భంగా మండలంలోని దళిత నాయకులు సమావేశం ఏర్పాటు చేసుకొని శుభాకాంక్షలు తెలుపుకొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నేటికీ గ్రామీణ ప్రాంతాల్లో దళితులు సమస్యలతో సతమతమవుతున్నారు. ఈ ఏడాది నుంచి సమస్యలు వస్తే ఇతర నాయకుల వద్దకు వెళ్లకుండా మన సమస్యలను మనమే పరిష్కరించుకొనేలా కార్యచరణ రూపొందించుకోవాలని చెప్పారు. మండల కేంద్రంలో నూతనంగా నిర్మిస్తున్న అంబేడ్కర్ భవన నిర్మాణానికి అందరూ సహకరించాలని ఆయన కోరారు. అనంతరం దళితులంతా అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో జీవరత్నం, మునిరత్నం తదితరులు పాల్గొన్నారు.

కాణిపాకంలో పోటెత్తిన భక్తజనం



కాణిపాకం వినాయకుని దర్శనార్థం క్యూలైన్లలో వేచి ఉన్న భక్తులు

కాణిపాకం, న్యూస్‌టుడే: ఆంగ్ల నూతన సంవత్సరం సందర్భంగా... స్వయంభు శ్రీ వరసిద్ధి వినాయకస్వామి వారి ఆలయంలో గతంలో మాదిరి భక్తుల రద్దీ కొనసాగింది. రాష్ట్ర దేవాదాయ, ధర్మాదాయశాఖ ఆదేశాల మేరకు ఆంగ్ల నూతన సంవత్సరం సందర్భంగా ఎలాంటి సంబరాలు నిర్వహించలేదు. కేవలం భక్తులకు దర్శన ఏర్పాట్లు చేపట్టారు. ఈ నేపథ్యంలో వరసిద్ధుని దర్శనానికి భక్తులకు సుమారు 4 గంటల సమయం పట్టింది. ఈ ఏడాది ప్రత్యేక అభిషేకాన్ని అర్ధరాత్రి 12 గంటలకు కాకుండా, వేకువజామున 3 గంటలకు నిర్వహించారు. ఉభయదారులతో స్వామివారికి ప్రత్యేక అభిషేకం జరిపారు. స్వామివారి మూలవిగ్రహానికి ప్రత్యేక అలంకారం చేశారు. అనంతరం వేకువజామున 4 గంటలకు భక్తులను దర్శనానికి అనుమతించారు. అప్పటి నుంచి సాయంత్రం వరకు భక్తుల రద్దీ ఏమాత్రం తగ్గలేదు. ఎటుచూసినా భక్తజనం సందడితో ఆలయ పరిసరాలు కళకళలాడాయి. ఆలయంలోని రూ.100, రూ.51, రూ.10, ఉచిత దర్శన క్యూలైన్లు భక్తులతో పూర్తిగా నిండిపోయాయి. భక్తులు స్వామివారి దర్శనం కోసం ఆలయం వెలుపలి వరకు బారులు తీరారు. సుమారు 80వేల మందికి పైగా భక్తులు స్వామివారిని దర్శించుకున్నట్లు ఆలయ అధికారులు వివరించారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా ఆలయ ఈవో పెనుమాక పూర్ణచంద్రరావు ఏర్పాట్లు పర్యవేక్షించారు. చిత్తూరు డీఎస్పీ సుబ్బారావు, సీఐ ఆదినారాయణ ఆధ్వర్యంలో పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు. పలువురు దాతలు భక్తులకు ఉచిత ప్రసాదాలు అందించారు.

వినాయకుడికి వెండి పళ్లెం కానుక

కాణిపాకం, న్యూస్‌టుడే: స్వయంభు శ్రీవరసిద్ధి వినాయకస్వామి వారికి ఓ భక్తుడు వెండి పళ్లెం కానుకగా ఇచ్చారు. నెల్లూరుకు చెందిన రామకృష్ణ అనే భక్తుడు రూ.50 వేలు విలువ చేసే కిలో బరువు కలిగిన వెండి పళ్లెం ఈవో పెనుమాక పూర్ణచంద్రరావుకు అందించారు. ఆలయ మర్యాదల ప్రకారం దాత, కుటుంబ సభ్యులకు స్వామివారి దర్శనం కల్పించి, తీర్థప్రసాదాలు అందించారు. మూషికమండపంలో వేదపండితులు వారిని ఆశీర్వదించారు. కార్యక్రమంలో ఆలయ ఏఈవో రవీంద్రబాబు, ఇన్‌స్పెక్టర్ బాలాజీనాయుడు పాల్గొన్నారు.

దర్శనానికి 4 గంటల సమయం



వెండి పళ్లెం ఈవోకు అందిస్తున్న దాత రామకృష్ణ, కుటుంబ సభ్యులు

ఆలయాలు కిటకిట..

తవణంపల్లె, న్యూస్‌టుడే: అర్ధగిరి శ్రీవీరాంజనేయ స్వామి ఆలయంలో ఆంగ్ల నూతన సంవత్సరాన్ని పురస్కరించుకుని అధిక సంఖ్యలో భక్తులు తరలి వచ్చి స్వామి వారిని దర్శించుకున్నారు. భక్తులకు ఉచితంగా తీర్థప్రసాదాలు అందించారు. అర్ధగిరి ఆలయ ఛైర్మన్ జెట్టిపల్లి శ్రీనివాసులు, ధర్మకర్తల మండలి సభ్యులు, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

బంగారుపాళ్యంలో..

బంగారుపాళ్యం, న్యూస్‌టుడే: నూతన సంవత్సరం సందర్భంగా మండలంలోని ఆలయాలు సోమవారం భక్తులతో కిక్కిరిశాయి. భక్తులు ఉదయం నుంచి ఆలయాల వద్ద క్యూ కట్టారు. మండలంలోని మొగిలి గ్రామంలో వెలసిన స్వయంభు మొగిలీశ్వరస్వామి ఆలయం, మొగిలివెంకటగిరిలోని శ్రీకోదండరామస్వామి ఆలయం, నల్లగాంపల్లె దేవర కొండపై వెలసిన శ్రీదేవి, భూదేవి సమేత శ్రీవేంకటేశ్వర స్వామి ఆలయం, వజ్రాలపురం బోయకొండ గంగమ్మ ఆలయం, బంగారుపాళ్యంలోని ముత్యాలమ్మ ఆలయాల్లో భక్తుల సందడి నెలకొంది. అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించి భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు.

ఐరాలలో...

ఐరాల, న్యూస్‌టుడే: మండల వ్యాప్తంగా ప్రజలు వేడుకగా ఆంగ్ల నూతన సంవత్సర సంబరాలు నిర్వహించుకున్నారు. పెద్ద ఎత్తున ఆలయాలకు వెళ్లి ప్రత్యేక పూజలు జరిపారు. పలుచోట్ల యువకులు శుభాకాంక్షలు తెలిపే స్వాగత తోరణాలు ఏర్పాటు చేశారు. ఈ క్రమంలో ఐరాలలోని పాలేటమ్మ ఆలయంలో అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించారు. పెద్దసంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు.



ఐరాల: ప్రత్యేక అలంకరణలో పాలేటి గంగమ్మవారు

యాదమరిలో...

యాదమరి, న్యూస్‌టుడే: యాదమరిలోని శ్రీఇంద్రవరద రాజస్వామి ఆలయం, శ్రీఏకాంబరేశ్వరస్వామి ఆలయం, శ్రీఅయ్యప్ప, షిరిడిసాయి బాబా ఆలయాలకు భక్తులు పెద్దసంఖ్యలో తరలివచ్చారు. ప్రత్యేక పూజలు నిర్వహించారు.



బంగారుపాళ్యం: అమ్మవారి దర్శనానికి తరలి వచ్చిన భక్తులు

నేడు అర్ధగిరిలో పౌర్ణమి వేడుకలు

అర్ధగిరి (తవణంపల్లె), న్యూస్‌టుడే: అర్ధగిరి శ్రీవీరాంజనేయస్వామి ఆలయంలో మంగళవారం పౌర్ణమి వేడుకలను ఘనంగా నిర్వహించనున్నట్లు ఆలయ ఛైర్మన్ జెట్టిపల్లి శ్రీనివాసులు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. పౌర్ణమిని పురస్కరించుకుని స్వామి వారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేయనున్నారు. బంగారుపాళ్యం నుంచి భక్తులు అర్ధగిరిని చేరుకోవడానికి ఆర్టీసీ యాజమాన్యం ప్రత్యేక బస్సు సర్వీసులను నడుపుతోంది. సుదూర ప్రాంతాల నుంచి తరలి వచ్చిన భక్తుల సౌకర్యార్థం రాత్రి ఆలయ ప్రాంగణంలో అన్నదానం, పలురకాల సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించనున్నారు. అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చి స్వామి వారి సేవలో పాల్గొనాలని ఆలయ ఛైర్మన్ జెట్టిపల్లి శ్రీనివాసులు, ఇన్‌ఛార్జి ఈవో రామకృష్ణారెడ్డి కోరారు.

గణనాథుని సేవలో పలువురు ప్రముఖులు

కాణిపాకం, న్యూస్‌టుడే: ఆంగ్ల నూతన సంవత్సరం సందర్భంగా పలువురు భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు. ఈ క్రమంలో జిల్లా ఎస్పీ రాజశేఖర్‌బాబు, పూతలపట్టు వైకాపా ఎమ్మెల్యే సునీల్‌కుమార్, డీసీసీబీ ఛైర్మన్ అమాస రాజశేఖర్ రెడ్డి, సినీ నటుడు నాగినీడు వేర్వేరుగా దర్శించుకున్నారు. ఆలయ మర్యాదల ప్రకారం ఈవో పెనుమాక పూర్ణచంద్రరావు, అర్చకులు రాజగోపురం వద్ద వారికి స్వాగతం పలికారు. అనంతరం వారు స్వామివారి సేవలో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. సంప్రదాయం ప్రకారం ప్రముఖులకు స్వామి వారి శేషవస్త్రాలు, తీర్థప్రసాదాలు ఈవో అందించారు. మూషికమండపంలో వేదపండితులు ప్రముఖులను ఆశీర్వదించారు. ప్రాంగణంలోని వీరాంజనేయస్వామి, నవగ్రహాలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు. ప్రముఖుల వెంట ఆలయ ఏఈవో రవీంద్రబాబు, సూపరింటెండెంట్ స్వాములు, ఇన్‌స్పెక్టర్లు బాలాజీనాయుడు, రమేష్ ఉన్నారు.



జిల్లా ఎస్పీ రాజశేఖర్‌బాబుకు స్వామివారి ప్రసాదాలు అందిస్తున్న ఈవో పూర్ణచంద్రరావు



స్వామివారి సేవలో పాల్గొని వస్తున్న ఎమ్మెల్యే సునీల్‌కుమార్



పాల క్యాన్లను పంపిణీ చేస్తున్న హెరిటేజ్ ట్రస్టు సభ్యులు

రైతు అభ్యున్నతే హెరిటేజ్ లక్ష్యం

తాళంబేడు (చిత్తూరు గ్రామీణ), న్యూస్‌టుడే : రైతుల సంక్షేమమే లక్ష్యంగా హెరిటేజ్ సంస్థ పని చేస్తోందని ట్రస్టు సభ్యులు రామచంద్రనాయుడు తెలిపారు. మండలం తాళంబేడు క్రాస్‌లో హెరిటేజ్ ఫుడ్స్ ప్రైవేట్ లిమిటెడ్ సోమవారం పాడి రైతులకు పాల క్యాన్ల పంపిణీ చేసింది. ఆయన మాట్లాడుతూ హెరిటేజ్ సంక్షేమ ట్రస్టు ద్వారా పాడి రైతులకు బీమా పథకాన్ని అమలు చేస్తోందన్నారు. ట్రస్టు సభ్యులైన రైతులకు నామమాత్ర రుసుం ద్వారా రూ.2 లక్షల నుంచి రూ.50 వేల వరకు బీమా నగదుతో పాటు ఉచిత వైద్యసేవలు అందిస్తున్నట్లు చెప్పారు. రైతుల అభ్యున్నతికి హెరిటేజ్ ట్రస్టు ద్వారా ఉచిత వైద్యశిబిరాలు, పశుపోషణ సదస్సులు, ప్రోత్సాహక బహుమతులు, గృహోపకరణాలు అందజేస్తోందని తెలిపారు. రైతులందరూ హెరిటేజ్ సేవలను సద్వినియోగం చేసుకొని, మరింతగా ఆర్థిక ప్రగతి సాధించాలని కోరారు. కార్యక్రమంలో హెరిటేజ్ సంస్థ ప్రతినిధులు హరిప్రసాద్, పద్మనాభనాయుడు, పర్యవేక్షకులు సుబ్రహ్మణ్యం, శంకర్, రైతులు పాల్గొన్నారు.

పూతలపట్టు

నేటి నుంచి 'జన్మభూమి ..మాఊరు' గ్రామసభలు

బంగారుపాళ్యం, న్యూస్‌టుడే: మండలంలో ఈ నెల 2 నుంచి 11 వరకు అయిదో విడత జన్మభూమి, మాఊరు గ్రామసభలు జరుగుతాయని ఎంపీడీవో దయానంద్ తెలిపారు. ఉదయం 10 గంటల నుంచి ఆయా పంచాయతీ కార్యాలయాలు, ప్రభుత్వ కార్యాలయాల్లో సాయంత్రం వరకు ఈ గ్రామ సభలు జరుగుతాయని వివరించారు. ఈ నెల 2న మంగళపల్లె, జిల్లేడుపల్లె, తంబుగానిపల్లె, చీకూరుపల్లె, 3న కల్లూరుపల్లె, కాటప్పగారిపల్లె, బోడబండ్ల, నల్లగాం పల్లె, తిమ్మోజపల్లె, 4న బొమ్మాయిపల్లె, సదకుప్పం, శెట్టేరి, తుపాయనపల్లె, 5న నల్లంగాడు, పెరుమాళ్లపల్లె, తుంబకుప్పం, ఈచనేరిపల్లె, తుంబ, 6న కొదలమడుగు కీరమంద, టేకుమంద, మొగిలి, 7న వెలుతురుసేను, కె.ఎం.కండిగ, రాగిమానుపెంట, గుంతూరు, 8న జంబువారిపల్లె, ముంగరమడుగు, 45గొల్లపల్లి, 9న కరిడివారిపల్లె, మొగిలివెంకటగిరి, పాలేరు, మొగిలివారిపల్లె, 10న మహాసముద్రం, సంక్రాంతిపల్లె, గుండ్లకట్టమంచి, కుర్మాయిపల్లె, చిల్లగుండ్లపల్లె, 11న బంగారుపాళ్యం, తగ్గవారిపల్లెలో జన్మభూమి గ్రామసభలు జరుగుతాయని ఆయన చెప్పారు.

నేడు నాలుగు గ్రామాల్లో....

తవణంపల్లె, న్యూస్‌టుడే: మండల పరిధిలోని నాలుగు గ్రామాల్లో జన్మభూమి-మా ఊరు మంగళవారం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో రవికుమార్ తెలిపారు. కారకాంపల్లె పంచాయతీలో పంచాయతీ భవనంలో ఉదయం 9.00 గంటలకు, పల్లెచెరువు పంచాయతీలో శ్రీరాముల గుడి వద్ద 10.45 గంటలకు, ఈచనేరి పంచాయతీలో పంచాయతీ భవనం వద్ద 2.30 గంటలకు, వెంగంపల్లె పంచాయతీలో శ్రీరాముల గుడి వద్ద 4.00 గంటలకు జన్మభూమి-మా ఊరు నిర్వహిస్తున్నామన్నారు. ప్రజలు తమ సమస్యలను వినతుల రూపంలో ప్రజాప్రతినిధులు, అధికారులకు తెలియజేయాలని కోరారు.

యాదమరిలో..

యాదమరి, న్యూస్‌టుడే: మండలంలో 2 నుంచి 11 వరకు మంగళవారం నుంచి 5వ విడత 'జన్మభూమి-మాఊరు' గ్రామసభలు జరుగుతాయని ఎంపీడీవో పారిజాతం తెలిపారు. 2వ తేదీన తెల్లరాళ్లపల్లె, 155కమ్మపల్లె, బుడితిరెడ్డిపల్లె, 3న దాసరాపల్లె, మాధవరం, జంగాలపల్లె, 4న సిద్ధారెడ్డిపల్లె, పత్రపల్లె, భూమిరెడ్డిపల్లె, 5న పెరియంబాడి, కొట్టాలం, కృష్ణంపల్లె, 6న 14 కండిగ ముస్లింవాడ, 184గొల్లపల్లె, 12కమ్మపల్లె, 7న అతికారపల్లె, దళవాయిపల్లె, మాదిరెడ్డిపల్లె, 8న కోణాపల్లె, మోర్ధానపల్లె, బుడితిరెడ్డిపల్లె, 9న ఓటివారిపల్లె, కాశిరాళ్ల, 10న కీనాటంపల్లె, వరదరాజులపల్లె, 11న యాదమరిలో గ్రామసభలు జరుగుతాయన్నారు. 3వ తేదీన గ్రామసభలకు జిల్లా పరిషత్తు ఛైర్‌పర్సన్ గీర్వాణీ హాజరవుతారని వివరించారు.

చట్టబద్ధంగా విధులు నిర్వహిస్తాం..

చిత్తూరు (నేరవార్తలు), న్యూస్‌టుడే: చిత్తూరు నగరంలోని గాంధీ విగ్రహ కూడలిలో సోమవారం పోలీసు అధికారులు ప్రతిజ్ఞ చేశారు. జిల్లా ఎస్పీ రాజశేఖర్‌బాబుతో పాటు డీఎస్పీలు, సీఐలు, ఎస్సైలు, కానిస్టేబుళ్లందరూ కలసికట్టుగా ప్రమాణం చేశారు. పోలీసు శాఖలో పనిచేస్తున్న అందరం చట్టబద్ధంగా పనిచేస్తామని.. ఎలాంటి ఒత్తిడికి తలొగ్గమని.. నిజాయితీగా విధులు నిర్వహిస్తామన్నారు.

ఘనంగా నూతన సంవత్సర వేడుకలు



తెదేపా కార్యాలయంలో కేక్‌ను కోస్తున్న పార్టీ మండల అధ్యక్షుడు ఎన్.పి.జయప్రకాష్‌నాయుడు

బంగారుపాళ్యం, న్యూస్‌టుడే: స్థానిక తెదేపా కార్యాలయంలో సోమవారం ఆంగ్ల నూతన సంవత్సర వేడుకలు ఘనంగా జరిగాయి. తెదేపా మండల అధ్యక్షుడు ఎన్.పి. జయప్రకాష్‌నాయుడు కేక్‌ను కోసి కార్యకర్తలు, నాయకులకు పంచి పెట్టారు. నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి అమలు చేస్తున్న సంక్షేమ ఫలాలు నూతన సంవత్సరంలో అర్హులైన అందరికీ అందుతాయని వివరించారు. నాయకులు, కార్యకర్తలు పార్టీ బలోపేతానికి కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో మాజీ మార్కెట్ కమిటీ ఛైర్మన్ జయచంద్ర నాయుడు, తెదేపా జిల్లా యువత అధ్యక్షుడు ప్రకాష్‌నాయుడు, తెదేపా జిల్లా యువత కార్యదర్శి చరణ్, రాధాకృష్ణ, కేశవులు, శివ, సూరినాయుడు, మైనారిటీ నాయకులు రహంతుల్లాఖాన్, జాకీర్ తదితరులు పాల్గొన్నారు.

పూతలపట్టులో..

పూతలపట్టు, న్యూస్‌టుడే: పూతలపట్టు మండలంలో సోమవారం నూతన సంవత్సర వేడుకలు ఘనంగా జరిగాయి. రాత్రి 12గంటలకు ఆయా పార్టీలకు చెందిన కార్యకర్తలు నాయకుల ఇళ్ల వద్దకు వెళ్లి బాణసంచా పేల్చి శుభాకాంక్షలు తెలిపారు. పలు చోట్ల నాయకులు కార్యకర్తలకు పెద్దఎత్తున విందు కార్యక్రమాలు నిర్వహించారు. ఉదయం 9గంటల ప్రాంతంలో ఎంపీపీ వీణ, జడ్పీటీసీ సభ్యురాలు వనజ తదితరులను మండలంలోని అధికారులు కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. కేక్‌లు కోసి ఒకరికి ఒకరు తినిపించుకొన్నారు. ఈ సందర్భంగా ఎంపీపీ, జడ్పీటీసీ సభ్యులు మాట్లాడుతూ 2018వ సంవత్సరంలో మండలంలోని ప్రజలు సుఖసంతోషాలతో ఉండాలని కోరారు. నూతన సంవత్సరం సందర్భంగా ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి.

తవణంపల్లెలో...

తవణంపల్లె, న్యూస్‌టుడే: నూతన ఆంగ్ల సంవత్సరాన్ని పురస్కరించుకుని సోమవారం మండల కేంద్రంలోని ఎంపీపీ కార్యాలయంలో సంబరాలు నిర్వహించారు. ప్రజాప్రతినిధులు, ప్రభుత్వాధికారులు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలుపుకొన్నారు. ఐకమత్యంతో అందరూ కలిసి మెలసి పనిచేసి మండలాన్ని మరింత అభివృద్ధి దిశగా నడిపించాలని కోరారు. కార్యక్రమంలో జడ్పీటీసీ సభ్యుడు వెంకటేశ్వరచౌదరి, ఎంపీపీ సరళకుమారి, తెదేపా మండలాధ్యక్షుడు వేణుగోపాలనాయుడు, తెదేపా జిల్లా బీసీసెల్ ఉపాధ్యక్షుడు గిరిబాబు, ఎంపీడీవో కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

యాదమరిలో...

యాదమరి, న్యూస్‌టుడే: ప్రభుత్వ కార్యాలయాల్లో ఉద్యోగులు నూతన సంవత్సర సంబరాలు చేసుకున్నారు. మండల జడ్పీటీసీ సభ్యురాలు ఉషను ఎస్టీయూ ఉపాధ్యాయ సంఘం మండల అధ్యక్షుడు మదన్‌మోహన్‌రెడ్డి, కార్యదర్శి సుబ్రహ్మణ్యం, సంఘం నేతలు కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఎంపీడీవో పారిజాతం, మండల పరిషత్తు ఉద్యోగులు, ఉపాధిహామీ ఏపీవో, ఉద్యోగులు జడ్పీటీసీ సభ్యురాలిని కలిసి పుష్పగుచ్ఛాలను అందించి శుభాకాంక్షలు తెలిపారు. తహసీల్దారు కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో రెవెన్యూ ఉద్యోగులు తహసీల్దారు రెడ్డప్పకు శుభాకాంక్షలు తెలిపారు. పోలీసు స్టేషన్‌లో ఎస్సై మనోహర్ కేక్ కోసి సిబ్బందికి పంపిణీ చేశారు. మండల పరిషత్తు కార్యాలయంలో ఉద్యోగులు ఎంపీడీవో పారిజాతానికి శుభాకాంక్షలు తెలిపారు.

బంగారుపాళ్యంలో...

బంగారుపాళ్యం, న్యూస్‌టుడే: పూతలపట్టు నియోజకవర్గ బాధ్యురాలు, మాజీ ఎమ్మెల్యే లలితకుమారి ఆధ్వర్యంలో నూతనసంవత్సర వేడుకలు జరిగాయి. ఇదే రోజు ఆమె పుట్టిన రోజు కావడం విశేషం. దీంతో ఆమె నివాసంలో నాయకులు, కార్యకర్తల నడుమ నూతన సంవత్సర, పుట్టిన రోజు సంబరాలు నిర్వహించారు. కేక్ కోసి పంచి పెట్టారు. బంగారుపాళ్యం, ఐరాల, తవణంపల్లె, పూతలపట్టు, యాదమరి మండలాల్లోని తేదేపానాయకులు, ప్రజాప్రతినిధులు అధికారులు, వీఆర్వోలు, గ్రామకార్యదర్శులు, పలుశాఖల అధికారులు ఆమెకు నూతన సంవత్సరం, పుట్టిన రోజు శుభాకాంక్షలు తెలిపారు. తెదేపా మండల అధ్యక్షుడు ఎన్‌పి జయప్రకాష్‌నాయుడు, తహసీల్దారు మురళి, ఎంపీడీవో దయానంద్, బంగారుపాళ్యం ఎస్సై నెట్టి కంఠయ్య తదితరులు ఆమెను సత్కరించారు.



యాదమరి: జడ్పీటీసీ సభ్యురాలు ఉషకు పుష్పగుచ్ఛాలు అందించి శుభాకాంక్షలు తెలుపుతున్న ఎస్టీయూ ఉపాధ్యాయ సంఘం నేతలు



యాదమరి: పోలీసు స్టేషన్‌లో కేక్ కట్ చేసి పంపిణీ చేస్తున్న ఎస్సై మనోహర్



కేక్ కోస్తున్న పూతలపట్టు నియోజకవర్గ బాధ్యురాలు లలితకుమారి

కులధ్రువీక'రణం'.. విద్యార్థుల అయోమయం!



తమ పిల్లలకు కులధ్రువీకరణ పత్రం రావడం లేదని వాపోతున్న బుడితిరెడ్డిపల్లె ముస్లింవాడ వాసులు

యాదమరి (బుడితిరెడ్డిపల్లె), న్యూస్‌టుడే: చిత్రంలో పత్రం పట్టుకుని కనిపిస్తున్న విద్యార్థి పేరు జహీర్ బాష. చిత్తూరులోని ఓ కళాశాలలో డిగ్రీ మొదటి సంవత్సరం చదువుతున్నారు. ఇటీవల ఉపకారవేతనం కోసం దరఖాస్తు చేసుకోవడానికి కులధ్రువీకరణ కోసం మీ-సేవా కేంద్రంలో దరఖాస్తు చేసుకున్నారు. తీరా తన 10వ తరగతి టీసీలో నమోదైన కులం పేరు రికార్డుల్లో లేదని కులధ్రువీకరణ పత్రం ఇవ్వలేమన్నారు. ఈ సమస్య ఒక్క జహీర్ బాషదే కాదు. మండలంలోని బుడితిరెడ్డిపల్లె ముస్లింవాడలోని పదుల సంఖ్యలోని విద్యార్థుల వెత. గడిచిన నాలుగైదు ఏళ్లుగా వీరు కులధ్రువీకరణ పత్రం పొందలేక ప్రభుత్వం నుంచి అందే ఉపకారవేతనాలు కోల్పోతున్నారు.

తప్పని తిప్పలు

మండలంలోని బుడితిరెడ్డిపల్లె ముస్లింవాడ గ్రామంలో సుమారు 50 ముస్లిం కుటుంబాల వారు జీవనం సాగిస్తున్నారు. ఇక్కడ గతంలో తమ పిల్లలను పాఠశాలల్లో చేర్పించే సమయంలో తల్లిదండ్రులు తమ కులం పేరును ఇండియన్ ముస్లిం మొఘల్‌గా నమోదు చేయించారు. దీంతో ఆ తరువాత తరగతుల్లోనూ ఇదే కులం పేరుతో పాఠశాలల నుంచి టీసీలు నమోదయ్యాయి. దీంతో ఉన్నత చదువులకు వచ్చేసరికి ప్రభుత్వం నుంచి అందే ఉపకారవేతనాలను పొందలేకపోతున్నారు. ప్రస్తుతం ఇంటర్, డిగ్రీ విద్యార్థులకు ఉపకారవేతనాల కోసం ప్రభుత్వానికి దరఖాస్తులు చేసుకోవాల్సి ఉంది. ప్రస్తుతం కులధ్రువీకరణకోసం దరఖాస్తుతో పాటు పాఠశాల నుంచి జారీ చేసిన టీసీని జత చేసి మీసేవా కేంద్రాల్లో దరఖాస్తు చేసుకున్నారు. తమ కులాల జాబితాలో మొఘల్ అనే కులం పేరు రావడం లేదని, కుల ధ్రువీకరణ పత్రం జారీ చేయలేమని చెప్తుండడంతో విద్యార్థులు, వారి తల్లిదండ్రులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

అవగాహన లేమితో అనర్థం

నాడు పాఠశాలలో చేర్పించే సమయంలో తమకు సరైన అవగాహన లేక ఇండియన్ ముస్లిం మొఘల్ అని నమోదు చేసినట్లు వాపోతున్నారు. అదే ఇప్పుడు సమస్యగా మారింది. తమ పిల్లలకు ఉపకారవేతనాలు, ప్రభుత్వం నుంచి అందే లబ్ధి చేకూరడం లేదని దిగాలు చెందుతున్నారు. ఇదే విషయంపై మండల రెవెన్యూ కార్యాలయంలోని అధికారులను కలసి తమ గోడు వెల్లబోసుకున్నారు. వారు తమ పరిధిలో లేదని ఉన్నతాధికారులు, ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలని సూచిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

అవస్థల్లో విద్యార్థులు

తమ టీసీల్లో మొఘల్ అనే పదం నమోదు చేయడంతో బుడితిరెడ్డిపల్లె ముస్లింవాడలో సుమారు 30 మంది విద్యార్థులు ప్రస్తుతం ఇబ్బందులు పడుతున్నారు. వారంతా ప్రస్తుతం 10, ఇంటర్, డిగ్రీ, ఇంజినీరింగ్ విద్య అభ్యసిస్తున్నారు. తమకు కులధ్రువీకరణ పత్రం మంజూరు కాకపోవడంతో ప్రభుత్వం నుంచి అందే లబ్ధిని పొందలేకపోతున్నారు. అధికారులు స్పందించి తమ సమస్యకు పరిష్కారం చూపాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళతాం..

మీ-సేవలోని కులాల జాబితాలో మొఘల్ అనే పదం లేదు. మండలంలో ఏ గ్రామంలోనూ మొఘల్ కులం నమోదు కాలేదు. బుడితిరెడ్డిపల్లె ముస్లింవాడలోని విద్యార్థులకు మాత్రమే ఇలా జరిగింది. ఈ విషయాన్ని ఉన్నతాధికారులకు నివేదించాం. విద్యార్థులకు ఇబ్బందులు రాకుండా చర్యలు తీసుకుంటాం.

-రెడ్డప్ప, తహసీల్దారు, యాదమరి

వ్యవసాయ సమాచార దర్శిని ఆవిష్కరణ

చిత్తూరు (వ్యవసాయం), న్యూస్‌టుడే : నూతన సంవత్సరాదిని పురస్కరించుకుని జిల్లా వ్యవసాయ విస్తరణాధికారుల సంఘం రూపొందించిన సమాచార దర్శిని-2018 దైనందిని ఆ శాఖ జిల్లా సంయుక్త సంచాలకులు విజయకుమార్ ఆవిష్కరించారు. సోమవారం జిల్లా వ్యవసాయ శాఖ కార్యాలయంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. జేడీ అధికారులు, సిబ్బందికి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో వ్యవసాయ శాఖను ప్రథమ స్థానానికి తీసుకెళ్లడానికి విస్తరణాధికారుల కృషి అభినందనీయమన్నారు. నూతన సంవత్సరంలో అన్నదాతలకు అందుబాటులో ఉంటూ మెరుగైన ఆధునిక సాగు విస్తరణ సేవలను అందించి అందరి మన్ననలను అందుకోవాలన్నారు.



చిత్తూరు

రాఘవా: 2 కంట్రీస్
విజయలక్ష్మి: జుమాంజీ-2 (ఇ)
గురునాథ: హలో
ఎం.ఎస్.ఆర్: ఎంసీఏ
చాణక్య: ప్రాజెక్టు 2 (ఇ)
దేవి: ఒక్క క్షణం
ఆనందా: వెలైకారన్ (త)
వెంకటేశ్వర: సక్కాపోడు పోడు రాజా(త)

కాణిపాకం

వినాయక: హలో

బంగారుపాళ్యం

వినాయక మహల్: 2కంట్రీస్

సత్యవేడు

ధర్మ ప్రచార రథం

సత్యవేడు, న్యూస్‌టుడే: శ్రీకాళహస్తి నుంచి బయలు దేరిన శ్రీకాళహస్తీశ్వరా స్వామి ధర్మ ప్రచార రథం సోమవారం సత్యవేడుకు చేరుకుంది. శ్రీకాళహస్తీశ్వర స్వామి విశిష్టతను భక్తులకు తెలియజేసే ఉద్దేశంతో డిసెంబర్ 23న ప్రాంభమైన ధర్మప్రచార రథం వివిధ ప్రాంతాల్లో పర్యటిస్తోంది. ప్రచార రథంలోని శ్రీకాళ హస్తీశ్వరుడిని చూసి భక్తులు తన్మయత్వం చెందారు.

నేడు ఆరుద్ర ఉత్సవం

నాగలాపురం, న్యూస్‌టుడే: సురుటుపల్లి పళ్లికొండేశ్వరాలయంలో మంగళ వారం ఆరుద్ర ఉత్సవాన్ని నిర్వహించనున్నట్లు ఆలయ ఛైర్మన్ తిరునీలకంఠన్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. పరమేశ్వరునికి ప్రీతిపాత్రమైన ఈ పర్వదినాన నటరాజస్వామికి ప్రత్యేక అభిషేకాలు, పూజలు చేసి ఉత్తుకోట వరకు గ్రామోత్సవం నిర్వహిస్తామని ఆయన తెలిపారు.

'జన్మభూమి'.. సమస్యలే సదాస్మరామి



గతేడాది కారిపాకంలో జన్మభూమి సందర్భంగా సమస్యలు తెలుసుకుంటున్న ఎమ్మెల్యే తలారి ఆదిత్య (పాతచిత్రం)

వరదయ్యపాళెం, న్యూస్‌టుడే: ప్రజాసమస్యలను అధికారుల దృష్టికి తీసుకురావడానికి ప్రభుత్వం జన్మభూమి-మా ఊరు కార్యక్రమాన్ని నిర్వహిస్తోంది. ఫలితంగా ప్రజల సమస్యలను పరిష్కరించడానికి అవకాశం ఉంటుందనేది ప్రభుత్వాశయం. అధికారులు కేవలం అర్జీలను స్వీకరించడం.. పరిష్కారంలో నిర్లక్ష్యధోరణితో ప్రజాసమస్యల పరిష్కారానికి చొరవ చూపడం లేదనే ఆరోపణలు వ్యక్తమౌతున్నాయి. గతేడాది జరిగిన జన్మభూమిలో నియోజకవర్గ వ్యాప్తంగా 10,140 అర్జీలు వచ్చాయి. వీటిలో కొందరికి పింఛన్లు, రేషన్‌కార్డులు మంజూరైంది. ఇతర సమస్యలను సాంకేతిక కారణాలను సాకుగా చూపి తిరస్కరణ పేరుతో లెక్కలు వేసి, ప్రభుత్వానికి తప్పుడు నివేదికలతో పక్కదారి పట్టిస్తున్నారనే ఆరోపణలు వస్తున్నాయి. గతేడాది ఎన్ని సమస్యలను పరిష్కరించారో అధికారులను వివరణ కోరితే, ఆ సమాచారం తమ దగ్గర లేదని పేర్కొనడమే ఇందుకు నిదర్శనం. ఇదే జన్మభూమి-మా ఊరులో అధికారుల చిత్తశుద్ధికి ప్రత్యక్ష తార్కాణం. మంగళవారం నుంచి జన్మభూమి కార్యక్రమం ప్రారంభమవుతున్న నేపథ్యంలో అధికారులు చిత్తశుద్ధితో ప్రజాసమస్యల పరిష్కారానికి చొరవ తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

గతేడాది జన్మభూమిలో సమస్యలు మచ్చుకు కొన్ని..

✷ వరదయ్యపాళెం మండలంలో కారిపాకంలో మద్యం గొలుసుదుకాణం తొలగించాలని మహిళలు సాక్షాత్తు ఎమ్మెల్యేకి మొరపెట్టుకున్నారు. ఆయన ఆదేశాలతో అధికారులు మొక్కుబడిగా దాడులు చేసి చేతులు దులుపుకున్నా, ఇంత

ప్రజావినతులకు పరిష్కారం దక్కేనా?

వరకు సమస్య పరిష్కారానికి నోచుకోలేదు. సంతవేలూరు పంచాయతీ ముత్తరాశిపాళెం, కళత్తూరులలో తాగునీటి వసతిని కల్పించాలని మూడేళ్లుగా జన్మభూమిలో అధికారులకు విన్నవిస్తూనే ఉన్నారు. పాండూరు కొత్తఎస్సీకాలనీ, కళత్తూరు, అంబూరు, కారిపాకం గ్రామాల్లో శ్మశానానికి దారి వసతి కల్పించాలని కోరారు. తొండంబట్టు మీదుగా తెలుగు గంగ కాలువ ప్రవహిస్తున్నా, ఎన్నో గ్రామాలకు గంగ ద్వారా నీరు అందుతుండగా, తొండంబట్టునకు మాత్రం సాగునీరు అందడం లేదు. సంతవేలూరులో రెండేళ్ల కిందట వరదలకు పులిబొంద, మార్లమడుగు కాలువలకు గండి పడి, రైతులు సాగు చేసుకోలేక తమ పొలాలను బీడుగా వదిలేయాల్సిన దుస్థితి ఉందని, గండి మరమ్మతులు చేపట్టాలని వేడుకున్నా ఫలితం లేకపోయింది.

✷ బీఎన్‌కండ్రిగ మండలంలో కనమనంబేడు-పెద్దపాలవేడు మార్గంలో అనుసంధానపు రహదారిని ఏర్పాటు చేయాల్సిఉంది. బీఎన్‌కండ్రిగలో బస్టాండు ఏర్పాటుచేయాలని, నీర్పాకోట ఎస్టీకాలనీలో తాగునీటి ట్యాంకు ఏర్పాటుచేయాలని, గాజులపెళ్లూరులో పంటకాలువలు మరమ్మతులు చేపట్టాలని, కొత్తపాళెం రహదారిని ఆధునీకరించాలని, టీబీపురం మార్గంలో రహదారి వసతిని కల్పించాలని ప్రజలు గతేడాది జన్మభూమిలో మొరపెట్టుకున్నారు.



ఈ వృద్ధురాలు వరదయ్యపాళెంనకు చెందిన ఇంద్రాణమ్మ. వయసు 65 ఏళ్లు. భర్త మరణంతో ఒంటరిగా జీవిస్తోంది. ఏ జీవనాధారం లేని తనకు వితంతు పింఛను ఇప్పించాలని నాలుగేళ్లుగా అధికారులకు మొరపెట్టుకుంటోంది. కార్యాలయాల చుట్టూ తిరిగినా ఫలితం లేకపోయింది. గత రెండు పర్యాయాలు జన్మభూమిలో వినతిపత్రం అందించినా, ఇంతవరకు ఆమెకు పింఛను మంజూరు కాలేదు. అటు భర్త మృతితో వితంతు పింఛనుకు, వయసు రీత్యా వృద్ధాప్య పింఛనుకు అన్ని అర్హతలున్నా, ఎందుకు తనకు మంజూరు చేయడంలేదంటూ ఈ వృద్ధురాలు కన్నీళ్లు పెట్టుకుంటోంది. ఈ సమస్య ఈమెదే కాదు.. మండలంలో ఎన్నో సమస్యలు అధికారుల నిర్లక్ష్యం కారణంగా పరిష్కారానికి నోచుకోవడం లేదు.

గతేడాది జన్మభూమికి వచ్చిన వినతులు

మండలం	రేషన్ కార్డులు	పింఛన్లు	పక్కా ఇళ్లు	ఇతరులు	మొత్తం అర్జీలు
వరదయ్యపాళెం	334	348	742	420	1844
బీఎన్‌కండ్రిగ	246	187	515	270	1218
కేవీబీపురం	364	256	701	194	1515
నాగలాపురం	367	252	389	269	1277
పిచ్చాటూరు	247	264	460	92	1063
సత్యవేడు	590	164	635	187	1576
నారాయణవనం	603	357	528	159	1647

✷ సత్యవేడు మండలం వానెల్లూరులో 2007లో జరిగిన జన్మభూమిలో భూపంపిణీలో పట్టాలు ఇచ్చినా ఇంతవరకు భూములు చూపలేదు. మూడేళ్లుగా జన్మభూమిలో లబ్ధిదారులు అధికారులను నిలదీస్తూనే ఉన్నా, హామీ తప్ప ఇంతవరకు పరిష్కారానికి నోచుకోలేదు. పీవీపురం, కన్నావరం గ్రామాల్లో శ్మశానానికి దారి వసతి కల్పించాల్సిఉంది.

✷ నారాయణవనం మండలం కసింమిట్టలో తొమ్మిది ఎకరాల ప్రభుత్వ భూమిలో ఇంటి పట్టాలు మంజూరు చేయాలని రెండేళ్లుగా జన్మభూమిలో వేడుకుంటూనే ఉన్నా ఫలితం శూన్యం. వెత్తలతడుకులో తాము సాగు చేసుకుంటున్న భూములకు పట్టాలు ఇవ్వాలని రెండేళ్లుగా స్థానిక దళితులు అధికారులను నిలదీసినా, వారి వేదన అరణ్యరోదనగానే మిగిలిపోయింది. పలు గ్రామాల్లో తాగునీటి ట్యాంకులు ఏర్పాటుచేయాలని ప్రజలు వేడుకుంటున్నారు.



గుక్కెడు నీళ్లు ఇప్పించాలని కళత్తూరులో అధికారులను నిలదీస్తున్న స్థానికులు (పాతచిత్రం)

✷ కేవీబీపురం మండలం ఎంఏ రాజులకండ్రిగ-ఎగువపూడి మార్గంలో, అంజూరు-జయలక్ష్మీపురం మార్గంలో కాజ్‌వే నిర్మించాలని ప్రజలు విన్నవిస్తూనే ఉన్నారు. బుంటిపీడు పంచాయతీ దర్గావారికండ్రిగ, జయలక్ష్మీపురంలలో శ్మశానానికి దారి వసతి కల్పించాలని కోరుతున్నారు. వేములపూడి, తిమ్మసముద్రంలలో తాగునీటి వసతిని కల్పించాల్సి ఉంది.

✷ పిచ్చాటూరు మండలంలో హనుమంతాపురంనకు బస్సు వసతి కల్పించాలని ప్రజల చిరకాల వాంఛ కలగానే మిగిలిపోతోంది.

✷ నాగలాపురం మండలంలో కొత్తకాడు వద్ద కాజ్‌వేను ఏర్పాటుచేయాలని ప్రజలు ఆశగా ఎదురుచూస్తున్నారు. నాగలాపురంలో శ్మశానస్థలం ఆక్రమణకు గురికావడంతో ఏటివద్దనే శవాలను దహనం చేయాల్సిన దుస్థితి ఏర్పడింది. సమైక్యతాపురంలో 500 మందికి పంపిణీ చేసిన ఇంటిపట్టాలు ఆక్రమణలకు గురి కావడంతో లబ్ధిదారులు లబోదిబోమంటున్నారు.



ప్రత్యేక అలంకరణలో శ్రీకైలాసనాథీశ్వరస్వామి



విశేషఅలంకరణలో కామాక్షాంబికాదేవి

కైలాసనాథీశ్వరస్వామి ఆలయంలో పౌర్ణమి పూజలు

గోవిందప్పనాయుడుకండ్రిగ (నారాయణవనం), న్యూస్‌టుడే : మండలంలోని అరణ్యంకండ్రిగ పంచాయతీ కైలాసకోనలోని శ్రీకామాక్షాంబికాదేవి సమేత కైలాసనాథీశ్వర స్వామి ఆలయంలో పౌర్ణమి సందర్భంగా సోమవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం ఆలయంలో మహన్యాసపూర్వక రుద్రాభిషేకం, కుంకుమార్చన, శ్రీచక్రనవ శరణహోమం, లలితాసహస్రనామార్చన, ప్రసాదవినియోగం చేపట్టారు. స్వామిఅమ్మవార్లను విశేషంగా అలంకరించి ప్రత్యేక పూజలు చేశారు. అధికసంఖ్యలో భక్తులు జలపాతంలో పవిత్రస్నానాలాచరించి స్వామిఅమ్మవార్లను దర్శించుకున్నారు. మహిళాభక్తులు ఆలయంలో నేతిదీపాలు వెలిగించి మొక్కులు తీర్చుకున్నారు. సాయంత్రం నవావరణ పూజ, లఘునవావరణహోమం కార్యక్రమాలు చేపట్టారు. అర్చకులు మహేంద్రశర్మ, జయచంద్రశర్మలు స్వామివారి తీర్థ ప్రసాదాలను భక్తులకు అందజేశారు.

ఆర్టీసీ డిపో గౌరవ అధ్యక్షుడిగా రోసిరెడ్డి

పిచ్చాటూరు, న్యూస్‌టుడే: సత్యవేడు ఆర్టీసీ డిపో గౌరవ అధ్యక్షుడిగా రోసిరెడ్డి ఎంపికయ్యారు. సోమవారం నూతన సంవత్సరం సందర్భంగా ఆర్టీసీ సంఘ నాయకులు, కార్మికులు పిచ్చాటూరుకు చేరుకుని స్థానిక ఆర్టీసీ బస్టాండు సమీపంలో రోసిరెడ్డిని పూలమాలలు, శాలువలతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా రోసిరెడ్డి మాట్లాడుతూ ఆర్టీసీ కార్మికుల సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తానని తెలిపారు. కార్యక్రమంలో ఆర్టీసీ డిపో కార్యదర్శి వీఆర్ కన్నప్పన్, వర్కింగ్ అధ్యక్షులు తిరుపతిరావు, అధ్యక్షులు పెద్దిరెడ్డి, పార్థసారధి, యూనియన్ నాయకులు పాల్గొన్నారు.



రోసిరెడ్డిని సన్మానిస్తున్న ఆర్టీసీ సంఘ నాయకులు, కార్మికులు

మాజీ సర్పంచి చంద్రమౌళి మృతి



చంద్రమౌళి (పాతచిత్రం)

సత్యవేడు, న్యూస్‌టుడే: మండలంలోని నరసరాజ అగ్రహారం తెదేపా నాయకుడు, మాజీ సర్పంచి చంద్రమౌళి(65) ఆదివారం రాత్రి గుండెపోటుతో మృతి చెందారు. విషయం తెలుసుకున్న జిల్లాపరిషత్ ఉపాధ్యక్షుడు సుందరరామిరెడ్డి, ఎంపీపీ మస్తాన్, తెదేపా మండల అధ్యక్షుడు పరమశివం, పల్లికొండేశ్వర ఆలయ ఛైర్మన్ తిరునీలకంఠం, ఎంపీటీసీ సభ్యుడు అమాసరెడ్డి, నాయుకులు బాలసుబ్రహ్మణ్యం తదితర నాయకులు ఆయన కుటుంబ సభ్యులకు సంతాపం తెలిపారు.



పళ్లికొండేశ్వరాలయ భక్తుల రద్దీ

భక్తుల రద్దీ అధికం

నాగలాపురం, న్యూస్‌టుడే: ఆంగ్ల నూతన సంవత్సరాది వేడుకలకు ఆలయాల్లో ప్రత్యేక ఏర్పాట్లు కానరాకున్నా.. భక్తుల రద్దీ మాత్రం సోమవారం అధికంగానే కొనసాగింది. వేదనారాయణస్వామి ఆలయాన్ని నూతన సంవత్సర వేడుకలకు ప్రత్యేకంగా రాత్రి 12 గంటలకు కాకుండా ధనుర్మాస సందర్భంగా పాటించే సంప్రదాయానుసారం ఉదయం 4.30 గంటలకు తెరచి దర్శనం కల్పించారు. పళ్లికొండేశ్వరాలయంలోనూ ప్రత్యేక ఏర్పాట్లు చేపట్టకుండా సాధారణ రీతిలోనే భక్తులను సర్వదర్శనానికి అనుమతించారు. ఆలయాల్లో సంవత్సరాదిపై ఏర్పాట్లు చేయటానికి నిబంధనలు అడ్డురాగా.. భక్తులు ఉదయం నుంచి రాత్రి వరకూ వరుసల్లో నిలబడి దర్శనాలు చేసుకున్నారు. పళ్లికొండేశ్వరాలయంలో ఒంగోలు అడిషనల్ ఎస్పీ ఢిల్లీబాబు, వైకాపా నేత మునిరత్నం మధ్యాహ్నం అన్నదానం చేశారు.



అన్నదానం చేస్తున్న ఒంగోలు అడిషనల్ ఎస్పీ ఢిల్లీబాబు




ప్రత్యేక అలంకరణలో శ్రీ త్రయంబకేశ్వర స్వామి

ఘనంగా నూతన సంవత్సర వేడుకలు

వరదయ్యపాళెం, న్యూస్‌టుడే: నూతన ఆంగ్ల సంవత్సర వేడుకలను సోమవారం ఘనంగా జరుపుకున్నారు. వాడవాడలా ఆలయాలు, చర్చిలను విద్యుద్దీపాలతో శోభాయానంగా తీర్చిదిద్దారు. వరదయ్యపాళెంలోని త్రయంబకేశ్వరాలయం, శ్రీవెంకటేశ్వరాలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. దేవాలయాలు భక్తజన సందోహంతో కిక్కిరిసింది. ఆంగ్లసంవత్సర ఆరంభంతోపాటు, సోమవారం పౌర్ణమి శుభసందర్భాన్ని పురస్కరించుకొని ఆలయ పాలకమండలి సభ్యులు పన్నెం బాలసుందరం, ఎంపీపీ పన్నెం జీవమ్మ ఆధ్వర్యంలో స్వామివారికి రుద్రాభిషేకాన్ని నిర్వహించారు. అర్చకులు రాజేంద్రప్రసాద్‌శర్మ స్వామివారిని ప్రత్యేకాలంకరణతో, సహస్రనామార్చన, బిల్వపత్రార్చన, సహస్రశతనామావళి వంటి పూజలు ఘనంగా జరిగాయి. వరదయ్యపాళెం, గోవర్ధనపురం, కడూరు, బత్తులవల్లం, లక్ష్మీపురం తదితర గ్రామాల్లో యువకులు ప్రత్యేకంగా షామియానాలు వేసి, బాణాసంచాల మోతల నడుమ కేకు కోసి సంబరాలు చేసుకున్నారు. పలు చోట్ల సాంస్కృతిక కార్యక్రమాల్లో యువత ఉత్సాహంగా పాల్గొన్నారు.

సత్యవేదు

యువకునికి తీవ్రగాయాలు



తీవ్ర గాయాలతో భాగ్యనాథన్

నాగలాపురం, న్యూస్‌టుడే: తిరుపతి-చెన్నై జాతీయ రహదారిపై గుంతల ధాటికి లారీ ఢీకొని ద్విచక్ర వాహనదారుడు తీవ్రగాయాలపాలైన సంఘటన మండలంలోని బైటకొడియంబేడు వద్ద సోమవారం జరిగింది. ఎస్‌హెచ్‌వో చంద్రబాబు కథనం ప్రకారం... సత్యవేదు మండలం దాసుకుప్పం గ్రామానికి చెందిన భాగ్యనాథన్(32) నాగలాపురం విద్యుత్ ఉపకేంద్రంలో షిఫ్ట్ ఆపరేటర్‌గా పనిచేస్తున్నారు. ఆయన సోమవారం విధి నిర్వహణకు ద్విచక్రవాహనంపై వస్తుండగా.. బైటకొడియంబేడు వద్ద రోడ్డుపై గుంతలను తప్పించుకోవడానికి వాహనాన్ని పక్కకు తిప్పారు. అదే సమయంలో వెనుక వస్తున్న లారీ ద్విచక్రవాహనాన్ని ఢీకొంది. సంఘటనలో భాగ్యనాథన్‌కు తీవ్ర గాయాలవ్వడంతో ఆయనను చికిత్స నిమిత్తం తిరుపతికి తరలించి లారీని అదుపులోకి తీసుకున్నామన్నారు.

చిత్తూరు ఎంపీ శివప్రసాద్‌కు సన్మానం



చిత్తూరు ఎంపీ శివప్రసాద్‌ను సన్మానిస్తున్న మాజీ ఎంపీపీ మురళి

నాగలాపురం, న్యూస్‌టుడే: ఆంగ్ల నూతన సంవత్సరాదిని పురస్కరించుకుని చిత్తూరు ఎంపీ శివప్రసాద్‌ను తిరుపతిలో సోమవారం నాగలాపురం మాజీ ఎంపీపీ మురళి, రజానగరం ఉపాధ్యాయుడు కామాక్షయ్య సన్మానించారు. ఎమ్మెల్యే ఆదిత్యను జడ్పీటీసీ సభ్యురాలు సుజాత, విజయభాస్కర్, తెన్నరసులు నారాయణవనంలో సన్మానించారు. ఒంగోలు అడిషనల్ ఎస్పీ ఢిల్లీబాబు, వైకాపా జిల్లా నేత మునిరత్నం, వైకాపా మండల కన్వీనర్ అపరంజిరాజులను వైకాపా నేతలు చిన్నదురై, దేశప్పన్, రాఘనవ్, ఈశ్వరయ్య, సురేష్, సెల్వంలు సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు.



కల్కిట్రస్టు నిర్వాహకులు లోకేష్‌దాసాజీని సన్మానిస్తున్న ఉపాధ్యాయులు

విద్యాప్రదాతకు సన్మానం

వరదయ్యపాళెం, న్యూస్‌టుడే: వరదయ్యపాళెంలోని ఎమ్మార్సీ భవనంలో యూటీఎఫ్, ఎస్టీయూ, ఇతర సంఘాల ఉపాధ్యాయులు సోమవారం నూతన ఆంగ్ల సంవత్సర వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఈవో సరస్వతి చేతుల మీదుగా కేకు కోసి పంచిపెట్టారు. అనంతరం మండలంలో ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతులను కల్పించడానికి కృషిచేస్తున్న కల్కిట్రస్టు, అమ్మాభగవాన్ సేవాట్రస్టు నిర్వాహకులు లోకేష్‌దాసాజీని ఈ సందర్భంగా ఉపాధ్యాయులు ఘనంగా సన్మానించారు. ఎంఈవో సరస్వతి మాట్లాడుతూ లక్షలాది రూపాయల వ్యయంతో మండలంలోని అనేక ప్రభుత్వ పాఠశాలల్లో తాగునీటిశుద్ధి కేంద్రాలను ఏర్పాటుచేయడం, పిల్లలకు భోజన సామగ్రి, క్రీడా సామగ్రి వంటి సామాజిక సేవలతో పేదవిద్యార్థుల విద్యాఅభ్యున్నతికి కృషిచేస్తున్న అమ్మాభగవాన్ సేవాట్రస్టు పేద విద్యార్థుల పాలిట వరమని అన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు రామకృష్ణారెడ్డి, రాజమోహన్‌బాబు, శశి, ఆనంద్, జగన్నాథం, మొహిద్దీన్ తదితరులు పాల్గొన్నారు.



శ్రీకాళహస్తి

సాయిరామ్: 2 కంట్రీస్
బలరాం: ఒక్క క్షణం
విజయలక్ష్మి: గరుడ వేగ
శ్రీనివాస: జ్యూమాంజి
రామచంద్ర: హలో
ఆర్ఆర్: ఎం.సి.ఎ.

వరదయ్యపాళెం

గౌరీశంకర్- 2 కంట్రీస్

నేటి నుంచి జన్మభూమి-మా ఊరు

నారాయణవనం, న్యూస్‌టుడే: మండలంలో సోమవారం నుంచి 11వ తేదీ వరకు జన్మభూమి-మా ఊరు కార్యక్రమం జరుగుతుందని ఎంపీడీవో గంగాభవాని ఒక ప్రకటనలో తెలిపారు. 2న పాలమంగలం ఉత్తరం, పాలమంగలం దక్షిణం, 3న నైనారుకండ్రిగ, తుంబూరు, 4న అరణ్యంకండ్రిగ, వెత్తలతడుకు, 5న బొప్పరాజుపాలెం, సముదాయం, 6న కశింమిట్ట, భీమునిచెరువు, 7న బ్రాహ్మణతాంగేల్, 8న వీకే పాలెం, కీలగరం, 9న తిరువట్యం, ఎరికంబట్టు, 10న కల్యాణపురం, కొండలచెరువు, 11న నారాయణవనం పంచాయతీలలో జన్మభూమి-మా ఊరు కార్యక్రమం నిర్వహించనున్నట్లు చెప్పారు.

ప్రజా సంక్షేమమే లక్ష్యం: ఎమ్మెల్యే



నారాయణవనంలో నూతన సంవత్సర వేడుకల్లో పాల్గొన్న ఎమ్మెల్యే తలారి ఆదిత్య

నారాయణవనం, న్యూస్‌టుడే: ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లి సమస్యల పరిష్కారానికి కృషి చేయడమే లక్ష్యంగా నూతన సంవత్సరంలో నవశఖానికి నాంది పలకాలని ఎమ్మెల్యే తలారి ఆదిత్య అన్నారు. సత్యవేడు నియోజకవర్గ స్థాయిలో మండల తెదేపా అధ్యక్షులు, నాయకుల సమక్షంలో నూతనసంవత్సర వేడుకలను నారాయణవనంలో సోమవారం ఘనంగా జరుపుకున్నారు. కేకు కోసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయకత్వంలో గ్రామాలను ప్రగతి బాటలో నడిపించేందుకు తన వంతు కృషి చేస్తానన్నారు. గ్రామస్థాయి నుంచి తెదేపాను బలోపేతం చేసి రానున్న ఎన్నికల్లో పార్టీ గెలుపునకు ప్రతి ఒక్కరు కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో జడ్పీ వైస్ ఛైర్మన్ సుందరరామరెడ్డి, ఏడు మండలాల తెదేపా అధ్యక్షులు గిరిబాబు(నారాయణవనం), పరమశివం (సత్యవేడు), సుధాకర్‌నాయుడు (బుచ్చినాయుడుకండ్రిగ), చలపతినాయుడు(చలపతినాయుడు), మునస్వామి యాదవ్ (కేవీబీ పురం), బాలాజిరెడ్డి(నాగలాపురం), ఇలంగోవరెడ్డి (పిచ్చాటూరు), నాయకులు సతీష్‌నాయుడు, కిరణ్‌యాదవ్, గోవిందస్వామి, షణ్ముగం, పొన్నుస్వామి తదితరులు పాల్గొన్నారు.

వసతిగృహాల్లో 'పోలీస్' వేడుకలు



సంతవేలూరు ఎస్సీబాలుర వసతిగృహంలో కేకు కోసి పంచిపెడుతున్న ఎస్సై హరిప్రసాద్

సంతవేలూరు (వరదయ్యపాళెం) న్యూస్‌టుడే: నూతన ఆంగ్లసంవత్సరాన్ని పురస్కరించుకొని పోలీస్ అధికారులు వసతిగృహాల్లో పేదవిద్యార్థుల నడుమ వేడుకలను నిర్వహించడం ద్వారా కొత్తసంప్రదాయానికి నాంది పలికారు. పిల్లలతో మమకమై ఆత్మీయతను పంచారు. మండలంలోని సంతవేలూరులో ఎస్సీ బాలుర వసతిగృహంలో ఎస్సై హరిప్రసాద్, శ్రీసిటీ పరిధిలోని ఇరుగొళం ఎస్సీబాలుర వసతిగృహంలో ఎస్సై సుబ్బారెడ్డి ఆధ్వర్యంలో నూతన సంవత్సర వేడుకల్లో భాగంగా కేకు కోసి పిల్లలకు పంచిపెట్టారు. ఉత్తమఫలితాలతో ప్రతిభ చూపాలని కాంక్షిస్తూ విద్యార్థులను ఉత్తేజపరిచారు. భావి నూరేళ్ల జీవితం ఆనందమయం కావాలంటే ఉన్నతస్థానాలకు చేరాలని, అందుకు విద్యార్థి దశలో చదువులే లక్ష్యంగా శ్రమించడమే మార్గమని ఈ సందర్భంగా విద్యార్థులకు ఉద్బోధించారు.

సత్యవేడు మండలంలో...

సత్యవేడు, న్యూస్‌టుడే: నూతన సంవత్సర వేడుకలను స్థానిక యువకులు ఉత్సాహంగా చేసుకున్నారు. 31 రాత్రి నుంచి యువకులు పలు చోట్ల కేకులు కోసి శుభాకాంక్షలు తెలుపుకున్నారు. సోమవారం ఉదయం ఆలయాలు భక్తులతో కిటకిటలాడారు. పట్టణంలోని గంగమిట్ట, మతంగేశ్వరాలయం, సదమాలమ్మ, లక్ష్మీనరసింహస్వామి, వెంకటేశ్వరాస్వామి ఆలయాలకు భక్తులు వెళ్లి దర్శించుకున్నారు. దాసుకుప్పంలోని జిల్లాపరిషత్ ఉపాధ్యక్షుడు సుందరరామిరెడ్డి, పట్టణంలోని ఎంపీపీ మస్తాన్, తెలుగుదేశం మండల అధ్యక్షుడు పరమశివం, పల్లికొండేశ్వర ఆలయ ఛైర్మన్ తిరునీలకంఠంలను స్థానిక తెదేపా నాయకులు, కార్యకర్తలు కలిసి వారికి శుభాకాంక్షలు తెలిపారు. ఉన్నత అధికారులను కలిసి కొందరు ఉద్యోగులు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు.



న్యాయమూర్తి ఆదినారాయణను కలిసి శుభాకాంక్షలు తెలుపుతున్న బార్ అసోసియేషన్ సభ్యులు



బాలుర గురుకుల పాఠశాలలో కేక్‌కట్ చేస్తున్న అధ్యాపకులు

'ఉత్తమ ఫలితాల కానుక ఇద్దాం'

వరదయ్యపాళెం, న్యూస్‌టుడే: ప్రభుత్వ పాఠశాలలు మరింత బలోపేతమయ్యేలా, ఉపాధ్యాయులందరూ సమష్టిగా కృషిచేసి, 2018 పరీక్షల ఫలితాల్లో ఉత్తమ ఫలితాలను నూతన సంవత్సర కానుకగా అందించాలని ఎంఈవో సరస్వతి పిలుపునిచ్చారు. స్థానిక ఎమ్మార్సీ భవనంలో సోమవారం నూతన సంవత్సరాన్ని పురస్కరించుకొని యూటీఎఫ్ ఆధ్వర్యంలో దైనందిని, కాలమాన పట్టికలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా యూటీఎఫ్ మండల అధ్యక్ష, కార్యదర్శులు షణ్ముఖరావు, శశికుమార్ మాట్లాడుతూ ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారం, విద్యారంగ పరిరక్షణకు యూటీఎఫ్ చేస్తున్న ఉద్యమాల కారణంగా పలు సమస్యలు పరిష్కారమవుతుండటం గర్వకారణంగా ఉందన్నారు. కార్యక్రమంలో యూటీఎఫ్ నాయకులు రామకృష్ణారెడ్డి, ఆనంద్, రాజు, రాజమోహన్‌బాబు, వెంకటమోహన్, విశ్రాంత ఉపాధ్యాయులు హరిగోపాల్‌రెడ్డి, సురేంద్రమూర్తి పాల్గొన్నారు.



ఎమ్మార్సీ భవనంలో దైనందిని, కాలమాన పట్టికలను ఆవిష్కరిస్తున్న యూటీఎఫ్ నాయకులు



కంకరతేలి.. అధ్వానంగా రహదారి

బుచ్చినాయుడుకండ్రిగలోని తెలుగుగంగ కార్యాలయం ముందు సీసీ రహదారి కనీస మరమ్మతులకు నోచుకుని దశాబ్దకాలం దాటింది. ఈ రహదారి వాహనాలు వెళ్లేందుకు వీలు లేకుండా ఉంది. కంకరతేలి గుంతల మయంగా మారింది. తహసీల్దారు, ఎంపీడీవో, వ్యవసాయ, ఉపాధి, గ్రామ పంచాయతీ కార్యాలయాలకు ఈ దారిలోనే వెళ్లాలి. ప్రాథమిక ఆరోగ్యకేంద్రానికి వెళ్లాలన్నా ఇదే మార్గం కావడంతో రోగులు, మహిళలు నానా తంటాలు పడుతున్నారు. అధికారులు స్పందించి ఈ రహదారిని బాగుచేయాలని స్థానికులు కోరుతున్నారు.

-న్యూస్‌టుడే, బుచ్చినాయుడుకండ్రిగ

ద్వారపాలక.. దుస్థితి కనలేక..



బీఎన్‌కండ్రిగ ప్రసన్న వెంకటేశ్వరస్వామి ఆలయ ముఖద్వారం ముందే మురుగు నీటి గుంత దర్శనమిస్తోంది. దుర్వాసన వెదజల్లుతుండడంతోపాటు నిత్యం ఆలయానికి వెళ్లే భక్తులకు ఈ మురుగునీటి గుంత అసౌకర్యంగా మారింది. గుంతను పూడ్చివేయాల్సిందిగా అధికారులకు పలుమార్లు విన్నవించినా పట్టించుకోవడం లేదని భక్తులు వాపోతున్నారు. ఆలయ ద్వారం ముందు గుంతను పూడ్చి, పరిసరాలు పరిశుభ్రంగా ఉంచాలని కోరుతున్నారు.

-న్యూస్‌టుడే, బుచ్చినాయుడుకండ్రిగ

శ్రీకాళహస్తి

ఆదరిస్తే అభివృద్ధి పరుస్తాం

అముడూరు (ఏర్పేడు), న్యూస్‌టుడే: రానున్న ఎన్నికల్లో వైకాపాను ఆదరిస్తే గ్రామీణ ప్రాంతాల్లో సమస్యలను పూర్తిస్థాయిలో పరిష్కరించి అభివృద్ధి పరుపస్తామని శ్రీకాళహస్తి నియోజకవర్గం వైకాపా సమన్వయకర్త బియ్యపు మధుసూదన్‌రెడ్డి తెలిపారు. మండలంలోని అముడూరు పంచాయతీలో సోమవారం ఆయన వైకాపా జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులకు రుణమాఫీ అంటూ మోసపూరిత పూరిత మాటలతో అధికారంలోకి వచ్చిన తెదేపా ప్రభుత్వం తరవాత కాలంలో అభివృద్ధిని పూర్తిస్థాయిలో మరచిపోయిందన్నారు. రానున్న ఎన్నికల్లో వైకాపా విజయానికి ప్రతి కార్యకర్త పనిచేయాల్సిన అవసరం ఎంతైనా ఉందని సూచించారు. కార్యకర్తలంతా జగన్ పాదయాత్రలో పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ప్రాదేశిక సభ్యులు రమణయాదవ్, మునిరత్నంరెడ్డి, నాగార్జున్ రెడ్డి, గంగాధరం పాల్గొన్నారు.

చిరువ్యాపారులకు అండగా ఉంటా

రేణిగుంట, న్యూస్‌టుడే: నూతన సంవత్సరాన్ని సందర్భంగా రేణిగుంటలోని ఒకటో వార్డు సభ్యులు ప్రభాకర్‌గౌరీని చిరువ్యాపారస్థులు సోమవారం ఘనంగా సన్మానించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ చిరువ్యాపారులకు ఎల్లప్పుడు అండగా ఉంటానని తెలిపారు.

సమస్యల ప్రస్థానం..

'జన్మభూమి' శ్రీకారం

- ఫిర్యాదులన్నీ డిజిటలైజేషన్
- నేటి నుంచి 'జన్మభూమి' ప్రారంభం



గత ఏడాది జన్మభూమిలో ప్రజల అర్జీలకు రసీదులు అందజేస్తున్న పురపాలక ఉద్యోగులు (పాత చిత్రం)

సమస్యల ప్రస్థానంగా సాగే.. జన్మభూమి-మాఊరు కార్యక్రమానికి ప్రభుత్వం మలి విడతగా శ్రీకారం చుట్టనుంది. ఇప్పటివరకు నాలుగు జన్మభూమి కార్యక్రమాలు పూర్తయ్యాయి. ప్రస్తుతం ఐదో విడత జన్మభూమికి అన్నీ ఏర్పాట్లు సిద్ధమయ్యాయి. కార్యక్రమం పాతదైనా.. ఈ దఫా మరింత వినూత్నంగా చేపట్టాలన్న సంకల్పంతో.. ప్రజాప్రతినిధులు, అధికారులు సంసిద్ధమయ్యారు. ఈ దఫా ఆయా ప్రాంతాల్లో సమస్యలకు సంబంధించి వచ్చే అర్జీలను డిజిటలైజేషన్ చేయాలని.. తీసుకున్న ప్రతి దరఖాస్తుకు విధిగా వివరణతో కూడిన పరిష్కారం ఇవ్వాలని ప్రభుత్వం సంకల్పించడం విశేషం.

-న్యూస్‌టుడే, శ్రీకాళహస్తి

సమస్యల పరిష్కారం కోసం ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ కాళ్లరిగేలా తిరగాల్సిన అవసరం లేకుండా.. ప్రజల వద్దకే అధికారులు పరిపాలన తీసుకువచ్చే దిశగా ప్రభుత్వం జన్మభూమి కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. గతంలో దరఖాస్తులు తీసుకోవడం.. కచ్చితమైన పరిష్కారం అంటూ తెలిసేది కాదు. ప్రస్తుతం జన్మభూమి సందర్భంగా వచ్చే దరఖాస్తులకు విధిగా నమోదు చేయడం, వచ్చిన సమస్యలకు పరిష్కారానికి తెలియజేయడం.. ఒక వేళ పరిష్కరించలేని పక్షంలో ఎందుకు పరిష్కారానికి నోచుకోలేదన్న విషయాన్ని కచ్చితంగా దరఖాస్తుదారునికి తెలిసే విధంగా వినూత్న విధానాన్ని అమల్లోకి తీసుకువచ్చారు. ఇలా పారదర్శకంగా.. పకడ్బందీగా ప్రభుత్వం ఈ కార్యక్రమం చేపట్టడం వల్ల చాలా వరకు సమస్యలు పరిష్కారరూపం దాల్చుతూ వస్తున్నాయి. అదేక్రమంలో సోమవారం నుంచి శ్రీకాళహస్తి పట్టణం, శ్రీకాళహస్తి మండలం, ఏర్పేడు, తొట్టంబేడు, రేణిగుంట మండలాల్లో పది రోజుల పాటు ఈ కార్యక్రమ నిర్వహణకు అన్నీ ఏర్పాట్లు పూర్తయ్యాయి.

ఇవీ కీలకాంశాలు..

ఇది వరకు నిర్వహించిన ఐదు జన్మభూములకు.. ప్రస్తుతం నిర్వహించే కార్యక్రమానికి కొంత తేడా ఉంది. ఎందుకంటే.. ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో చేపట్టే కార్యక్రమం కావడంతో.. అటు ప్రధాన పక్షం.. ప్రతిపక్షం రెండూ.. వాళ్ల కార్యక్రమాలకు వేదికగా ఈ కార్యక్రమాన్ని నిర్వహించుకునేందుకు సంసిద్ధమవుతున్నాయి. ఈ పరిస్థితుల్లో ప్రభుత్వం.. జన్మభూమి-మాఊరు కార్యక్రమంలో ప్రధానంగా ప్రస్తావించాల్సిన అంశాలు, ప్రజలను జాగృతం చేయాల్సిన పలు అంశాలకు సంబంధించి ప్రభుత్వం ప్రత్యేక రూపకల్పన చేసింది. అందులో ప్రధానంగా * సంక్షేమం, సంతృప్తి, సంతోషం, * ఆరోగ్యం, ఆనందం, * స్వచ్ఛాంధ్రప్రదేశ్, * జన్మభూమి-జ్ఞానభూమి, * పల్లెసిరులు, * జలం..వనం..మనం, * అన్నదాతకు అండాదండా, * విజన్ స్వర్ణాంధ్రప్రదేశ్, * పల్లె తల్లికి వందనం, * ఆనందలహరి, * కుటుంబ వికాసం, * సమాజ వికాసం తదితర 12 అంశాలను చర్చించే దిశగా ఇప్పటికే అధికారగణానికి, ప్రజాప్రతినిధులకు స్పష్టమైన ఆదేశాలు ఇచ్చారు.

గతేడాది జన్మభూమిలో వచ్చిన అర్జీలు.. పరిష్కారమైన వాటిని పరిశీలిస్తే..

ప్రాంతం	గతేడాది వచ్చిన దరఖాస్తులు	పరిష్కారమైనవి..	తిరస్కరించినవి
శ్రీకాళహస్తి పట్టణం	2495	2220	275
శ్రీకాళహస్తి మండలం	3537	3470	67
ఏర్పేడు	1348	1305	43
తొట్టంబేడు	1310	1300	10
రేణిగుంట	3985	3645	340
మొత్తం	12,675	11,940	735



రాజీవ్‌నగర్‌లో పక్కా ఇళ్లు నిర్మాణం చేపట్టదల్చిన ప్రాంతం ఇదే

తగ్గుతున్న దరఖాస్తులు


ప్రజా సమస్యల పరిష్కారానికి జన్మభూమి కార్యక్రమాల్లో వస్తున్న అర్జీల సంఖ్య నానాటికి తగ్గుముఖం పడుతున్నాయి. గతంలో వేలల్లో దరఖాస్తులు రావడం.. అవి అట్లే పేరుకపోవడం జరుగుతూ వస్తోంది. గత రెండు జన్మభూమి కార్యక్రమాల సందర్భంగా వచ్చే దరఖాస్తులు సంఖ్య మాత్రం నానాటికి తగ్గుతూ వస్తోంది. వచ్చిన దరఖాస్తుల్లోనూ ఎక్కువగా హౌసింగు, రేషన్‌కార్డులు, తాగునీటి కుళాయిలు, పక్కా ఇళ్ల నిర్మాణం, పింఛన్లు తదితర సమస్యలను వీలైనంతగా పరిష్కరించడంతో మళ్లీ మళ్లీ దరఖాస్తులకు అవకాశం లేకుండా పోతోంది.

సమస్యల పరిష్కారమే లక్ష్యం

జన్మభూమి-మాఊరు కార్యక్రమాన్ని పకడ్బందీగా నిర్వహించేందుకు అన్నీ ఏర్పాట్లు సంసిద్ధం చేశాం. వచ్చే దరఖాస్తులన్నీ డిజిటలైజేషన్‌చేసి వీలైన అన్నీ సమస్యలను నిర్ణీత వ్యవధిలో పరిష్కరించాలన్నది లక్ష్యం. అందుకు తగ్గట్టుగా అవసరమైన అన్నీ చర్యలు తీసుకుంటున్నాం. వచ్చిన ఫిర్యాదులకు పరిష్కారాలను, ఒక వేళ పరిష్కరించలేని సమస్య అయితే అందుకు తగ్గ సమాధానాన్ని కూడా దరఖాస్తుదారులకు తెలియజేయనున్నాం. ఆయా వార్డుల్లో కార్యక్రమాన్ని ప్రశాంత వాతావరణంలో నిర్వహించే విధంగా అక్కడి ప్రజలు సహకారం అందించాల్సి ఉంది.

- రమేష్‌బాబు, కమిషనర్, శ్రీకాళహస్తి పురపాలక సంఘం

రోడ్డుపై నరకయాతన



రోడ్డుపై పడిఉన్న వ్యక్తి చుట్టూ కాపలాగా నిలబడి ఉన్న పోలీసులు

అంజిమేడు (ఏర్పేడు), న్యూస్‌టుడే: లారీ ఢీ కొట్టడంతో ఓ ద్విచక్రవాహన చోదకుడు ప్రాణాలతో కొట్టుమిట్టాడుతున్నప్పటికీ ఎవ్వరూ పట్టించుకోకపోవడంతో రెండు గంటలు పాటు నడిరోడ్డుపై క్షతగాత్రుడు నరకయాతన పడ్డాడు. స్థానికుల కథనం ప్రకారం.. శ్రీకాళహస్తి మండలం మద్దిలేడు ఎస్సీకాలనీకి చెందిన ఓ వ్యక్తి (40) సోమవారం రాత్రి తిరుపతి నుంచి ద్విచక్ర వాహనంలో స్వగ్రామానికి వెళ్తుండగా ఇసుకతాగేలి సమీపంలోని ప్రధాన రహదారిపై అటువైపుగా వెళ్తున్న ఓ లారీ అదుపుతప్పి ఢీ కొట్టి వేగంగా వెళ్లింది. తీవ్రంగా గాయపడి రోడ్డుపై పడిఉండటాన్ని గమనించిన స్థానికులు 108 అత్యవసర వైద్యసేవలు వాహనం, ఏర్పేడు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ప్రధాన రహదారిపై శాంతిభద్రతలు పరిరక్షించే రక్షక్ సిబ్బంది సకాలంలో సంఘటన స్థలానికి చేరుకున్నప్పటికీ క్షతగాత్రుడు రోడ్డుపై రక్తపు మడుగులో పడిఉన్నప్పటికీ రెండు గంటల పాటు ప్రేక్షక పాత్ర వహించారు. చివరికి బంధువులు, అత్యవసర వాహనం రెండు సంఘటన స్థలానికి చేరుకుని ఆస్పత్రి తరలించేంత వరకు క్షతగాత్రుడు రోడ్డుపై రక్తపు మడుగులో కొట్టిమిట్టాడాడు.

ఘనంగా నూతన సంవత్సర వేడుకలు

తొట్టంబేడు, న్యూస్‌టుడే: మండల యూటీఎఫ్, ఏపీటీఎఫ్ సభ్యులు తెదేపా మండల అధ్యక్షుడు మురళినాయుడు, ఎంఈవో భారతికిలకు ఎంపీడీవో, ఎంఈవో కార్యాలయాల్లో సోమవారం కలసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేసి నూతన డైరీ, కాలమానపట్టి, పండ్లను అందజేశారు. ఈ సందర్భంగా మురళినాయుడు మాట్లాడుతూ నూతన సంవత్సరంలో మండలంలోని రైతులు, ప్రజలు సుభిక్షంగా, సుఖంగా ఉండాలని శుభాకాంక్షలను తెలిపారు. కార్యక్రమంలో సభ్యులు మురళీకృష్ణ, బాలసుబ్రహ్మణ్యం, ఉదయ, పెరుమాళ్, మునిరాజ, కుమార్,శ్రీనివాసులు, సూర్యప్రకాష్, విజయ్ కుమార్, మార్టిన్, చెంచయ్య, వెంకటాచలం, చలపతినాయుడు, సుబ్బరామయ్య, సుజాత, మార్కండేయులు, మణి, తిరుపాల్, బాలాజీ, శివాజీ, రమేష్, ఈశ్వర్‌రెడ్డి, మాధవరావు, చంద్రబాబు, హరిబాబు, ప్రేమ్‌కుమార్, ఢిల్లీబాబు, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

భక్తులకు అన్నదానం



భక్తులకు అన్నదానం చేస్తున్న ఇన్‌ఛార్జి ఛైర్మన్ పార్థసారథి

భాస్కరపేట (శ్రీకాళహస్తి), న్యూస్‌టుడే: పట్టణంలోని భాస్కరపేట చాముండేశ్వరి ఆలయంలో సోమవారం పూర్ణిమ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారికి విశేష పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ ఆవరణలో భక్తులకు అన్నదాన కార్యక్రమం చేపట్టారు. కార్యక్రమాన్ని పురపాలక సంఘ ఇన్‌ఛార్జి ఛైర్మన్ పార్థసారథి ప్రారంభించారు. కార్యక్రమంలో ఆలయ నిర్వాహక కమిటీ సభ్యులతో పాటు అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

అందరూ బాగుండాలి: మాజీ మంత్రి గల్లా

అమరరాజా ఫ్యాక్టరీ (రేణిగుంట), న్యూస్‌టుడే: నూతన సంవత్సరం సందర్భంగా కరకంబాడిలోని అమరరాజా ఫ్యాక్టరీలో మాజీ మంత్రి గల్లా అరుణకుమారి, ఫ్యాక్టరీ ఛైర్మన్ గల్లా రామచంద్రనాయుడు కేకు కోసి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నూతన సంవత్సరంలో ప్రతి ఒక్కరూ బాగుండాలని శుభాకాంక్షలు తెలియజేశారు.

ముగ్గుల పోటీల్లో విజేతలకు బహుమతుల పంపిణీ

అమరరాజా ఫ్యాక్టరీలో సంజీవ్ అండ్ కంపెనీ నిర్వాహకులు హిమత్, సంజీవకుమార్ ఆధ్వర్యంలో సంతూర్ ముగ్గుల పోటీలను నిర్వహించగా 70 మంది మహిళలు పాల్గొన్నారు. ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులుగా ఆరు, నాలుగు, మూడు వేల రూపాయల బహుమతులను అందజేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో డాక్టర్ గౌరినేని రమాదేవి (యూఎస్ఏ), సంతూర్ ఏఎస్‌వో గోవిందరాజులు, లక్ష్మీనారాయణ, యుగంధర్ తదితరులు పాల్గొన్నారు.



కేకు కోస్తున్న మాజీ మంత్రి గల్లా అరుణకుమారి, చిత్రంలో కర్మాగారం ఛైర్మన్ గల్లా రామచంద్రనాయుడు

ఆరుద్ర పూజలకు ఏర్పాట్లు పూర్తి

శ్రీకాళహస్తి, న్యూస్‌టుడే: శ్రీకాళహస్తీశ్వరాలయంలో మంగళవారం నిర్వహించనున్న ఆరుద్ర అభిషేకాలకు అన్నీ ఏర్పాట్లు పూర్తయ్యాయి. వేకువజామున శ్రీశివకామసుందరి సమేత నటరాజస్వామికి విశేష అభిషేకాలు నిర్వహించనున్నారు. వీక్షణకు వచ్చే భక్తులకు సత్వరంగా దర్శనం కల్పించే విధంగా చూడాలని, బయటి ప్రాంతాల నుంచి వచ్చే భక్తులకు ఆలయం మూతకు సంబంధించి ముందస్తుగా తెలియజేయాలని ఆలయ ఈవో భ్రమరాంబ అధికారులను ఆదేశించారు.



ముక్కంటి సేవలో డీఐజీ ప్రభాకర్‌రావు

శ్రీకాళహస్తి, న్యూస్‌టుడే: అనంతపురం రేంజి డీఐజీ ప్రభాకర్‌రావు సోమవారం కుటుంబ సభ్యులతో కలసి సోమవారం వాయులింగేశ్వరుని దర్శనార్థం వచ్చారు. వీరికి ఆలయ ఈవో భ్రమరాంబ ఘనంగా స్వాగతం పలికారు. ఆలయంలో స్వామి, అమ్మవార్లను దర్శించుకుని ప్రత్యేక పూజలు చేయించారు. దర్శనార్థం వచ్చిన వీరికి ఆలయం తరపున స్వామి, అమ్మవార్ల తీర్థ ప్రసాదాలను అందజేశారు. కార్యక్రమంలో స్థానిక డిఎస్పీ వెంకటకిషోర్, సీఐ సత్యనారాయణతో పాటు ఆలయ అధికారులు పలువురు పాల్గొన్నారు.



ఎస్టీయూ నేత హరికృష్ణకు పదోన్నతి

శ్రీకాళహస్తి, న్యూస్‌టుడే: ఎస్టీయూ జిల్లా అదనపు ప్రధాన కార్యదర్శిగా శ్రీకాళహస్తికి చెందిన హరికృష్ణయాదవ్‌ను నియమిస్తూ రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు నాగేశ్వరరావు ప్రకటించారు. పుంగనూరులో నిర్వహించిన జిల్లా కార్యవర్గ సమావేశంలో ఈ నిర్ణయం తీసుకున్నారు. ఎన్నికైన హరికృష్ణను ఎస్టీయూ నేతలు యువశ్రీమురళి, మనోహర్, సుధాకర్, వెంకటసుబ్బయ్య, అబ్బులు, రామకృష్ణయ్య, నాగూర్, కృష్ణయ్య, సునీల్ అభినందించారు.

వీఐపీ డైరీ

ముక్కంటి ఆలయ ఈవో డి.భ్రమరాంబ మంగళవారం ముక్కంటి ఆలయంలో అందుబాటులో ఉంటారు. పురపాలక సంఘ కమిషనర్ రమేష్‌బాబు, తహసీల్దార్ సుబ్రహ్మణ్యం, ఇన్‌ఛార్జి ఎంపీడీవో రఫి వారి కార్యాలయాల్లో అందుబాటులో ఉంటారు. **- న్యూస్‌టుడే, శ్రీకాళహస్తి**

శ్రీకాళహస్తి

విద్యార్థుల విహారయాత్ర

వెదళ్లచెరువు (రేణిగుంట), న్యూస్‌టుడే: నూతన సంవత్సరం సందర్భంగా రేణిగుంట గిజుబాయి ప్రీ ట్యూషన్ విద్యార్థులు వెదళ్లచెరువు శివాలయం వద్ద సోమవారం ఆట పాటలతో విహారయాత్రను సాగించారు. ఈ సందర్భంగా నిర్వాహకులు మాట్లాడుతూ విద్యార్థులకు ఎప్పుడూ చదువుతోనే కాకుండా అప్పడప్పుడు విహారయాత్రలు, వ్యాయామం అవసరమని తెలిపారు.

ప్రజానందమే తెదేపా ఆనందం

ఘనంగా ఆంగ్ల సంవత్సరాది వేడుకలు



మధుసూదన్‌రెడ్డికి పుష్పగుచ్ఛాన్ని అందజేస్తున్న వైకాపా నేతలు



అభిమానుల మధ్య వేడుకలు జరుపుకొంటున్న శాంతారాం జె.పవార్

శ్రీకాళహస్తి, న్యూస్‌టుడే: ప్రజల ఆనందమే. తెదేపా ఆనందమని శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బొజ్జల గోపాలకృష్ణారెడ్డి ఆకాంక్షించారు. నూతన ఆంగ్ల సంవత్సరాదిని పురస్కరించుకుని సోమవారం హైదరాబాద్‌లో ఉన్న ఆయనకు పలువురు అభిమానులు, పార్టీ నేతలు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఈ సంవత్సరమంతా అందరూ సంతోష, సౌభాగ్యాలతో ఉండాలని, నియోజకవర్గ పరిధిలో ఐదు దఫాలు ఎమ్మెల్యేగా గెలిపించిన ఇక్కడి ప్రజలకు మరింతగా అభివృద్ధిని చేపట్టే శక్తిని ఆ భగవంతుడు ప్రసాదించాలని, అందరూ సుఖ, సంతోషాలతో ఉండాలని ఆకాంక్షించారు. ఆయన్ను పలకరించిన ప్రతి ఒక్కరికీ ఆయనతో పాటు ఆయన సతీమణి బృందమ్మ, తనయుడు సుధీర్‌రెడ్డిలు ప్రత్యేకంగా శుభాకాంక్షలు తెలిపారు.

◆ నూతన ఆంగ్ల సంవత్సరాదిని పురస్కరించుకుని మాజీ ఎమ్మెల్యే ఎస్సీవీనాయుడు స్వగృహంలో సంవత్సరాది వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా తెదేపా నేతలు, పార్టీ కార్యకర్తలు ఆయన్ను కలిసి శుభాకాంక్షలు తెలి



అభిమానుల మధ్య కేక్ కోస్తున్న మాజీ ఎమ్మెల్యే ఎస్సీవీనాయుడు

పారు. పట్టణ మైనార్టీసెల్ నేత ఫరీద్‌ఖాన్ నేతృత్వంలో కేక్ కట్ చేసి పార్టీ శ్రేణులతో కలిసి వేడుకలను ఘనంగా జరుపుకున్నారు.

◆ వైకాపా నియోజకవర్గ బాధ్యుడు బియ్యపు మధుసూదన్‌రెడ్డిని ఆ పార్టీకి చెందిన పలువురు నేతలు కలిసి ఎ అభినందించారు. పుష్పగుచ్ఛాలు అందజేశారు. ఈ వేడుకల్లో మిద్దెలహరి, బాలకృష్ణయ్య పాల్గొన్నారు.

◆ భాజపా నేత కోలా ఆనంద్ స్వగృహంలో పార్టీ అభిమానుల మధ్య ఆయన సంవత్సరాది వేడుకలు ఘనంగా జరుపుకున్నారు. భాజపా మహిళా మోర్చా నేతల ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో మహిళలు ఆయనకు కేక్ తినిపించి వేడుకలు జరుపుకున్నారు.

◆ పురపాలక సంఘ ఇన్‌ఛార్జి ఛైర్మన్ పార్థసారథిని పురపాలక సంఘ కమిషనర్ రమేష్‌బాబుతో పాటు పురపాలక సంఘ అధికారులు పుష్పగుచ్ఛాని అందజేసి సత్కరించారు. పట్టణంలోని బి.పి.అగ్రహారం కూడలిలో రష్ ఆస్పత్రి అధినేత డాక్టర్ సిపాయి సుబ్రహ్మణ్యం వన్నెకుల క్షత్రియ సంఘం ఆధ్వర్యంలో జరిగిన వేడుకల్లో పాల్గొని కేక్ కట్ చేశారు. పురపాలక సంఘ మాజీ ఛైర్మన్ శాంతారాం జె.పవార్ స్వగృహంలో పలువురు నేతలు సంవత్సరాది వేడుకల్లో పాల్గొన్నారు.

◆ కాంగ్రెస్ పార్టీ నియోజక వర్గ సమన్వయకర్త బత్తెయ్యనాయుడు తన పార్టీ కార్యాలయంలో నిర్వహించిన సంవత్సరాది వేడుకల్లో పాల్గొన్నారు.



కోలా ఆనంద్‌కు మిఠాయి తినిపిస్తున్న మహిళా మోర్చా నేతలు



పార్థసారథికి పుష్పగుచ్ఛాన్ని అందజేస్తున్న కమిషనర్ రమేష్‌బాబు

ఆలయాల్లో భక్తుల రద్దీ

గుడిమల్లం (ఏర్పేడు), న్యూస్‌టుడే: ఆంగ్ల కొత్త సంవత్సరం సందర్భంగా మండలంలోని గుడిమల్లంలో వెలసిన శ్రీ పరశురామేశ్వరస్వామి ఆలయం సోమవారం భక్తజన సంద్రంగా మారింది. పెద్దఎత్తున భక్తులు తరలివచ్చి స్వామి వారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. ఆలయ పెద్దలు ప్రత్యేక వరుసలను ఏర్పాటు చేశారు. అన్నదానం నిర్వహించారు. దాదాపు 8 వేలు మంది భక్తులు స్వామివారిని దర్శించుకున్నట్లు ఆలయ ఛైర్మన్ గిరిబాబునాయుడు వెల్లడించారు. వికృతమాలలో వెలసిన శ్రీ సంతాన సంపద వేంకటేశ్వరస్వామి ఆలయాన్ని అధిక సంఖ్యలో భక్తులు దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు.

తొట్టంబేడు, న్యూస్‌టుడే: శ్రీకాళహస్తి- తడ ప్రధాన రహదారిపై వెలసిన శ్రీషిర్డిసాయిబాబా ఆలయంలో సోమవారం ప్రత్యేక అలంకరణలు చేశారు. అలయంలోని బాబా, దత్తాత్రేయ స్వామిలను ప్రత్యేక పూలతో అలంకరించారు. మండలంలోని సింగమాలలోని వీరభద్రస్వామికి ప్రత్యేక అభిషేకాలను నిర్వహించారు.



ప్రత్యేక అలంకరణలో శ్రీ షిర్డిసాయిబాబా



శ్రీ పరశురామేశ్వరస్వామి ఆలయంలో భక్తులు రద్దీ

ఆలయాల్లో నూతన సంవత్సర సంబరాలు

శ్రీకాళహస్తి గ్రామీణం, న్యూస్‌టుడే: మండలంలోని పలు ఆలయాల్లో సోమవారం నూతన సంవత్సర వేడుకలు పురస్కరించుకుని విశేష పూజలు నిర్వహించారు. వేడాంలో వెలసిన దక్షిణ కాళికాదేవి ఆలయంలో అమ్మవారికి విశేష అలంకరణలు చేశారు. తితిదే అనుబంధంగా తొండమాన్‌పురంలో వెలసిన శ్రీదేవి, భూదేవి సమేత ప్రసన్న వేంకటేశ్వరస్వామి ఆలయంలో స్వామి అమ్మవార్లకు ప్రత్యేక అలంకరణలు చేసి పూజలు నిర్వహించారు. బొక్కసంపాళెంలో వెలసిన అన్నపూర్ణాదేవి సమేత నీలకంఠేశ్వరాలయం, చెన్నకేశవస్వామి ఆలయంలోను నూతన సంవత్సరాన్ని పురస్కరించుకుని విశేష పూజలు జరిపారు. వేడాం మార్గంలో వెలసిన మూకేశ్వరాలయంలోను, బొక్కసంపాళెంలో వెలసిన కోదండరామేశ్వరాలయంలో జరిగిన ప్రత్యేక వేడుకల్లో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని స్వామి, అమ్మవార్లను దర్శించుకున్నారు.



అలంకరణలో వేడాం దక్షిణ కాళికాదేవి అమ్మవారు



సింగమాలలో వీరభద్రస్వామి



రేణిగుంట రైల్వేస్టేషన్‌లో ధర్నా నిర్వహిస్తున్న రన్నింగ్ స్టాఫ్

సమస్యలు పరిష్కరించాలని ధర్నా


రేణిగుంట, న్యూస్‌టుడే: రైల్వేలోని రన్నింగ్ స్టాఫ్ (గార్డులు, లోకోపైలట్లు, అసిస్టెంట్ లోకోపైలెట్లు) సమస్యలను పరిష్కరించాలని కోరుతూ రేణిగుంట రైల్వే స్టేషనలో సోమవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆలిండియా మెన్ ఫెడరేషన్, సౌత్ సెంట్రల్ మజ్దూర్ యూనియన్, నాయకుల పిలుపు మేరకు ఈ ధర్నా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఏడియస్‌జీ జయంత్‌కుమార్, యల్ఆర్ఎస్ ఛైర్మన్, బియం బాషా, కార్యదర్శి అబ్దుల్‌సలీమ్, ట్రెజరర్ వైయం బాబు, ఏఐయల్ఆర్ కార్యదర్శి జయరాం పాల్గొన్నారు.



ఇలగనూరులో చంద్రన్న కానుకలను అందజేస్తున్న మురళినాయుడు

పేదల సుఖసంతోషాలే తెదేపా ధ్యేయం

కొణతనేరి(తొట్టంబేడు), న్యూస్‌టుడే: పేదల సుఖసంతోషాలే తెదేపా ధ్యేయమని మండల తెదేపా అధ్యక్షుడు మురళినాయుడు అన్నారు. చంద్రన్న సంక్రాంతి సరకుల పంపిణీ కార్యక్రమాన్ని సోమవారం ఇలగనూరులో ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలోని పేద నిరుపేద ప్రజలు పండుగలను ధనికులతో సమానంగా జరుపుకోవాలనే ఉద్దేశంతో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు చంద్రన్న కానుకలను ఉచితంగా పంపిణీచేస్తున్నట్లు వివరించారు.



తిరుపతి

ప్రతాప్ - ఒక్కక్షణం
జయశ్యామ్- 2 కంట్రీస్
విఖ్యాత్- ఆక్సిజన్
బిగ్‌సినిమా- ప్రాజెక్టు జెడ్
వేల్‌రామ్స్- హలో
జగత్- ఎమ్‌సీఏ
శ్రీనివాస-ఒక్కక్షణర్
కృష్ణతేజ- ప్రాజెక్టు జెడ్
సంధ్య - సప్తగిరి ఎల్ఎల్‌బీ
సీవీఎస్- సప్తగిరి ఎల్ఎల్‌బీ
మినీప్రతాప్- టైగర్ జిందాహై
శ్రీనివాసతేజ- జ్యూమాంజి
పీజీఆర్- హలో
తేజ - సీత రామునికోసం
ఐ.ఎస్.మహల్- నెక్ట్స్ నువ్వే
పళణి- వేళక్కారన్, సక్కాపోదు పోదు రాజా
సీఎస్ సినిమాస్-జ్యూమాంజి

శ్రీకాళహస్తి

సాయిరామ్: 2 కంట్రీస్
బలరాం: ఒక్క క్షణం
శ్రీనివాస: జ్యూమాంజి
రామచంద్ర: హలో
ఆర్ఆర్: ఎం.సి.ఏ

రేణిగుంట

పద్మ 2 కంట్రీస్



సీఎంకు ముక్కంటి ప్రసాదాలు

ఏర్పేడు, న్యూస్‌టుడే: ఆంగ్ల సంవత్సరాదిని పురస్కరించుకుని తెదేపా బీసీ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గురవారెడ్డి సోమవారం ముఖ్యమంత్రిని కలిసి శుభాకాంక్షలు తెలియజేశారు. అమరావతిలోని తెదేపా సచివాలయంలో సీఎంను కలిసిన శ్రీకాళహస్తీశ్వరాలయం శేషవస్త్రంతో సన్మానించి తీర్థప్రసాదాలను అందజేశారు. నియోజకవర్గంలో ప్రభుత్వ సంక్షేమ పథకాలు అమలుతీరుపై సీఎం మెచ్చుకుంటించినట్లు ఆయన వివరించారు.

పూలమొక్కతో శుభాకాంక్షలు

శ్రీకాళహస్తి , న్యూస్‌టుడే: నూతన సంవత్సరం సందర్భంగా తెదేపా నాయకుడు చీకటివేణు శ్రీకాళహస్తీశ్వరాయాల మాజీ ధర్మకర్తలమండలి అధ్యక్షుడు పోతుగుంట గురవయ్యనాయుడుని పట్టణంలోని ఆయన గృహమునందు కలిసి పూలమొక్కను అందజేసి శుభాకాంక్షలు తెలియజేశారు. కార్యక్రమంలో మాలమహానాడు జిల్లా అధ్యక్షుడు రాజేంద్రలు పాల్గొన్నారు.



గురవయ్యనాయుడుకి పూలమొక్కను అందిస్తున్న చీకటివేణు

తంబళ్ళపల్లె

కోసువారిపల్లెలో నేడు ఎమ్మెల్యే పర్యటన

కోసువారిపల్లె(తంబళ్ళపల్లె)న్యూస్‌టుడే: మండలంలోని కోసువారిపల్లెలో ఎమ్మెల్యే శంకర్‌యాదవ్ మంగళవారం పర్యటిస్తారని తెదేపా మండలాధ్యక్షుడు సిద్ధా భాస్కర్‌నాయుడు పేర్కొన్నారు. బాలిరెడ్డిగారిపల్లె, కోసువారిపల్లెలో జన్మభూమి గ్రామ సభలు జరుగుతాయని, ఎమ్మెల్యే కోసువారిపల్లె గ్రామసభలో పాల్గొంటారన్నారు.

కందుకూరులో నేడు గ్రామసభ

పెద్దతిప్పసముద్రం, న్యూస్‌టుడే: మండలంలోని కందుకూరు పంచాయతీలో మంగళవారం జన్మభూమి- మా ఊరు కార్యక్రమాన్ని పురస్కరించుకొని అధికారులు గ్రామసభ నిర్వహించనున్నారు. గ్రామసభలో ముఖ్యమంత్రి సందేశాన్ని నేరుగా టీవీల ద్వారా వినిపించేందుకు అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. ప్రజలు ఈ కార్యక్రమంలో పాల్గొని విజవంతం చేయాలని తహసీల్దారు హనుమంతు కోరారు.



మదనపల్లె గ్రామీణ మండలంలో నిర్మాణంలో ఉన్న హంద్రీనీవా కాలువ



పట్టు దారానికి రంగులు అద్దుతున్న చేనేత కార్మికులు



కళాశాలలో చదువుకుంటున్న విద్యార్థులు

కొత్తకొత్తగా ఉండాలని..కోటి ఆశలతో..!

మదనపల్లె (విద్యావిభాగం), రామసముద్రం, న్యూస్‌టుడే : కొత్త సంవత్సరం కొత్తగా ఉండాలని.. పాత జ్ఞాపకాలను మరిపించాలని.. అన్నివిధాలుగా..అందరికీ ఉపయోగకరంగా ఉండాలని మదనపల్లె నియోజకవర్గ ప్రజలు భావిస్తున్నారు.. ప్రజలు, ఉద్యోగులు, చేనేత కార్మికులు, రైతులు, యువత, మహిళలు కొత్త సంవత్సరంలో కొత్తదనం కోరుకుంటున్నారు..గత సంవత్సరం పడ్డ కష్టాలను గట్టెక్కించేలా కొత్త సంవత్సరం ఉండాలని ఆశిస్తున్నారు.

ధరల స్థిరీకరణ నిధి ఏర్పాటు

వ్యవసాయ రంగం ప్రస్తుతం ఇబ్బందుల్లో ఉంది. 2017 సంవత్సరంలో పంటల ధరలు హెచ్చుతగ్గులతో రైతులు అవస్థలు పడ్డారు. దీంతో ప్రభుత్వం ఈ ఏడాదైనా ధర స్థిరీకరణ నిధిని ఏర్పాటు చేయాలని రైతులు కోరుతున్నారు. టమోటా, బంగాళాదుంప, కొత్తిమీర పంటలు నష్టాలను మిగిల్చాయి. పంటలకు నష్టం వాటిల్లినప్పుడు, ధరలు పతనమైనప్పుడు ధరల స్థిరీకరణ నిధి నుంచి కొంత నగదు తీసి, రైతులకు గిట్టుబాటు ధర కల్పించేలా చూడాలని వారు కోరుతున్నారు. గత కొన్ని సంవత్సరాలుగా డార్క్ ఏరియా పేరుతో ప్రభుత్వం కొత్త మోటార్లకు విద్యుత్తు సరఫరా ఇవ్వడం లేదు. గతంలో వెయ్యి అడుగుల లోతులో ఉన్న భూగర్భ జలాలు ఇప్పుడు 300 నుంచి 200 మీటర్ల పైకి వచ్చాయి. జల వనరుల శాఖ అధికారులు నీటి పెరుగుదలను పరిశీలించి ప్రభుత్వానికి తెలియజేసి.. కొత్త కనెక్షన్లు ఇస్తే మరింత భూమి సాగులోకి రావడంతో పాటు చాలా మంది రైతులు వృద్ధి సాధిస్తారని రైతులు అంటున్నారు.

అలాగే హంద్రీనీవా సుజల స్రవంతి పనులు పూర్తి చేసి రైతులకు నీరు అందేలా చూడాలని రైతులు కోరుతున్నారు.

చేనేత రంగంపై జీఎస్‌టీ రద్దు

చేనేత రంగం ఇప్పుడే ఇబ్బందుల్లో ఉంది. గోరుచుట్టుపై రోకటి పోటులా ప్రభుత్వం చేనేత రంగంపై జీఎస్‌టీ పెట్టింది. దీనివల్ల చాలా మంది నష్టపోతున్నారు. మదనపల్లె పట్టణంలో వేల మంది చేనేత రంగాన్ని నమ్ముకుని జీవనం సాగిస్తున్నారు. జీఎస్‌టీ కారణంగా చేనేత ముడిసరకులతో పాటు వస్త్రాలపై అదనపు పన్ను పడుతోంది. దీనివల్ల ఈ రంగంపై తీవ్ర ప్రభావం పడుతోంది. ఇప్పటికే చాలా మందికి పనులు లేక ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పుడు ఈ అదనపు పన్ను కారణంగా చాలా మంది వృత్తిని మానేసి వేరే రంగాలవైపు వెళ్తున్నారు. 2018 సంవత్సరంలో అయినా ప్రభుత్వం చేనేత రంగంపై జీఎస్‌టీని తొలగించాలని కార్మికులు కోరుతున్నారు. అలాగే ముడిసరకులో రాయితీ ఇవ్వడంతో పాటు చేనేత కార్మికులకు సకాలంలో రుణాలు అందేలా చూడాలని వారు కోరుతున్నారు.

☛ పోటీల పరీక్షలకు శిక్షణ కేంద్రాల ఏర్పాటు

విద్యారంగంలో మదనపల్లె పట్టణం తిరుపతి, చిత్తూరు పట్టణాలతో పోటీ పడుతోంది. అయితే జిల్లాకు చివరలో ఈ ప్రాంతం ఉండటం వల్ల విద్యారంగంపై అధికారులు చిన్న చూపు చూస్తున్నారని విద్యార్థులు అభిప్రాయపడుతున్నారు. పోటీ పరీక్షలకు శిక్షణ కోసం తిరుపతి, హైదరాబాదు వంటి ప్రాంతాలకు వెళ్లాల్సి వస్తోందని, మదనపల్లె పట్టణంలో ప్రభుత్వమే పోటీ పరీక్షలకు అవసరమైన శిక్షణ కార్యక్రమాలు నిర్వహిస్తే బాగుంటుందని విద్యార్థులు అంటున్నారు. పడమటి మండలాల్లో ఉన్న విద్యార్థులు ఉన్నత విద్య కోసం వేరే ప్రాంతాలకు వెళ్లాల్సిన పరిస్థితి ఇప్పుడుందని, అదే మదనపల్లెలో విశ్వవిద్యాలయం ఏర్పాటు చేస్తే అవసరమైన విద్య విద్యార్థులకు అందుతుందని వారు అంటున్నారు. వంద సంవత్సరాల క్రితమే మదనపల్లెలో విద్యావ్యాప్తికి ఎంతో మంది కృషి చేశారని, ఈ ఏడాది అయిన ప్రస్తుత ప్రభుత్వాలు విద్యావ్యాప్తికి కృషి చేయాలని విద్యార్థులు, యువత కోరుతున్నారు.

☛ అందుబాటులో..అందరికీ ఉచిత వైద్యం

పేదలకు ప్రభుత్వ ఆసుపత్రుల్లో సరైన వైద్యం అందడం లేదు. దీంతో ప్రైవేటు ఆసుపత్రులను ఆశ్రయించాల్సి వస్తోంది. ఇదే అదునుగా ప్రైవేటు ఆసుపత్రుల వైద్యులు ప్రజలను పీల్చి పిప్పి చేస్తున్నారు. జిల్లాలోని పడమటి మండలాల్లో పారిశుధ్యం అధ్వానంగా ఉండటం వల్ల వ్యాధులు కూడా ఎక్కువగా ప్రబలుతున్నాయి. అన్ని వ్యాధులకు ప్రభుత్వాసుపత్రిలో వైద్యులు లేకపోవడంతో ప్రజలు 120 కిలోమీటర్ల దూరంలో ఉన్న తిరుపతి, బెంగళూరుకు వెళ్లాల్సి వస్తోందని రోగులు అంటున్నారు. ఆసుపత్రిలో కిడ్నీ సంబంధిత వ్యాధిగ్రస్తులు చాలా మంది ఉన్న నేపథ్యంలో ఈ ప్రాంతంలో కిడ్నీ చికిత్సల విభాగాన్ని ఏర్పాటు చేయాలని రోగులు కోరుతున్నారు. 2018 సంవత్సరంలో అయినా ప్రభుత్వాసుపత్రిలో అన్ని జబ్బులకు చికిత్సలు అందించేలా చూడాలని వారు కోరుతున్నారు.

☛ మహిళలకు స్వయం ఉపాధి కల్పన

మహిళలకు స్వయం ఉపాధి కల్పించేందుకు ప్రభుత్వం పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో కుట్టు శిక్షణలతో పాటు వివిధ రకాల శిక్షణలు ఉచితంగా అందజేయాలి. కొన్ని ప్రాంతాల్లో వీటిని నిర్వహిస్తున్నప్పటికి కొంత మంది మాత్రమే వీటిని సద్వినియోగం చేసుకుంటున్నారు. మహిళలందరికీ శిక్షణ ఇవ్వాలంటే చాలా శిక్షణ కేంద్రాలు ఏర్పాటు చేసి, మహిళలను స్వయం ఉపాధి వైపు నడిపించాలని కోరుతున్నారు. కుట్లు, అల్లికలు, బ్యూటీప్యార్లర్ వంటి వాటిలో శిక్షణ పొందిన మహిళలకు ప్రభుత్వం రుణాలు మంజూరు చేయాలని, మహిళలు తయారు చేసిన వస్తువులను ప్రభుత్వమే కొనుగోలు చేయాలని, మహిళాభ్యుదయానికి కృషి చేయాలని కోరుతున్నారు.



ఆసుపత్రిలో చికిత్సలు పొందుతున్న రోగులు



కుట్టులో శిక్షణ పొందిన మహిళలు

డెంగీ లక్షణాలతో బాలుడి మృతి

తుమ్మరకుంట (పెద్దతిప్పసముద్రం), న్యూస్‌టుడే: డెంగీ లక్షణాలతో పీటీఎం మండలం తుమ్మరకుంట పంచాయతీ పరిధిలోని నవాబుకోటలో రెడ్డెప్ప కుమారుడు గౌతం (1) సోమవారం మృతిచెందాడు. బాలుడికి మూడు రోజులుగా జ్వరం వస్తుండగా స్థానికంగా వైద్యం చేయించారు. ఫలితం లేకపోగా బాలుడు మరింతగా నీరసించి పోయాడు. ఆందోళన చెందిన తల్లిదండ్రులు మెరుగైన చికిత్స కోసం మదనపల్లెలోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తీసుకెళ్లారు. బాలుడి ఆరోగ్య పరిస్థితి ఆందోళనకరంగా ఉండడంతో వైద్యుల సలహా మేరకు శనివారం తిరుపతి రుయాకు తరలించారు. చికిత్స పొందుతూ బాలుడు సోమవారం మృతి చెందాడు. పల్లెలో మరింత మంది జ్వరాలతో అల్లాడుతున్నారని, వైద్యసిబ్బంది ఇటువైపు కన్నెత్తి చూడలేదని స్థానికులు ఆరోపిస్తున్నారు.





తంబళ్లపల్లె: శ్రీశేష షిరిడీ సాయిబాబా ఆలయంలో ప్రత్యేక పూజలు చేస్తున్న అర్చకులు

వాడవాడలా నూతన వేడుకలు

తంబళ్లపల్లె, న్యూస్‌టుడే: మండల ప్రజలు నూతన సంవత్సరం 2018 వేడుకలను సోమవారం వైభవంగా నిర్వహించారు. ఆదివారం అర్ధరాత్రి నుంచే బాణసంచా పేల్చి, కేక్‌లు కోసి, ఆలయాల్లో ప్రత్యేకపూజలు, అభిషేకాలు చేయించి, ఏడాదంతా మంచి జరగాలని, ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో గడపాలని, అనుకున్న లక్ష్యాలు చేరుకోవాలని ఆకాంక్షించారు. పుణ్యక్షేత్రాలు మల్లయ్యకొండ మల్లికార్జునస్వామి ఆలయం, కోసువారిపల్లె శ్రీప్రసన్న వెంకటరమణస్వామి ఆలయం, కుక్కరాజుపల్లె శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయం, కోటకొండ గంగమ్మ ఆలయం, మండలంలోని ప్రధాన చర్చిలు, మసీదుల్లో ప్రత్యేక పూజలు, ప్రార్థనలు చేశారు.

ఉచిత కంటి పరీక్షల కేంద్రం ప్రారంభం

తంబళ్ళపల్లె, న్యూస్‌టుడే: నియోజకవర్గ కేంద్రం తంబళ్ళపల్లెలో నూతన ఆంగ్ల సంవత్సరం సందర్భంగా సోమవారం మదనపల్లె ఎల్.వీ.ప్రసాద్ నేత్రవైద్య విజ్ఞాన సంస్థ, రెబాన్‌సన్ ఆప్టిక్స్ సహకారంతో ఉచిత ప్రాథమిక కంటివైద్య పరీక్ష కేంద్రాన్ని ప్రారంభించారు. నిరుపేదలు ఎక్కువగా ఉన్న తంబళ్ళపల్లె నియోజకవర్గ ప్రజలకు సేవలందించి కంటికి సంబంధించిన సమస్యలతో ఎవరూ ఇబ్బంది పడకూడదన్న లక్ష్యంతో కంటివైద్య పరీక్ష కేంద్రాన్ని ప్రారంభించినట్లు సహాయ డైరెక్టర్ నిరంజన్‌కుమార్ పేర్కొన్నారు. సోమవారం నుంచి శనివారం వరకూ ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకూ కేంద్రంలో ఉచిత కంటి పరీక్షలు నిర్వహిస్తారు. అర్హులైన వారికి ఉచితంగా శస్త్రచికిత్సలను కూడా మదనపల్లె కంటివైద్యశాలలో నిర్వహిస్తామన్నారు. కంటివైద్య నిపుణులు జీసమ్, ఆర్‌ఎస్‌వీపీ పెచ్చిరెడ్డి, శ్రీనివాస్, సిబ్బంది, స్థానిక ప్రాథమిక ప్రైవేటు వైద్యకేంద్రాల వైద్యులు విజయకుమార్, ప్రభాకర్‌నాయుడు, త్యాగరాజు, గ్రామపెద్దలు తదితరులు పాల్గొన్నారు.



అత్యాధునిక కంటిపరీక్షల యంత్రాన్ని ప్రారంభిస్తున్న కంటివైద్య నిపుణులు జీసమ్, నిరంజన్‌కుమార్

భక్తులతో కిటకిటలాడిన ఆలయాలు

ములకలచెరువు, న్యూస్‌టుడే : నూతన సంవత్సరం సందర్భంగా సోమవారం మండలంలోని అన్ని ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. రామాపురం రామలింగేశ్వరస్వామికి అభిషేకం, మారేడు పత్రాలతో విశేష పూజలు నిర్వహించారు. బురకాయలకోట ప్రసన్న వేంకటేశ్వరస్వామి, ములకలచెరువు శ్రీకన్యకాపరమేశ్వరి అమ్మవారిని నూతన సంవత్సరం సందర్భంగా శుభాలు కలుగజేయాలని కోరుతూ ప్రార్థించారు. ఆలయ ధర్మకర్తలు, అర్చకులు భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.

నేడు తెట్టులో జన్మభూమి

తెట్టు (కురబలకోట), న్యూస్‌టుడే: ఐదో విడత జన్మభూమి-మా ఊరు కార్యక్రమం మంగళవారం తెట్టులో జరగనుంది. మంగళవారం ఉదయం 11 గంటలకు స్థానిక పంచాయతీ కార్యాలయం వద్ద జరిగే జన్మభూమి కార్యక్రమంలో తంబళ్లపల్లె ఎమ్మెల్యే శంకరయాదవ్ పాల్గొంటారని తెదేపా మండల కన్వీనర్ సురేంద్రయాదవ్ తెలిపారు.

హంద్రీ-నీవా పనులు ఆరు నెలల్లో పూర్తి

☛ రూ.12 వందల కోట్లతో నిర్మాణ పనులు
☛ ఎమ్మెల్యే జి.శంకర్ వెల్లడి

కురబలకోట, న్యూస్‌టుడే: కరవు ప్రాంతమైన రాయలసీమ జిల్లాల రైతులకు త్వరలోనే మంచి రోజులు వస్తున్నాయని తంబళ్లపల్లె ఎమ్మెల్యే శంకరయాదవ్ స్పష్టం చేశారు. రాయలసీమ జిల్లాకు కృష్ణా జలాలను తరలించే హంద్రీ-నీవా పథకం పనులు శరవేగంగా జరుగుతున్నట్లు వెల్లడించారు. ఎమ్మెల్యే సోమవారం మండలంలో పర్యటించారు. అంగళ్లులో జరిగిన షాదీఖానా శంకుస్థాపన కార్యక్రమం అనంతరం మట్లివారిపల్లె పంచాయతీ గడ్డెత్తుపల్లె, నడింపల్లె గ్రామాల్లో పర్యటించారు. అక్కడి ప్రజలతో మాట్లాడి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రూ.12 వందల కోట్లతో హంద్రీ-నీవా కాలువ నిర్మాణం పనులు జరుగుతున్నాయన్నారు. గత ప్రభుత్వం అక్కడక్కడా కాలువలను మాత్రమే తవ్వించి వదిలేసిందని, ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు హంద్రీ-నీవాపై ప్రత్యేక దృష్టి సారించారన్నారు. తంబళ్లపల్లె నియోజకవర్గంలో 64 చెరువులను హంద్రీ-నీవా కాలువతో అనుసంధానం చేసి దాదాపు 3 టీఎంసీల నీటిని నిల్వచేయాలనే లక్ష్యంతో ఉన్నామన్నారు. ఇందుకు అవసరమైన నిధులు సైతం మంజూరయ్యాయని, త్వరలో ఆ పనులు కూడా చేపడుతామన్నారు. మరో ఆర్నెళ్లల్లో నిర్మాణం పనులు పూర్తవుతాయని, ఆ తర్వాత కృష్ణా జలాలను తంబళ్లపల్లె నియోజకవర్గానికి తీసుకువస్తామన్నారు. నిరంతరం కరవుతో సతమతం అవుతున్న పడమటి జిల్లాల రైతాంగాన్ని ఆదుకునే ఉద్దేశంతో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు కాలువ గట్టుపై నిద్రించిన రోజులు ఉన్నాయని గుర్తుచేశారు. గ్రామాల్లో సీసీరోడ్ల నిర్మాణం, ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా నిధుల మంజూరు వంటివి అధిక సంఖ్యలో చేపట్టామన్నారు. కార్యక్రమంలో నాయకులు ముస్తఫా, వై.జి.రమణ, ఎల్లారెడ్డి, బాలకృష్ణ, ఖలీల్, బావాజీ, రెడ్డికుమారి, తిమ్మరాయుడు, వై.జి.సురేంద్ర, గుడే శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

తంబళ్లపల్లె

దిగవపల్లె, మండలవారిపల్లెలో జన్మభూమి

పెద్దమండ్యం, న్యూస్‌టుడే: ప్రభుత్వం చేపడుతున్న 5వ విడత జన్మభూమి కార్యక్రమం మంగళవారం పెద్దమండ్యంలో ప్రారంభించనున్నట్లు ఎంపీడీవో శ్రీధర్, తెదేపా మండల కన్వీనర్ ప్రసాద్ తెలిపారు. 2వ తేదీన మంగళవారం దిగవపల్లెలో, మధ్యాహ్నం మండల వారిపల్లెలో జన్మభూమి గ్రామసభలు జరుగుతాయని తెలిపారు.



హార్సిలీహిల్స్‌లో బస్సులోకి చొరబడుతున్న ప్రయాణికులు

మైనార్టీల సంక్షేమమే తెదేపా లక్ష్యం

మండలానికో షాదీఖానా, సామాజిక భవనం



షాదీఖానా శిలాఫలకానికి శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే

అంగళ్లు (కురబలకోట), న్యూస్‌టుడే: మైనార్టీల సంక్షేమమే తెదేపా లక్ష్యమని తంబళ్లపల్లె ఎమ్మెల్యే జి.శంకర యాదవ్ పేర్కొన్నారు. అంగళ్లులో రూ.50 లక్షల నిధులతో షాదీమహల్ మంజూరు చేశారు. స్థానిక ఉన్నత పాఠశాల సమీపంలోని గుర్రాలవారిపల్లె దారి వద్ద షాదీమహల్ నిర్మాణానికి సోమవారం భూమిపూజ, శంకుస్థాపన కార్యక్రమం నిర్వహించారు. శిలాఫలకాన్ని ఆవిష్కరించి భూమిపూజ చేసిన అనంతరం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఎమ్మెల్యే మాట్లాడారు. తంబళ్లపల్లె నియోజకవర్గంలోని ప్రతి మండలానికి షాదీఖానా నిర్మిస్తామన్నారు. రూ.కోటి వ్యయంతో తొలివిడత బి.కొత్తకోట, అంగళ్లుకు మంజూరు చేశామని, ములకలచెరువులోనూ రూ.30లక్షలతో నిర్మిస్తున్నట్లు వెల్లడించారు. మిగిలిన మండలాల్లోనూ షాదీఖానాలు నిర్మించి పేద, మధ్య తరగతి ముస్లిం సోదరుల వివాహాలకు భరోసా కల్పిస్తామన్నారు. దీంతోపాటు దుల్హన్ పథకం ద్వారా వివాహం చేసుకునే ప్రతి ముస్లిం స్త్రీకి రూ.50వేల చొప్పున తెలుగుదేశం ప్రభుత్వం అందజేస్తోందన్నారు. గతంలో ఏ ప్రభుత్వమూ చేయని విధంగా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ముస్లింల అభ్యున్నతికి ప్రత్యేక దృష్టి సారించారని అన్నారు. అదేవిధంగా రానున్న రోజుల్లో మండలానికి ఒక్కటి చొప్పున సామాజిక భవన నిర్మాణాలకూ నిధులు మంజూరు చేయనున్నట్లు ప్రకటించారు.

నూతన సంవత్సర శుభాకాంక్షలు

ఈ సందర్భంగా ఎమ్మెల్యే శంకరయాదవ్ కేకును కట్ చేసి నియోజకవర్గ ప్రజలకు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. పలువురు నాయకులు, కార్యకర్తలు సైతం ఎమ్మెల్యేకు పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో జడ్పీటీసీ సభ్యురాలు ధనలక్ష్మి, ఎంపీపీ భూమిరెడ్డి, సింగిల్‌విండో అధ్యక్షుడు బి.వి.రెడ్డి, ప్రత్యేక ఆహ్వానితులు ప్రసాదరావు, వైస్ ఎంపీపీ రజియాసుల్తానా, మాజీ ఎంపీపీ కుళ్లాయప్ప, సర్పంచి అమ్మాజీ, ఉపసర్పంచి దస్తగిరి, తెదేపా కన్వీనర్ సురేంద్రయాదవ్, పంచాయతీ రాజ్ డీఈ శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.



కేకును కట్ చేస్తున్న ఎమ్మెల్యే శంకరయాదవ్

హార్సిలీహిల్స్ ప్రయాణికులకు తప్పనిపాట్లు

బి.కొత్తకోట, న్యూస్‌టుడే: కొత్త సంవత్సరం సందర్భంగా హార్సిలీహిల్స్‌కు రాకపోకలు సాగించడానికి ఆర్టీసీ సోమవారం ప్రత్యేకంగా బస్సులను ఏర్పాటు చేసింది. వివిధ ప్రాంతాల నుంచి కొండపైకి బస్సులు నడిచాయి. అయితే పర్యాటకులు కొండపైకి చేరడంలో ఆలస్యం కావడంతో మధ్యాహ్నం నుంచి బస్సుల్లో రద్దీ ఒక్కసారిగా పెరిగింది. ఈ కారణంగా ప్రయాణికులు ఇబ్బందులకు గురయ్యారు. ఈ మధ్యలో బస్సు ఘాట్ రోడ్డులో ఆగిపోవడంతో ప్రయాణికులు ఆందోళనకు గురయ్యారు. కాగా బస్సులు ఉన్నప్పటికీ గ్రామాల నుంచి పర్యాటకులు మినీలారీలు, ట్రాక్టర్లలో వచ్చారు. ప్రయాణికుల రద్దీని బట్టి బస్సులను నడిపామని ఆర్టీసీ వర్గాలు వెల్లడించాయి.

వైకాపా నుంచి తెదేపాలో చేరిక

పెద్దమండ్యం, న్యూస్‌టుడే: ఎమ్మెల్యే శంకర్ సమక్షంలో పాపేపల్లి పంచాయతీ గుడిశవారిపల్లెకు చెందిన వైకాపా నేత చంద్రమౌళిరెడ్డి సోమవారం తెదేపాలో చేరారు. తెదేపా చేపడుతున్న పథకాలు, అభివృద్ధిని చూసి పార్టీలో చేరినట్లు ఆయన తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే శంకర్ మాట్లాడుతూ.. పార్టీ కోసం, సమాజం కోసం మంచి చేయాలన్న ఉద్దేశం ఉన్నవారు పార్టీలోనికి రావొచ్చన్నారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ ప్రసాద్, నాగరాజ, రమణారెడ్డి, మధూకర్, మనోహర్‌నాయక్, శ్రీనివాసులు ఉన్నారు.



సర్వర్‌కు పూజచేసి ప్రారంభిస్తున్న ప్రిన్సిపల్ డాక్టర్ యువరాజ్

కొత్త సంవత్సరం క్యాలెండర్ల ఆవిష్కరణ

బి.కొత్తకోట, న్యూస్‌టుడే: మదనపల్లెకు చెందిన హెల్పింగ్ మైండ్స్ సంస్థ రూపొందించిన క్యాలెండర్లను ఆదివారం రాత్రి హార్సిలీహిల్స్‌లో ఆవిష్కరించారు. కొండపై ఉన్న పర్యాటకశాఖ హాలులో జరిగిన కార్యక్రమంలో తిరుపతి డీవీఎం సురేష్‌కుమార్ రెడ్డి, జీడీ నెల్లూరు ఎమ్మెల్యే నారాయణస్వామి, స్థానిక మేనేజరు మురళి, హెల్పింగ్ మైండ్స్ సంస్థ అధ్యక్షుడు అబుబకర్ సిద్ధిక్ పాల్గొన్నారు.



క్యాలెండర్లను ఆవిష్కరిస్తున్న తిరుపతి డీవీఎం సురేష్‌కుమార్‌రెడ్డి, ఎమ్మెల్యే నారాయణస్వామి

తెదేపా సీనియర్‌నేత మృతి

బి.కొత్తకోట, న్యూస్‌టుడే: బి.కొత్తకోటకు చెందిన సీనియర్ తెదేపా నేత గార్ల నటరాజ(59) సోమవారం మృతి చెందారు. గత కొన్ని రోజులుగా ఆయన తీవ్ర అనారోగ్యంతో బాధపడుతూ తిరుపతిలో చికిత్సపొందాడు. దివంగత మాజీ సీఎం ఎన్టీరామారావు వద్ద కొన్నాళ్లపాటు సహాయకుడిగా నటరాజ పనిచేశారు. ఇద్దరు రాష్ట్ర మంత్రులకు సహాయకుడిగా వ్యవహరించారు. మరోవైపు తెదేపా ఆవిర్భావం నుంచి పార్టీలో కొనసాగుతూ ప్రత్యేక గుర్తింపు పొందారు. మంగళవారం బి.కొత్తకోటలో నగరాజకు అంత్యక్రియలను నిర్వహించనున్నట్లు కుటుంబసభ్యులు తెలిపారు.



గార్ల నటరాజ (పాత చిత్రం)

అందుబాటులో అంతర్జాల సేవలు

కురబలకోట, న్యూస్‌టుడే: అంతర్జాల సేవలు విద్యార్థులకు అందుబాటులోకి తెస్తున్నట్లు మిట్స్ ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ యువరాజ్ తెలిపారు. ఈ మేరకు సోమవారం 200 ఎంబీపీఎస్ స్పీడ్‌ను ప్రారంభించారు. ఈనెలాఖరుకు మరో 150 ఎంబీపీఎస్ స్పీడ్‌ను పెంచి మొత్తం 350 ఎంబీపీఎస్ స్పీడ్‌తో అంతర్జాల సేవలను విద్యార్థులకు అందుబాటులోకి తెస్తామన్నారు. ప్రస్తుతం కాలంలో అంతర్జాల సేవలు ప్రతిఒక్కరికీ అవసరమన్నారు.

జిల్లా పర్యాటకశాఖ రాబడి రూ.23.65 కోట్లు

బి.కొత్తకోట, న్యూస్‌టుడే: జిల్లాలో పర్యాటకశాఖకు ఈ ఆర్థిక సంవత్సరంలో ఇప్పటివరకు రూ.23.65 కోట్ల రాబడి వచ్చిందని తిరుపతి పర్యాటకశాఖ డీవీఎం సురేష్‌కుమార్‌రెడ్డి తెలిపారు. బి.కొత్తకోట మండలం హార్సిలీహిల్స్‌లో రూ.2.50 కోట్లతో చేపట్టిన గవర్నరు బంగ్లా ఆధునీకరణ పనులను సోమవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా డీవీఎం మాట్లాడుతూ.. ఈ ఏడాది మార్చి నెలాఖరుకు రూ.29 కోట్ల రాబడిని సంపాదించాలని లక్ష్యంగా పెట్టుకున్నామని, ఇప్పటివరకు పరిస్థితి ఆశాజనకంగా ఉందని తెలిపారు. తిరుపతిలోని నాలుగు ఎకరాల స్థలంలో రూ.2 కోట్ల వ్యయంతో పర్యాటక భవన్‌ను నిర్మించడానికి చర్యలు చేపట్టినట్లు తెలిపారు. రాయలసీమలో అధ్యాత్మిక, పర్యాటక కేంద్రాల అభివృద్ధికి రూ.126 కోట్లు కేటాయించాలని కేంద్రానికి ప్రతిపాదనల్ని పంపినట్లు తెలిపారు. స్వచ్ఛభారత్ కార్యక్రమం కింద రూ.47 లక్షలతో హార్సిలీహిల్స్‌లో సాలిడ్‌వేస్ట్ మేనేజ్‌మెంటు ప్లాంటును ఏర్పాటు చేయడానికి ప్రతిపాదనల్ని పంపినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో స్థానిక పర్యాటక మేనేజరు మురళి, ఏఈ రామ్మోహన్ పాల్గొన్నారు.




తిరుపతి పర్యాటక శాఖ డీవీఎం సురేష్‌కుమార్‌రెడ్డి

మహిళ ఆత్మహత్యాయత్నం

మదనపల్లె (నేరవార్తలు), న్యూస్‌టుడే : కుటుంబ కలహాలతో మహిళ ఆత్మహత్యకు యత్నించిన సంఘటన తంబళ్లపల్లె మండలంలో ఆదివారం రాత్రి జరిగింది. పోలీసుల కథనం మేరకు.. మండలంలోని కోటకొండ గ్రామానికి చెందిన లలిత (35) కుటుంబ విషయమై భర్తతో గొడవపడి ఇంట్లోనే పురుగుల మందుతాగి ఆత్మహత్యకు యత్నించింది. కుటుంబ సభ్యులు ఆమెను మదనపల్లె ప్రాంతీయ వైద్యశాలకు తరలించారు.

కాలువపల్లెలో నేడు జన్మభూమి

ములకలచెరువు, న్యూస్‌టుడే : కాలువపల్లె, గూడుపల్లె గ్రామాల్లో మంగళవారం జన్మభూమి కార్యక్రమం ఉంటుందని ఎంపీడీవో రాజగోపాల్ తెలిపారు. ప్రజలందరూ జన్మభూమి కార్యక్రమంలో పాల్గొని వారి సమస్యలు పరిష్కరించుకోవాలని కోరారు. కొత్తరేషన్‌కార్డులు, ఎన్టీఆర్ సామాజిక భద్రతా పింఛన్లు, ఎన్టీఆర్ గృహకల్ప, ఇతర సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలకు సంబంధించి ప్రజల నుంచి దరఖాస్తులు తీసుకుంటారని తెలిపారు. సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు, డ్వాక్రా సంఘాల మహిళలు జన్మభూమి కార్యక్రమంలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.



మదనపల్లె

ఎంఎస్‌ఆర్: ఎంసీఏ
సిద్దార్థ: హలో
శ్రీకృష్ణా: 2 కంట్రీస్
సాయిచిత్ర: ఒక్క క్షణం
సునీల్: జుమాంజి
మినీసిద్ధార్థ : టైగర్ జిందగి హై
ఎంఎస్‌ఆర్: ప్రాజెక్ట్ 2
రవి: ఎంసీఏ

తంబళ్లపల్లె

విజయ: 2 కంట్రీస్

బి.కొత్తకోట

వెంకటేశ్వర: 2 కంట్రీస్
ద్వారకనాథ: హలో..

ములకలచెరువు

మాలిక్: 2 కంట్రీస్



మహిళలతో మాట్లాడుతున్న జగన్

45 ఏళ్లకే పింఛను: జగన్

కురబలకోట, న్యూస్‌టుడే: వైకాపా అధికారంలోకి వస్తే 45 సంవత్సరాలకే పింఛను అందజేస్తామని ఆ పార్టీ అధ్యక్షుడు వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి పేర్కొన్నారు. జగన్ తలపెట్టిన ప్రజా సంకల్పయాత్ర సోమవారం నియోజకవర్గంలో ముగిసింది. ఆదివారం రాత్రి ముదివేడులో బసచేసిన జగన్ సోమవారం ఉదయం అక్కడినుంచి బయలుదేరారు. నూతన సంవత్సరం సందర్భంగా ముదివేడు క్రాస్‌లో మహిళా కార్యకర్త ఏర్పాటు చేసిన కార్యక్రమంలో కేకును కత్తిరించారు. అనంతరం ప్రజలకు, కార్యకర్తలకు జగన్ కొత్త సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. అక్కడినుంచి మట్లివారిపల్లె పంచాయతీలోని నడింపల్లె, ఆర్.సి.కురవపల్లె, గడ్డెత్తుపల్లె మీదుగా మదనపల్లె నియోజకవర్గంలోకి వెళ్లారు.

కస్తూర్బాలో నూతన వేడుకలు

ములకలచెరువు, న్యూస్‌టుడే : పోలీసులు దత్తత తీసుకున్న కస్తూర్బా పాఠశాలలో సీఐ రుషికేశవ, ఎస్సై ఈశ్వరయ్య సోమవారం విద్యార్థినులతో కలసి నూతన సంవత్సర వేడుకల్లో పాల్గొన్నారు. 7వ తరగతి విద్యార్థిని పూజిత జన్మదినం సందర్భంగా పాఠశాలలో వేడుకలు నిర్వహించారు. పోలీసులు విద్యార్థిని ఆశీర్వదించారు. విద్యార్థినులతో మాట్లాడారు. సీఐ మాట్లాడుతూ విద్యార్థినులు బాగా చదువుకుంటే భవిష్యత్తు ఎంతో బాగుంటుందన్నారు. విద్యార్థినుల జానపద పాటలు అందరినీ ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో పాఠశాల ప్రత్యేక అధికారిణి విశ్వలత, ఉపాధ్యాయిని నిర్మల, రమాదేవి తదితరులు పాల్గొన్నారు.



కస్తూర్బాలో నూతన సంవత్సర వేడుకలు జరుపుకుంటున్న సీఐ, ఎస్సైలు

తిరుపతి



డీజీపీ మాల కొండయ్యను సన్మానిస్తున్న అంబేద్కర్‌కృష్ణ

మాలకొండయ్యకు యూనియన్ నేతల సన్మానం

తిరుపతి(ఆర్టీసీ), న్యూస్‌టుడే: ఏపీఎస్ ఆర్టీసీ ఎండీ మాలకొండయ్య డీజీపీగా బాధ్యతలు స్వీకరించిన సందర్భంగా తిరుపతికి చెందిన ఆర్టీసీ బహుజన వర్కర్స్ యూనియన్ తెలుగురాష్ట్రాల అధ్యక్షుడు అంబేద్కర్ కృష్ణను సోమవారం ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నష్టాలలో ఉన్న ఆర్టీసీని లాభాలబాట పట్టించిన ఘనత మాలకొండయ్యకే దక్కుతుందన్నారు. ఆయన స్ఫూర్తితో యూనియన్లు పనిచేయాలని తెలిపారు. డీజీపీగా ఆర్టీసీ పరిరక్షణకు, అక్రమ వాహనాలను అరికట్టేందుకు, దళిత బహుజన కార్మిక, ఉద్యోగులకు అండగా నిలవాలని కోరినట్లు తెలిపారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు పాల్గొని శుభాకాంక్షలు తెలిపారు.



మహిళలకు చంద్రన్న కానుక పంపిణీ చేస్తున్న శ్రీధర్‌రెడ్డి

తిరుచానూరులో నూతన చౌకదుకాణం

తిరుపతి (నగరం), న్యూస్‌టుడే: తిరుచానూరు గ్రామ పంచాయతీలో నూతనంగా ఏర్పాటు చేసిన చౌకదుకాణాన్ని సోమవారం మార్కెట్ కమిటీ మాజీ ఛైర్మన్ సి.శ్రీధర్‌రెడ్డి ప్రారంభించారు. ఇందులో భాగంగా తెల్ల రేషన్‌కార్డు కలిగిన మహిళలకు చంద్రన్న సంక్రాంతి కానుకలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామ ప్రజల సౌకర్యార్థం రెవెన్యూ శాఖ 55వ నెంబరు చౌకదుకాణాన్ని వేపమాను వీధికి కేటాయించినట్లు చెప్పారు. కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యురాలు జమున, నాయకుడు సాల్మన్‌రాజు, డీలర్ సుప్రియ తదితరులు పాల్గొన్నారు.

నగదు రహిత సేవలు షురూ!

☛ ఖాళీగా దర్శనమిచ్చిన కౌంటర్లు

☛ వెలవెలబోయిన ఆర్టీఏ కార్యాలయం



వినియోగదారులు రాక ఖాళీగా దర్శనమిస్తున్న ఆర్టీఏ కార్యాలయ కౌంటర్లు

న్యూస్‌టుడే, తిరుపతి(రెవెన్యూ): తిరుపతి రవాణా శాఖ కార్యాలయంలో నగదు రహిత సేవలు ప్రారంభమయ్యాయి. ఇందుకు నూతన ఆంగ్ల సంవత్సరం-2018 మొదటి రోజు సోమవారం శ్రీకారం చుట్టారు. వివిధ సేవల నిమిత్తం సోమవారం కార్యాలయానికి వచ్చిన వినియోగదారుల నుంచి రూ.20 మాత్రమే నగదు వచ్చింది. మిగిలిన మొత్తం ఆన్‌లైన్ ద్వారానే చెల్లింపులు జరిగాయి. ఈ విధానాన్ని కొనసాగిస్తామని ఆర్టీవో వివేకానందరెడ్డి స్పష్టం చేశారు. ముందస్తుగా ప్రకటించినట్లు మధ్యాహ్నం 1 నుంచి 2 గంటల వరకు నగదు లావాదేవీలకు అవకాశం ఇస్తామని తెలియజేశారు. ఈ అవకాశం నెలరోజులు ఉంటుందన్నారు. ప్రతి ఒక్కరు తప్పనిసరిగా నగదు రహిత లావాదేవీలకు అలవాటుపడాలని వివరించారు. నగదు రహిత లావాదేవీల పట్ల డీటీసీ సీహెచ్ ప్రతాప్ ఆర్టీవో వివేకానందరెడ్డిని అభినందించారు. అంతకుముందు డీటీసీని ఆర్టీవోతో పాటు ఎంవీఐ అధికారులు సురేష్‌నాయుడు, శివారెడ్డి, నాగరాజునాయక్‌లు కలిసి పుష్పగుచ్ఛం అందజేసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. అన్ని కార్యాలయాల్లో నగదు రహిత సేవలు అమల్లోకి తీసుకొచ్చేందుకు చర్యలు చేపట్టాలని డీటీసీ ఆర్టీవోకు సూచించారు.

అతి తక్కువగా సేవలు

వివిధ సేవల నిమిత్తం వినియోగదారులతో ఎప్పుడూ కిటకిటలాడే తిరుపతి ఆర్టీఏ కార్యాలయం వెలవెలబోయింది. గతంలో ఎప్పుడూ ఈ విధంగా కార్యాలయం బోసిపోయిన సందర్భాలు లేవు. వినియోగదారులు రాకపోవడంతో కౌంటర్ సిబ్బంది కాలక్షేపం చేశారు. నూతన ఆంగ్ల సంవత్సరం కావడంతో చాలా మంది సెలవు రోజుగా భావించారని ఆర్టీవో తెలిపారు.

కాలమాన పట్టికలు, దైనందినిల ఆవిష్కరణ

నూతన సంవత్సరం సందర్భంగా పలు ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక, సేవా సంఘాలు ప్రత్యేకంగా ముద్రించిన క్యాలెండర్లు, డైరీలను సోమవారం ఆవిష్కరించాయి. ఆయా సంఘాల ప్రతినిధులు, సభ్యులు వీటిని అందుకున్నారు. పరస్పర సహకారానికి, ఐక్యతకు ఇలా క్యాలెండర్లు ముద్రించడం ముదావహమని ఆవిష్కర్తలు కొనియాడారు. సంఘం సభ్యులకు ఉపయుక్తమైన సమాచారంతో డైరీలను ముద్రించడాన్ని అభినందించారు.



తిరుపతి (రైల్వే), న్యూస్‌టుడే: ఆర్టీసీ ఎన్ఎంయూ అలిపిరి డిపో కార్యదర్శి కేవీజీ రెడ్డి రూపొందించిన కాలమానపట్టికను ఎన్ఎంయూ రాష్ట్ర అధ్యక్షులు చల్లా చంద్రయ్య ఆవిష్కరించారు. ప్రచార కార్యదర్శి ఎస్.మణ్యం, నాయకులు పాల్గొన్నారు.



శ్రీ వేంకటేశ్వర వైద్యకళాశాలలోని ఏపీ వైద్య ఉద్యోగుల సంఘం బ్రాంచి కాలమాన పట్టికను కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఎన్.వి.రమణయ్య ఆవిష్కరించారు. వైద్య ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు ఎమ్.బాలరాజునాయుడు, రాష్ట్ర కార్యదర్శి బ్రాంచి అధ్యక్షులు ఎ.గిరిబాబు, కార్యదర్శి కె.సి.సుబ్రమణ్యం, కోశాధికారి వి.కిరణ్, ఉపాధ్యక్షులు కె.రాజ్యలక్ష్మి, ఎస్.అస్థానాబేగం, సి.సిద్ధారెడ్డి తదితరులు పాల్గొన్నారు.



తిరుపతి(ఎస్వీ విశ్వవిద్యాలయం), న్యూస్‌టుడే: వృత్తి ధర్మంతో సేవచేయడమే ఉద్యోగుల లక్ష్యం కావాలని ఎస్వీయూ వీసీ ఆచార్య దామోదరం పేర్కొన్నారు. ఏఐటీయూసీ అనుబంధ సంఘమైన ఏపీ ఎంప్లాయిస్ అండ్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తేనేబండ ప్రసాద్ ఆధ్వర్యంలో రూపొందించిన క్యాలెండర్‌ను ఎస్వీయూలోని ఆర్ట్స్ బ్లాక్ ఆడిటోరియంలో వీసీ దామోదరం, రెక్టార్ భాస్కర్, రిజిస్ట్రార్ అనురాధ సంయుక్తంగా ఆవిష్కరించారు. ఉద్యోగ సంఘాల నాయకులు మురళి, రాజారెడ్డి, సుధాకర్, శేఖర్, గిరి, వెంకటేష్ పాల్గొన్నారు.



తిరుపతి(తితిదే), న్యూస్‌టుడే: జై సేవాలాల్ మహరాజ్ కోఆపరేటివ్ హౌసింగ్ బిల్డింగ్ సొసైటీ లిమిటెడ్ క్యాలెండర్‌ను తితిదే ఈవో అనిల్ కుమార్ సింఘాల్ తన కార్యాలయంలో ఆవిష్కరించారు. సొసైటీ అధ్యక్షులు భాస్కర్, ప్రసాదరావు, నాగార్జున, కల్పన, వెంకటరమణరెడ్డి, మధు, ఇందిర, బాలదాస్ తదితరులు పాల్గొన్నారు.



తిరుపతి(తితిదే), న్యూస్‌టుడే: తితిదే ఇంజినీరింగ్ విభాగం డైరీని తితిదే ఈవో ఏకే సింఘాల్ పరిపాలనా భవనంలోని తన కార్యాలయంలో ఆవిష్కరించారు. చీఫ్ ఇంజినీరింగ్ అధికారి చంద్రశేఖర్‌రెడ్డి, ఇంజినీరింగ్ అసోసియేషన్ అధ్యక్షులు టి.సదాశివకుమార్, కార్యదర్శి వీరప్రసాద్, కోశాధికారి సురేష్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పద్మావతి ఫ్యాబ్రిక్, మ్యాచింగ్స్ ప్రారంభం

తిరుపతి(గాంధీరోడ్డు), న్యూస్‌టుడే: చిత్తూరు జిల్లాలోనే అతిపెద్ద షోరూం పద్మావతి ఫ్యాబ్రిక్ అండ్ మ్యాచింగ్స్ సెంటర్‌ను తిరుపతిలో ప్రారంభించినట్లు ప్రొప్రైటర్ జగదీష్ పేర్కొన్నారు. స్థానిక తీర్థకట్ట వీధిలోని కంచి మహాలక్ష్మి షోరూంలో సోమవారం ఘనంగా ప్రారంభమైందన్నారు. ఈ సందర్భంగా ప్రొప్రైటర్ మాట్లాడుతూ ముంబాయి, కోల్‌కతా, బెనారస్, ఢిల్లీ, జోధ్‌పూర్, రాజస్థాన్ వంటి మహా నగరాల నుంచి సేకరించిన డిజైనర్ మెటీరియల్స్ తమ ప్రత్యేకత అని తెలిపారు. నగర ప్రజలు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

కళాకారులకు చేయూతనివ్వాలి

తిరుపతి(గాంధీరోడ్డు), న్యూస్‌టుడే: రంగస్థలి కళాకారులకు చేయూతనివ్వాలని రాయలసీమ రంగస్థలి అధ్యక్షుడు గుండాల గోపీనాథ్ రెడ్డి కోరారు. నూతన సంవత్సరం సందర్భంగా సోమవారం స్థానిక చిత్తూరు ఎంపీ డాక్టర్ శివప్రసాద్, తిరుపతి ఎమ్మెల్యే సుగుణమ్మను కలిసి సత్కరించి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేశారు. కార్యక్రమంలో రంగస్థలి కార్యదర్శి కె.ఎన్.రాజా, కళాకారులు నారాయణరెడ్డి, పణిభూషణ్ రెడ్డి, భాస్కర్ రాయల్, మునస్వామి నాయుడు, జయచంద్ర యాదవ్ పాల్గొన్నారు.

అనాథలను ఆదరించాలి

సి.రామాపురం (రామచంద్రాపురం), న్యూస్‌టుడే: అనాథ పిల్లలను దాతలు ఆదరించాలి. వారికి మనమంతా ఉన్నామనే ధైర్యాన్నివ్వాలని దాత నంద్యాల బాలాజీ పిలుపునిచ్చారు. సోమవారం ఆంగ్ల సంవత్సర ప్రారంభాన్ని పురస్కరించుకుని సి.రామాపురంలోని అక్షయ క్షేత్రంలోని 180 మంది పిల్లలకు ఆయన అన్నదానం నిర్వహించారు.

నేటి నుంచి 'జన్మభూమి-మన ఊరు'

చంద్రగిరి, న్యూస్‌టుడే: ప్రభుత్వం నేటి నుంచి 11వ తేదీ వరకు ప్రతిష్ఠాత్మకంగా జన్మభూమి-మాఊరు గ్రామసభలు నిర్వహించడానికి ప్రభుత్వం చర్యలు చేపట్టిందని ఎంపీడీవో డాక్టర్ వెంకటనారాయణ అన్నారు. పనపాకం, కల్‌రోడ్డుపల్లి, కాశిపెంట్ల గ్రామపంచాయతీల్లో గ్రామ పంచాయతీ సర్పంచుల అధ్యక్షతన మంగళవారం గ్రామసభలు నిర్వహిస్తామన్నారు.

రామచంద్రాపురంలో...

రామచంద్రాపురం, న్యూస్‌టుడే: మండలంలో అయిదో విడత 'జన్మభూమి-మన ఊరు' కార్యక్రమం నేటి నుంచి ఈ నెల 11వ తేదీ వరకు మండలంలోని 23 పంచాయతీల్లో జరగనున్నట్లు ఎంపీడీవో వెంకటేశులు సోమవారం తెలిపారు. మంగళవారం రావిళ్లవారిపల్లి, కమ్మపల్లి, సొరకాయలపాళ్యం పంచాయతీల్లో నిర్వహించనున్నట్లు వివరించారు.

నివాస గృహాలను క్రమబద్ధీకరించాలి

సబ్ కలెక్టర్‌కు సాయినగర్ పంచాయతీ ప్రజల వినతి



తహసీల్దార్ రాజగోపాల్‌ను సమస్య అడిగి తెలుసుకుంటున్న సబ్‌కలెక్టర్ నిశాంత్‌కుమార్

తిరుపతి(రెవెన్యూ), న్యూస్‌టుడే: సాయినగర్ పంచాయతీలోని నివాస గృహాలను క్రమబద్ధీకరించాలని ప్రజలు తిరుపతి సబ్‌కలెక్టర్ నిశాంత్‌కుమారను కోరారు. సోమవారం సాయంత్రం కార్యాలయంలో సబ్‌కలెక్టర్‌ను కలిసిన ప్రజలు సమస్యను వివరించారు. దశాబ్ద కాలంగా నివాస గృహాలు ర్పరుచుకుని జీవిస్తున్నామని తెలిపారు. గజం రూ.640లు చెల్లించేలా మార్కెట్ ధరను హైకోర్టు నిర్దేశించిందన్నారు. అనివార్య కారణాలతో మళ్లీ అనుమతులు లేనందున ఆ ప్రక్రియ మరుగున పడిందన్నారు. దాదాపు 1400 నివాస గృహాలు క్రమబద్ధీకరించాల్సి ఉందన్నారు. వీరి వినతికి సబ్‌కలెక్టర్ సానుకూలంగా స్పందించారు. సాయినగర్ పంచాయతీ నివాసాలు ఏర్పాటు చేసుకున్న భూములు మఠానికి సంబంధించినవన్నారు. రెవెన్యూ ఆధీనంలో లేనందున క్రమబద్ధీకరణ చేయలేమని సూచించారు. అయితే మఠంకు మార్కెట్ ధరను చెల్లించి నివాస స్థలాలను క్రమబద్ధీకరించుకునే విధంగా సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకెళతానని భరోసా కల్పించారు. నివాస గృహాలు ఏర్పాటు చేసుకుని 12 సంవత్సరాలు అయినందున ప్రస్తుత ధరను నిర్దేశిస్తామన్నారు. కార్యక్రమంలో తిరుపతి రూరల్ తహసీల్దార్ రాజగోపాల్, ఇతర అధికారులు తదితరులు పాల్గొన్నారు.

శ్రీ కోదండరామాలయంలో భక్తుల రద్దీ

తిరుపతి (వాణిజ్యం), న్యూస్‌టుడే: తిరుపతి శ్రీకోదండ రామాలయంలో సోమవారం నూతన ఆంగ్ల సంవత్సరాది పురస్కరించుకొని ప్రత్యేక సేవలు నిర్వహించారు. ఆలయంలో ఉదయం ధనుర్మాస కైంకర్యాలు నిర్వహించి భక్తులకు దర్శన భాగ్యాన్ని కల్పించారు. అనంతరం తోమాల, సహస్రనామార్చన జరిపించారు. భక్తులకు ఇబ్బంది లేకుండా ఆలయం ఉపకార్యనిర్వహణాధికారి ఝాన్సీరాణి, పర్యవేక్షకుడు మునికృష్ణారెడ్డి, ఇన్‌స్పెక్టర్లు శేషారెడ్డి, మురళీకృష్ణ ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ లఘు దర్శనంతో భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు.

నేడు అష్టోత్తర శత కలశాభిషేకం...

తిరుపతి శ్రీకోదండ రామాలయంలో మంగళవారం పౌర్ణమి పురస్కరించుకొని అష్టోత్తర శత కలశాభిషేకం నిర్వహించనున్నారు. ఉదయం తొమ్మిది గంటలకు జరిగే అభిషేకానికి భక్తులు రూ.50 చెల్లించి సంప్రదాయ దుస్తులతో పాల్గొనవచ్చు. సాయంత్రం బంగారు తిరుచ్చిలో ఉత్సవర్లను సర్వాంగ సుందరంగా అలంకరించి శ్రీరామచంద్ర పుష్కరిణికి తీసుకువెళ్లి అక్కడ ఆస్థానం నిర్వహిస్తారు.

రేపు శ్రీ సీతారామ కల్యాణం...

శ్రీరాముని జన్మ నక్షత్రం పునర్వసు పురస్కరించుకొని బుధవారం ఉదయం 8.30 గంటలకు తిరుమంజనం, 11 గంటలకు కల్యాణ మండపంలో శ్రీసీతారాముల కల్యాణం వైభవంగా జరపనున్నారు. దంపతులు ఆలయంలో రూ.200 టికెట్ కొనుగోలుచేసి సంప్రదాయ దుస్తుల్లో కల్యాణం తిలకించవచ్చు. సాయంత్రం బంగారు తిరుచ్చిలో నాలుగు మాడవీధుల్లో ఊరేగుతూ శ్రీరామచంద్ర పుష్కరిణికి తీసుకువెళ్తారు. ఊంజల్ సేవానంతరం పుష్కరిణి హారతి, ఆస్థానం నిర్వహించి ఆలయానికి తీసుకువస్తారు.




హుండీ ఆదాయం రూ.2.75 కోట్లు

తిరుమల, న్యూస్‌టుడే: తిరుమల శ్రీవారి హుండీ ఆదాయం సోమవారం అధిక మొత్తంలో వచ్చింది. భక్తులు ఆదివారం సమర్పించిన కానుకలను లెక్కించగా రూ.2.75 కోట్ల ఆదాయం వచ్చినట్లు వివరాలు వెల్లడయ్యాయి. యాత్రికుల రద్దీ అత్యధికంగా ఉండడంతో హుండీ ఆదాయం మొత్తం ఎక్కువగా వచ్చింది.

తితిదే టోల్ ఫ్రీ నెంబరు: ఫిర్యాదులు, సూచనలు చేయడానికి, ఇతర సమాచారం కోసం సుంకంలేని దూరవాణి సంఖ్య **1800-425-4141** ద్వారా తెలియచేయవచ్చు.

శ్రీవారి సేవలో నేడు



తెల్లవారుజామున: 3.00-3.30: తిరుప్పావై పఠనం, 4.00-4.30: తోమాల(ఏకాంతం), 4.30- 5.00: అర్చన(ఏకాంతం), ఉదయం: 5.30- 6.30: అష్టదళ పాదపద్మారాధన సేవ, 6.30: మొదటి గంట, 6.45- 7.45: వీఐపీ దర్శనం, 8.00- రాత్రి 7.30: సర్వదర్శనం, 09.00- సాయంత్రం 7.00: ప్రత్యేక ప్రవేశ దర్శనం, మధ్యాహ్నం 12.00- 1.00: కల్యాణోత్సవం, 1.00- 1.30: ఆలయంలో ఊంజలసేవ, 2.00- 2.30: వైభవోత్సవ మండపంలో ఆర్జిత బ్రహ్మోత్సవం, 2.30- 3.00: వసంతోత్సవం, 5.00- 6.00: సహస్రదీపాలంకరణ సేవ, 6.00: ఉత్సవ మూర్తుల ఊరేగింపు, రాత్రి 7.00- 7.30: శుద్ధి, రాత్రి కైంకర్యాలు, 7.30-7.45: నైవేద్యం గంట, 8.00- 1.00: సర్వదర్శనం, 1.00: ఏకాంత సేవ ఏర్పాట్లు, 1.30: ఏకాంతసేవ.


తిరుమల సమాచారం



తిరుమల క్షేత్రంలో భక్తుల రద్దీ అధికంగా ఉంది. దర్వదర్శనానికి భక్తులు గంటల తరబడి వరుసలో యాత్రికులు వేచి ఉన్నారు. మంగళవారం కూడా సందడి అధికంగా ఉండనుంది. మందిరంలోని స్వామి సన్నిధిలో మహాలఘు దర్శనం అమలు చేయనున్నారు. బుధవారానికి సంబంధించి మంగళ జారీ చేయనున్న ఆర్జిత సేవా టిక్కెట్ల వివరాలు: సహస్రకలశాభిషేకం, కల్యాణోత్సవం సేవా టిక్కెట్లు అందుబాటులో ఉన్నాయి.


☛ ప్రత్యేక ప్రవేశ దర్శనం టిక్కెట్లు కలిగిన భక్తులను ఉదయం తొమ్మిది నుంచి రాత్రి 9 గంటల వరకు శ్రీవారి దర్శనానికి అనుమతిస్తారు.

తిరుమలలో నేడు



తిరుమల శ్రీవారి ఆలయంలో తెల్లవారుజామున మూడు గంటలకు శ్రీవారికి తిరుప్పావై నివేదన జరుగుతుంది. ఉదయం 4 గంటలకు తోమాల(ఏకాంతం), 4.30 గంటలకు అర్చన(ఏకాంతం), 6 గంటలకు కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం ప్రారంభమవుతుంది. వీఐపీ ప్రారంభ దర్శనం ఉదయం 10.30 గంటల నుంచి మొదలవుతుంది. నాదనీరాజనం వేదికపై సాయంత్రం ఆరు గంటల నుంచి నాదస్వర కచేరి కార్యక్రమాన్ని కంచికి చెందిన సెల్వరత్నం బృందం నిర్వహించనుంది.

ఆలయ దర్శిని



ముక్కంటి సమాచారం

శ్రీకాళహస్తీశ్వరాలయంలో మంగళవారం ఉదయం 5.00 గంటల మంగళవాయిద్యాలు, గోమాతపూజ పూర్వ్యాక 6.00 గంటలకు సర్వదర్శనానికి అనుమతించనున్నారు. ద్వితీయ కాల అభిషేకానంతరం నిత్యోత్సవం, నిత్యకల్యాణం, చండీ, రుద్రహోమాలు నిర్వహించనున్నారు. ఉదయం 7 గంటల నుంచి రాత్రి 6 గంటల వరకు రాహు, కేతు సర్పదోష నివారణ పూజలు నిర్వహించనున్నారు. ఉదయం 6.00, 7.00, 9.30, సాయంత్రం 4.30 గంటలకు స్వామి, అమ్మవార్లకు ఆర్జిత అభిషేకసేవలు జరగనున్నాయి. ముక్కంటి ఆలయంలో కొలువుదీరిన శ్రీకాలభైరవస్వామికి విశేష పూజలు, ప్రత్యేక అభిషేకసేవలు ఘనంగా నిర్వహించనున్నారు. ఆలయ బసవసతి, ఆర్జిత సేవా టిక్కెట్ల విషయమై 08578-222240, 08578-221336 నంబర్లకు డయల్‌చేసి వివరాలు తెలుసుకోవచ్చు.

ఆర్జిత సేవలు.. వాటి ధరలు

సుప్రభాతసేవ రూ.50, గోమాత పూజ రూ.50, అర్చన రూ.25, సహస్రనామార్చన రూ.200, త్రిశతి అర్చన రూ.125, శ్రీజ్ఞానప్రసూనాంబిక సమేత శ్రీకాళహస్తీశ్వరస్వామికి నిర్వహించే రోజువారి ఆర్జిత అభిషేకసేవల్లో భాగంగా సాయంత్రం 4.30 గంటలకు మహాన్యాస పూర్వక రుద్రాభిషేకం రూ.1500, సాధారణ రుద్రాభిషేకం రూ.1000(క్షీరాభిషేకం, పచ్చకర్పూరం, పంచామృత అభిషేకాలు), నిత్యదిట్ట అభిషేకం రూ.100, శనేశ్వర అభిషేకం రూ.150, అఖండ దీపారాధన రూ.200, ప్రత్యేక ప్రవేశం రూ.50, వీఐపీ బ్రేక్ దర్శనం రూ.200, నిత్యోత్సవం రూ.58, నిత్య కల్యాణోత్సవం రూ.501, రుద్రహోమం రూ.1116, చండీ హోమం రూ.1116, అష్టోత్తర శత స్వర్ణ కమలార్చన (శుక్రవారం మాత్రమే)రూ.1000, ప్రత్యేక ఆశీర్వచనం రూ.500, సాధారణ సర్పదోష పూజలురూ.300, ప్రత్యేక సర్పదోష నివారణ రూ.750, ఆశీర్వచన, సర్పదోష నివారణ రూ.1500 (అద్దాల మండపానికి పక్కన), ప్రత్యేక ఆశీర్వచన సర్పదోష నివారణ పూజలు రూ.2500 (వెంగ్వలరాయ స్వామి ఆలయం ఎదురుగా), రూ.5 వేలు వీవీఐపీ పూజ (ఆలయంలోని సహస్రలింగేశ్వరస్వామి వద్ద), ఏకాంతసేవ రూ.200 వాహనపూజలు (పెద్దవి) రూ.25,(చిన్నవి) రూ.20.

- న్యూస్‌టుడే, శ్రీకాళహస్తి

కాణిపాకం ఆలయ దర్శిని



కాణిపాకం స్వయంభు శ్రీ వరసిద్ధి వినాయకస్వామి ఆలయంలో మంగళవారం వేకువజామున 4.00 గంటలకు సుప్రభాత సేవ, గోపూజ. 4.30 బిందుతీర్థ అభిషేకం. 5.30 గంటలకు ప్రథమకాల పంచామృతాభిషేకం. అనంతరం సర్వదర్శనానికి అనుమతించనున్నారు. ఉదయం 7.30, సాయంత్రం 5.45 గంటలకు క్షీరాభిషేకం. 9.00, 11.00 గంటలకు ద్వితీయ, తృతీయకాల పంచామృతాభిషేకం. ప్రత్యేక మండపంలో 11.30 నిత్య కల్యాణం. 10.00, 12.00 గంటలకు గణపతి హోమం నిర్వహించనున్నారు. ఉదయం 7.00, 8.30, 10.30, సాయంత్రం 4.30 గంటలకు స్వామివారి నిజరూప దర్శనం. మధ్యాహ్నం 12 గంటల నుంచి సాయంత్రం 4.30 గంటల వరకు సర్వదర్శనం. ఆలయం వద్ద బసవసతి కోసం 08573-281560, 08573-281222 ఆర్జిత సేవా టిక్కెట్లు, ఇతర పూజల విషయమై 08573-281540, కార్యాలయ సమాచారం కోసం 08573-281747 నెంబర్లకు డయల్ చేసి వివరాలు తెలుసుకోవచ్చు.

- న్యూస్‌టుడే, కాణిపాకం

నూతన సంవత్సరానికి... శ్రీవారి ఆశీస్సులు

తిరుమల, న్యూస్‌టుడే: తిరుమలలో శ్రీవారి భక్తుల రద్దీ సోమవారం కూడా కొనసాగింది. నూతన సంవత్సరాది సందర్భంగా శ్రీవారి ఆశీస్సుల కోసం వేలాది మంది భక్తులు తరలివచ్చారు. గత కొన్నేళ్లతో పోల్చుకుంటే ఈసారి సందడి ఎక్కువగా ఉంది. శ్రీవారి అన్ని రకాల దర్శనాలకు గంటల సమయం వేచి ఉండాల్సి వచ్చింది. అర్ధరాత్రి సమయానికి వేచి ఉన్న భక్తులకు స్వామివారి దర్శనం దాదాపు పూర్తయ్యింది. ఇతర దర్శనాలన్నీ రద్దు కావడంతో సర్వదర్శనం, దివ్యదర్శనం ప్రాంగణాల నుంచి భక్తులను ఆలయానికి అనుమతించారు. సాయంత్రం ఆరు గంటల సమయానికి వైకుంఠం-1లో 16, 2లో 35 కంపార్ట్‌మెంట్లలో యాత్రికులు వేచి ఉన్నారు. అద్దె గదుల కొరత అధికంగా ఉంది. ఆరుబయటే వేలాది మంది చలిలోనే సేదతీరాల్సిన పరిస్థితి వచ్చింది. ప్రత్యేక ప్రవేశ దర్శనానికి 10 వేల టిక్కెట్లను మాత్రమే తితిదే ముందస్తుగా విక్రయించింది. అర్ధరాత్రి సమయానికి ధర్మదర్శనానికి వైకుంఠం-2లో 6 కంపార్ట్‌మెంట్లలో యాత్రికులు వేచి ఉన్నారు. ప్రత్యేక ప్రవేశ దర్శనానికి 2 గంటలు, ధర్మదర్శనానికి 6 నుంచి 7 గంటల సమయం తీసుకుంది. సాయంత్రం ఆరు గంటల సమయానికి 69,096 మంది భక్తులు శ్రీవారిని దర్శించుకున్నారు. పద్మావతి, సీఆర్వో, కౌస్తుభం విచారణ కార్యాలయాల వద్ద గదుల కోసం భక్తులు పడిగాపులు గాశారు. తలనీలాల సమర్పణ త్వరగా పూర్తయ్యింది. అన్ని కల్యాణకట్టల వద్ద యాత్రికులు పలుచగా కనిపించారు. భక్తుల రద్దీ మంగళవారం అధికంగా ఉండనుంది. స్వామివారి ధర్మదర్శనానికి 7, ప్రత్యేక ప్రవేశ దర్శనానికి 3, దివ్యదర్శనానికి 2.30 గంటల సమయం తీసుకోవచ్చు. ప్రత్యేక ప్రవేశ దర్శనానికి ఎక్కువ మంది భక్తులు తరలివస్తున్నారు.



శ్రీవారి ఆలయం ఎదుట సందడిగా ఉన్న యాత్రికులు

☛ అలిపిరి, శ్రీవారిమెట్టు నుంచి కాలినడకన తిరుమలకు వేలాది మంది యాత్రికులు తరలివచ్చినా దివ్యదర్శనం టోకెన్లను తితిదే జారీ చేయలేదు.

☛ పద్మావతి, కేంద్రీయ విచారణ కార్యాలయం(సీఆర్వో), కౌస్తుభం విచారణ కార్యాలయాల ఎదుట యాత్రికుల సందడి అధికంగా కనిపించింది.

☛ ఉదయం వీఐపీ ప్రారంభ దర్శనానికి ఎక్కువ సంఖ్యలో టిక్కెట్లను కేటాయించి రెండు గంటల వ్యవధి దర్శనానికి కేటాయించారు. వీఐపీ దర్శన సమయంలో కులశేఖరపడి వరకు అనుమతించగా ధర్మదర్శన సమయంలో మహాలఘు దర్శనం ప్రవేశపెట్టారు. అదనపు లడ్డూ ప్రసాద టోకన్లను 2 లక్షల వరకు జారీ చేశారు.

☛ మంగళవారం ఉదయం ప్రత్యేక ప్రవేశ దర్శనానికి తొమ్మిది గంటల నుంచి తితిదే అనుమతించనుంది. ఉదయం పూట మాత్రమే వీఐపీ దర్శనం ఉంటుంది.

నేటి నుంచి ఆర్జిత సేవలు పునరుద్ధరణ

తిరుమల, న్యూస్‌టుడే: తిరుమల శ్రీవారి ఆర్జిత సేవలను మంగళవారం నుంచి తితిదే పునరుద్ధరించనుంది. వైకుంఠ ఏకాదశి, ద్వాదశి, నూతన సంవత్సరాన్ని పురస్కరించుకుని గత ఐదు రోజులుగా సేవలను రద్దు చేసింది. వీటితో పాటు వయోవృద్ధులు, దివ్యాంగులు, చంటిబిడ్డలతో పాటు తల్లిదండ్రులకు ప్రత్యేక దర్శనాలను పునరుద్ధరించనుంది. కాలినడకన వచ్చే యాత్రికులకు దివ్యదర్శనం టోకెన్ల జారీని సోమవారం అర్ధరాత్రి నుంచే ప్రారంభించింది.

నేడు ఆర్జిత సేవా టిక్కెట్ల జారీ

తిరుమల, న్యూస్‌టుడే: తిరుమల శ్రీవేంకటేశ్వర స్వామివారి విశేష ఆర్జితసేవా టిక్కెట్లను తితిదే మంగళవారం జారీ చేయనుంది. బుధవారం స్వామివారికి జరిగే సహస్రకలశాభిషేకం 25, కల్యాణోత్సవం 80 టిక్కెట్లు వంతున అందుబాటులో ఉన్నాయి. భక్తులు తిరుమల కేంద్రీయ విచారణ కార్యాలయం(సీఆర్వో) ఆవరణం ఆర్జితం కౌంటరులో ఉదయం 11 నుంచి సాయంత్రం 5 గంటల్లోపు పేర్లు నమోదు చేసుకోవాల్సి ఉంటుంది. అందుబాటులో ఉన్న టిక్కెట్లను బట్టి భక్తులను ఎలక్ట్రానిక్ లాటరీ విధానంలో తితిదే ఎంపిక చేస్తుంది. సహస్రకలశాభిషేకం రూ.850, కల్యాణోత్సవం రూ.1000గా తితిదే నిర్ణయించింది. నూతన వధూవరులకు 20 కల్యాణోత్సవం టిక్కెట్లు కేటాయించింది. వివాహ పత్రిక, పెళ్లి ఫొటోతో స్వయంగా హాజరై టిక్కెట్లు కొనుగోలు చేయాలి.



తిరుమల నాదనీరాజనం వేదికపై నామసంకీర్తన కార్యక్రమం నిర్వహిస్తున్న కళాకారులు

నయనానందకరం... నామసంకీర్తనం

తిరుమల, న్యూస్‌టుడే: తిరుమల నాదనీరాజనం వేదికపై నామసంకీర్తన వీనులవిందుగా సాగింది. తమిళనాడు రాష్ట్రం కుంభకోణంకు చెందిన విఠల్‌దాస్ బృందం సోమవారం సాయంత్రం గోవిందనామాలను గంటన్నర పాటు స్మరించారు. భక్తకోటిని విశేషంగా ఆకట్టుకున్నారు. 35 మంది కళాకారులు పాల్గొన్నారు. వీరిని తితిదే సత్కరించి శ్రీవారి తీర్థ ప్రసాదాలను అందచేసింది. స్వామివారి దర్శనభాగ్యాన్ని కల్పించింది. కార్యక్రమాన్ని శ్రీవేంకటేశ్వర భక్తి ఛానల్ నిర్వహించింది.

78 వేల మందికి దర్శనం

తిరుమల, న్యూస్‌టుడే: తిరుమల శ్రీవారిని 78 వేల మంది భక్తులు ఆదివారం దర్శించుకున్నారు. ఆరోజు తెల్లవారుజామున మూడు నుంచి అర్ధరాత్రి వరకు 78,478 మంది భక్తులు దర్శించుకున్నట్లు తితిదే తెలిపింది. సోమవారం తెల్లవారు జామున మూడు నుంచి సాయంత్రం 6 గంటల వరకు 69,096 మంది భక్తులు దర్శించుకున్నారు. సాయంత్రం 6 గంటల వరకు ప్రత్యేక ప్రవేశ దర్శనానికి భక్తులను అనుమతించారు. స్వామి సన్నిధిలో మహాలఘు దర్శనం అమలు చేశారు.

ట్రస్టులకు రూ.12 లక్షల విరాళం

తిరుమల, న్యూస్‌టుడే: శ్రీవేంకటేశ్వర స్వామివారికి నగదు రూపంలో సోమవారం విరాళాలు వచ్చాయి. నిత్య అన్నప్రసాదం ట్రస్టు కింద రూ.లక్ష, బాలాజీ ఆరోగ్య వరప్రసాదిని ట్రస్టు కింద రూ.10 లక్షలు, ప్రాణదానం ట్రస్టుకు రూ.లక్ష వంతున మొత్తం రూ.12 లక్షల విరాళం సమకూరింది. ఆరుగురు భక్తులు ఈ విరాళం సమర్పించారు. తిరుమలలోని తితిదే దాతల విభాగంలో అధికారులను కలిసి డీడీలను సమర్పించారు. దాతలను తితిదే అధికారులు సత్కరించి శ్రీవారి తీర్థ ప్రసాదాలను అందచేశారు.

ముఖ్యమంత్రి దంపతులకు శ్రీవారి ఆశీస్సులు

తిరుమల, న్యూస్‌టుడే: నూతన సంవత్సరం సందర్భంగా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు దంపతులకు తిరుమల శ్రీవారి ఆశీస్సులు అందచేసే కార్యక్రమం సోమవారం జరిగింది. అమరావతికి తిరుమల జేఈవో శ్రీనివాసరాజు, ఆలయ బొక్కసం బాధ్యులు గురురాజారావు, అర్చక బృందం అమరావతికి చేరుకున్నారు. పండితులు వేదాశీర్వచనం చేశారు. శ్రీవారి పట్టువస్త్రంతో ముఖ్యమంత్రిని సత్కరించి తీర్థ ప్రసాదాలు, క్యాలెండరు, డైరీలను జేఈవో శ్రీనివాసరాజు బహూకరించారు.



ముఖ్యమంత్రి చంద్రబాబు దంపతులకు శ్రీవారి ఆశీస్సులు అందచేస్తున్న అర్చక బృందం